వేంకటసుబ్బరాయకవి, కొప్పరపు

ఘూర్జరతార

కాకినాడ, 1915

Record no. 389

Vēṅkaṭasubbarāyakavi,
Kopparapu

Ghūrjaratāra

Kākināḍa, 1915

Record no. 389

Bibliographic Record Target

వేంకటసుబ్బరాయకవి, కొప్పరపు.

ఘూర్జరతార / కొప్పరపు వేంకటసుబ్బరాయకవిగారిచే రచింపఁబడి.- కాకినాడ : స్కేప్ అండ్ కో., ముద్రాక్షరశాల, 1915.

2 parts in 1. ;20 cm.

Record no. 389

Vēṅkaṭasubbarāyakavi, Kopparapu.

Ghūrjaratāra / Kopparapu Vēṅkaṭasubbarāyakavigāricē racimpam̐baḍi.- Kākināḍa : Skēp amḍ Kō., Mudrākṣaraśāla, 1915.

2 parts in 1. ;20 cm.

Record no. 389

10550

10550

[illegible]

శ్రీ

ఘూర్జరతార.

(Adoptation Reynold's "Lil...

కొప్పరపు వెంకటసుబ్బారాయకవిగారిచే

రచింపఁబడి

గుంటూరుపురస్థితంబయిన శ్రీ సమ్మోదిని గ్రంథమాలకొరకు

ఏలేశ్వరపు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి

సంపాదితమై

గరికిపాటి సేతుమాధవరావుగారిచేఁ

బ్రకటింపఁబడియె.

(1915 సం॥రం మార్చి, ఏప్రిల్ నెలల ప్రచురణము.)

కాకినాడ:

స్కేప్ అండ్ కో., ముద్రాక్షరశాల సుముద్రితము.

1915.

P. O. Subbarkam

Uetapalem

ఇందుముఖి

24-1-24

...సుప్రచురణము.

ఫిబ్రవరి మాసాంతమునకు [illegible]డవలసిన మా గ్రంథమాలా ప్రథమ ప్రచుర
ముద్రాక్షరాలాధికారుల యాలస్యమువలన సకాలమున భాషాభిమానుల హస్తాలం
మై ప్రకాశింపక పోయినను "కేరళ కల్పనాకథలు కృతిరత్నము" లను పెద్ద
ణ్యని మహాశయంబునకు సాదృశ్యంబుగ నాంధ్రభాషకు నూతనాలంకారమై, నవీన
గ్రప్రదర్శితమై, విశేషభావగర్భితమై, మృదుమధురపదభూయిష్ఠమై, నాతి[illegible]లి
యై ప్రకాశించుచున్నదనుట యతిశయోక్తి కాదు. ఇందలి కథ యిందుముఖికిని
దరునకు జరిగినవివాహసంబంధమగుటచే నీకృతి యిందుముఖి యను నామమునఁ
గుచున్నది. ఇందు లోకస్వభావము మొదటినుండి తుదిదాక నొక్క[illegible]
పఁ బడుటయేకాక బాల్యవివాహము, కన్యాశుల్కము, పాతివ్రత్యము మున్నగు
వలనఁ గలుగు పెక్కు లాభనష్టములు దిగ్మాత్రముగ సూచింపఁ బడినవి. గ్రంథ
శ్రీ పిఠాపురం రాజావారి కళాశాలాపండితులును, సుప్రసిద్ధాంధ్ర కవివరేణ్యు
బహువిధగ్రంథరచనాధురీణులు నగు బ్రహ్మశ్రీ శృంగరకవి సర్వారాయఁడుగా[illegible]
వ్రాది చక్కని గ్లేజు కాగితములపై ముద్రింపఁ బడినది.

చందాదారులకు పోస్టేజి సహా 0-6-0, ఇతరులకు పోస్టేజిసహా 0-10-0.

గరికిపాటి సేతుమాధవరావు,

పబ్లిషరు అండు ప్రొప్రయిటరు.

సమ్మోదినీగ్రంథమాల, గుంటూరు.

1. న్యాపతి నారాయణరావు బి. యె., జిల్లాకోర్టు వకీలు, గుంటూరు,
ఆనరరి సంపాదకుఁడు.

2. ఏలేశ్వరపు సుబ్రహ్మణ్యశాస్త్రి. అష్టావధాని,
ఆ. సంపాదకుఁడు.

3. నాగవరాజు లక్ష్మీకాంతము, టౌనుహైస్కూలు తెలుఁగుపండితులు
గుంటూరు. ఆ. సంపాదకుఁడు.

4. గరికిపాటి సేతుమాధవరావు, గ్రంథమాలా ప్రొప్రయిటరు,
పబ్లిషరు, గుంటూరు.

5. ‑ట్టి నరసింహారావు, అగ్రహారందారు, గుంటూరు,
ఆనరరి మెంబరు.

విజ్ఞాపన.

శ్రీ సమ్మోదినీ గ్రంథమాలకు వ్రాయు నుత్తరముల వగైరాకు.

అడ్రసు:—

గరికిపాటి సేతుమాధవరావు,
సమ్మోదినీ గ్రంథమాల, ప్రొప్రయిటరు,
గుంటూ[illegible]

సమ్మోదినీ గ్రంథమాల, గుంటూరు.

రాజపోషకులు.

1. శ్రీ పిల్లలమర్రి సోమయాజులు పంతులుగారు, తహశ్శీలుదారు, నర్సారావుపేట.
2. శ్రీ చిరుమామిళ్ళ నారాయణ ప్రసాద్ గారు, మేజస్ట్రీటు, నర్సారావుపేట.

పోషకులు.

1. శ్రీ నల్లపాటి శేషగిరిరావుగారు ప్లీడరు, తెనాలి.
2. శ్రీ రాజామానూరు వెంకట నరసింహారావుగారు జమీందారు, గుంటూరు.
3. శ్రీ మేళ్ళచెర్వు వెంకటామయ్యగారు కంట్రాక్టరు. కాకినాడ.
4. శ్రీ వైజర్సు అప్పారావు పంతులుగారు మేజస్ట్రీటు, కొవ్వూరు.
5. శ్రీ రాజా కంచుమర్తి శివప్రసాదభూషణరావు బహద్దరుగారు, నర్సాపురం

సహాయులు.

1. శ్రీ నడింపల్లి వెంకట హనుమంతరావుగారు ప్లీడరు, నర్సారావుపేట.
2. శ్రీ గుర్భా వెంకట శివరామరాసుగారు ప్లీడరు, కాకినాడ.
3. శ్రీ దివాన్ బహద్దరు దురిసేటి శేషగిరిరావు పంతులుగారు, కాకినాడ.
4. శ్రీ రావు బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తిగారు, కాకినాడ.
5. శ్రీ పాణంగిపల్లి వెంకటరావుగారు ల్యాండుహోల్డరు, పెద్దాపురం.
6. శ్రీ మంత్రిరావు వెంకటరత్నంగారు ప్లీడరు, తణుకు.
7. శ్రీ సారంగు సోమసుందరరావుగారు ప్లీడరు, తణుకు.
8. శ్రీ ఘట్టు లక్ష్మీనాగభూషణరావుగారు సబు రిజస్ట్రారు, తణుకు.

శ్రీ మాచేపల్లి మాణిక్యంగారు మేనేజరు హిందూ ఐ. పి. స్కూలు, పాలకొల్లు.

శ్రీ చిర్రావూరి వరదరాజులు పంతులుగారు డిస్ట్రిక్టుమునసబు, నర్సాపురం.

శ్రీ రాయసం కృష్ణమూర్తిగారు ప్లీడరు, నర్సాపురం.

శ్రీ శ్రీపాద రామమూర్తిగారు ప్లీడరు, నర్సాపురం.

శ్రీ కామరాజు వెంకటప్పయ్య పంతులుగారు మేజస్ట్రీటు, నర్సాపురం.

శ్రీ నండూరి నరసింహాచార్యులుగారు హెడ్ క్లర్కు డి॥ మునసబుకోర్టు, నర్సాపురం.

. శ్రీ పూసర రంగయ్యగారు క్లార్కు డి॥ మునసబుకోర్టు, నర్సాపురం.

3. శ్రీ అయ్యగారి త్రియంబకంగారు ప్లీడరు, నర్సాపురం.

7. శ్రీ బుద్ధిరాజు నరసింహంగారు క్లార్కు డి॥ మునసబుకోర్టు, నర్సాపురం.

నియమోద్దేశము.

1. ఆంధ్రదేశమున కుపకరించు బహువిధగ్రంథముల రెండేసి నెలల కొక్కొకటిగాఁ బ్రచురించుట.
2. ఆంధ్రకవులను బ్రోత్సహించి గ్రంథముల వ్రాయించుట.
3. తక్కువవెలల కెక్కువచక్కనిపుస్తకముల నెల్లరకు లభింపఁజేయుట.
4. శక్తికొలంది నాంధ్రభాషాభివృద్ధికిఁ దోడ్పడుట.
5. ప్రతివత్సరమును బరీక్ష లేర్పఱచి యందు త్తీర్ణులగువారికి బహుమతులనిచ్చి యీరూపమున నాంధ్రభాషా పాఠకులసంఖ్య నభివృద్ధి చేయుట.
6. శిథిలములగుచున్న పూర్వగ్రంథము లెవ్వియేని లభించినచో వానిని బండితులచేఁ బరిష్కరింపించి ముద్రించుట.
7. ప్రతివత్సరాంతమున నొక్కొక బహుమతిగ్రంథమును గైకొని కవులఁ బ్రోత్సహించుట.
8. పరమప్రయోజనకరములగు చిన్నపొత్తముల ముద్రించి నడుమ నడుమ చందాదారుల కుచితముగా నొసంగుట.
9. ఈ 1915 సంవత్సరములో 100 పేజీలకు తక్కువయు 200 పేజీలకు మించనియు 6 నవలలు వెలువడును.

చందా పద్ధతులు.

1. చందాదారులెవ్వరును ముందుగా సొమ్మీయనక్కర లేదు.
2. ప్రచురించిన వెంటనే పుస్తకము వి. పి. గా పంపఁబడి చందాదారులవలన సొమ్ము వసూలు చేయఁబడును.
3. పోస్టుఖర్చులుకాక నూటేసిపుటల కొకనాల్గణాలు విలువ యేర్పఱచి చందాదారులకు పంపఁబడుచుండును.
4. ప్రతిపుస్తకమును దప్పక తీసికొనువారే చందాదారులుఁగా నెన్నఁబడుదురు.

5. చందాదారులు కానివారలకు నూటేసి పుటల కెనిమిదణాలు విలువ యేర్పఱచి వసూలు చేయఁబడును.
6. చందాదార్లకుఁ బంపించెడు ప్రతినవలయు పోస్టేజిసహా రు 0-6-0 కు తక్కువయు రు 0-10-0 కు మించియు నుండదు.

గరికిపాటి సేతుమాధవరావు,
గ్రంథమాల పబ్లిషరు & ప్రొప్రయిటరు.
గుంటూరు.

మాగ్రంథమాల విలేఖకులు.

మ. రా. రా.

1. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు, శతావధాని కళాశాలా పండితులు, బందరు. [స్థానకవులు, పిఠాపురం.
2. శ్రీ రామకృష్ణకవులు, శతావధానులు పిఠాపురం రాజావారి యా
3. శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు, అష్టావధాని రాజమండ్రి.
4. శ్రీ పిశుపాటి చిదంబరశాస్త్రిగారు, శతావధాని, కరవది.
5. శ్రీ సత్య సుబ్రహ్మణ్యేశ్వర కవులు, శతావధానులు కలవపాముల.
6. శ్రీ ద్వివేది బ్రహ్మానందశాస్త్రిగారు, శతావధాని కళాశాలాపండితులు, తుని. [హిత్యపరిషత్తు, మదాసు.
7. శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు. ఎడిటరు, ఆంధ్రసా
8. శ్రీ జనమంచి శేషాద్రి శర్మగారు, కళాశాలాపండితులు, కడప.
9. శ్రీ బులుసు పాపయ్యశాస్త్రిగారు, అనకాపల్లి. [కాకినాడ.
10. శ్రీ శృంగారకవి సర్వారాయఁడుగారు కళాశాలా పండితులు,
11. శ్రీ నండూరి మూర్తిరాజుగారు-బి. యె. కాకినాడ.
12. శ్రీ కాళ్ళకూరి సాంబశివరావుగారు-బి యె. పోలవరం

13. శ్రీ ఏలేశ్వరపు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు-అష్టావధాని, కాకినాడ.
14. శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు-విజయనగరము.
15. శ్రీ కవిరాజు శ్రీ వత్సవాయి వేంకటనీలాద్రిరాజుగారు. శతావధాని, శ్రీతునిరాజావారి యాస్థానకవులు, తుని.
16. శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు మేనేజరు, ఆంధ్రసాహిత్యపరిషత్తు, మద్రాసు.
17. శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు-అష్టావధాని పొలమూరు.
18. శ్రీ కొత్తపల్లి సుందరరామయ్యగారు-ఏలూరు.
19. శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు-గుంటూరు.
20. శ్రీ [illegible]రపరాజు లక్ష్మీకాంతకవిగారు-గుంటూరు.
21. శ్రీ కూచి నరసింహంగారు-బి. యె. పిఠాపురం.
22. శ్రీ మోచర్ల హనుమంతరావుగారు-కాకినాడ.
23. శ్రీ ఉమ్రఅలీషాకవిగారు-పిఠాపురం.
24. శ్రీ చట్టి నరసింహారావుగారు-గుంటూరు.
25. శ్రీ దేవగుప్తపు సన్యాసిరాజుగారు-కశింకోట.
26. శ్రీ భాగవతుల రామమూర్తిగారు-విజయనగరము.
27. శ్రీ రాజా వత్సవాయి రాయగజపతివర్మగారు-రాజమండ్రి
28. శ్రీ కస్తూరి శివశంకరకవిగారు-నర్సాపురం.
29. శ్రీ మత్తుకుమల్లి సరస్వతిశాస్త్రిగారు-గుంటూరు.
30. శ్రీ కొండపల్లి లక్ష్మణపెరుమాళ్ళుగారు-ముత్యాల.
31. శ్రీ శొంఠి భద్రాద్రిరామశాస్త్రిగారు ఉర్లాముజమీందారువారి యాస్థానకవులు-ఉర్లాము.
32. శ్రీ కొప్పరపు వెంకటసుబ్బారాయకవి-గుంటూరుజిల్లా.
33. శ్రీ వింజమూరి వెంకటలక్ష్మీనరసింహారావుగారు-కాకినాడ.

విజ్ఞాపనము.

భాషాభిమానులగు నాంధ్ర సోదరులాలా!

దైవానుగ్రహమువల్లను భాషాభిమానుల ప్రోత్సాహమువలనను మా గ్రంథమాల ద్వితీయప్రచురణము సకాలమునకు వెలువఱుపఁ గలిగితిమి.

ప్రస్తుత మెల్లరును హూణభాషాపరిచితులై తత్కవితా రసాస్వాదనాభిలాషులగుటచే మాయీరెండవగ్రంథము హూణకవివరేణ్యుఁడగు "జి. డబ్ల్యు. యమ్. రీనాల్డ్సు" వలన వ్రాయఁబడిన 'లీలా' యను నవల ననుసరించి వ్రాయఁబడినది. ఈ గ్రంథము పెద్దదిగా నుండుటచే ప్రస్తుతము కొంతవఱకే ప్రథమభాగముగా ముద్రింపించి ముగించితిమి. ఇందలి శైలియు కథాసందర్భమును వర్ణనావైశద్యమును మున్నగునవి యథోచితములని పాఠకులకు వేఱుగఁ దెలుప నక్కరలేదు.

ఇందు సందర్భానుసారముగఁ గొన్ని యన్యభాషాశబ్దములును నచ్చటచ్చటఁ గొన్ని వ్యావహారికపదములును పాఠకజనసౌలభ్యమునకై వాడఁబడినను మొత్తముమీఁద పుస్తకము మిగుల చక్కఁగ నున్నది.

భాషాభిమానులు గ్రంథమాలానిర్మాతలకుఁ దగు ప్రోత్సాహము కలిగించి గ్రంథమాల నభివృద్ధిజేయుదురు గాక!

ఇట్లు విధేయుఁడు
ఏలేశ్వరపు సుబ్రహ్మణ్యశాస్త్రి,
ఆనరరి సంపాదకుఁడు.

విన్నపము.

భాషాభిమానులగు నోయార్యులారా!

మా గ్రంథమాల కియ్యది ద్వితీయప్రచురణమని (మార్చి యేప్రియల్ నెలలతాలూకు) యిదివఱకె ప్రచురించియుంటిమి. మాప్రథమ ప్రచురణము చాల ఆలశ్యముగాఁ బంపినందులకు నీప్రచురణ మాలశ్యముగాఁ బ్రకటించినందులకు క్షమింపవేఁడెద. రాఁబోవు (మెయి, జూను, నెలల) ప్రచురణము జూను ప్రథమవారములోపుగఁ బంపుచున్నాఁడఁగాన స్వీకరింపఁగోరెద. పేరుపడసిన మన లేఖకులు గ్రంథములు వ్రాయుటవలనను, రాజపోషకులు, పోషకులు, సహాయులు, మున్నగువారలు, చూపుచున్న గౌరవమువల్లను గ్రంథమాల బాలచంద్రునివలె దినదినాభివృద్ధిం గాంచుచున్నందులకు భగవంతుని సర్వదా ప్రార్థించుచున్నాను,

ఈగ్రంథ మాంగ్లకవివరుడగు ''జి డబ్లియి యం రీనాల్డు'' అను మహాకవి యింగ్లీషుభాషతో ''లీలా'' అనుపేరుతో వ్రాసియున్నాఁడు. ఇది యా గ్రంథమున ననుసరించి గ్రంథకర్తగారివలన వ్రాయఁబడినది. ఇంగ్లీషుభాషలోనే యీగ్రంథము బాహుళ్యమయినదిగనుక రెండు భాగములుగాఁ బ్రచురింపఁదలఁచినాడను. ఇది ప్రథమభాగము. గ్రంథకర్త రెండవభాగము వ్రాయుచున్నాడు. అయినవెంటనె ప్రచురించెద. మా ప్రచురణములలో నిదియొకటియె రెండుభాగములుగాఁ బ్రచురింపఁబడవలసివచ్చిన నవల. తక్కినవన్నియు సంపూర్ణముగానె యుండును.

ఇట్లు విధేయుఁడు,
గరికిపాటి సేతుమాధవరావు,
పబ్లిషరు అండు ప్రొప్రయిటరు.

ఘూర్జరతార.

ఒకటవ ప్రకరణము.

బాటసారి.

సూర్యాస్తమయంబు సమీపించుచుండె. ఎఱ్ఱనివెలుఁగు ప్రకృతిపైఁ బ్రసరించి సర్వమును రక్తవర్ణముగా మార్చుచుండె. దూరమున నున్న పెద్దకొండల శిఖరము లెఱ్ఱనివై చూచువారికి బర్వతము ధరించు హేమకిరీటములవలెఁ గనుపట్టె. మన కథాభూమికయగు నీసమభూమి యందనేకజాతుల ఫలవృక్షములు క్రిక్కిఱిసియుండె, సంకులముగానున్న యామహావృక్షములలో సూర్యకిరణములు బంధింపఁబడి మిలమిల లాడుచుండె. ఆచెట్లకొమ్మలపై నెక్కి కోయిలలుహాయిగా పాటలు పాడుచుండె. అందందు బుడిబుడి తోఁకలనిక్కఁబొడిచి యుడుతలు నికుంజములపై దుముకుచుండె.

ఆనాఁడు గగనము నిర్మలమైయుండె. దూరదేశమున కేగు బాట

సారసలవలె నడవికొంగలు బారులుతీర్చి యాకాశమార్గమున త్వరపడఁ బరుగెత్తుచుండె. నిజముగా నానాఁటి సంధ్యాసమయము మిక్కిలి మనోహరమై, దృష్టినాకర్షింపఁ జాలునదియైయుండె. కావుననే యొకఁడు తత్ప్రకృతిరంగమును మిక్కిలి విలోకించుచుఁ దానెక్కినగుఱ్ఱమును మెల్లగా నడిపించుచుండె. వాఁడు యువకుఁడు.

వానివయస్సిరువదిరెండేండ్లకు మించియుండదు. మొగము చక్కని స్త్రీముఖమును బోలియుండును. కాని స్త్రీముఖమునకు సహజమగు మృదుత్వమాతని మొగమునకు లేదు. కనులు మిక్కిలిపెద్దవి. వానినుండి వెలువడు చూపులతితీక్ష్ణములును, సూక్ష్మములును, మిక్కిలి చుఱుకుగలవియునై యుండె. ఆకనులను గాపాడుచున్న ఱెప్పలుపలుచనివై నల్లనియంచులతో నగిషీచేయఁబడినట్లుండె. మిక్కిలి దట్టముగా నుండక సరియగు వక్రగతితో నొప్పినవాని కనుబొమ్మలాకనుదమ్ముల సహజసౌందర్యమును రెండింతలుచేసె. బాల్యసౌశీల్యముచే నధిష్ఠింపఁబడు సింహాసనమువలె నెన్నుదురెత్తైయుండె. వానినోరు మిక్కిలిపెద్దదికాక ముద్దులుమూటఁగట్టుచుండె. క్రిందిపెదవి దొండపండువలె నెఱ్ఱఁగానుండె. ఆతఁడా మనోహర సంధ్యాసమయంబునకు సంతసమొంది తనలోఁ దాను ముసిముసినవ్వుల నవ్వుకొనినపుడెల్ల రెండుపెదవుల నడుమనుండి దంతములు పరిశుభ్రముత్యములవలెఁ దళదళలాడుటఁ గాంతుము. బాహువులు దీర్ఘములు. భుజములత్యున్నతములు. కష్టపుఁబనిఁజేయుట కలవడెఁ గాఁబోలు! వానిచేతివ్రేళ్ళు మృదువుగానుండక పనాటుదేరియుండెను. వానిదేహవర్ణము రక్తశ్వేతవర్ణమిశ్రమమై మిక్కిలి సొగసుగానుండె.

వాఁడుధరించిన దుస్తులఁబట్టియు, మొలనుండి కుడిపిఱుదుమీఁదుగా వ్రేలాడుచున్న కరవాలమునుఁ జూచియు, శిరముననోరగా సవరింపఁబడియున్న శిరోవేష్టనమును బరీక్షించియు, చూపఱులాతని నొకమంచి యోధునిగాఁ గ్రహింపకపోరు.

ఆతఁడారోహించిన గుఱ్ఱము మిక్కిలి బలిష్ఠమైనది. దానినడకయు, రూపమును, నెడ్డుపొడుగులును, కాశ్మీరదేశహయములయందు మిక్కిలి సామాన్యముగాఁ జూపట్టుచుండుటచే నదియునొక కాశ్మీరహయమే యగుట నిస్సందేహవిషయము. మఱియు నీబాటసారి పోవుచున్నది కాశ్మీరదేశమునుండియే కావున మనయభిప్రాయము తప్పెన్నటికినిగాదు. దానిపుడు నడచుచున్న బాటతనకిదివరకే బరిచితియైయున్నటులా గుఱ్ఱమటు నిటుఁ జూచుచుండక తిన్నగాఁబోవుచుండె. దానిపైఁ గూరుచుండియున్న మనయువకుఁడానాఁటి మనోహరసాయంసమయమును తిలకించుచుండెనని కదా మనకథాదినిఁ జెప్పియుంటిమి.

అట్లు తదేకదృష్టితోఁ జూచుచున్నంతఁ గ్రమక్రమంబుగా తారాంకురములు రేకెత్తసాగె. పక్షులన్నియు నఱచుచుఁ జెట్లపైనున్న తమతమ కులాయములకుఁ బరువెత్తదొడఁగె. ఆకాశమునం దచ్చటచ్చట వెలవెలఁబోవుచుఁ జుక్కలువిలసిల్లుచుండె. క్రమంబుగ రాత్రి ప్రవేశించె.

ఇంతలోఁ గనుచూపు దూరంబున నొకసన్నని వెలుఁగుగానవయ్యె. ఆవెలుఁగు వచ్చుచున్న దెసకే మనయువకుఁడు తన హయమును

నడిపించుకొని పోవుచుండె. అట్లుపోవు, యావెలుఁగునకింకను నలువదిగజముల దూరమునుండియే, వాఁడు చప్పట్లుకొట్టి తననోటితో సన్నని యీలవేసెను. అది వినవచ్చినతోడనే యావెలుఁగు గాన్పించుచున్న దెసనుండి నలువురుమనుజులుచేత దీపములఁబట్టికొని యొకగుడారమునుండి బయటికివచ్చిరి. ఇంతలో మనయువకుఁడును వారిని సమీపించి తన గుఱ్ఱమునుండి క్రిందికిదిగె. సత్వరమే యానలువురిలో నొకఁడా గుఱ్ఱమును గోష్ఠములోనికిఁ దీసికొనిపోయె.

ఈకోష్ఠమా గుడారమునకుఁ బ్రక్కనేయున్నది. తక్కుఁగల మువ్వురిలో నొకఁడు మనయువకునితో మిక్కిలి పరిచయముఁ గలవానివలె మీరు మూఁడుగంటలకే వత్తురని మాప్రభువుగారు చెప్పియుండిరి. కాని యింతయాలస్యముగా నేలవచ్చితిరని ప్రశ్నించెను.

మిక్కిలి చెప్పఁదగినంత కారణమేమియులేదు. అయినను మీప్రభువుగారడిగినఁ గదా చెప్పవలయు. నన్నాయన యున్నచోటికిఁ దీసికొనిపొండు' అని మనయువకుఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

మరల నేమియుఁ బ్రశ్నింపక వాఁడు మనయువకుని వెంటఁబెట్టుకొని గుడారమునకు దక్షిణముగానున్న యొకకాలిబాటఁ బట్టిపోవుచుండె. ఆబాటపై మిక్కిలివంగి యనేకములగు నటవీనికుంజములుండె. వానినుండి చొఱఁబడి వారిరువురుబోయి పోయి యొకచక్కని కుటీరమును సమీపించిరి. ఆకుటీరద్వారమునొద్దనున్న ద్వారపాలకుఁడు వీరినిఁ జూచినతోడనే యొకప్రక్కగా నిలువఁబడి వారిని లోనికి బోని

చ్చె. వారును లోనికిఁబోయి గృహాంగణమును దాటి యొకచక్కని గదిలోఁ బ్రవేశించిరి. ఆగదియం దొకఁడు విలువగలపీఠకపై నోరగాఁ గూరుచుండియుండె. ఆగదియందు వెలుంగుచున్న దీపపుకాంతి యానూతనపురుషుని మొగముపై తిన్నగాఁ బ్రసరించుటచే వాఁడు మిక్కిలి తేజోమూర్తియని తెలియనయ్యె.

కనులు మిక్కిలి విశాలములు. వానినుండిఁ బ్రసరింపఁబడు చూపులెంతయు భయదములై, యెట్టివానినైనను వశపఱచుకొనునంతటి తీక్ష్ణములై యుండె. ఆతని మొగము మిక్కిలి గంభీరమైనది. మిక్కిలి పొడుగైనవాఁడును నతిబలిష్ఠుఁడునునగు నాతని లక్షణముల నరసిచూచిన, నాతఁడొక గొప్పనాయకపదవి కర్హుఁడనితోఁచు.

వాఁడు మనయువకునిఁ జూచినతోడనే, తన పీఠికనుండిలేచి, సమీపించి, వానిహస్తమును తనహస్తమునఁబట్టి, మఱియొకపీఠికపైఁ గూరుచుండ నియోగించి, తాను తనపీఠికపైఁ గూరుచుండి, మనయువకునిఁ గూర్చి “అయ్యా! తామేగినపని యేమైనది” యని యడిగెను.

యువకుఁడు చిఱునవ్వు నవ్వి నాయకా! మీతో నేనిదివఱకు మనవిఁజేసికొనిన రీతి మోహనునిఁగములనుండి విడఁదీసి చెఱియొక మారుత్రోవకును బోవునట్లుచేసితిని. అని త్వరలోఁ బ్రత్యుత్తరమిచ్చెను.

మంచిది. మీపన్నిదము శ్లాఘనీయమే. కానికమల మీచేఁ జెప్పఁబడినటులు చెలికత్తెలతోఁ బయనముసేయక, ఖడ్గధారులగు పురు

షులతోఁ బయనము చేయుచున్న యెడల నెట్లాయని నాకు సందియమగుచున్నది.

‚‚సందియమేల? ఆమె హృదయమున నామాటలును, బోధనలును, నిజముగా నాటుకొనియున్నవి. ఆమె యెన్నటికిని నాపలుకులకు వ్యతిరేకము సలుపదు. సలుపదు. సలుపదు. ముమ్మాటికి నిశ్చయము. నిశ్చయము. నిశ్చయము" అని మనయువకుఁడు నొక్కి నొక్కి గంభీరస్వనముతోఁ బ్రత్యుత్తరమిచ్చె.

‚‚సరే! మీరంత నిశ్చయముగా నమ్మియుండుటచే నాకు సందియము తీరినది" అని మనయువకునితోఁ జెప్పి, వానిప్రక్కనున్న వానితో ‚‚భీమా! మనయతిథియగు నీహేమచంద్రుని మనభోజనశాలకుఁ దీసికొనిపోయి షడ్రసోపేతముగా విందుసేయుము" అని పలికె.

తోడనే యాభీముఁడును, జిత్తమని మన హేమచంద్రుని వెంటనిడుకొని భోజనశాలకుఁ గొనిపోయెను.

ఘూర్జరతార.

రెండవప్రకరణము.

పొరపాటు.

ఇప్పుడు మనము వ్రాయుచున్న కాలము, మొదటి ప్రకరణమునకు సంబంధించిన విషయములకు నాలుగుదినముల పిదప యని తెలియునది.

సూర్యోదయమైన సత్వరమే యాయిర్వురు తుపాకులను గత్తులను దాల్చి గుఱ్ఱములనెక్కి పోవుచుండిరి. వీరిని మనమిదివఱకు హేమచంద్రునికి సంబంధించిన విషయమున గుడారము నొద్దఁ జూచియేయున్నారము. వీరందఱును 'గోరిల్లా' యను నొకతెగకుఁ జేరినవారు. వీరియుద్యోగము దొంగతనమే. వీరిగురువు మన హేమచంద్రునికి వెనుక నాతిథ్యము నొసఁగినవాఁడే!

అట్లు వారాయిర్వురును హయారోహకులై పోయిపోయి యొకచో నిలువఁబడిరి. ఈచోరసమాజమునకుఁ బ్రస్తుతనాయకుఁడగు భీముఁడు తక్కువారితో ‚‚ఇదే! మనగమ్యస్థానము. అదే యాదెసనుండియే మనచేఁ బట్టుఁబడవలసిన వారు వచ్చుట" యని వారు నిలిచిన బాటకునుత్తరదిశకు వ్రేలుసూపె.

అంత వారలలో మఱియొకఁడు భీమునితో 'సరే! కాని నాకొక్క భయము పుట్టుచున్నది' యనెను.

భయమెందులకు? అని భీముఁడు ప్రశ్నించెను. వేరొకఁడు మనచేఁ బట్టుబడవలసిన వారిని మనము చంపక, సజీవులుగానే, పట్టుకొనవలయునని కదా మననాయకుఁడగు వీరరుద్రుని యాజ్ఞ' యని పలికె.

'అగు నయిననేమి' యని భీముఁడు ప్రశ్నించె.

''ఒకవేళ వారు మనకన్న బలిష్ఠులై, చిక్కక మనపైఁ దుపాకులఁ గాల్చిన నేమికావలయును?''

''నీయూహ బొత్తుగా మంచిదిగాదు. మొట్టమొదట మనయాఱ్వురిని జూచినంతనే, వారు కాళ్ళబేరమునకు వత్తురు. లేనిచోఁ గత్తులు ఝళిపించి, తుపాకులను వారి ఱొమ్ములకు గుఱివెట్టి భయపెట్టుదము. అప్పటికైనను జిక్కనియెడల నిక్కనిజముగా వారినిఁ గాల్చివేయవలసినదే'' యని భీముఁడు వాక్రుచ్చెను.

'అటులఁ జంపఁగూడదని కదా రుద్రునియాజ్ఞ'

'అట్లు స్పష్టముగా రుద్రదేవుఁ డాజ్ఞనిచ్చియుండలేదే'

'అయినను వారిని సజీవులుగానే మనము పట్టుకొనినయెడల మనకు మనరుద్రనాయకునిచే మెప్పుకలుగును. శవముల నీడ్చుకొనిపోయి పంచిపెట్టిననేమి మెచ్చుకొనును' అని మఱియొకఁడనెను.

అంత వేరొకఁడు మీకెట్టి పిచ్చియూహలు పుట్టుచున్నవి! తుపాకులను, గత్తులను, దాల్చిన యాఱ్వురమగు మనము మువ్వురిని బట్టుకొనలేమా? చాలు, చాలు. దానికేమి కాని—యని భీముని దెసఁజూచి భీమా! నాలుగుదినముల వెనుక నొకరాత్రి నీవు వెంటఁబెట్టుకొని నాయకునియొద్దకుఁ దీసికొనిపోయిన యాయనయెవ్వరు? అని ప్రశ్నించెను.

వానికి భీముఁడిట్లనెను.

నాకాయన విషయమై పూర్తిగా నెఱుకలేదు. కాని శ్రీనగరమునం దొక గొప్పవర్తకుని కాయన పుత్రసమానుఁడని మాత్రము తెలియును. అఁ—అఁగుమాఁగుము మిక్కిలి దూరమునందు గుఱ్ఱముల కాలిచప్పుడులు విననయ్యె. ఎవరో గుఱ్ఱములనెక్కి వచ్చుచున్నారు. వారు మన మనుకొనుచున్నవారే యైయుందురు. లెండు. బాట కటునిటుఁ బొదలచాటున డాఁగియుందము. వారు మనదెసకు వచ్చినతోడనే యొక్కుమ్మడి వారిపై నుఱుకుదము.

తోడనే భీముఁడాజ్ఞ యిచ్చినట్లు మువ్వురు బాటకొకప్రక్కను, దక్కఁగల మువ్వురు మఱియొకప్రక్కను డాఁగి యాగంతుకుల రాకకై వేచియుండిరి.

వేచియుండినట్లే క్రమక్రమముగ నాచోరులకు మువ్వురు గుఱ్ఱములనెక్కి తామున్న దెసకు వచ్చుచుంటఁ గాననయ్యె. ఆమువ్వురిలో

ముందు సవారిచేయుచున్న యువకునిదుస్తులఁ బట్టియు, రూపరేఖావిలాసంబులం బట్టియు, నాచోరులు వానిని దమచేఁ బట్టుబడవలసిన వానినిగా గుర్తెఱుఁగఁజాలిరి. ఆయువకుని వెనుక నిద్దఱు బలిష్ఠులుండిరి. వీరిరువురును ముందు సవారిచేయుచున్న యువకుని ప్రియసేవకులు. పాపము! వారు తమకు రానున్నయాపదనేమియు నెఱుంగరుకదా?

నిర్భయముగా నామువ్వురును సవారిజేసిచేసి క్రమక్రమముగా నాతస్కరులున్న దెసకు సమీపించిరి. తోడనే తమకిటునటునున్న సాంద్రనికుంజములమధ్య 'గలగల' మను చప్పుడువిననయ్యె. ఏదియో యపాయము రానున్నదని యామువ్వురును, క్షణమాత్రములోఁ దమకత్తుల నొరలనుండితీసి, దుస్తులలో దాఁపఁబడియున్న 'పిస్తోలు' ల బైటికి నూడఁబెఱికి వానియందు తోటాల నిమిడ్చియుండిరి.

ఈపనులన్నియుఁ గనుఱెప్పపాటులో జరుపఁబడినవి. ఆక్షణముననే వారాఱ్వురు ధృఢకాయులచేఁ జుట్టబడిరి. వారిలో నిద్దఱిద్దఱు వీరిలో నొక్కొక్కని దాఁకిరి. పలుకులు లేవు. ఆలోచనలు లేవు. ఒకటేపోరు.

బాటసారులలో ముందు సవారిచేయుచున్న యువకుఁడు తనకత్తిని మిక్కిలి గుఱితోఁ దన్నుఁదాఁకిన యిరువురిలో నొకనిపై విసరెను. తోడనేవాఁడు నిర్జీవుఁడై గుఱ్ఱమునుండి జారి భూమిపైఁబడియె. సత్వరమే రెండవవాఁడు తనతుపాకిని యువకునివక్షమునకు గుఱిపెట్టి "పట్టుబడుము. లేకున్ననిదే నీప్రాణములఁగొనియెద" నని రోషభీషణంబుగాఁ బలికె.

ఆయువకుఁడును జంకక, "పట్టుపడనక్కఱలేదు. చూడుము" అని తనపిస్తోలును వానిఱొమ్ములకు గుఱిపెట్టికాల్చెను. ఆయగ్నిగోళము వానిదుస్తులను భేదించి, వక్షమునుండి దూసికొనిపోయెను. తోడనే వాఁడు భూమిపయింబడియె. అట్లు తన్నుఁదాఁకిన పురుషద్వితయమును మహోగ్రతతోఁ బరిమార్చి, తనవెనుక దెసఁజూచె. అచట తనసేవకులే జయశీలురై యుండిరి. వారిని దాఁకిన నలువురిలో మువ్వురుశవప్రాయులై భూమిపైఁ దన్నుకొనుచుండిరి. ఇఁక నాచోరులలో నొక్కభీముఁడే మిగిలియుండె. వాఁడతిత్వరితక్రియఁ దన తుపాకిని యువకునిదెస గుఱిపెట్టికాల్చుటకు సిద్ధపడియె. అంత నొకక్షణమునకుఁ బూర్వమే బాటసారులలో నొకని పిస్తోలునుండి యగ్నిగోళము భీమునిచెవికి దాపుగా ఱివ్వున రాచుకొనిపోయె. ఇఁకఁ బ్రయోజనము లేదని యెఱిఁగి తనతుపాకిని బాఱవైచి, గుఱ్ఱమునెక్కి యొక్కతన్నుఁదన్ని యదలించి పరువెత్తింపసాగెను. ఏలయనఁగా బాటసారులు మువ్వురగుటచే వారినోర్చుట తనకుఁ గష్టసాధ్యమగుటయు, వారు తనవెనుక ముందులఁగూడ నగ్నిగోళములఁ బేల్చుటయు వానికి మిక్కిలి భయదాయకములైన విషయములగుటచే నాభీముఁడు సత్వరమే యాచెట్లమధ్యనుండి పాఱిపోయెను. పోవుచు నయ్యో! మొదట వానినిఁ దాఁకినప్పుడే, మానాయకుని యాజ్ఞను లెక్కసేయక కాల్చినచో నింతవఱకు రాకుండునుగదా! ఎంత పొరపాటు అని తనలోఁ దాను పశ్చాత్తాపము నొందెను.

ఇచట బాటసారులు మువ్వురును దమవిజయమున కొకరినొకరు మెచ్చుకొనుచు భూమిపయిఁబడియున్న శవములను జెట్లచాటునకీడ్చి త

మగుఱ్ఱముల మరల నెక్కి తమగమ్యస్థానమును గూర్చి పోవుచుండిరి.

అయ్యెడవారిలో యువకుఁడగు మోహనుఁడు తనసేవకులలో నొకఁడగు వానితో "అంగదా! ఇప్పుడు మనలనుఁ దాఁకిన వారెవ్వరై యుందురని నీయూహ?" యని ప్రశ్నించెను.

అంగదుఁడు ప్రత్యుత్తర మీయకపూర్వమే రెండవసేవకుఁడు "దేవా! వీరిదుస్తులనుఁ బట్టి యాలోచించిన వీరుఁ "గోరిల్లా" యను నొకవిధమగు దొంగజాతికి సంబంధించినవారివలెఁ దోఁచుచున్నది" యని చెప్పెను.

పిదప నంగదుఁడు 'నాకును నట్లేతోఁచె. ఈగోరిల్లా తెగవారు మిక్కిలికౄరులు. ఉత్తరహిందూస్థానమున మిక్కిలి పేరువడసిన తస్కరనాయకుఁడగు వీరరుద్రుఁడీ 'గోరిల్లా' తెగవారికిఁ బ్రభువు" అని బదులుచెప్పెను.

అంత మోహనుఁడు "వీరుమనలను దాఁకుటయందు విచిత్రవర్తనులై మెలంగి నటులున్నారుకదా?' అని యనెను.

అంగ—నిజమే! ముఖ్యముగా బాటసారులను దోఁచుకొనిపోయెడి యుద్దేశముగల దొంగలు వీరివలెఁ బ్రవర్తింపరు. అట్టి దొంగలు వెనుక ముందు లాలోచింపకయే పెచ్చుపెరిగి యొక్కుమ్మడి మీఁది కుఱుకుదురు. వీరన్ననో, మనలను దాఁకినతోడనే తమ తుపాకులనుఁ గాల్పక మనతోఁ గత్తిసామునకు డీకొనక, సందే

హాస్పదులైనట్లు ప్రవర్తించిరి. ఏదియెట్లైనను వీరియుద్దేశము చౌర్యమునకన్న వేఱొకటై యుండనోపునని నాయూహ! యని యనుచుఁ దనసహసేవకుని బలభద్రా! నీయూహయేమి? యని ప్రశ్నించెను.

బల—నాకు నట్లేతోఁచుచున్నది.

మోహ—మీయిరువురి యూహలును న్యాయములుగనే యున్నవి. నిజముగా వారియుద్దేశము చౌర్యేతరమే యైయుండు.

వీరిట్లు తమచేనోడింపఁబడిన చోరసమాజముఁ గూర్చి ప్రసంగించుచు నొకరక్షకస్థానమును సమీపించిరి. అది వారేగుచున్న బాటకుఁ బ్రక్కనే నిర్మింపఁబడియున్నది. దానిని సమీపించినతోడనే వారుమువ్వురును గుఱ్ఱములనుండి దిగిరి.

మోహనుఁడు రక్షకస్థానములోని కేగి యచటనున్న రక్షకాధికారిఁ గూర్చి తమకు సంభవించిన మార్గాపాయమును విశదీకరించి, తాము దొంగలశవములను బాటనుండి తప్పించి చెట్లచాటున నుంచితి మనియు, వాని నచటనుండి తొలఁగింపవలయుననియుఁ జెప్పి, యాశవముల నుంచినచోటునకు గుఱుతులనుడివి తిరిగి తనహయమున్న స్థలమునకువచ్చెను. మరల వారందరును హయారూఢులై బాటనుబట్టి పోవుచుండిరి.

అట్లు పరిశ్రాంతచిత్తులై, సవారిచేయుచున్న వీరినొక్కసారి వర్ణనాదృష్టితోఁ దిలకింతము.

మువ్వురిలో ముందుపోవుచున్న మోహనుఁడతిసుందరుఁడు. వానిప్రాయఁ మిరువదియేండ్లు. ఆతని యంగసౌష్ఠవము కడుంగడు సొగసుగానుండి మగవారికైనను నాతనిపై ననురాగము గలుగఁజేయునంతటి మోహనమై యుండెను. వానికుంతలము లతిదీర్ఘములై నల్లనిపట్టుప్రోవులవలె మిలమిలలాడుచు నుంగరములఁ జుట్టుకొని యున్నతభుజాగ్రములమీఁదుగాఁ గ్రిందికి వ్రేలాడుచుండె. మొగము ముద్దులమూటగట్టుచుఁ గామినీమానసాకర్షకమై యుండె. నెన్నుదు రెత్తుగానుండె. కనులు తామరరేకులవలె సోగలై యుండె. వాని చూపులయందుఁ గాఠిన్యభావ మిసుమంతయును లేక, యోధునిదృష్టులకుఁ దగియుండెను. మోహనుని మొగము, వానిసహజమృదుల హృదయమును వెల్లడిసేయునట్లు శాంతరసోద్వేలమై యుండె. వక్షముత్యున్నతమై, తాను దొడుగుకొన్న తెల్లనిమసిలిన్ చొక్కాయనుండి మీఁదికిఁబొడుచుకొని వచ్చుచున్నట్లుండెను. ఆతనిదేహము, ధరింపఁబడిన మృదులవసనములనుండి, పసిడిచాయల వెడలఁగ్రిక్కుచుండెను. గుఱ్ఱపుటూపున కెల్లప్పుడును వానిదేహము కదలుచుండుటచే, నాదేహచ్ఛాయ ద్విగుణంబుగా మిలమిలలాడుచు మనోహరమై కనుపట్టె.

వానిని వెంటనంటియున్న సేవకులిరువురును ముదిరినవయస్సుగలవారయ్యును మిక్కిలి దృఢకాయులై, యారోగ్యచిహ్నములతో నొప్పుచుండిరి. అందంగదుఁడు బలభద్రునికన్నను బలిష్ఠుఁడైనట్టుచూపట్టె.

ఈపురుషత్రియము తమ గమ్యస్థానమును గూర్చి పోవుచుండిరని కదా మన మెఱిఁగియుంటిమి.

సూర్యుఁడు మెల్లనియడుగులతో నాకసపుదారిని నడచుచుండెను. ఇంతవఱకు ప్రచండకరుఁడు తన మార్గములో నాల్గవభాగమును బూర్తిజేసెను. ఆసమయము దాదాపుగాఁ బదిగంటలై యుండనోపు.

అపుడట్లు హయారూఢులై పోయిపోయి తుదకు మోహనాంగదబలభద్రులొక శృంగాటకమును జేరిరి. శృంగాటకమన నాల్గుత్రోవలొకచోఁ గలసికొనినచోటు. దానిని డాసినతోడనే తాము తమగమ్యస్థానమున కేమార్గముననుసరించి పోవలెనో తెలియక యెవ్వరైనఁ దెలియఁజెప్పువారు కనఁబడుదురేమో యని నిరీక్షించుచుండిరి. వారట్లు నిరీక్షించుచున్నంతఁ బరిసరమున నొకకుటీరమును, దానికుత్తరభాగమున నొకచట్రాతిపైఁ గూరుచున్న యొకఁడును దృష్టిపథమునఁబడిరి. ఆమనుజుఁడు మిక్కిలి దృఢకాయుఁడు. వానిదుస్తులన్నియు మాలిన్యభూయిష్ఠములై, యచట నచట జిరుగులువట్టియుండెను. వానిచేత నొకవిధమగు భిక్షాపాత్రయుండుటం బట్టియు, వానిపూర్వోక్తాకారమును బట్టియు వానినొక భిక్షుకునిగా నెంచనగు.

వాఁడు కాన్పించినయంత మోహనుఁడు తనహయమును ద్వరలో వానిదాపునకు నడపించెను. సమీపించి "ఓయీ! నీవెవ్వఁడవో నాకుఁ దెలియదు. కాని యొక్కింత శ్రమదీసికొని శ్రీనగరమునకు దారి యెట్టులో తెలియఁబఱుతువా?" యని యధికవినయముతో ననెను.

ఆహా! తనకన్నఁ బెక్కుమడుంగులన్ని విషయములందును హీనుఁడగు నొకభిక్షుకునిదెస మోహనుఁ డెంతవినయముఁ జూపె! ఏమి! వీని ప్రవర్తనము!

అట్లు ప్రశ్నింపఁబడి భిక్షుకుఁడు కొంతసేపునకుఁ బలుకాడక పిదప నెకింతతలయెత్తి, యొకవిధములగు చుఱుకుఁ జూపులతో మోహనుని మొగము నోరఁగాఁజూచి 'ఆఁ. అదే! ఆమార్గమే' యని యాదెస వ్రేలుసూపెను.

భిక్షుకుని చుఱుకుఁజూపులు మోహనుఁడు కనిపెట్టకపోలేదు. కాని యాచూపులయందుఁగల యర్థమాతనికి మిక్కిలి దురవగాహముగానుండె. ఎట్లైననుఁ దద్విషయమై మోహనుఁడు శ్రద్ధఁబుచ్చుకొనక, భిక్షుకునితో మంచిది! నీప్రత్యుత్తరమున నాకు మిక్కిలి సంతోషమయ్యె. ఇదిగో నాబహుమతిని దీసికొమ్ము' అని తన యంగీజేబునుండి మూఁడురూప్యంబులఁ దీసి యాభిక్షుకుని కిచ్చెను. భిక్షుకుఁ డారూప్యంబులఁ బుచ్చుకొనుటకుఁ దొలుదొల్త సందేహించినట్లు తోఁచె. కాని వానిసందేహము చిరస్థాయిగాకపోయెను. దానినింకను దృప్తినొందని వానివగిదిఁ దనయెడమచేయి సాచి యారూప్యంబుల నందుకొనెను. భిక్షుకుని యాచర్యయు మోహనుని ధీసూక్ష్మతకుఁ బట్టువడకపోలేదు. ఐనను మునుపటివలెనే తద్విషయమై శ్రద్ధఁదీసికొనలేదు. పిమ్మట మోహనుఁడు తనసేవకులను డాసెను. భిక్షుకుఁడు నిరూపించిన మార్గమున నుసరించి యాముప్పురునుఁ గలసిపోయిరి.

ఇఁక నిచట భిక్షుకుఁడు తనచోటునుండి లేచి, పరిసరకుటీరమునకుఁ బోవుచుఁ దనలో 'ఎవనిని నాకుశత్రువుగా నెన్నుకొంటినో, ఎవనిని నా కోపాగ్నిని వ్రేల్పఁబ్రయత్నించితినో, యట్టి వానినుండి నేనుధనమును బుచ్చుకొంటిని గదా' యని రోషభీషణుఁడై తలపోసెను. కుటీరము సమీపించినంత నచట నాసీనుఁడై యున్న యొకవృద్ధుఁడా భిక్షుకునిఁజూచి 'ఏమైనది?' యని యనెను.

'అనుకొన్నట్లే యైనది. వేఱుగా సంభవించునా?' యని కొంచెమాఁగి 'నాదుస్తుల నాకుఁబారవేయుము. ఈదారిద్ర్యముతో నుండుట నాకు మిక్కిలి కష్టముగానున్నది' యనుచు తనభిక్షుకోపధానంబుల విప్ప మొదలిడ, నావృద్ధుఁడు వేఱుదుస్తులను గుటీరాంతరమునుండి తెచ్చి వానికిచ్చెను. ఆదుస్తుల ధరించిన పిదప భిక్షుకుఁడు, భిక్షుకుఁడుగాలేఁడు. వాఁడే వెనుకటిభీముఁడు. వృద్ధునివిడిచి, యొక కాలిబాటను బట్టి యాతఁడరిగెను.

అట్లు పోవుచున్న భీమునివదలి మనము మనపాంథత్రయమును, దిలకింతము. భిక్షుకుని చర్యనుజూచినది యొక్క మోహనుఁడేకాదు. వానిసేవకులును జూచిరి. చూచుటయే కాక మిక్కిలి దగ్గఱనుంటచే వారి ప్రసంగమునుగూడ వినిరి. ఆభిక్షుకుఁడు మోహనునిపైఁ బఱపిన వేఁడిచూపులును, వాని యసమ్మతప్రవర్తనమును, బెక్కు సందేహముల కెడమిచ్చె. వారిట్లుసందేహసంభ్రమములతోఁ బోయిపోయి తుదకుఁబా మేగుమార్గమొక సుందరప్రదేశములోఁ జొచ్చుటఁజూచిరి. ఆప్రదేశమును డాయునంత, తమబాటయునంత మొందె. ఈవిచిత్రమున కచ్చెరువడుచుండ నొకమూలనుండి మర్మరధ్వని వారికివినవయ్యె. ఎటుఁబోవుటకును వారికిఁదోఁచకుండె. తోడనే భిక్షుకునిఁ గూర్చిన వారిసందేహములు వారి మనముల నిశ్చితములయ్యె. ఏదియో తమకు మోసముసంభవిం

చినదని యెఱింగి, వారుమువ్వురును, తమకు వినవచ్చుచున్న మర్మరధ్వని దెసకుఁబోయిరి.

ఆధ్వనికి నొకచక్కని సెలయేఱు మూలకారణమగుట వారు కనుఁగొనిరి! అదియేకాక, యా సెలయేట నిర్మలనీరములకన్న వినిర్మలమగునట్టియు, నచట నీదులాడుచున్న రాయంచలకన్న మనోహరమగునట్టియు, సుమనోమనోజ్ఞమగు వస్తురాజము వారిదృష్టిపథమునఁ బడియె. ఆవస్తువునుండి మణిమరీచులఁ బోలె తేజోరాసులు వెలువడుచుండె. అయ్యది జీవవస్తుచూడామణి. అదియె సౌందర్యమున కాలయము. కావున దానినిఁజూచినతోడనే వారుమువ్వురును దిగ్భ్రమఁజెందిరన్న నతిశయోక్తి కానేరదు.

ఘూర్జరతార.

మూఁడవప్రకరణము.

సుందరి.

ఆసుందరి వసించియున్న దెసకు మోహనుఁడు తనగుఱ్ఱమును మెల్లఁగా నడిపించుచుండెను. మోహనుఁడా సుందరి నొక్కొక్కయడుగున డాయుకొలఁదిని, ఆయువతీమణి సౌందర్యవిచిత్రి మొక్కొక్కటి చూపట్టఁదొడఁగె. ఆసుందరి నిశ్చలచిత్తమున నేదియో యాలోచించుచుండెఁ గాఁబోలు! వినమ్రముఖియై యుండెను. ఆచిత్తైకాగ్రత యెట్టిదో కాని, దాఁపున గుఱ్ఱపుడెక్కలచప్పుడైనను నామెకు వినరానట్లు కాన్పించె. ఆమె ప్రక్కనొక చిన్నవీణియ యుండెను. కొంచెముదూరమున నొకగుడారముచెంత నిద్దఱుయువతు లీమె పరిచారికలు కాఁబోలు కూర్చుండియుండిరి:

తదేకధ్యాన నిమగ్నచిత్తయైన యాసుందరి, నిసర్గమనోహరమగు సౌందర్యము, మోహనునిబోలు యువకుని హృదయరంగమునఁ గొంత బుద్ధీంద్రియక్షోభమున కెడమీయకపోదు. మర్మరధ్వని సేయుచు జలజలఁబాఱుచున్న యా సెలయేఱును ఫలభరవినమ్రములై క్రిక్కిఱిసియున్న యావివిధజాతుల వృక్షములును వివిధవర్ణములగు కుసుమకాం

డములతోఁ జెట్లనుగట్టిగాఁ గౌఁగిలించుకొనియున్న యాలతావితానములును గుసుమములకమ్మని నెత్తావులుతనతోఁ గూడ వహించి యారంగప్రదేశమున విరివిగా వెదఁజల్లుచుఁ దప్పటడుగులు వేయుచున్న మలయసమీరమును మఱియు నిట్టిప్రకృతి మనోహరవస్తువులతోఁ గూడిన యారంగమునం దవతరించిన దేవకన్యకయో యను సందియము మోహనునికిఁ గలిగి యొకింత తడవాశ్చర్య చేతస్కుఁడై యట్టె నిలువఁబడియె. అట్లొక నిమేషమాత్రమునిలిచి, పిమ్మటఁ దనహయమునుండి దిగి యాసుందరియున్న దెసకునడచి, యామెకుఁ బదిగజముల దూరమున నాఁగెను.

ఇంతలో నామెయుఁ దనదీర్ఘాలోచనము వదలి శాంతము నొందినట్లు తన సుకుమారముఖము పైకెత్తి మోహనునివంకఁ జూచెను. తలఁపనితలంపుగాఁ దనకుఁదానై యెట్టయెదుట నిలువఁబడిన యానూతనపురుషునిఁ జూచినయంతనే మహాశ్చర్యముతోఁ "నీవెవ్వరవ"ని యడుగుటకాసుందరి తనబింబోష్ఠమును విప్పకపూర్వమే "సుందరీమణీ! శ్రీనగరమునకీమార్గము మమ్ముఁ గొంపోవునేమో యొకింత జెప్పుమని నిన్ను మేమడుగవచ్చునా! యని వినయపూర్వకముగా మోహనుఁడడిగెను.

ఆమె యాశ్చర్యభయసంభ్రమములు కొంతవఱకు సద్దడఁగెను. దీనికిఁగారణము లారంగబాహుళ్యమే కాక, యానూతనపురుషుని మనోహరాకారమును, వాని వినయపూర్వక ప్రశ్నయునయియుండె. వినయ

విధేయతలతో నడిగిన మనుజునకుఁ బ్రత్యుత్తర మొసంగకుండుట భావ్యముకాదని యెంచినటుల 'అయ్యా! మీరు తప్పుత్రోవకువచ్చితిరి! శ్రీనగరమునకుఁ బోవు మార్గమిచటికి మిక్కిలి దూరముననున్నది' అని మోహనునివంకఁ జూచుచు నాసుందరి ప్రత్యుత్తర మొసంగెను.

మోహనుఁడు తలయూఁచె. అంగదుఁడు నివ్వెఱపడియె.

"ఎంత మోసగాఁడు! మన మనుకొనినట్లే, భిక్షుకుఁడు మనకుఁ దప్పుత్రోవఁజూపినాఁడు కదా! ఇఁక నీకాశ్మీరదేశమునందు వాఁడెచ్చటఁ గాన్పించినను నాకత్తికి బలియిచ్చెదఁగాక" యని బలభద్రుఁడు పండ్లుపటపటఁగొఱికె. సహజముగా బలభద్రుఁడు కోపియగుటచే, మోహనాంగదులకు రానికోపము వానియెడఁజూపట్టె.

ఆసుందరి ప్రత్యుత్తర మొసఁగునంత నామె నేత్రపద్మములనుండి వెలువడి మోహనుని ముఖచంద్రునిపైఁ బ్రసరించిన చూడ్కులు, మనోహరములై, భాను రుచి ప్రసారములై, పూర్ణ యౌవన విలాస భాసురములై యుండుటయే కాక, వానియందు వేఱొకయర్థముకూడ విశదమగుచుండె. ఆ యితరార్థమును మోహనుఁడు తప్పుగా గ్రహించెను. తద్విషయమై మనకథా సందర్భానుసరణిని గ్రహింపఁ జాలుదుము గాన పాఠకమహాశయులోపికఁ గాంచెదరుగాక!

తప్పుత్రోవనువచ్చి, శ్రీనగరమునకుఁ బోవు మార్గమెఱుఁగకఁ గలవరపాటు నొందుచున్న యామువ్వురినిఁ జూచి 'అయ్యలారా! పరిచ

యము లేనివారికిఁ గనుఁగొనుట కష్టతమమైనను, శ్రీనగరమునకుఁ బోవు రాజమార్గము నందుకొనుటకీ ప్రదేశమునుండి యొక చిన్ని బాటకలదు. నేనును శ్రీనగరమునకే ప్రయాణము చేయుచున్నాను'.

ఇచట నాపె తనపల్కులనాపెను. ఏమనిన తాను చెప్పవలయు దానికన్న నెక్కువగాఁ జెప్పుచుంటినని యనుకొనెను. మఱియు, దనపల్కులయందలి గూఢార్థము వారిని దనతోఁ గూడ ప్రయాణము సేయుమనియే యని వారు గ్రహించెదరేమో యని;

సత్వరమే మోహనుఁడు "సుందరీ! నీకు, వేఱుగాఁ బురస్సరులు లేనియెడ, మమ్మునీవెంట రానిత్తువేని, ప్రయాణవశమున నీకు సహాయముగా నుండుటకు మేమెంతయు గర్వితులముగా నుందుము" అని యనెను.

కొంతవఱకా యువతి పలుకక, శిరమువంచి యేదియో యాలోచించి నట్లుండి, పిదప "అయ్యా! మీరును నాకు సహాయులుగా రానగు. నిజమునకు నాకుసహాయులుగా రావలసిన పురుషు లేకారణముననో రాక నన్ను మోసపుచ్చి నటులున్నది. ఉదయమునుండియు నేనును నాసఖులును, ఇచట వారికై వేచియుంటిమి. కాని వారింకను రాలేదు. ఇఁక రారని నాయభిప్రాయము. అదే! ఆదెస నాసఖు లిరువురున్నారు. వారియొద్దకుబోయిన మీకుఁ గావలయు భోజనపదార్థముల నిత్తురు. మనభోజనమైన వెంటనే ప్రయాణమున కుపక్రమింతము." అని మృదుమధురనిస్స్వనముతోఁ బలికెను.

పిమ్మట నంగడుఁడా దెసకుఁ బోయెను. బలభద్రుఁడు మాత్ర మొకింత యాలోచించెను. ఈనూతన సమాగమము వానికి రుచింపలేదు. వాని హృదయమునందేదియో పెద్ద యనుమానము సందడించుచుండెను. అయినను, తన యధికారియగు మోహనుఁడు "పొమ్మ"ని యాజ్ఞ యిచ్చినతోడనే బలభద్రుఁడును, ఆగుడారమునకుఁ బోయెను. అచట మోహనుని సేవకులిరువురును, ఆసుందరి పరిచారికలిరువురితో హితమునుఁ గలుపుకొనుచుండిరి.

పది నిమేషములపిదప, నాసుందరియును మోహనుఁడును మెల్లగనడచి గుడారమును జేరిరి. అచట మనబాటసారుల[illegible]దుసేయఁబడెను. ఆవిందు జఱిగినపుడు ప్రసంగవశ[illegible] హీని' యనియు తానధిక భాగ్యవతి ననియు తన[illegible] సోదరీ సోదరులును లేరనియు, తనతల్లి తనకు మూఁడవయేట[illegible]దత్వమొందెననియుఁ, దనతండ్రి రెండునెలలకుఁ బూర్వమే చని[illegible]నియు, అల్లెవ్వరును లేకపోవుటచే, తనభూముల విషయమైన [illegible] కార్యమున కాప్రక్కనున్న పురమునకేగి పనిఁ జక్కజేసికొని తిరి[illegible]చుంటిననియు. తన కాపురమునన్న 'రైతులు' సహాయమ[illegible]బంపెదమనిన పురుషులను దన్నా ప్రదేశమునఁ గలసికొమ్మ[illegible]ప్పి తాను ముందువచ్చి యచట నుంటిననియు, వారు రావ[illegible]నియమితకాల పరిమాణ మతిక్రమించుటచే మోసపు[illegible]యని యాలోచించుచు నేమియుఁ దోఁచమి నాసెలయేటియొ[illegible]ర్చుండియుండఁగా నాకసమునుండి దిగివచ్చినట్లు మీరు వ[illegible]యు, మొదలుగాఁగల యుదంతమును వాక్రు

చ్చెను. భోజనానంతరమున వారందరును బ్రయాణమునకుఁ దమ తమ హయముల నాయత్తపఱచుకొనిరి.

పదియైదు నిమేషముల పిదప నొక చిన్నిబాటపై వారు గుఱ్ఱములనెక్కి పోవుచుండిరి.

సాయంతనము సమీపించె. దూరమునందు వారికొక వెలుఁగుఁ గా[illegible]నయ్యె. అపుడు మోహిని "అయ్యా! మనము మిక్కిలి దూరప్ర[illegible]ము జేసితిమి. ఆకనుపడుచున్నది యొక ధర్మాత్ముని గృహము. మన[illegible] విశ్రాంతిఁ దీసికొని మరల ప్రొద్దు వొడువక పూర్వమే తిరిగి ప్ర[illegible] సలుపుదము. ఏమనిన నిచటికి శ్రీనగరమింకను ముప్పదియైదు దూర[illegible]నున్నది." యనెను. మోహనుఁడు దానికి దన సమ్మతిని దెలిపెను. [illegible] మాట్లాడుచున్నంతలో యాగృహము సమీపించె.

ఘూర్జర తార.

నాల్గవ ప్రకరణము.

ఈతేనియ యమృతమే.

గృహమునకు ముందొకండు వచ్చుచున్నవారికి నాహ్వానము సలుప నిలువఁబడియుండె. వారార్వురును వచ్చి గృహ ప్రాంగణమున గుఱ్ఱముల నవరోహించిరి. తోడనే యామనుజుఁడును "మీరెవ్వరైనను మా యీగృహమునకు స్వాగతులని దెలియఁ జెప్పుటకు నాకు సంతసము వొడముచున్నది." యని పలికెను. అంతట మోహనుఁడు "మేము శ్రీనగరమున కేగుచున్నవారము. ఈరాత్రికి మాకిచట విశ్రాంతిఁ గలుగఁ జేసిన యెడల మీకెంతయుఁ గృతార్థులమగుదు" మని నుడివెను.

ఆమనుజుఁడును మిక్కిలి సమ్మతించి వారిని దనతో లోనికి రా సన్నఁజేసె సత్వరమే బలభద్రుఁడు తక్క దక్కినవారందరును వానిని వెంబడించి గృహాంతరమునకుఁ బోయిరి.

ఆగృహము మిక్కిలి విశాలమైనది. దానికిఁ బెక్కు గవాక్షము లుండుటచే నాగృహమెల్ల నప్పుడు నిర్మలవాయువుచేఁ బరిపూరితంబయి, యారోగ్యవంతముగా నుండె. ఆమనుజుఁడు గృహాధికారి కానోపు. వారికొక ప్రక్క మూఁడుగదులను జూపి, "మీరీ గదులలో నుండవ

చ్చు" నని చెప్పె. అందు మోహనున కొకగదియు, మోహినీ పరిచారికాత్రయమున కొకగదియు, మోహనుని సేవకుల కిరువురకొక గదియు నేర్పరుపఁబడెను. ఆగదులయందుఁ జక్కని తైలదీపములు దేదీప్యమానముగా వెలుఁగుచుండె. వానియందుఁ బాన్పులమర్పఁబడి యుండె. ఆహారపదార్థములఁ దీసికొనుటకుఁ జక్కని బల్లలుండె.

రాత్రి తొమ్మిదిగంటలయ్యె. కావున భోజన సమయమగుట మోహనుఁడును, మోహినియు నాగృహమునందొక ప్రక్కనున్న భోజనశాలయందుఁ గూర్చుండిరి. అంత మోహిని పరిచారికలు, ఫలాహారములను, ఆసవములను, మధురపదార్థములను, మఱియుఁ దక్కఁగల పెక్కు భోజ్యములను దీసికొనివచ్చి వారియెదుటఁ బెట్టిరి. మోహినీమోహను లాభోజ్యములయందుఁ గొన్నిటిని రుచిఁజూచిరి. ఆభోజ్యములయందు మిక్కిలి రుచ్యమగు నట్టి దిదియ యని మోహిని యొక కాచపాత్రమందున్న తేనియను జూపి "దీనిని ద్రావిన సర్వరోగహరణంబగు. కొండతేనియ మిక్కిలి సౌఖ్యదాయకమని విందురుకదా! అది యే యిది" యని చెప్పుచుఁ దాను దానిలోఁ గొంతభాగమును వేఱొకపాత్రయందుఁ బోసి త్రావెను. తనకప్పటికే తృప్తి తీఱినదనియు, నింక భోజ్యములపై నాసక్తి లేదనియు, మితముగా భుజింపనియెడ ననారోగ్యమునకుఁ గారణమనియు వచించి మోహనుఁడా తేనియను ద్రావుటకు సమ్మతింపలేదు కాని, పలుమారు దాని ప్రాశస్త్యమును మోహిని పొగడుటంబట్టియు- నామె మరల మరల త్రావుమని ప్రశంసచేయుటఁబట్టియు మోహనుఁడు సమ్మతించి తేనియను ద్రావెను. నాలుగైదు

చుక్కలాతని జిహ్వనంటి గళాంతర సీమనుండి యుదర గుహాగేహంబునుఁ జొచ్చెనో లేదో మోహనునియెడ నొకవింత విషయము చూపట్టెను. వానిమొగము నందెఱ్ఱని రంగుపేలికలు కాన్పించె. కనుల యందొక విధమగు నుద్రేకరస మవతరించె. అనిర్వాచ్యమగు నొకనూతనోత్సాహము వాని సర్వరక్తనాళములయందును జలజల ప్రవహించె. క్షోడనే మఱికొంత త్రావెను. సత్వరమే మఱికొంత బుద్ధీంద్రియ విప్లవము ప్రబలెను. "మోహినీ! నిజముగా నీవు చెప్పినట్లీతేనియ యమృతమే! అదేమో కాని, నాకుఁ దల భారముగానున్నది కనులు బరువులుగాఁ దోఁచుచున్నవి" యని తడఁబడుచుఁ బలికి మకరందపాత్రను మరల బల్లపై నునిచె.

అంత "మోహనా! అలసి యలసి వచ్చినవాఁడు వేఁడి వేఁడి యన్నమును భుజించిన నెట్లు సొమ్మసిల్లునో, మార్గాయాసముచే డస్సిన నిన్నీ తేనియయు నట్లే సొమ్మసిల్లఁజేయఁ జాలు" నని పలికెను.

"నిజమేయగు. నీమా...ట...ల...య......"

మోహనుఁడింకఁ బలుకలేకపోయె. వానికన్నులు మూఁతపడియె. జ్ఞానేంద్రియములు వాని మేధాధిక్యమును దిరస్కరించె. సర్వావయవములును వానివశమునుండి తొలఁగె. ఆపై నిదుర వానినావహించె. తోడనే పాన్పుపై నాతఁడు వ్రాలెను. ఇఁక నిప్పుడాతని కీప్రపంచమునఁ దాను లేనట్లు తోఁచెను.

మోహిని మొగము క్రమక్రమముగా వికసింపఁ జొచ్చెను. ఆ

మెకనులయందొక విధమగు తేజస్సు నిలిచె. పెదవులు తమ నాయకి విజయదంభమునకుఁ గాఁబోలు విచ్చియుండె. మోహనుఁడు నిదురవోయి నతత్క్షణమే యాగదినుండి బయలువెడలి, కవాటమును దగ్గరగా వేసి, మోహిని తనగదిలోనికిఁ బ్రవేశించె.

తొమ్మిదిగంటలు దాటుటచేఁ దమనాయకుఁడింక నిద్రబోవు సమయమగుటఁ దెలిసికొని యంగద బలభద్రులు మోహనునికిఁ బ్రాన్పు నాయత్తపఱుప వానిగది యున్న దెసకు మెల్లగాఁ దమగదినివిడిచి నడచి పోవుచుండిరి.

వీరిగది చిట్టచివర నుండుటచే మోహనునిగదికిఁ బోవలెనన్న మోహినియున్న గదెమీఁదుగాఁ బోవలయునని మా చదువరులూహించునది. అట్లు వారిరువురును మెల్లగా మోహనునిగదికిఁ బోవుచున్నతఱి మోహినిగదిలో నేవియో గుసగుసలు వినవచ్చె. బలభద్రునికి మొట్టమొదటనుండియు నీయువతీ సంపర్కమే కారణముననో రుచింపకపోవుటచే, నాతని కాగుసగుసలు వినవలెనని యాసపుట్టె నని నేను మీకు వచించినచో సహజమనియే మీరు భావింపనగు. బలభద్రుఁడా గుసగుసలు వినుటకై మెల్లగా ద్వారమువద్దఁజేరి తనచెవి నాతలుపుపై నుంచి యేకాగ్రతతో విన మొదలిడె. అంగదుఁడు బలభద్రుఁడు చేయుచున్న పని కచ్చెరువడె. ఏమియుఁ బలుకవద్దని బలభద్రుఁడు తీక్ష్ణములైన నేత్రసంజ్ఞలచే నానతిచ్చుటఁజేసి యంగదుఁడు నోరెత్తలేదు. నిమేషద్వయకాలమే వాఁడాగుసలగుసల నాలకించె. పిమ్మట నతిలాఘవంబున నచటనుండి పిల్లియడుగులతో నంగదుని సమీపించి వానిచెవిలో నేది

యో గుసగుసలాడెను. అంగదుఁడట్టె తెల్లబోయి, ఏదియో పలుక నుంకింపఁగా వద్దని చేసన్నఁజేసి బలభద్రుఁడు మరల వానిచెవిలో నేదియో రహస్యముగాఁ జెప్పెను.

ఒక్కక్షణమైనను విలంబనము సేయలేదు. ఒక్కపలుకైన నెలుగెత్తి పలుకలేదు. వేఱొకదిక్కునకైనఁ గనులెత్తి కాంచలేదు. వారిరువురును శరవేగమున గృహాధికారి నిదురవోవుచున్న యాంగణమునఁ బ్రవేశించి వానిపై నొక్కుమ్మడి గుభాలునఁ బడిరి. ఆమనుజుఁడు తత్తరపడి కనులఁదెఱచి చూచునంత, బలభద్రునిచేతనున్న ఖడ్గము తనవక్షమునకుఁ దిన్నగాఁ ద్రిప్పఁబడి యుండెను. అంగదుఁడు వాని గళమును దన రెండుచేతులతో బిగియఁబట్టి "నోరుమూసికొనుము! లేకున్న బలభద్రుని ఖడ్గదేవత నీరక్తమును గుత్తుక బంటిగఁ ద్రావు" నని మేఘగంభీర భీషణములఁ గనులెఱ్ఱజేసి చెప్పె. ఆమనుజుఁడును గ్రుక్కినపేనువలెఁ గదలక మెదలక యుండెను. బలభద్రుఁ డామనుజుని యంగిని బరీక్షించి యందున్న తాళపుజెవి నొకదానిని గ్రహించి యంగదుని కందించె. పిమ్మట వానిచేతులను, కాళ్లను, ద్రాఁడులచేఁ బిగియఁగట్టి, వారిరువురును, నాగదినుండి బయల్వెడలి, తలుపునకు వెలుపలఁ దాళమువేసిరి. తదనంతరము నిశ్శబ్దముగా వారిరువురును, మోహిని యున్నగదిలోఁ బ్రవేశించిరి. అచట మోహిని పాన్పుపైఁ బరుండియుండెను. గదిలోని కెవ్వరో ప్రవేశించిన శబ్దమువిని, వెనుకకుఁ దిరిగి చూచుటకుఁ బూర్వమే యామె యంగద బలభద్రులచేఁ గట్టఁబడి పట్టువడె. బలభద్రునిహస్తమునన్నున్న కరవాల మామె హృదయమునకు సూటిగా నుంచఁబడుటచే

నామె భయకంపితగాత్రయై వడవడ వడంకెను అతిత్వరిత గమనంబున వారిరువురు నామెను గట్టి త్రాళ్లచే బంధించిరి. పిమ్మట నచటనుండి బయల్వెడలి మోహనుం డున్నగదిలోఁ బ్రవేశించిరి.

మోహనుఁడు గాఢనిద్రా పరవశుండై యుండె. వానిమొగము వాడిపోయి వెలవెలఁబోయె. పెదవులు సహజ ప్రవాళరుచిని వీడి గోధుమవర్ణము నొందె. తమనాయకుఁ డట్లుండుటఁజూచి యంగద బలభద్రులు శోకముచేఁ బీడింపఁబడక పోలేదు కాని మిక్కిలి ధైర్యవంతులగుటచే వారు నిరాశనొందలేదు. అచట నొకపాత్రయందు నిర్మలోదకముండుటఁ జూచి బలభద్రుఁ డాదెసకుఁబోయి, తన చేరుమాలు నా నిర్మలోదకమునఁ దడిపి, తిరిగి మోహనుని పాన్పునొద్దకుఁ జేరి తన చేరుమాలుచే మోహనుని నెన్నుదురును శిరమును నొత్తి, బలభద్రుఁడు శుశ్రూషఁ జేయుచుండె. అంతఁ గ్రమక్రమముగ మోహనుఁడు కనులఁ దెఱచి వారిరువురివంకను జూచి గుర్తింపఁ గలిగెను. తమ నాయకుఁడట్లు తెలివినొందుటకు సంతసించి 'దేవా! మనమిచట నింకొక నిముసమైన నుండఁగూడదు. ఏమనిన మనమనేకాపాయముల మధ్య నిఱికికొని యున్నారము. లెండు! శక్తినొందుఁడు! మనప్రాణముల మనము దక్కించుకొందమ'ని వినయపూర్వకమైన త్వరిత ప్రసంగముఁ జేసెను.

మేఘపటలంబునఁ బ్రసరించు నుదయభాస్కరు నరుణకిరణ జాలంబులపగిది, మలిన భూయిష్ఠమైన వాని హృదయమునందు వెనుకటి విషయంబు లొకదానివెంట నొకటి ప్రసరింప మరల జ్ఞానియై బలభద్రుఁడు చెప్పినట్లు మోహనుఁడు చేయఁదొడఁగె. ఒక్కక్షణమైనను వా

రు వృథావ్యయము సలుపలేదు. తత్క్షణమే ముగ్గురును దమ తమ హయముల నధిరోహించి యొకత్రోవ నధికవేగముతోఁ బరువిడిరి. ఆ త్రోవ యెచటికిఁ బోవునో వారూహింపఁ గడఁగలేదు. ఎచటికిఁ బోయిననేమి? రాఁబోవు నపాయములనుండి తప్పించుకొనినఁ జాలుఁ గదా!

అట్లు వారు శరవేగమున సవారి చేయుచున్నయెడ, బలభద్రుఁడు జరిగినదంతయు తన నాయకునికిఁ జెప్పుచుఁ "దేవా! అట్లు మేమిరువురము, మీకుఁ బాన్పు నాయత్తము సలుపవచ్చుచున్న తఱి మోహిని గదియందు నాకుగుసగుసలు వినవచ్చె. చూచితిరా! మొదటినుండియు నాకాయువతీ సంపర్కమే కారణమునో సందేహాస్పదముగానే యున్నది. అట్లగుటచే, నాగుసగుసలను వినుటకు నాకేలనో తత్తరము కలిగె. సత్వరమే మెల్లగాఁ దలుపువద్దకుఁ జేరి వింటిని. మోహిని తన చెలికత్తెతో "మనకు విజయము సంప్రాప్తమైనది. ఇఁక గంటలో భీముఁడు నలువురిని వెంటఁ బెట్టుకొని మోహనుని కాలుసేతులు బంధించి, నానాథుఁడగు వీరరుద్రుని యొద్దకుఁ దీసికొనిపోవు" నను పలుకుల వింటిని.

"ఏమీ? మోహిని వీరరుద్రుని భార్యయా? ఎంతమోసము!! ఎంతమోసము !!!" అని యధికాశ్చర్యముతో మోహనుఁడు పల్కెను.

"దేవా! అందునకు సందేహమా!—అట్లు మనకు రాఁబోవు నపాయముల గ్రహించి సత్వరమే యంగదుని వెంట నిడుకొని గృహాధికారియున్న గదిలోనికిఁ బోయితిని. ఏమంటిరేని, ఎప్పుడు మోహిని వీరరుద్రుని భార్యయని తెలియనయ్యెనో, ఆగృహవాసులకూడ నామె

కు సంబంధించిన వారేయని నేను గ్రహింపఁజాలితిని. కావున ముందుగా వాఁడున్న గదిలోఁ బ్రవేశించి, వానిని బంధించి, వాని యంగీలో నుండిన తాళపుఁజెవిని దీసి, ఆగదికి వెలుపలఁ దాళము వేసితిని. సత్వరమే మోహిని గదిలో మేమిరువురమును కాలిడితిమి. అచట మోహిని నిగూఢ నల్లె కాలుసేతులు బంధించి వెలుపల గొళ్లెముఁ బెట్టి మీ యొద్దకు వచ్చితిమి. మీరాసమయమున గాఢనిద్రా పరవశులై వెలవెలబోయి యుండిరి.

అంతట బలభద్రుని ప్రసంగమునకు మోహానుఁ డడ్డము వచ్చి "ఆఁ. నాకొకటి తోఁచుచున్నది. నేనట్లు వెలవెలబోయి యుండుటకుఁ గారణము మీ రెఱుఁగుదురా! నేనును, మోహినియుఁ గలసి ఫలాహారము జేయుచుండఁగా, నొకవిధమగు తేనియను మోహిని నాకందించి త్రావుమని బలవంతము జేసెను. నాకుఁ దేనియను త్రావు నలవాటు లేదు కావున నాకువద్దని యామెకుఁ జెప్పితిని. నామాటలను వినక, మరలమరల నిర్బంధించెను. నావంటివాఁడింకను నిరసించినచో, మూర్ఖతాగుణమగుననియనుకొని, మర్యాదకొఱకై నను త్రావనెంచి, యాద్రవమును గొంత గ్రహించితిని. నాలుగైదు చుక్కలు నాజిహ్వపైఁ బడియెనో లేదో, చిత్రముగా నామెదడు పరిభ్రమింపఁ దొడఁగె. ఆపరిభ్రమణమునకుఁ గారణ మాసమయమున నేను గ్రహింపలేకపోయితి. ఇపుడా మోహిని సంబంధ బాంధవ్యములిట్టివని తెలియుటచే, నాపె యాతేనియ యందేదియో విషపదార్థమును గలిపెనని గ్రహింపఁజాలితినని యొక దీర్ఘనిశ్వాసమును విడుచుచు సవిస్మయుఁడై పలికెను.

ఆయాశ్చర్యవృత్తమును వినినతోడనే యంగదబలభద్రు లధిక విస్మయముచేఁ గళవళమొందిరి. కాని వారిముఖములయం దధికానందము తాండవమాడుచుండెను. వెంటనే బలభద్రుఁడు "దేవా! దైవమొకఁడీ ప్రపంచమునను, పైనుండి తిలకింపనియెడ, సచ్చరితులు మగ్గుటయు, దుశ్చరితులు వర్ధిల్లుటయు నధికప్రాబల్యము నొందకుండునా! ఏకారణముననో, మీకుఁ బెట్టినవిషపదార్థము జీవక్షయము సేయునది కాదు. కావుననే మరల మీరును మేమును, నిట్లుమాట్లాడుట సంభవించినది. ఒకవేళ మిమ్ములనుఁ జంపుట కాదుర్మార్గుఁడు తలఁచుకొనక, మీమూలముగా నేదియో స్వలాభము నార్జించుటకు మాత్రమే యెన్నుకొనెఁగాఁబోలు. అదియును మనభాగ్యమే" యని యనుచుఁ గొంచెమాగి "దేవా! నావెనుకటి కథనుఁ బరిసమాప్తి నొందింపనిండు. అట్లు మీరు వెలవెలఁ బోవుచుండుటకు మేమెంతయో దుఃఖమునొంది యనేకవిధములగు నుపచారముల మీకుఁ జేసితిమి. మాయదృష్టమునఁ గ్రమక్రమమున మీరు నిదురనుండిలేచి మమ్ము గుఱుతించిరి. పిదప సంభవించిన దంతయు మీకే విశదముకదా!" యనుచుఁ దనప్రసంగమును ముగించెను.

వానిభక్తి విశ్వాసములకు మోహానుఁడు బలభద్రు ననేకరీతులఁ బొగడెను. అంగదునిం బరిపరివిధములఁ గృపాదృష్టితోఁ జూచెను. బలభద్రునివలె నంగదుఁడు సూక్ష్మబుద్ధి కాకపోయినను, మోహానుని యెడ భక్తివిశ్వాసములలో వారిరువురును సమానులే. ఈవిషయము మోహానునికిఁ దెలిసియుండుటచే, నాతఁ డంగదునిఁ గూడఁ బ్రశంసించెననిన మాచదువరులు విస్మయము నొందకుందురుగాక!

నడురేయి సమీపించెను. మోహానాంగద బలభద్రులింకను, నధికవేగముతో సవారిజేయుచునే యుండిరి.

ఘూర్జరతార

ఐదవప్రకరణము.

సందేహమా?

"బుద్ధినైపుణ్యములేమియేనా యీయపజయమునకుఁ గారణము. భీముని(దిట్ట)నేల? పాపము! వాఁడేమిచేసె! నాయాజ్ఞానుసరణిఁ బ్రవర్తించెఁగదా. ఐననిప్పుడైనను జయము సమకూరకుండునా. ఈవఱకే, మోహనుఁడు, మోహిని వన్నినవలయందుఁ జిక్కుకొనియుండును. భీముఁడును వానిసహచరులును, నీవఱకే మోహినిని గలసికొనియుందురు. వారందఱునుఁగలసి, యీవఱకే కుటీరోపాంతమునకు వచ్చియుందురు" అని గొంతెమకోరికలఁగోరుచు వీరరుద్రుఁడు తనకుటీరమునుండి పరిసరప్రాంతమునుఁ దిలకించెను. వానిగ్రహణశక్తి కొకింతయును సరణీయంబుగ భీముఁడట్లేవచ్చె. వచ్చినవాని మొగమునఁ బ్రదర్శింపఁబడుచున్న నిరాశాసూచనములను వీరరుద్రుఁడు తత్క్షణమే గ్రహింపఁగలుగుట వానిహృదయమునఁ బెద్దసీసపుగుండును విడిచినట్లయ్యె. మరల నొకింతసేపులో వానిమొగమెఱ్ఱబాఱె. కనులయందు రక్తనాళములు గుప్పలు గూడుకొనియె. నెన్నుదురు ముడుతలువడియె. ముఖము గంభీరరూపమును ధరించె. పెదవులెఱ్ఱవాఱె. ఇవియన్నియుఁ గోపదేవతాప్రభావమ లని యెఱిఁగి భీముఁడు "నాయకా! నాపైఁ గోపమొంది

న నేనేమియుఁజేయలేను. నాయెడఁ దప్పుకలదో లేదో, ఆవచ్చుచున్న మీభార్యయే విన్నవించు" నని సవినయుఁడై పలికె.

"ఏమి! మోహిని వచ్చుచున్నదా! ఏది! ఏది! యని యధికసంభ్రమముతోఁ బ్రశ్నించెను.

భీముఁడు ప్రత్యుత్తర మీయనవసరము లేకపోయె. ఏమనిన, నాసమయముననే కుటీరద్వారము తెఱవఁబడియె. మోహినీ స్వరూపమా కవాటమధ్యమునుండి లోనికిఁ బ్రవేశించె. ఒక్కక్షణమాత్ర మాలస్యము! మోహినీ వీరరుద్రులిరువురును బరస్పర కరయుగంబులయందు బంధింపఁబడియుండిరి. తానచటనుండుట భావ్యముకాదని తలఁచి భీముఁడా చోటినుండి నిష్క్రమించెను.

ఆగాఢాలింగనమునుండి వారిరువురును, రెండుమూఁడు నిమేషములవఱకుఁ గదలలేదు. పిమ్మట నొకింతదెప్పిరిలి యొకరిమొగముల నొకరనురాగాశ్రుపూరితనేత్రంబులతో నట్టెయవలోకించుకొనిరి. వారివృత్తి యెట్టిదైనదేమి? పరస్పరానురాగము వృత్తికి సంబంధించియుండునా?

మోహినీ వీరరుద్రులొకరినొక రధికముగాఁ బ్రేమించియుండిరి. మోహిని వీరరుద్రుని తనదైవముగా భావించి పూజసేయును. మోహినిని తనలక్ష్మినిగాభావించి వీరరుద్రుఁడు పూజసేయును. కావున యందెట్టి పరస్పరద్వేషమును మనము గ్రహింపలేము.

అట్లు వారిరువురును, బరస్పరముఖావలోకనంబు సలిపిన పిమ్మట వీరరుద్రుఁడు మోహినితో “ మోహినీ ! మోహనుని విషయమేమి” యని నెమ్మదిగాఁ బ్రశ్నించెను.

ఈప్రశ్న గతవిషయములను మోహినిబుద్ధియందుఁ బ్రవేశపెట్టుటచేఁ బ్రస్తుతము ప్రేమవిషయమొకింత యాపె మనమునందు డిందుపడియె. తోడనే జరగినసర్వమును, మోహిని తనభర్తకుఁజెప్పె. వీరరుద్రుఁడా ప్రసంగసందర్భమున, నాయావిషయముల కనుసరణముగా, నాశ్చర్యసంభ్రమ విషాదచేతస్కుఁడయ్యె. తానుపన్నినయొగ్గరము, జయచిహ్నము నొందకపోవుట భీముని తప్పుకాదని యాపె నిర్ధారణముఁ జేసె. కావున భీమునిపైఁ గోపము వీరరుద్రునికిఁ గలుగలేదు.

పిమ్మట కర్తవ్యమును భార్యాభర్తలు దీర్ఘాలోచనమందుఁ బెట్టిరి. ఆయావిషయములను వా రధికబుద్ధి నైపుణ్యముతోఁ దర్కించిరి. తుదకు వీరరుద్రుఁడు మోహినితో నిట్లనెను. “ ప్రియమోహినీ! నేను మార్వారువేషముధరించి కమలనెట్లైనను నావశముఁ జేసికొందును. నీబుద్ధి నైపుణ్యమున నీవెట్లైనను మరల మోహనుని వశముఁజేసికొనఁ గల్గుదువా?” “ఆ. అందునకుసందేహమా” “సరే! అట్లయిన నేనుముందేగి నాకర్తవ్యమును సమకూర్చుకొని వచ్చెదఁగాక. అంతవరకు నీవిచటనే యుండుము ”

అని వీరరుద్రుఁడు మార్వారువేషముధరించి యొకచక్కని హయమునెక్కి దక్షిణమార్గముగాఁ బోయె.

ఘూర్జరతార.

ఆఱవప్రకరణము.

కపటవర్తకుఁడు.

“కమలపయనము సేయుచున్న దీపురముమీఁదుగానని కదా భీముఁడిదివఱకు నాకుఁజెప్పియుండె. ఒకవేళ నీరాత్రి యామె, యీపురమున విశ్రమించి యుండెనేమో! ప్రయత్నించెదఁ గాక ” యని మార్వారువేషముధరించి వీరరుద్రుఁడు తనలో వితర్కించుకొనుచు నొకచిన్నపల్లియలోఁ బ్రవేశించెను.

ఆపల్లియకు వీరరుద్రుఁ డిదివఱకే పరిచితుఁడని మాచదువరులు తెలిసికొందురుగాక. ఆయూరునందుఁ బాంథులకొఱకు విశ్రామగృహమును ధనికుఁడగు నొకయుదారుఁడు కట్టించియుండెను. కమలవచ్చిన యెడలఁ దప్పకయందే యుండునని వీరరుద్రుఁడు నిర్ధారణముఁ జేసికొని విశ్రామగృహంబుఁ జేరె. అచటఁ దనగుఱ్ఱమునుండి దిగి దానిని గట్టివేయుమిషతోఁ గోష్ఠములోఁ బ్రవేశించెను. ఆకోష్ఠమునకుఁ బోవుటయందువీరరుద్రుని యభిప్రాయముగూఢము. కమల, యిరువురుపరిచారికలతోఁ బయనము సేయుచున్నదనియు వారారోహించిన గుఱ్ఱములిట్టిట్టి రూపములచే నొప్పియున్నవనియు, భీముఁడంతకుఁ బూర్వము వీరరుద్రునితోఁజెప్పియుండె. కమలయే సపరిచారికయై, యారాత్రి యావిశ్రామ

గృహమునఁ నుండెనేని, వారెక్కివచ్చిన హయము లాకోష్ఠమునందే గట్టఁబడియుండును. గుఱ్ఱములు వారివేయని నిశ్చయించుకొనుటకు, భీముని వర్ణనమే వీరరుద్రునికి మూలబలము. అట్లగుటచే వాఁడా కోష్ఠమునందుఁ బ్రవేశించి, సూక్ష్మదృష్టితో నచటఁ గట్టివేయఁబడిన హయములనన్నిటినిఁ బరీక్షించెను. వీరరుద్రుని బ్రహ్మానందము నేమని చెప్పనగు! కోష్ఠమునందు వెలుఁగుచున్న దీపపుకాంతి పచ్చిగడ్డిని మేయుచున్న చక్కని మూఁడుగుఱ్ఱములపై నిండుగాఁ బ్రసరించియుండెను. అవియే కమలాపరిచారికలహయములు. వానిని క్షణములో సూక్ష్మబుద్ధియగు తస్కరనాయకుఁడు గుఱుతింపఁజాలెను. వానిమొగమునందుఁ జిఱునవ్వుదోలుకాడె. కాని పరులెవ్వరైన ననుమానమొందెదరేమో యను భయముచేఁ దనసంతసమును డిందుపఱచుకొని, వీరరుద్రుఁడు విశ్రమగృహాధికారిని సందర్శించె. వానితో వీరరుద్రుఁడు తానొకవర్తకుఁడననియు శ్రీనగరమునకుఁ బోవుచుంటిననియు, రాత్రి యాగృహమునఁ దానువిశ్రమించుటకొక గదినీయవలయుననియుఁ జెప్పెను. గృహాధికారియు సమ్మతించివాని నొకగదిలోనికిఁ గొంపోయె. సామాన్యముగా నడిగినట్లును తనకేమియునవసరములేకయే ప్రశ్నించినట్లును తనకటునిటునున్న గదులయం దెవరెవరున్నారని వీరరుద్రుఁడా గృహాధికారినిఁ బ్రసంగవశమునఁ బ్రశ్నించెను. వాఁడును ననుమానము నొందక తత్తద్విషయములకుఁ బ్రత్యుత్తర మొసంగెను. అందుఁ గమల పరిచారికలతో విశ్రాంతినొందుచున్న గదినిగూడ గృహాధికారి, వానిప్రత్యుత్తర సందర్భమునఁ జెప్పి వెడలిపోయెను.

ఇచట నొకింత మనమాగి యొక్కవిషయమును వితర్కింతము. కమల ఘూర్జరదేశపురాణి. ఆమె యత్యధికసౌందర్యము జగన్మోహనమై యుండుటచే జనులందఱు నాసుందరిని "ఘూర్జరతార" యని పిలచుట వాడుకఁగలదు. ఘూర్జరతారయనఁగా ఘూర్జరదేశమునందుఁ జుక్కవంటిది.

"రాణీకమల" యను మఱియొక నామమామెకుఁగలదు. ఈరాణీశబ్దమామెపదవికి సంబంధించియున్నదని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. ఆమెయీనామముననే యెల్లయెడలను మిక్కిలి వ్యవహరింపఁబడుచుండుటఁగలదు. కాని, కొన్నికారణములచేఁ దనరాజ్ఞీత్వమునుఁ బ్రయాణము సేయుచున్నంతవఱకు డాఁపవలసివచ్చుటచే నాసుందరి తననామముయొక్క "కమల" యనిమాత్రమే చెప్పుచువచ్చెను.

అట్టి కారణముచే నామె గృహాధికారికిఁ దననామము "కమల" యనియే చెప్పియుండనగు. ఇదియంతయును వీరరుద్రుని సూక్ష్మబుద్ధికి బాహ్యమునందులేదు. వాఁడు నిజమునే గ్రహింపఁజాలెను.

రాత్రి పదునొకండు గంటలయ్యె. ఆసమయమునందు మారువేషమును ధరించిన వీరరుద్రుఁడు తనదుస్తులలోనుండి యొక నల్లనిరుమాలును వెలుపలికిఁదీసి, తనముఖముపై ముసుఁగుఁగాఁ గప్పుకొనెను. అట్లు ముసుగులో డాఁపబడియున్న వానిమొగమును గుర్తించుట యెంతయు దుర్లభముకదా!

పిమ్మటఁ బిల్లియడుగులతో నొకగదిని సమీపించి, తలుపునొద్ద నిలువఁబడియె. ఉచ్ఛ్వాసనిశ్వాసముల శబ్దముతక్క మఱియెట్టిచప్పుడును వానికి వినరాలేదు. పిమ్మటఁ దనబొడ్డునుండి యొకచూరకత్తిని బైకిలాగి, యెడమచేతియందు దానినిదాల్చి యాగదిలోనికిఁ బ్రవేశించెను.

ఘూర్జరతార.

ఏడవప్రకరణము.

చౌర్యము.

ఒకచక్కని పాన్పుపై మేను సేర్చి కమల నిదురపోవుచుండెను.

ఈ కమలనుఁగూర్చి వెనుకటి ప్రకరణమునఁ గొంతవిశదీకరించియుంటిమి. ఆపెరాజ్ఞీత్వమునకుఁ దగినట్లాసౌందర్యము తేజోవిరాజితమై యొప్పుచుండుటచే నామెకుఁ 'దారాకమల' 'ఘూర్జరతార' యనువిశేషనామములు కలిగెనని గదా వెనుక వాక్రుచ్చియుంటిమి. అట్టి నామములకు మూలకారణమైన యావిలాసము నొకంత మనము నేఁడు విలోకింతము.

ఆసుకుమారి యంగలావణ్యము, మనోహరకుసుమ విలాసమును గేరుచుండును. ఆపె యవయవసౌష్ఠవమెంతయుగణితశాస్త్రప్రకారమున హెచ్చుతగ్గులులేక దిద్దఁబడినట్లుండె. దీర్ఘములై, నల్లపట్టుపోగులవలె మిలమిలలాడుచు నుంగరములు జుట్టుకొని పాన్పుపైనటునిటు విశ్రాంతినొందియున్న యాకోమలకుటిలకుంతలములును, ముంగురులచేఁ గిరీటితంబై, సౌశీల్యభావములచే నధిష్ఠింపఁబడు సింహపీఠికవోలె నైత్తురానన్న, యాలలాటభాగమును, పేలవములైన భ్రూలతలకుఁ గ్రిందు

గా నాకర్ణాంతములై జగన్మోహనములై సుకుమార కమలబద్ధములవలె దివ్యతేజః ప్రభాసితములై వెలుఁగొందుచున్న, యామనోజ్ఞనేత్రములును, మిక్కిలి పెద్దదియునుగాక, మిక్కిలి చిన్నదియునుగాక గురులఘుస్వరూపములకు మధ్యస్వరూపమును బొందిముద్దులమూటఁగట్టుచున్న యావదనమును సంజకెంజాయలచే మెఱుఁగు వెట్టఁబడినట్లు తోఁపజేసి, మన్మథవిలాసాస్థానమై, యెట్టిపురుషునిహృదయమున నైనను, గామవికారమును గలిగింపఁజాలు నామధురాధరోష్ఠబింబమును, లేలేఁతతములపాఁకువలె నవనవలాడుచు, మృదులారుణవర్ణముచేఁ జిత్రింపఁబడి సౌకుమార్యసౌందర్య విలాసభాసురములగు నాసుస్నిగ్ధ గండఫలకములును, రాయంచమెడవలె వాటముగా నంచులుదిద్దఁబడి, మిక్కిలి దీర్ఘము గాక యమూల్యవిమల ముక్తాతార హారములచే నలంకృతమై తేజరిల్లుచున్న యాగళసీమయును, మన్మథమహాసామ్రాజ్యమునకుదివ్యసింహాసనమువోలె నైత్తె, లలితవిలోలనిర్మల సముద్ర తరంగముల పగిదిని నుచ్ఛ్వాసనిశ్వాసములకు లేచుచుఁబడుచు నతిలావణ్యమును వెదలఁ గ్రక్కుచున్న యాకమనీయ గురుతరవక్షోభాగమును, గళసీమనుండి క్రిందుగా దిగిదిగి, వక్షోభాగమునకుఁ బ్రాంతమునసుండి యేటవాలుగా వంగివంగి తుద కత్యాశ్చర్యజనితములుగా పరస్పరసమ్మేళనమునుఁ బొందిన వోయనునటులనున్న యాపె యంగబాహ్యరేఖదృశ్యాదృశ్యమై సింహమధ్యమును గేలిసేయునట్టి యామధ్యప్రదేశమును, నతిసుకుమారరేఖావిలసితములై, లలితకోమల మృణాళములను జ్ఞప్తికిఁ దెచ్చునవియైన, యామృదులకర కమలంబులును, నాపెజగన్మోహన సౌందర్య

సామ్రాజ్యమునకు ముఖ్యరాజ్యాంగములు. అత్యంత సూక్ష్మగ్రాహి యగు నొక మహాచిత్రకారుఁ డెవ్వఁడైనఁ దన హస్తలాఘవంబు నామె యెడఁ జూపినచో, మహాకవియగు కాళిదాససదృశుఁ డెవ్వఁడేని తనమహాద్భుతమేధావిధానము నొకసారి యాపెవంకఁ బ్రసరింపఁజేసినచో, వారివారికెంతటి బ్రహ్మానందము సంభవించియుండు! ఏమనిన సౌందర్యమున కామెయే పరిమాణము. సౌకుమార్య విలాసమున కామెయే నిరుపమానమైన ముఖ్యమూలము. ప్రపంచమున ననేకదేశములం దనేక జాతులయందు జనించిన వివిధరమణీమణులకు వెవ్వేరురూపరేఖా విలాసంబులుండుట విదితము. అది యెట్టిచిత్రమో కాని యావివిధరూపరేఖా విలాసంబులన్నియు, నీసుందరియందు మూర్తీభవించియున్నట్లు తోఁచు.

ఉత్తరహిందూస్థానవాసినులగు రమణీమణులకు సహజమగు నిమ్మపండువంటి దేహచ్ఛాయయును అరేబియాఖండ వాసినులగు కాంతలకు సహజమగు గురుతరవక్షస్స్థలమును, మహమ్మదీయకులసంజాతలగు నారీమణులకు సహజమగు విశాలమనోహర నేత్రపద్మములును, నాంగ్లసీమనలంకరించు సీమంతినీరత్నములకు సహజమగు సుకుమారసూక్ష్మ మధ్యభాగమును, పారసీకమండలమునఁ బుట్టువుఁగాంచు వధూతిలకములకు సహజమగు ప్రవాళాధరబింబమును, నాజగన్మోహిని యందు మూర్తీభవించుటచే, నాపె సౌందర్యము, వివిధవిలాసరసాలవాలమై, యనిర్వచనీయ సౌకుమార్యసర్వస్వమై, విరాజిల్లుచుండె.

ఒక కమనీయ కరకమల మాసుందరి శిరముక్రింద నుపధానమై పరిణమింప, మఱియొకటి వక్షోభాగముపైఁబడి, తద్దివ్యతేజస్సుముద్ర

మున నిమగ్నమైయున్నటుల నిశ్చలమై విశ్రాంతినొందియుండ లేమ పాన్పు నలంకరించియుండె.

వీరరుద్రుఁడా గదియందుఁ బ్రవేశించిన క్షణముననే, యొక కలయందామె కలవరమునొంది కనులఁదెఱచెను. కనులఁ దెఱచినంతనే యాపెహృదయము జల్లుమనియె. ఆపె దృష్టిపథంబున నొక ఘోరాకారుఁడు ఖడ్గపాణియై నిల్వఁబడియుండుట కానఁబడియె. ఘోరభయదేవత యాపెదేహమునఁ బ్రవేశించి కంపమునొందఁజేసె. మొగము పాలిపోయె. నోట మాటరాకపోయె. ఒక్కపెనుకేకవైచి తనకు దగ్గరగా వెవ్వేరుపాన్పులపై నిదురవోవుచున్న తనపరిచారికల మేలుకొలుపుటకామెయెంచె. కాని యంతకుమునుపె యాదొంగవానిఖడ్గ మాసుందరి ప్రాణములఁ గొనునేమో! ఆమెకేమియునుఁ దోఁచులేదు. మంత్రపటుత్వమున నోరు కట్టివేయబడినట్లామె పలుకాడనేరకయుండె. ఇంతలో వీరరుద్రుఁడు పిల్లియడుగులతో మెల్లగా నాపెయొద్దకుఁజేరె. తాను మెలకువతోనుంట కనుగొనినయెడల వాఁడు చంపునేమో యనుభయమున నామె కనులనుమూసె. ఇపుడా సుందరిహృదయమున కిట్లుతోఁచె. 'వీఁడెవ్వఁడో దొంగకదా! వీనిముఖ్యోద్దేశము నాయమూల్యాభరణములఁ దస్కరించుటయే! కావున నేను కనులఁ దెఱువక, నిశ్చలనముతోనుండిన వాఁడు వానిపనినిఁ బూర్తిసలుపుకొనిపోవు! ఈనగలుపోయిన క్రొత్తనగలకు నాకుఁగఱవా! ఏల నిష్కారణముగాఁ బ్రాణాపాయమునుఁ దెచ్చుకొనవలయు'.

ఆపె హృదయవీథిని సంచరించుచున్నట్టి యాయాభావముల కను

గుణ్యముగనే, కమల ప్రవర్తించె. ఆమె నిజముగా నిదురపోవుచున్నదియేయనుకొని, వీరుద్రుఁడా జవ్వని కుడిహస్తమును మెల్లగాతన చేతితో గ్రహించె. వాని రెండవచేయియందుఁగలఖడ్గము, అవసరమగునేని, యాపెయసువులఁ గ్రహించుటకు సిద్ధముగానుండె. దొంగ వాని కరస్పర్శ యాపెకుఁ దగిలియున్నను, కమల కనులఁదెఱువలేదు. ఆహా! ఏమి! ఈసుకుమారిసంస్తవనీయధైర్యము! వీరరుద్రుఁ డామె గళమున మణిమాణిక్యాదులతోఁ జేయఁబడిన హారమును దొంగిలింపలేదు. ఆపె కరకమలముల నలంకరించియున్న రత్నకంకణములనుఁ జూచియు వానిని ముట్టుకొననైనలేదు. అట్లయిన వాని యూహయేమి!

అట్లా కుడిహస్తమును దనచేతితో మెల్లగా గ్రహించి యొక వ్రేలినలంకరించిన. యొకవిధమగు చక్కని రతనపుటుంగరమును మెల్లగా నూడఁదీసి, మరల నాపెమృదుకరమును దాని పూర్వస్థానముననుంచి, వెనుకకుమఱలి మెల్లనియడుగులతో గదిగుమ్మమునొద్దకుఁ బోవుచుండె. ఆసమయమునఁ గమల కన్నులుదెఱచి వానినిఁ గుర్తింపఁబ్రయత్నించెను. ఎట్లు గుర్తింపఁగలుఁగు! మొగము నల్లనివసనమునఁ దాఁపఁబడియుండె. దేహమంతయు దుస్తులలోఁ బొందుపడియుండె. కావున నాతఁడు మిక్కిలి పొడగరియను విషయమొకటిదక్క, యాపెకేమియుఁ దెలియలేదు. వీరరుద్రుఁ డదృశ్యుఁడయ్యె. ఇఁకఁ జెలికత్తియలను మేలుకొలిపి, గృహాధికారియొద్దకుఁబోయి తగినబలముతో దొంగవాని వెంటఁబడి పట్టుకొనవలెనని యామె యాలోచించెను. కాని యా యాలోచన లేమియు నామె హృదయమున నిలువలేదు. ఏమనిన నామె యనిర్వా

చ్య సంతాపసముద్రమున మునిఁగియుండె! సంతాపమేల? తస్కరుఁడు దొంగిలించినది యొక విలువలేని యుంగరమేకదా! కాదుకాదు! ఆ యుంగరము మనకు విలువలేనిదైనను నామెకుఁ దనసర్వభూషణముల కన్నను, విలువగల వస్తువదియే! యేల? అందు చెక్కఁబడియున్న రత్నముచేఁగాదు. ఆయుంగరమును సంబంధించిన వేరువిషయము లాపె నిక్షేపవిషయములు. ఆపె రహస్యవిషయములు. ఆపె ముఖ్యవిషయములు. మనకుఁ దెలియరానివి యాపె కమూల్యమైనవి. వేయేల? ఆ యుంగరమే యామెతనకుఁ బ్రస్తుతముఖ్య భూషణముగానెంచెను. అయ్యో! అట్టియుంగరము దొంగిలింపఁబడెఁగదా! ఇఁక నేమిగతి!

కమల తన కోమలముఖముపై రెండుచేతులను బెట్టుకొని వలవల నేడ్చెను. ఆ చింతావశమున నెప్పుడు నిదురపోయెనో మనకుఁ దెలియదు. పదినిమిషములపిదప గాఢనిద్రా పరవశయై, సొమ్మసిల్లియుండుటమాత్రము మనకుఁదెలియు.

అట్లుతన చౌర్యకార్యమున జయశీలుఁడై వీరరుద్రుఁడు విశ్రమగృహాంగణమును దాటికోష్ఠములోఁ బ్రవేశించి, స్వకుటీరమునకుఁ బారిపోవుటకై తనగుఱ్ఱమును సిద్ధపఱచుచునుండె. ఆసమయమున నెవ్వఁడోయొక పాంథుఁడు హయారూఢుఁడై వచ్చి, యాకోష్ఠమునందిగి, తన గుఱ్ఱము నచటఁ గట్టివేయుచున్నంత, వీరరుద్రుఁడు కాన్పించె. స్వకార్యము సాఫల్యమునొందినవెంటనే తనమొగమును గప్పియున్నవసనమును వీరరుద్రుఁడు తొలంగించె. కావున వానిమొగ మిప్పుడెవ్వరికైనను విశదపడును. ఆవచ్చిన పాంథుఁడు వీరరుద్రుని వెంటనే గుర్తించి, తానా

ఘోరచరిత్రుని సమక్షమున నుండుటకెంతయు భయకంపితగాత్రుఁడై గజగజవణఁకె. ఇంతలో వీరరుద్రుఁ డతిత్వరితమునఁ దనహాయము నాయత్తపఱచుకొని, దానిపై నధివసించి తనత్రోవను శరవేగంబునఁబోయె. మిక్కిలి యప్రసిద్ధినివడసిన వీరరుద్ర ఘోరచరిత్రుఁడా నడురేయిని, విశ్రమగృహమునుండి వెడలిపోవుటకుఁ గొప్పకారణమేదియో యుండవచ్చునని యూహించి, యాబాటసారి సత్వరమే గృహాధికారియొద్దకుఁబోయి సర్వమునుఁ దెలియఁబఱచె. ఆగృహాధికారియును మారువేషమునఁ దన్నుగది కోఱకడిగినవాఁడు వీరరుద్రుఁడేయని యెఱుఁగుటకత్యంతభయ సంభ్రమములనొందె.

సూర్యుఁడుత్తరదిశ నలంకరించె. విశ్రమగృహమంతయు నప్పుడల్లకల్లోలముగానుండె. వీరరుద్రునిచరిత్రము జగద్విదితమును, ఘోరకార్యభూయిష్ఠమును నగుటచేవాని సంయోగమెవ్వరికైనను భయముఁ గలిగించు. వాఁడారాతిరి విశ్రమగృహమునఁగూడ వేషధారియైయుండుటయు, నడురేయిని, యెవరికినిఁ దెలియకుండ హయారూఢుఁడై పోవుటయు నాదిగాగలవృత్తములపుడే విశ్రమగృహవాసులకుఁ గృహాధికారిమూలముగాఁ దెలియవచ్చె.

కమల నిదురనుండిలేచి తనపరిచారికలతో రాతిరి సంభవించినదంతయు వాక్రుచ్చె. ఈపరిచారికల నామములు మాలతియును, మాలినియును. తమనాయకికి సంభవించిన యాసంతాపకరయోగమును గని వారును కన్నీరునించిరి. తనసర్వభూషణములు పోయినను తాను

లెక్కసేయకుండుననియు, నాయుంగరమే తనకొకవిషయమునఁ బ్రాణపదమగుటచే నధికసంతాపమునకు మూలకారణమయ్యెననియుఁ గమల మాలినీ మాలతులతోఁ జెప్పెను. కాని యాముఖ్యవిషయమెయ్యదియో వాక్రుచ్చుమని మాలినీమాలతులు కమలనుఁ బ్రశ్నింపలేదు కావున మనకుఁగూడ గ్రహించుట దుర్లభము. అట్లుకొంతవఱకు వారు చింతాక్రాంతలైయుండ నిదివరకే మనము విశదీకరించిన వృత్తములా గృహవాసులలోఁ గొందరు వారికిఁ దెలియపఱచిరి. తోడనే సర్వమును పూర్తిగాఁ దెలసికొనుటకై పరిచారికాసమేతయై కమల గృహాధికారియొద్దకుఁబోయి వానినడిగెను. ఆగృహాధికారియు "అమ్మా! నిన్నటిరాతిరి తొమ్మిదిగంటలకాలమందు వీరరుద్రుఁడను ఘోరతస్కరుఁడొకఁడు మాఱువేషముదాల్చి నాయొద్దకువచ్చి, తానొకవర్తకుఁడననియు శ్రీనగరమునకుఁబోవుచుఁ ద్రోవలోఁ జీకటిపడుటచే నిచట విశ్రమింపఁగోరుచుంటిననియుఁ దనకొకగది నీయవలయుననియు నన్నడిగెను. నేనును వాని మాఱువేసముననే మోసమునొంది గదినిచ్చితిని" యని చెప్పుచుండఁగా గమల వానికడ్డమువచ్చి "అయ్యా! వాఁడెట్టిరూపురేఖలు కలవాఁడో, వాఁడీగృహమునందున్నయపుడు ధరించినదుస్తు లేరీతినున్నవో యొకింత జెప్పుఁడు" అనెను. "వాఁడుచక్కనివాఁడు. కాయపుష్టికలవాఁడు. మిక్కిలి దీర్ఘదేహుఁడు. వానిమొగము మిక్కిలి గంభీర—"

"వానిరూపవర్ణనతో నికనాకుఁబనిలేదు. కాని వాఁడు నిన్నటిరేయిని ధరించినదుస్తు లేశైలినున్నవో తెలియఁజెప్పుఁడు"

మిక్కిలిదీర్ఘదేహుఁడని గృహాధికారి చెప్పినవెంటనే కమలకుఁ గొంతనిజము తెలిసె. వానిముఖమును దాను జూడలేకపోవుటచే, గృహాధికారివర్ణనతోఁ దారతమ్యము నెంచిచూచుటకు వీలులేమి, ముందు చెప్పినట్లుగా రూపవర్ణనమునాపి యుపధానములరీతి సెప్పుమని గృహాధికారిని కమలయడిగెను. గృహాధికారియు వానిదుస్తులశైలిని విశదీకరించె. తనయుంగరమునుఁ దస్కరించిన చోరుఁడా దుస్తులనే ధరియించియుంట కమలకు జ్ఞప్తికివచ్చె. మరియు దొంగతనము నడురేయిని జఱుగుటయు, నడురేయినే వీరరుద్రుఁడు పారిపోవుటయు నెంచిచూడ కమల వీరరుద్రుఁడే తనయుంగరమునుఁ దస్కరించిన దొంగయని నిస్సంశయముగా నిర్ధారణఁజేసికొనియె. పిదప పరిచారికాసమేతయై కమల గృహాధికారియొద్ద సెలవుఁగైకొని తనగదిలోనికివచ్చి, తనమనోనిశ్చయమును తన సేవకురాండ్రకుఁజెప్ప వారును తమయధికారిణి యూహనే సమ్మతించిరి.

ఉంగరమును దొంగిలించుటయే విచిత్రభావముగాఁగల వీరరుద్రుఁడింకను తన్ను ముందెన్ని యపాయములందు బెట్టఁబోవునో యని భయమునొంది, యిఁకముందుమగవారితోడుగా నుంచుకొనకపయనము సేయకూడదని నిశ్చయించుకొనియె. ఆ నిశ్చయము తనపరిచారికలకుఁ గూడవిశదీకరించె. వారును సమ్మోదమొందిరి. వెంటనే యిరువు రాయుధపాణులగు బలిష్ఠులను దినబత్తెముల నిచ్చుపద్ధతిపై గృహాధికారిమూలముగా సిద్ధపఱచుకొని, యానాఁటియుదయము పదిగంటలకుఁదన శ్రీనగరప్రయాణమునకుఁ గమల మరల నుపక్రమించె.

ఘూర్జరతార.

ఎనిమిదవ ప్రకరణము.

ప్రాణములఁ దక్కించుకొనుఁడు.

ఇరువురాయుధపాణులగు బలిష్ఠులు హయారూఢులై, యిరుఁగెలంకుల రాఁ, జక్కని మూఁడుగుఱ్ఱముల నెక్కి కమలామాలినీమాలతులు శ్రీనగరమునకుఁ బోవుచుండిరి.

శ్రీనగరమింకను డెబ్బదిమైళ్ళ దూరములోనున్నది. మధ్యందినభాస్కరుఁడు తనసహస్రచండకిరణములచేఁ బ్రకృతినంతయు స్పృశించి వెట్టఁగలుగఁ జేయుచుండెను.

వారేగుమార్గమున కిటునటు మహావృక్షములు క్రిక్కిఱిసియుండెను. అచటికి దక్షిణప్రదేశమున మూఁడుమైళ్ల దూరమునందొక ఘోరాటవియుండుటయే యీవృక్షముల సాంద్రతకుఁ గారణమని యూహింపనగు. ఆవృక్షములేకాక, మిక్కిలి దట్టముగాఁ బెరిగిన యట వీని కుంజము లనేకములాబాటను జుట్టుముట్టియుండెను. కావున నట్టిచోట నెవ్వియైన క్రూరమృగములు వసించియుండనగునని యోజించి జాగ్రత్తతోనే వారు సవారిచేయుచుండిరి. అట్లు పోవఁబోవఁ గొంతదూరమున నొకపొదలో 'గలగల' యనుశబ్దము వారికివినవచ్చె. ఆశబ్దము ననుస

రించిన 'గాండ్రుగాండ్రు' మను భయానకగర్జనము వారినిత్వరలో మేలుకొలిపె. ఆయుధపాణు లిరువురు తమతుపాకులయందు మందుదట్టించి, ఖడ్గహస్తులై సిద్ధముగానుండిరి. వెంటనే, యొకభీకరశార్దూలము తన క్రూరవదన గహ్వరమును దెఱచి విసవిసఁబరువెత్తుచు వారిపై కిలంఘించె. సత్వరమే దానిమొగమునకు గుఱివెట్టి యొకఁడు తనతుపాకిని గాల్చెను. ఆగుఱి తప్పిపోవుటచే నాశార్దూలము చలింపక శరవేగముతో నొకనిని గుఱ్ఱమునుండి క్రిందునకులాగివైచెను. ఇంతలో రెండవవాఁడు మరల గుఱివెట్టికాల్చెను. అపుడా గుఱితప్పక, శార్దూలపువీఁపునం దొక పెద్దగాయముఁ గలుగఁజేసె. అంతనదియు మొదటివానినివిడిచి యినుమడించినరోషభీషణ నేత్రములతో నపుడుకాల్చినవానిపైఁ బగదీర్చుకొనుటకై యాదెసకుఁ బోయె. పాపము వాఁడుకూడ భయమునొందియు ధైర్యముఁ దెచ్చుకొని మరలఁ దనతుపాకినిఁ బ్రేల్చుటకుఁ బూర్వమే వానిగుఱ్ఱ మావ్యాఘ్రముచేఁ గఱవఁబడియె. పిదపఁ దానుగూడ మొదటివానివలెనే క్రిందికీడ్వఁబడియె. అదియట్లీడ్చి, వానిని దనక్రూరనఖరములచేఁ జీల్చిచెండాడి, యంకఁ దనదృష్టిని కమలామాలినీ మాలతులపైఁ బఱపెను. పాపము వారధికభయముచే గడగడ వడఁకుచుండఁగా వారెక్కిన గుఱ్ఱములుకూడ భయపడి గింజికొని, కాలికొలంది వెనుకకుఁ బరువెత్తనారంభించె. అదిచూచి వానివిఱికితనమును గ్రహించి యాశార్దూలమద్భుత వేగముతో వారిని వెంబడించుచుండె. ఆమహాపత్సమయమున నుత్తరప్రదేశమునఁ దుపాకి ప్రేలినచప్పుడయ్యె. యొక తుపాకిగుండా పెద్దపులిపొట్టనుండి దూసికొనిపోవ, నయ్యదిభీకరగర్జనముల సేయుచు భూమిపైబడి క్షణములోఁ బ్రాణములవిడిచె. తమప్రాణములఁ గాపాడిన వారెవ్వరో యని తుపాకిప్రేల్వఁబడిన యాదెసకుఁ దిలకించుచుండఁగా నాయెడనుండి మువ్వురు హయారూఢులైన వారారంగమునందుఁ బ్రవేశించిరి. మన మోహనాంగద బలభద్రులువీరే!

మోహనుఁడు సత్వరమే తనగుఱ్ఱమును వారియొద్దకుఁ దోలుకొనిపోయి “సుందరీమణులారా! మీరెవ్వరో నాకుఁ దెలియదు. అయినను మీరు నాయెడ సోదరభావము వహింతురుగాక యని నేను వేడుచున్నాను” అని యనెను.

ఎంతయో వినయపూర్వకముగా, నెంతయో విశ్వాసపూర్వకముగా, నెంతయో సంభ్రమపూర్వకముగా “అయ్యా! మీరు మాపాలిదేవతలవలె వచ్చి మమ్మాపులివాఁతనుండి తప్పింపఁగలిగితిరే కాని లేనియెడ మాగతియేమైయుండు? అట్టి మీయెడ మాకుసోదర భావమే కాక, జీవనములొసంగిన దైవభావమునుగూడ నొందియున్నారము” అని తనసహజ మాధురీకలకంఠ నిస్వనముతోఁ గమల మోహనునిఁ బ్రస్తుతించె. మాలినీ మాలతులట్లేయంగద బలభద్రులను స్తుతించిరి.

అట్లు తనకుఁ బ్రత్యుత్తర మొసంగిన కమల నిసర్గమనోహర లావణ్యరూపరేఖా విలాసములు మొదటిచూపునందే మోహనుని హృదయముఁ నాకర్షించెను. కమలయు మోహనుని, యసమానసౌకుమార్య విలాసమునకచ్చెరువడియె. అపుఁడు మోహనుఁడు “సుదతీరత్నములారా! మీరెచటికిఁ బోవుచుండిరో కాని యిట్లిద్దరినే వెంటబెట్టుకొని,

యీఘోరారణ్య ప్రాంతమునఁ బయనము సేయుచుంటుట మిక్కిలి సాహసకృత్యము. ఏమనిన నియ్యది క్రూరజంతువులకుఁ బ్రియగృహము. ఇచట ననేకపాంథులు శార్దూలముల కెరయైరి." అనెను.

"ఏమి! ఈసంగతిని నేనెఱిఁగియున్నయెడల వలయునంత బలమును వెంటఁబెట్టుకొని వచ్చియుందును. కాని వీరిఱువురిని వెంటఁబెట్టుకొనివచ్చినది శార్దూలభయముచేఁ గాదు. శార్దూలములకన్న క్రూరజంతువని ప్రసిద్ధిఁగనిన మఱియొక వైరికి భయపడి వీరిని వెంటఁబెట్టుకొని వచ్చితి" నని కమల చిఱునవ్వుతోఁ బలికెను.

కమల చిట్టచివర వచించిన పలుకులయందలి గూఢార్థమును మోహనుఁడు సూక్ష్మబుద్ధి కావున వెంటనేగ్రహించి "ఆక్రూరజంతువు వీరరుద్రుఁడే యని నేననుకొనియెద" నని పలికెను.

అత్యాశ్చర్యముతోఁ గమల "మీరెట్లు గ్రహింపఁజాలితిరి?" యని యడిగెను.

"ఈప్రదేశము వీరరుద్రుని దండయాత్రలకుఁ బేరునొందియున్నది కావున నేనపుడే గ్రహింపఁజాలితిని"

"అట్లే మేమునువింటిమి? మీరెప్పుడైన వానినిఁ జూచియుండిరా?"

"వానినిఁ జూచియుండకపోయినను, వానిచే నపాయమ్ము నొందింపఁబడితిమి? ఆకథ తరువాత మీకుఁజెప్పెద" నని తనసేవకుల వంకఁ

దిరిగి "మీరాకళేబరములను బాటనుండి తొలఁగించిరండు. పిమ్మట ముందురాఁబోవు రక్షకస్థానమునకుఁ బోయి జరిగినసర్వము నచటి యధికారులకు విశదీకరించి కర్తవ్యము నూహింతము" అని చెప్పెను.

అంగద బలభద్రులు మోహనుని యాజ్ఞానుసరణినట్లే పోయిరి.

వారేగినపిదప మోహనుఁడు "మీరేపురమునకుఁ బోవుచుంటిరో యడుగనగునా?" యని సవినయముగా నడిగె.

ఆయువకుని వినయపూర్వక సంభాషణమును, వానియనుపమాన సౌందర్యవిలాసమును, గమలహృదయమునందు వానియెడ నొకవిధమగు హితభావమును గలిగింపఁజేసె కావున తనగమ్యస్థానమునుఁ గూర్చి మోహనునికిఁ జెప్పుటకామె సందేహమునొందక "అయ్యా! ఒక ముఖ్యకార్యమునకై మేము శ్రీనగరమునకుఁ బోవుచుంటి" మని పలికెను.

"ఏమి! మీగమ్యస్థానము శ్రీనగరమా! మేముకూడ నచటికే పోవుచుంటిమి. కావున మీకునేనొకటి ధైర్యముతోఁ జెప్పఁదలచినాఁడ. మీరును మేము నొకేనగరమున కేగుచుంటిమికదా! మీరుమగతోఁడు లేక పోవుట, యీమార్గములయందు మిక్కిలి యపాయకరము. అట్లగుటచే మీరును మేమును గలసి పయనము సేయుటకు సమ్మతింతురని నాకోరిక" యని విమలహృదయపూర్వకముగా మోహనుఁడు వారి నడిగెను.

వెంటనే "అయ్యా! మాకంతకుమించి వేఱుభాగ్యము కలదా

యని మందహాసముతోఁ బలికెను. పరిచారికలును, నట్లే పలికిరి.

శరచ్చంద్రసాంద్ర చంద్రికల వెదజల్లు నామె మందహాసమొనర్చునపు డోష్ఠద్వంద్వ మధ్యమునుండి తళతళ మెఱయుచు విమలమౌక్తికములను బురుడించియున్న యాపె విమలరదన పంక్తులు మోహానునికత్యద్భుతమును జనింపఁజేసె.

ఇంతలో సంగద బలభద్రులు తమ పనిని ముగించి మోహానుని గలసికొని “దేవా! తాము సెలవిచ్చినరీతి నంతయునుఁ జేసితిమి”యని పలికిరి.

అంత వారితో వారేగినపిదపఁ దనకును గమలకును జరిగిన ప్రసంగమును సంగ్రహముగాఁ జెప్పెను; బలభలద్రుని కాయువతుల సంయోగమున కిష్టము గలుగలేదు. ఏమనిన నిట్లే, యొక యువతినినమ్మి వారందఱు నిదివఱకొకసారి మోసపోయిరి? ఆయువతి మోహినియని మాచదువరులకు మేము చెప్పనక్కఱలేదు.

ఐనను మోహినికిని గమలకునుగల తారతమ్యమును వాఁడు త్వరలో గ్రహించెను. కమల మొగమునందు సౌశీల్యమును, హృదయనైర్మల్యమును, విమలానుకంపయును జాటఁబడియుండె. కాన బలభద్రుఁడు మొదట సందేహించినను, మఱికొంత యాలోచనానంతరమున వాని సందేహములన్నియు నస్తమించె. పిమ్మట వారందఱునుఁ గలసి పయనమున కుపక్రమించిరి. వారార్వురును మూఁడు జంటలుగా విభజింపఁబడిరి. కమలా మోహానులొకజంట—మాలిన్యంగదులు మరియొక

జంట—మాలతీబలభద్రులు వేఱొకజంట—ఇట్లుమూఁడు జంటలుగా వారు వేఱుపడి శ్రీనగరమునకుఁ బోవుఁ మార్గము మీఁదుగాఁ బయనము సేయుచుండిరి. కమలా మోహానులొకరితో నొకరత్యంత మోదముతో నేవియో విషయములఁ బ్రసంగించుకొనుచుండిరి. మాలిన్యంగదు లొకరితో నొకరు వర్తమానదేశస్థితినిఁ గూర్చి ముచ్చటించుకొనుచుండిరి. మాలతీ బలభద్రులొకరితో నొకరా పరిసరప్రకృతి విషయమునుఁ బలికికొనుచుండిరి. అట్లు పరస్పర స్నేహభావమున పయనము సేయువారికా మాటలసందడిని మార్గాయాసము కాన్పింపదయ్యె.

సూర్యుఁడస్తాద్రి నలంకరించె. సంధ్యారాగ పరాగము ప్రకృతిపైఁ బ్రసరించి, దానికి జపాకుసుమ వర్ణకవచము నిచ్చె: తూర్పుదిక్కును ధూమశకటాశ్రయమునుండి బయల్వెడలి, యాకాశమను వయోమార్గము మీఁదుగాఁ జండ జ్వాలల వెడలఁ గ్రక్కుచుఁ బయనము జేసి సూర్యుఁడను ధూమశకటము తన గమ్యస్థానమగు పశ్చిమదిక్కును వేఱొకధూమ శకటాశ్రయమును జేరుటచే నిఁక నాగుమని సూచించు కాలమును భారవాహి యెత్తిపట్టిన యెఱ్ఱ జెండాయనఁ బశ్చిమదిశ రక్తవర్ణపరిశోభితమై యలరారియుండె.

ఆసమయమునఁ గమలా మోహానులు తమతమ పరిచారికాసేవకులకు నేనూఱుగజముల దూరమందుండిరి. అపుడు జీర్ణవస్త్రధారియైన యొకభిక్షుకుఁడు వారికిఁ బ్రక్కఁగా నిలవఁబడి భిక్షవేడె. సహజమృదులహృదయయగు కమలభిక్షుకుని వీక్షించి జాలినొంది, తనసహాయమునాపి

వానిచేత నాల్గురూప్యంబుల నిడె. అట్లే మోహనుఁడు తనగుఱ్ఱమునాపి వానియెడఁ జాలినొంది, యంగీనుండి యొకచక్కని దంతపు బరిణెను దీసి, దాని మూఁతను దెఱచి, కొన్నిరూప్యంబుల నందుండి తీసి వాని కీయఁబోవు నాక్షణమునందే వానిగుఱ్ఱమొకింత సకిలించుచు నెడలు కదల్చె. ఆకదలికచే మోహనుని చేయినుండి బరిణె జారి భూమిపైఁ బడియె. పడినతోడనే దానియందున్న వస్తువులన్నియు భూమిపై విడివడి యుండె.

ఆహా! అతివిచిత్ర మతివిచిత్రము! నేలపైఁబడిన వస్తువులయందేమికలదు? కమల యనుకొనినట్లు తనచేతిరతనపుటుంగరము! ఆమె ముమ్మాటికిని యాయుంగరము తనదేయని నిశ్చయించుకొనెను. తోడనే యామెకొక గొప్పసందియము కలిగెను. ఏమని? వాఁడే మారువేషమునున్న వీరరుద్రుఁడని! లేనియెడల తనచేతి రతనపుటుంగరము వాని యొద్ద నుండుట కేమికారణము? తనయుంగరమునకుఁ జెక్కఁబడిన రతనమే దానికిఁ జెక్కఁబడియున్నది. దానికిఁ జేయబడిన నగిషీపనియే యొకింతైన హెచ్చుతగ్గులేక దీనికిఁగూడఁ జేయఁబడియుండె. దాని వర్తులమునకు దీని వర్తులమునకును నణుమాత్రమైన భేదము లేకుండె. కాన కమల వేరుగా నూహించుటకు లేశమైన నవకాశము లేదు! ముమ్మాటికిని లేదు !! వీఁడే వీరరుద్రుఁడు! వీఁడే వీరరుద్రుఁడు !! ఇదియే యామె నిశ్చయము. తనగదిలోఁజొచ్చి యుంగరమును దస్కరించుటతో సంతృప్తినొందక పిశాచమువోలె వెంటఁబడి తన్నింకను ముప్పతిప్పలఁబెట్ట రుద్రుఁడు నిశ్చయించుకొని యట్టి గూఢవేషముతోఁ దన్ను వెంట

నంటెనని యామె నిశ్చయముగా నమ్మెను.

అట్లు కమల తలపోయుచున్నయెడ మోహనుఁడు గుఱ్ఱమునుండి దిగి, భూమిపై విడవడియున్న వస్తువులను మరల బరిణెలోఁ బొందుపఱచి, భిక్షుకునికి నాల్గురూప్యములనిచ్చి మరల గుఱ్ఱముపై నెక్కెను. కమల హృదయమునందు సంచరించుచున్న వివిధభావములు మోహనునికేమియుఁ దెలియవుకదా!

కమల తనసందియము నిసుమంతయైనను బయల్పరుపలేదు. వెనుకటివలెనే మోహనునితో గంభీరభావముఁదాల్చి యామె ప్రసంగింపఁదొడఁగె. ఇంతలోనె మాలిన్యంగదులును, మాలతీ బలభద్రులును వారినిఁ గలిసికొనిరి. పిమ్మట వారందరునుఁగలసి మరల పయనము సేయఁదొడఁగిరి.

సూర్యుఁడు పూర్తిగా నదృశ్యుఁడయ్యె. తమోరేఖలు భుజంగములవలె సర్వవస్తు ప్రపంచముపైఁ బ్రాకె. ఒక్కటొక్కటిగా తారలాకసమునఁ జూపట్టె. అది కృష్ణపక్షము కాన చంద్రుఁ డింకను నభోమార్గము నలంకరింపలేదు.

ఆసమయమున మన పాంథనిచయమొక చక్కని పట్టణమునుఁ జేరెను. ఆపట్టణ బాహ్యప్రదేశమునసే యొకచక్కని సత్రము కలదు. ఆసత్రపుసింహద్వారమున కమలామోహను లాదిగానార్వురును గుఱ్ఱములనుండి దిగిరి. వెంటనే యాసత్రాధికారి వారియొద్దకు వచ్చెను. వానినిఁజూచి "అయ్యా! మీ రెవ్వరు" అని మోహనుఁడడిగెను. ఆ

మనుజుఁడు తానే యాసత్రాధికారినని చెప్పినంత మాకార్వురికి నీరాత్రి మీసత్రమునందుఁ దగిన వసతి దొఱకునా" యని మోహనుఁడు ప్రశ్నించెను. "దొఱుకకేమి? కాని యొకటిమాత్రము మీతో ముందుగాఁ జెప్పవలసియున్నది. ఈసత్రము సౌధమగుటచే, పైయంతస్థు పురుషులకును గ్రిందిభాగము స్త్రీలకును ప్రత్యేకము వినియోగింపఁబడుచున్నది. మీకట్లుచేయుట యంగీకారమేనా" యని యడిగెను.

"నాకంగీకారమే. అమ్మా! నీకుంగూడ యొప్పుదలయేనా?" యని మోహనుఁడు కమలనుఁ బ్రశ్నించెను.

క్షణమైన జాగుసేయకఁ దనకుఁగూడ నంగీకారమేయని కమల వాక్రుచ్చెను.

"సరే! అట్లయిన ముందుగామేము లోనికిఁబోయి మన మనవసతులఁజూచి వచ్చెదము. అంతవరకు మీరిచటనున్న మేముతిరిగివచ్చి మీవసతియొద్దకు మిమ్ముఁ గొంపోయెదము" అనిపలికెను.

అందులకుఁ గమల తనసమ్మతిని దెలిపెను. అనంతరము మోహనాంగదబలభద్రులు తమతమ హయములతో సత్రప్రాకారమును నిర్గమించిలోనికిఁ బోయిరి.

వారు లోనికిఁబోయిన క్షణముననే కమల తనగుఱ్ఱముపై, చివాలుననెక్కి దాని నొక్కసారి గాటముగా నదలించి, వెనుకఁ దత్తరముతోఁ దన కృత్యమునుఁ జూచుచున్న పరిచారికలతో "రండు!

పరువెత్తుఁడు! మీప్రాణముల దక్కించుకొనుఁ"డని యఱచుచు శరవేగమునఁ దన హయమును బరువెత్తింపసాగెను. ఆమాటలయందర్థము నాపరిచారికలు గ్రహింపఁజాలకపోయినను నేదియో యపాయము రానున్నదని వారు వెంటనేగ్రహించి, తత్క్షణమే తమహయములనెక్కి వానినిశరవేగమునఁ బరువెత్తించుచుఁ గమలనువెంటనంటిపోయిరి.

నిశ్చితమైన యొకమార్గము ననుసరింపక వారిగుఱ్ఱములను చెట్లనుండియు, డొంకలనుండియుఁ, గడుంగడు వేగమునఁ బరువెత్తించుచుండిరి.

ఘూర్జరతార.

తొమ్మిదవ ప్రకరణము.

పూర్వసువాసిని.

అట్లు వారుముప్పురును బ్రచండవేగంబునఁ బలాయనము సేయుచుండిరి. మూఁడుగడియల కాలమట్లొకేరీతినిఁ బరువెత్తుటచే వారి హయములు మిక్కిలి యలసిపోయి వెసవెస నూర్పులుసేయసాగి తొట్రువాటువడ నారంభించె. కాన వారలుద్రుతగతిని విడిచి గుఱ్ఱములను మెల్లగా నడుపింపసాగిరి.

ఇంతవఱకు వారిముప్పురియందొక్క పలుకైన నాఁడఁబడలేదు. తమ విచిత్రరహఃపలాయనమునకుఁ గారణమును మాలిసీమాలతు లణుమాత్రమైన గ్రహింపలేకయుండిరి. తద్విషమై కమలయును వారితో ముచ్చటించుట కవకాశము నేర్పఱచుకొన నశక్తురాలయ్యె. ఇఁక నిపుడు వారు మందగతితో నేగుచుంటఁ గమల సమయమును స్వీకరించి వారితో భిక్షుకుని దర్శనమునకుమీఁద జరిగినవృత్తాంతము సర్వమును వారికి నుడివెను.

వారి విస్మయము నేమనివర్ణింతుము? భయము, ఆశ్చర్యము, సంభ్రమము, విస్మయము, సంతాపము, వేయేల సర్వవిధోపద్రవ భావములును వారిహృదయ సీమలనాట్యమాడె. తుదకుమాత్రము తమ విముక్తికి వారెంతయు నానందమొందుచు నొకింతకాలము తమ మనముల నాద్యంతరహితుని ధ్యానించిరి.

అట్లు వారు ధ్యానించుచుండఁ గనుచూపుదూరమునసుండు దీప కాంతులు వారికిఁ గానవచ్చె. ఇంకను డాయుతటి నావెలుఁగుగాన వచ్చుచున్నది యొకచక్కని సౌధమునుండియని వారికిఁ దెలియనయ్యె. మఱికొంతదాపునకుఁ జేరినంత వారియూహ నిజమయ్యె. ఆసౌధస్వాముల యానఁగైకొని వారచట నారాతిరి విశ్రమింపఁదలఁచి సౌధప్రాకారద్వారమునఁ దమహయములనుండిదిగి, ద్వారమునొద్దకుఁబోయి రెండుసారులుతట్టిరి. వెంటనే యొకర్తుక తలుపుఁదీసె. ఆమె యగుపడిన వెంటనే కమల అమ్మా! మేము శ్రీనగరమునకేగుచుఁ దోవఁదప్పి, యిచ్చోటునకు వచ్చితిమి. మాకీరాతిరి నీసౌధమునందు విశ్రాంతిఁ దీసికొన వీలుకలుగునా" యని యడిగెను.

వినయపూర్వకమైన యాపె ప్రార్థన, తలుపుఁదెఱచిన స్త్రీ హృదయమున మైత్రిని సంపాదింపఁగలిగె. వెంటనే యామెయు నంగీకరించి వారిగుఱ్ఱముల నొక కోష్ఠములోఁ గట్టివేయ తనసేవకులలో నొకనిని నియోగించి కమలామాలిసీమాలతులఁ దనవెంట సౌధాంతరమునకుఁ గొంపోయెను. ఈమె యీసౌధమున కధికారిణియైయుండెనోపు:—

ఈమెకు రమారమి నలువదివత్సరంబులుండు. ఈపె భర్తృమృతుండై దాదాపు పదివత్సరములుగడచియున్నను, యీపెముఖవర్చ

స్పింకను సంతాపరేఖామిళితమై యుండె. ఆమెకిరువురు చుక్కలబోలు చక్కని కొమారితలుకలరు. అందొకకన్య ప్రాయము పదియారేఁడులు. వేరొకకన్యవయస్సు పదునాలుగేండ్లు. ఈమెభర్త చనిపోయిననాఁటనుండియు, సంసారభారము నీమెయేవహించుచుఁ గనుజాగ్రత్తతోఁ గాలముఁ గడపుచుండె. మృదులహృదయయగు నామె కొమరితలే సర్వసంతోషములను సమకూర్చుచుఁ దొల్లింటి యాపెదుఃఖప్రవాహమున కడ్డు వేయఁ జాలియుండిరి.

కమల తనపరిచారికలచే నన్నమును వండించుకొనెదనని చెప్పెఁ గాని మృదులహృదయయగునామె వారిని వండుకొననీయకఁ దమయింటనే భుజింపుఁడని ప్రార్థించె. లోకమర్యాద ననుసరించి యెంతనిరసించినను యామె యియ్యకొనక బలవంతముసేయఁగాఁ గమల వేరుగాఁ జెప్పనేరకపోయె.

అంతనామె వారికి చక్కనివిందును సలిపె. భోజనానంతరమున కమలాపరిచారికలు తమయమ్మగారికిఁ బాన్పునమర్పవేఱొకగదిలోనికిఁ బోయిరి. ఆపూర్వసువాసినియుఁ గమలయు నొకచోఁ గూరుచుండి వెవ్వేరు విషయములఁ బ్రసంగించుచుండిరి. ఆప్రసంగవశమున నామె కమలకుఁ దనచరిత్ర నీక్రిందివిధముగాఁ జెప్పెను. ఇట్లు భర్తృమృతినొందిన దుఃఖముననే నేను మరపిల్లుచుండఁగా, నాకు గర్భనిర్భేద్యమగు వేరొక దుఃఖకారణము సంభవమయ్యె. నాకు మువ్వురుకొమరితలు- అని చెప్పునంత,

“ఏమి! మీకు మువ్వురాపుత్రికలు? ఇచట నిరువురేకదా యుండిరి. మఱియొకపుత్రికయెచటనున్నది?”యని కమల ససంభ్రమముగా నడిగెను.

“అమ్మా! ఆవిషయమునే నేను వాక్రువ్వనెంచితి ” నని యామె చెప్పెను.

ఇపుడాపె కనుదమ్ములనుండి దుఃఖాశ్రువులొక్క దానివెంట నొకటి బొటబొట గండస్థలములమీఁదుగాఁ జాఱె. “పాపము! జనకుని త్రోవనే పోయెగాఁబోలు? ” నని కమలపలికెను. కమల మొగమునందు సంతాపసానుభూతులు ప్రకటింపఁబడియుండె.

ఆపెయు తనయశ్రువులుఁ గొనగోటమీటి “అమ్మా! తొందరయేలఁ? తుదముట్టవినుఁడు. నాగర్భసీమ నలంకరించిన ప్రప్రథమశుక్తిముక్తాఫలమగు నాప్రస్తుతకథానాయకి నామము అయేషా. ఇప్పటికి జీవించియే యున్నయెడల నామెకిపు డిరువదిరెండేండ్ల ప్రాయము. జగన్మోహనమగునా ‘అయేషా’ నిసర్గసౌందర్యము వాడవాడలను విదితమే. అట్లు కడుంగడుఁ బ్రఖ్యాతివడసి, రారాజసద్మశులగు రసికాగ్రణులచేఁ బూలపూజ నందఁదగిన యాపె సౌందర్యము నామెపాలికి దేవుడిచ్చిన విషపాకమే యని తలఁచెద. క్రమక్రమముగాఁ జిగిలించి, పూవులుపూచి, సర్వాంగపరిశోభితమై, నేత్రానందమై, వెలుఁగొందు సుకుమారలతికవలె, నా‘అయేషా’ మనోహరవయోవిలాసము నంతక్రమముగా నొందె. ఆయౌవనప్రాయమున నీయూరనున్న యొకధని

కుఁగికిని నాకొమరితకును స్నేహభావము ప్రజ్వరిల్లె. ఆధనికుఁడు యువకుఁడును, వివిధభాషాపరిచితుఁడును, సంస్తవనీయ సౌందర్యవిభాసితుఁడును నగుటచే వారివారిస్నేహభావము శుక్లపక్షపాకరునిరీతిఁ బరిపక్వమై తుదకుఁ బరస్పరావ్యాజానురాగ విలాసమునొందె. ఆయువకుఁడప్పుడపుడు నాయొద్ద కేతెంచి తన "కయేషా" యెడ జనించిన గాఢానురాగము నొక్కొకింత విశదీకరించుచు, వారిరువురకును, ద్వరలో నుద్వాహముసేయ నన్నియకొనుమని బ్రతిమాలె. జవ్వనులకు సహజమగు లజ్జాభావముచే నాపట్టితన మనోభిప్రాయమును నాకు బహిరంగముగా వచింపకపోయినను, ఆమె హృదయమును నేను పూర్తిగా నెఱింగియేయుంటిని. ఇరువురును పరస్పరానురాగానుబంధితులై యుంట, వారికిఁ గొలఁదికాలములోఁ బెండిలిసేయ నెంచితిని. కాని తానొకటితలంచ, దైవమొకట దలంచు, ననునార్యోక్తి కీర్తిబోవునా!"

ఇచట నామె యొకింతయాగి మరలకన్నుల నీరునించెను. ఆసమయమునఁ గమల పరిచారికలు వారిసన్నిధికేతెంచి కమలతో "అమ్మా! పాన్పునాయత్తపఱచితిమి యని చెప్పుచుండ వారి కామెను జూపించి పదినిమేషముల పిదపవత్తును మీరుపొండని పలికెను. వారును వెంటనే గ్రహించి తిరిగిపోయిరి. వారేగిన పిదప యామె తనవిషాదకథాసూత్రమును మరల ననుగమించి, యిట్లని చెప్పఁదొడఁగెను.

"రంజాన్" అనునది మహమ్మదీయులకు ముఖ్యమగు పండువులలో నొకటియని నీవెఱుఁగుదువుకదా! ఆపండువు దినములలో ఢిల్లీసు

ల్తానునకు సుందరీమణులను బహుమతిగా నిచ్చు ఘోరాచారముండుటయు నెఱిఁగియేయుందువు.

"ఆ! ఎఱుఁగకేమి! మా దేశమునం దిది క్రొత్తవింతకాదు. ఆసుల్తానుని, యనంతైశ్వర్యముల నోలలాడి, వానియుంపుడుకత్తెలుగా నుండఁగోరి, తమకుఁదామే యనేకసుందరీమణు లాపండువు దినములలో ఢిల్లీకిఁబోవుదురు. అంతియకాక, వానిప్రాపకము నార్జించుకొని, దానిచే సంతానములకు గొప్పపదవులనుఁ గూర్చ నాసతోఁ దలిదండ్రులే బుద్ధిపూర్వకముగాఁ దమపుత్రికల బహుమతిగాఁ బంపుటయును గూడ విదితమే"

"అట్లనేక సుందరీమణులా సుల్తానుని భవనమునకుఁ బోవుదురు. అందరిని స్వీకరింపక వారియం దధికసౌందర్యవతి నెవ్వతెనో యొకర్తును మాత్రమే సుల్తానుచేకొనును. ఈదురాచార మనేకఘోరకృత్యముల కెడమిచ్చినది? ముఖ్యముగా సుల్తానుని ప్రాపకము నార్జించుకొని, తన్మూలమున నైశ్వర్యము నొందుటకుఁ గొందరు దుశ్చరితులు సుందరీమణులనుఁ దస్కరించుకొని పోవమొదలిడిరి అట్టివారలలో నొకఁడగు సౌందర్యవణిజుఁడు నేటికి నాలుగువత్సరములకు ముందు నాగృహమునకు వచ్చెను. వాఁడు వచ్చినదినము లాపండువుదినములే. వానివెంట నార్వురుచక్కని కన్యలును, నలువురాయుధపాణులగు మనుజులును, నుండిరి. ఆదుర్మార్గుఁడు నాకొమరితనుఁజూచి, యామెనుఁ దనకు విక్రయింపవలయుననియు నట్లు విక్రయించినయెడల నాకనేకలాభములు కలవనియును బోధించెను. అమ్మా! కడుపార తొమ్మిదినెలలుమోసి, కని, పెంచి

నకొమరితను చేతులార నీచలాభతృష్ణకెట్లొగ్గుదు? కావునేను వానిపైఁ గోపించితిని. తాను నాకు లంచమునిత్తుననెను. భూములనిత్తుననెను. రమ్యహర్మ్యములు కట్టింతుననెను. ఎంతకైనను నేనీయకొనక వానిని గృహమునుండి వెడలనడంచెదనని యదలించితిని. దైవలిఖితము వేఱుగానుండ నాయదలింపు లేమిసేయు. లంచములచేతను, ప్రార్థనచేతను, లభ్యముకాని కార్యమును వాడు బాహుబలమున సాధించెను. నేనును, నాతక్కఁగల కొమరితలును రెక్కలు విఱిచి కట్టఁబడితిమి. పిదప నా ముద్దుల 'అయేషా' వానిచే బలిమిమై గొంపోవఁబడియె. ఆవిపత్సమయమున నాగారాబుపట్టి యెంతదుఃఖించెనో యెంతభయమొందెనో యాదేవునికే తెల్లము! నేనేమిసేయఁగలుగుదు. నాసేవకులు పొలములకుఁబోయిరి. నాకెవ్వరును దిక్కు లేరు. కాన చేయునదేమియును లేక నేనును నాకొమరితలును భోరుననింతసేపేడ్చితిమి. సాయంతనమునకు నాసేవకులువచ్చి మాకట్లనువిప్పిరి. పిదప పాపమా ధనికయువకుని కీవిషాదకరమగు సంగతి తెలియవచ్చిన వెంటనే ఢిల్లీనగరమునకుఁ బోయె. అచటికిఁబోయి యత్నింపగా, నాఱునూఱుల సుందరీమణులలో 'నయేషా'ను రంజాక్ బహుమతిగా సుల్తానంతకుఁ బూర్వమే, యెన్నుకొని స్వీకరించెనని వానికిఁ దెలియనయ్యె. అంతనా ధనిక యువకుఁడు నిరాశనొంది, యనిర్వచనీయదుఃఖవివశుఁడై, వెనుకకుమరలివచ్చె. అని యొకింతయాఁగి మరల 'నమ్మా! ఇదియేనావిషాదవృత్తమని తనచరిత్రనుసంపూర్తిఁజేసె. ఆపెయెడ కమల కడుంగడుఁజాలి నొందెనని మాచదువరులకు మేము నొక్కి వచింపనక్కరలేదు.

అనంతర మాపె యొద్ద సెలవుఁగైకొని కమల తనకేర్పరుపఁబడిన గదిలోనికిఁబోయి మాలినీమాలతులను గలసికొనియె.

ఆమువ్వురును నాగదియందు వెవ్వేరుపాన్పులపై మేనులు సేర్చి పిదప నిదురవోయిరి.

సూర్యోదయమైన వెంటనే వారు నిదురనుండిలేచి, మరల శ్రీనగరప్రయాణ సన్నాహితులై, యాపూర్వసువాసిని యొద్దను, నాపె పుత్రికలయొద్దను సెలవుఁగైకొని శ్రీనగరోన్ముఖులై గుఱ్ఱములనెక్కి పోయిరి.

ఘూర్జరతార.

పదియవ ప్రకరణము.

ఘోరభుజంగము.

"నీభర్తగారు నీకీయుంగరము నిమ్మనినన్నుఁ బుత్తెంచినారు. తీసికొమ్ము" అని భీముఁడొక యుంగరమును మోహినిహస్తమునఁ బెట్టెను.

ఆయుంగరము నవలోకించినంత మోహిని మనోవీధి నెట్టియానందము సంచరించెనో యలేఖ్యము.

"భీమా! ఈయుంగరము నాభర్తకెట్లు దొరకెనో నీకుఁ దెలియునా"

కమల యొకవిశ్రామగృహమున నుండుటయు వీరరుద్రుఁడదియెఱింగి, యాపెగదిలోనికిఁ బ్రవేశించుటయు నాదిగాఁగలమనకుఁ బరిచయములైన విషయముల భీముఁడు, వీరరుద్రుఁ డేతనకుఁ జెప్పెనని, మోహినికిఁ జెప్పుచు "అమ్మా! నీతోనింకొక విషయమునుఁగూడ వచింపుమనియె. నిన్నటిసూర్యోదయమున నుండియు కమల శ్రీనగరప్రయాణమును జేయుటచేఁ, దప్పక, నీభోజన, నీసమయమునకు, యీబాటనేవచ్చు

చుండును. కావున నీజాగ్రత్తతో నీవుండుమనె" యని వీరరుద్రుని సందేశమునుఁ జెప్పి, యామెయొద్ద సెలవుఁగైకొని, యెచ్చటికో పోయెను.

ఆయుంగరమునం దేమిమర్మముకలదో కాని, దాని నొక్కొకసారి ముద్దువెట్టుకొనుచు, నొక్కొకసారి కనులనద్దుకొనుచు, నొక్కొకసారి భయభక్తులతోఁ దిలకించుచు ననేకవిధములగు చేష్టలనామె చేయఁదొడఁగె. అమితసంతోషపారావారమున నామె మునింగి, తన్మయహృదయయగుటచేఁ గాబోలు నీకమాకానందము లభింపకుండునా యని యెలుఁగెత్తిపలికి వెంటనే యులుకుఁజెంది తనమాట నెవ్వరైనవినిరేమో యని యటునిటు బిత్తరపుఁజూపులఁజూచెను. కాని యచ్చటను మనుజుఁడులేఁడు. ఎట్టిశబ్దమును నచట వినరాకయుండె. కానియామె కనతిదూరమున నొకచిన్నసెలయేఱు మాత్రము పరువిడుచుండు త్రాచుపామువలె మెలికలుదిరిగి గులకరానేలపై జలజలబ్రాకుచుంటఁ గలిగినబాధకుఁగా నోపు గొణగొణగొణుగుచుండె. ఆఝరీతటమున మావిమొదలగు ఫలవృక్షములు ఫలభరవినమ్రములై యైశ్వర్యమొందిన సచ్చరితుని లక్షణమును జాటుచుండె. ఆవివిధపాదపములొకదాని నొకటికౌఁగిలించుకొనినట్లుండుటచే సూర్యకిరణములు వానినుండి నిర్గమింపలేక యగ్రములపైఁబడి సోమరిపోతులవలె నిద్రింపఁజొచ్చినట్లుతోఁచె. చండప్రతాపుఁడగు మార్తాండునెదిర్చిపోరలేక కాలికొలఁది బరువెత్తిన పందలగు నీడలావృక్షముల శరణుగోరి వానిచాటుననక్కియుండె. ఆచెట్లనీడలందే యొకచల్లనిచోట మోహినికూర్చుండి యుండెను.

వెనుకఁజెప్పినరీతి నుంగరమునుఁజూచి వివిధవికారముల నామె

సలుపుచుండఁగా ముప్పదుసుందరులా ప్రాంతమునకు గుఱ్ఱములనెక్కి వచ్చిరి. అపుడు మధ్యాహ్నమగుటఁ బట్టియు గుఱ్ఱములలసియుండుటచే తమకు దాహముకూడ నన్నముఁదినవలసి యుండుటచేతను వారాచల్లని మామిడితోఁపునందు తమగుఱ్ఱములనుండి దిగిరి.

మోహిని వారినివెంటనే గుర్తింపఁజాలెను. ఆజగన్మోహన సౌందర్యము మోహినికెంతయో యాశ్చర్యకారణ మయ్యెను.

కమలయును బరిచారికలును మోహినిఁజూచి యట్టిమధ్యాహ్నసమయమున తోఁటయందామె యొంటిఁగా విశ్రమించియుండుటకుఁగారణమూహింపలేక పోయిరి. మోహినియును కమలామాలతీ మాలినులు నొకరినొకరవలోకించుటకిదియే ప్రథమతరుణము. కమలయెవ్వరో మోహినియెఱుఁగును గాని కమలామాలినీ మాలతులలో నెవ్వరును మోహిని నెఱుంగరు. అయినను వారందరు స్త్రీలేయగుటచేఁ బరస్పరపరిచయప్రాప్తికి వెనుదీయులేదు.

వారినిఁగూర్చి తనకేమియుఁ దెలియనట్లు "అక్కలారా! మీరెవ్వరు" అని మోహిని యడిగెను. "నాపేరుకమల. వీరు నాపరిచారికలు. మేమందరమును ఘూర్జరదేశవాసినులము."

వారియెడ ననిర్వాచ్యస్నేహభావమునకుఁ గడంగుచున్నటులఁ బ్రవర్తించుచు కపటమందహాసాంకురములు, సుకుమార బింబాధరములపైఁ జిందుచుండ "మీరెచటికిఁబోవుచున్నారు?" అని మోహిని వారిని

ప్రశ్నించెను. "మేము శ్రీనగరమునకుఁ బోవుచున్నాము" అని యొకింత యాఁగి "మీరెవ్వరు?" అని కమల మోహినినడిఁగె.

"నేనిచటికి మైలుదూరముననున్న ధారానగవాసినిని. నాపేరు సరోజిని." అని మోహిని ప్రత్యుత్తరమిచ్చెను.

ఏవృక్షచ్ఛాయ నీ స్త్రీసంఘమున కుత్తరప్రత్యుత్తరములు జరగుచున్నవో, యావృక్షశాఖలయందేయుండి వారందఱిలో నెవ్వరిని తన కాహారముగా నొనర్చుకొందునాయని యాలోచించుచుండినట్లుండిన, యొకవిధమగు ఘోరభుజంగము (నిజముగా నొకపాముచెట్లకొమ్మలయందుండె.) నకుఁగల వాడికోఱలయందెంతటి క్రూరవిషముకలదో, యంతవిషము మోహినీదృక్కులయందుకూడ గలదని పాపము కమలకేమి తెలియును?

కమలకుఁదన సత్యనామము నెఱింగింపకపోవుటకుఁ గారణ మొక్కటేకలదు. కమల తనస్వరూపమును, నిదివరకెన్నఁడునుజూచియుండకపోవుట నిస్సందేహ విషయమేయైనను, తనపేరైనను వినియుండవచ్చునని మోహిని తలంచెను. కావుననే, తనపేరు "సరోజిని" యని మోహినిచెప్పెను.

ఆపె కపటస్నేహమునకును కైతవకటాక్షములకును, నిజముగాఁ గమలామాలినీమాలతులు మోసపోయిరి.

పూర్వోక్తరీతిని మోహిని వారితోఁ బరిచయముఁ గలిగించుకొనుచుండఁగా నచటికొక స్త్రీవచ్చెను.

ఆపె వయస్సేబదియైదేండ్లు. ఆపెకుంతలములన్నియు గాక నచటనచట గొన్ని నెఱసియుండె. ఆపెధరించినకాషాయాంబరములవలెనే, ఆపెదేహచ్ఛాయయుఁగాషాయవర్ణముగానుండె. ఎడమహస్తమునందొక వెండిబెత్తముఁదాల్చి, కుడిచేతనొకదంతపుపెట్టియను బట్టుకొని, యామె వారున్నదెసకువచ్చుచు ననతిదూరమునుండి "అక్కలారా! అమోఘమూలికలు! అత్యద్భుతౌషధములు" అని కేకవేయుచు వారినిడాసి, ప్రక్కగా నుపవసితయై, తనచేతనున్న దంతపుఁబఱణినిఁదెఱచి "ఇదుగో! ఈమూలికలు సర్వవిషహరములు. వీనిచే నేనెందరిప్రాణములనో కాపాడియుంటిని. ఈమూలికాసేవచే నెట్టివిషమైనను విఱిగిపోవు. వీనిచే నాకు దిగంతరదంతురమైన యశస్సుకలిగినది. కొనుఁడు. ఈఁమందరచేఁ జేయబడిన రాజౌషధముల నుపమానములు. మఱియునివిగో! ఇవిపరిమళపుష్పసారములు. మీకుభర్తలుగాని, ప్రియులుగాని, యుండకపోరు. వారికి మీరీపుష్పసారముల నిచ్చినయెడల బ్రహ్మానందము నొందుదురు" అని గంభీరకంఠనిస్వనముతోఁ బలికెను.

మందరపలుకులయం దనుమాత్రమైన కపటమున్నట్లు వారికిఁ దోపలేదు. కావున వారామెనుఁ జూచి తలయూఁచిరి.

"నామాటలను మీరు విశ్వసింపుఁడు. ఈమూలికచేతనే నాలుగేండ్లకుఁ బూర్వము, కాశీరాజును పునర్జీవిగా జేయఁగలిగితిని. ఓర్వలేని భటుఁడొకఁ డారాజు భుజించెడియన్నమునందు విషముఁగలిపె. ఆ విషభోజనమును గ్రహించుటచే, మృతినొందుట కారాజుసిద్ధముగానుండ నేన వానికీ మూలికాచికిత్సను సలిపి ప్రాణములవోసితిని. అప్పుడునా.

ఇచట మోహిని యులికిపడి పెద్దకేకవైచె. ఏమి! ఇంతవఱకును చెట్లకొమ్మలయందు వారిశిరములకు సూటిగాఁబొంచియున్న క్రూరభుజంగము బుసకొట్టుచుఁ దటాలున మోహిని బుజములపైఁబడి, దండవలె నామెశిరమునకుఁ జుట్టుకొని, తనఘోరదంష్ట్రలతో నామెమొగమును గఱచెను. ఆకస్మికముగఁ బిడుగుపైఁబడినట్లు లెక్కగ నవారందరు విస్మయభయస్తంభీభూతలై, వెనుకకుఁదగ్గిరి. 'మందర' యొకర్తుమాత్రము మాత్రమైనఁ జలింపక తనచేతనున్న వెండిబెత్తముతోఁ దానిశిరమును గ్రుచ్చెను. అదియును బుస్సుమనుచు లేచి మందరపైఁబడ నుంకించుచున్నంతలో సమానపటుత్వముతో మందర యింకొకసారి తనబెత్తముతో గట్టిగా దానినిమోదె. ఆగాఢఘాతికా క్రూరవ్యాళముశిరము వ్రక్కలుకాగా, గీలసడలినేలపై వ్రాలి నిశ్చేష్టమయ్యె. పాము పరలోకమున కేగినపిమ్మట, వారందరును, నేలపైఁబడియున్న మోహినియొద్దకుఁ బోయిరి. ఆపెకనులు మూఁతపడియె. మొగమునందు రక్తవర్ణము క్షీణింపసాగెను. సహజారుణోష్ఠములు క్రమక్రమముగఁ బాండురవర్ణమిశ్రమయ్యె. కాలుసేతులు జల్లబడియె. గాయమపడినచోటినుండి రక్తము బొటబొటఁగఁ గాఱుచుండె. కరుణాపూరితలగుఁ గమలామాలినీమాలతులు ఆపెమొగమునుండి గాఱుచున్న రక్తమును తమ చేరుమాలులతోఁ దుడిచి కట్లుగట్టనారంభించిరి. పాపము, మోహిని మృతినొందునని కమల తలంచి కన్నీరు నించెను. ఇంతలోన, 'మందర' తనబరణెనుండి యొకమూలికనుఁదీసి దానినిఁ జేతితో చిన్నిచిన్నిముక్కలుగా విఱుచుచుండెను. అట్లు విఱుచుచు "అక్కలారా! వగపుఁజెందిన బ్రి

యోజనము లేదు. మీరేమియు భయము నొందకుఁడు. భగవంతుఁ డామె యెడఁ గరుణాస్వభావుఁ డయ్యెనేని, మూలికచే నామె పునర్జీవినియగుఁ గాక. మీలో నెవరైన నొకరేగి, యల్లదె! ఆసెలయేటినుండి దోసిటజలముఁ గొనిరండు" అని పలికెను.

ఆకార్యాచరణమునకుఁ గమలమాలినినిఁ జూచి సన్నఁజేసె. వెంటనే మాలిని సెలయేటికిఁ బోయి తన దోయిటఁ జలము గ్రహించి మందర యొద్దకేతెంచెను. వెంటనే తన బరిణెనుండి చక్కని చిన్న గాజు పళ్లెరము నొకదానినిఁ దీసి, దానియందా యుదకము నుంచుమని మందర మాలినికిఁ జెప్పె. ఆమెయు నట్లుచేసి మోహినియొద్దకుఁ బోయె. ఆనీటియందా మూలికా ఖండములనుంచినతోడనే నవియన్నియుఁ గఱఁగియదృశ్యములయ్యె. వెంటనే, యాద్రవమును మోహినియొద్దకుఁ గొంపోయి దానినామెచేఁ ద్రావించెను.

"అమ్మా! ఏమైన నాశకలదా" యని కమల సాభిలాషయై యడిగెను.

"ఎట్లు నిశ్చయముగాఁ జెప్పగలను. నాకుఁ జేతనైనది నేనొనర్చితిని. ఇఁక దైవమునదే భారము" అని మందర పలికెను.

ఆసమయమున మోహిని, యొకింత కనులు దెఱచి తనప్రక్కగా నున్నవారినిఁ జూచె. వెంటనే "అక్కలారా! నాకీచోటనే మరణము తప్పదు. మీరందఱు నాకొఱకుఁ దుఃఖిల్లనేల? నేను నిర్భాగ్యురాలను. దీను

రాలను. పాపిని. నాయెడ మీరు జాలినొందనక్కఱలేదు. పొండు తొలఁగిపొండు. అమ్మా! కమలా! నీపరిచారికలను, నామందరను దూరముగాఁ బొమ్మనుము! నీతో నేను కొన్ని రహస్యముల ముచ్చటింపవలయు" నని పలికెను.

అట్లే మందరయును, మాలినీమాలతులును దూరముగాఁ దొలఁగిపోయిరి.

అంత మోహిని తనదృష్టిని కమలాముఖముపైఁ బ్రసరింపఁజేసి "అమ్మా! కమలా! నేను నీకుఁ జెప్పఁబోవు నాశ్చర్యవృత్తాంతములను నిర్భయముగా వినుటకు సిద్ధముగానుండుము! నేను నీతోఁ జెప్పినట్లు సరోజినిని కాను. ఆఁ! అదియే! ఉలికిపడకుము! ఓర్పుతో వినుము! నాపేరు మోహిని! ఇంకను విచిత్రమేమన, నేనే నీయుంగరమును దస్కరించిన వీరరుద్రుని భార్యను!"

ఈనూతన విచిత్ర విషయములు సపదిస్ఫుటభావోపద్రవములకు మూలములై కమలను కలవరమొందింపసాగె. తానంట! వీరరుద్రుని భార్యయంట!

"నేను నానాథురహస్యమును, నాబాంధవరహస్యమును నీతో నిపుడీరీతిఁ జెప్పుచుండుటకుఁగల కారణమేమాయని నీవు తర్కించుకొనకుము. నేనును, నాభర్తయును నీకధికహానిఁ దలంచియుండుట ముమ్మాటికిని సత్యమే. కాని కాలము మాఱినది. నాయాశలును, నాభావములును, నాభాగ్యములును, వేయేల తుదకు నాజీవములుకూడ, పది

యిరువదినిమేషములలోఁ దప్పక తుదముట్టును. నేనిపుడే మృత్యుదేవతాలయము లోనికిఁబోవు సోపానముల నెక్కియుంటిని. ఇఁక రెండుమూఁడు మెట్లుగడచిన నేనుదీతోఁ బలుకకుందును. అపుడే నాకన్నుల కా యమదూతలు కాన్పించుచున్నారు. ఆ! కాన్పించుచున్నారు. అయ్యో!"

నిజముగా యమదూతల సమ్ముఖమున నున్నదానివలె గజగజవణఁకి మొగముపైఁ జేతులిడికొని కొంతసేపూరకుండి, మరల కనులు తెఱచి హీనస్వరముతో ''కమలా! నాబ్రతుకిఁక నిమిషములోనున్నది. కావున నేఁ జెప్పనెంచినది త్వరలో ముగించెద. నాజీవితమంతయు దుశ్చరితములప్రోవు. ఇఁక నేను నరకమందిర ద్వారమునకు ముందుగా నుండుటచే నాదుష్కార్యాచరణము లిపుడు పశ్చాత్తాప బోధకములైనవి. చచ్చుచున్నపుడుఁ గూడ దుష్టవర్తనము చేసిన నన్నుఁ బరలోకమునఁ బెట్టు హింసస్ఫురించుచున్నది. కావున నావెనుకటి దుష్కృతమునకు నన్ను క్షమించితిననుము. నాకదియే చాలు.

''అమ్మా! నీవు వీరరుద్రుని భార్యవైనను నేనెంతమాత్రమును నీయెడ కఠినత్వమును దాల్పను. అట్లే నిన్ను క్షమించితిని.

''ఆహా! కమలా! ఇప్పటికిఁగదా నీవిమలహృదయమును గ్రహింపజాలితిని. దేవకన్యకా సదృశవగు నిన్ను చిక్కులుబెట్టవలచినట్టి దుర్మార్గురాలను, దుష్టురాలను, రాక్షసిని. నాకుఁ బరలోకమునం దేనరకబాధ యెదురగునో కదా! దానినిఁ దప్పించుకొనుటెట్లు?" అని కొంచెమాగి తనకంచుకము నుండి యొకవస్తువును దీసి ''కమలా! ఇదిగో నీయుం

గరమును నీవుగైకొనుము." అని కమల కాయుంగరము నిచ్చెను.

తనరతనపుటుంగరము, మరల తనకు వచ్చుటచేత, కమలకు సంభవించిన బ్రహ్మానందము నేమనివర్ణింతును! అంతటి దయార్ద్రస్వభావముతో నవసానకాలమునందు మెలఁగిన మోహినిని తనబాహువులతో గ్రుచ్చి కౌఁగిలించుకొని ''మోహినీ! నీయుదార స్వభావమును, నేనెట్లు ప్రస్తుతింతు? నీఋణమును నేనెట్లుతీర్తు?" నని హృదయపూర్వకముగాఁ గమలవచించె.

''నీవునాకేమియు దీర్పనక్కఱలేదు. కాని నాకోరికనొక్కటి నెఱవేర్పుము అదియేనాకుఁ బదివేలు.'

''మోహినీ! నీకోరికను దీర్పననియందునా!

''అట్లైన నిటువినుము! నేనుమృతినొందుట విని నాభర్తయగు వీరరుద్రుఁడు నీవిషయమున నికనెట్టిసంబంధమును గలుగఁజేసికొనఁడు. కావున నిదిమొదలు వానిపైఁ బగదీర్చుకొనుటకు యత్నింపననియు, నలువురున్నచోట వానినామము నుచ్చరింపననియు, నీవు ప్రమాణముఁ జేయుము. నాకదియే చాలు."

అట్లే కమల ప్రమాణముఁజేసెను.

''మంచిది! అదియే నాకుఁబదివేలు! వింటివా! దుర్మార్గుఁడైనను, నాభర్తయే నాదైవముగా నేను భావించుకొని యుంటచే, వాని

కింక ముందెన్నటికిని నీచేహాని కలుగకుండుటకై, యిట్లొనర్చితినిసుమా! ఇట్లు ప్రమాణముఁజేసియుంట, నీకేవిధముననైనను సహాయకరముకాదు! అమ్మా! కమలా! చచ్చిపోవుచున్నపుడుకూడ నీయెడనేను హానితలంతునని యనుకొనుచుంటివా?

“లేదు. లేదు. ముమ్మాటికిని లేదు. నిన్ను సాముకొంచినదాది, గత దుశ్చరిత్రమునకుఁ బశ్చాత్తప్తురాలవగు నీయెడ వైరభావము మానియుంటిని. మఱియు నీకొక్కటి చెప్పఁదలఁచుకొన్నాను. నీకు నేనెఱింగినంతవఱకు, నెవరిచేనైనను హానికలుగఁబోదు. కాని యొక్కనిని మాత్రము నీవుకనిపెట్టి యుండవలెను. వాఁడెన్నటికైన నీకు ఘోరాపాయమును కలుగజేయు”

“ఎవ్వఁడు? ఎవ్వఁడు? వానినామమేమి” యని యత్యంతసంభ్రమముతో గమల మోహినినిఁ బ్రశ్నించెను.

“వానినామమా! వానినా—ము—ము—ప—హే—ప హే—ప—ప

తనచెవిని యామెనోటిపై నొగ్గివినెను. అంతకును, నామెకంఠస్వరము హీనమయ్యె. నోటినుండి పచ్చనినురుగలఁ గ్రక్కసాగెను. ఆమె నాలుక పొడవై నోటినుండి బయటికి సాగివచ్చినట్లయ్యె. పలుపలుకు లేల? ఆమె తనప్రాణముల విడుచుటకుసిద్ధమయ్యె. ఆసమయమ్మున ప—హే—ప—యనుచు, హీనస్వరమునఁ జెప్పిననామము ‘హేమ

చంద్రుఁడా’ యని కమలతనలోఁ దానువితర్కించుకొనుచు మందరయును దనపరిచారికలును, విశ్రమించిన చోటికిఁబోయి వారినిఁ గలసికొని మోహిని మృతినొందుటకు సిద్ధముగానుంటఁ జెప్పి తనపరిచారికలను శ్రీనగరప్రయాణమునకు హయముల నాయత్తపఱుపుమనెను. వారును నట్లేచేయుచుండగా గమల మందరనుజేరి యామెకరములఁ దనకరపల్లవములఁగ్రహించి ‘అమ్మా! మందరా! మనము చేయునదేదియును లేదు! మోహిని యీవఱకే ప్రాణములువిడిచియుండును! నేనొకముఖ్యకార్యమునకై శ్రీనగరమునకుఁ ద్వరలోఁ బోవలయుఁగాన నాకు సెలవొసంగుము. ఇదిగో! ఈధనమును నీయొద్దనుంచుకొని యామె దహనసంస్కారములకు వినియోగింపుము” అనుచుఁ గొంతధనమును కమల మందరకీయఁబోవఁగా “చాలుఁజాలు కమలా! నీధనమును నీయొద్దనే యుంచుకొనుము! నాయొద్దవలయునంతధనముకలదు. కావున నీధనమున నాకు కాసైన నవసరములేదు. ధనమునకేమికాని నన్నుమాత్రము మఱచిపోకుము” అని దయాదృష్టుల నామెపై బఱపి మందరపలికెను.

ఎంతబలవంతపెట్టినను మందర ధనమునుగ్రహింపలేదు. కావున కమల యేమియుచేయనేరక తుదకామెనుండి సెలవుగైకొని పరిచారికాసమేతయై, గుఱ్ఱమునెక్కి శ్రీనగరమునకుఁ బోవుబాటననుసరించిపోయె.

ఘూర్జరతార.

పదునొకండవ ప్రకరణము.

శ్రీనగరము.

మధ్యాహ్నము నాల్గుగంటలుగడచె. భాస్కరుఁడు తనచండోగ్రతనుమాని కొంచెము శాంతించె. అంతవఱకుఁ గాలికాలియున్న శిలాస్థలములనుండి వెచ్చనియావిరి బయల్వెడలుచుండె. కపటసముద్రతరంగములవలె, నంతవఱకు వ్యాప్తిఁజెందియున్న మృగతృష్ణ లొక్కొక్కటే యదృశ్యములు కాఁజొచ్చె. చండభానుని గాటపుటెండకుఁ దాళఁజాలమిఁ గులాయముల డాఁగియున్న వివిధపక్షిజాలంబు లిపుడు గూండ్లనుండి బయల్వెడలి, యాహారాన్వేషణమున నటునిటుఁ బరువెత్తఁజొచ్చె.

ఆసమయమునఁ గమలామాలినీమాలతులు శ్రీనగరమును డాసిరి.

ఎన్నియపాయములు మార్గక్రమమున వారికి సంభవించినను తుదకుఁ దమగమ్యస్థానమును జేరగలిగితిమికదాయని వారుమువ్వురును సంతోషముతో దీర్ఘనిశ్శ్వాసములవిడచిరి. ఆనగరమునకు బహిఃప్రదేశమున విశ్రామగేహముకలదు. ఆగేహమువద్ద తమగుఱ్ఱములనుండి వారుమువ్వురును దిగినవెంటనే, యావిశ్రామగేహమునఁ బనిసేయు సేవకుఁ

డొకఁడు వారియెదుటనిల్చెను. వానినిఁజూచి "నీవీ విశ్రామగృహమునఁ బనిసేయు సేవకుఁడవా?" యని కమల యడిగెను.

"చిత్తము" అని వాఁడుమిక్కిలి వినయపూర్వకముగాఁ బ్రత్యుత్తరమొసంగెను.

"ఈరూప్యమును నీసేవ కుపకృతిగాస్వీకరించి, మాకొకచక్కని గుఱ్ఱపుఁబండిని బేరమాడుము?"

అనిపలుకుచుఁ గమలచేనీయఁబడిన రూప్యమును వాఁడు విశ్వాసముతోఁగైకొని, వెంటనే ప్రక్కనున్న శకటాశ్రమునకేగి, యొకచక్కని గుఱ్ఱపుబండిని, బేరమాడి తీసికొనివచ్చె.

"ఇదే! ఈరూప్యమునుఁగూడ స్వీకరించి, యీ మామూఁడుహయములను నీజాగ్రత్తలోనుంచుకొనుము. మేమీబండినెక్కి నగరాంతరముననున్న, యొకగృహంబునకుబోయి, యచటినుండి మాసేవకునొకని నీయొద్దకుఁ బంపెదము. వానివెంట నీవీగుఱ్ఱములను దిరిగి మాకు బంపుము."

కమల మఱియొకరూప్యమును వానికిచ్చెను. వాఁడును సమ్మతించి, యాగుఱ్ఱములను దనవెంట నిడుకొనిపోయెను. వచ్చియున్న శాకటికునితో "ఓరీ! మమ్ము, రవీంద్రనాథుని గృహమునకుఁ దీసికొనిపోవలయు" నని కమల వచించెను. వాఁడును వెంటనే తలనూపగా, గమలామాలినీమాలతులాశకటము నెక్కి, దాని కిటునటునున్న గవాక్ష

ములను మూసివేసిరి. వెంటనే యాశకటము బిఱబిఱ పురవీధినిఁబోయె.

ఆశకటము నొకింతసేపువీడి, మనమొక్క విషయమును ప్రసంగింతము!

రవీంద్రనాథుఁ డొకగొప్ప రత్నవర్తకుఁడు. అతఁడు న్యాయమగు వర్తకముచే నపారభాగ్యముల నార్జించె. మిక్కిలి మంచివాఁడు. ఆ నగరమునం దెక్కువపలుకుబడి కలవాఁడు. శ్రీనగరవాసులెల్లరును, వాని నెఱుంగుదురు. కావుననే, బండివాఁడు తడఁబడక 'రవీంద్రనాథుని గృహమునకుఁ దమ్ముఁదీసుకొని పోవలయునని కమలచెప్పగనే తనతల నూఁచె.

ఇఁక శకటము వెంబడి నడచుచు మనముఁగూడ పోవుదము.

మనమేమిచూతుము? రాజమార్గమున కటునిటు వర్తకస్థానములు, పూలయంగడులు, మధురపదార్థముల నమ్ముచోటులు, పాత్రవిక్రయశాలలు, పట్టుబట్టలనేయు పరిశ్రమాగారములు, మొదలగునవి క్రిక్కిఱిసి యుండుటఁజూతుము. మనశకటమునకును, మనకును, నటునిటు జనసమ్మర్ద మెక్కువగానున్నది. కొందరు వర్తకస్థానములందు వసనముల బేరమాడుచున్నారు. కొందరు పూలనమ్మెడి యువతుల పూలతట్టలయొద్దఁజేరి, వారితోఁ బరిహాసములనాడుచు, ముసిముసినవ్వులు నవ్వుచు, పూలబేరము సేయుచున్నారు. ఆ పూలబేరగాండ్లలో నొక

డొక పూలనమ్మెడి జవ్వనినిఁజూచి నవ్వుచు "నీదండవెలయెంత?" యని యడిగెను. ఆపుష్పలావికయు "నీదండ" యనుపదమునఁగల గూఢార్థమునుగ్రహించి, ముత్తియములఁబోలు రదనపఙ్క్తులు బహిరంగము కాఁగా చిఱునవ్వునవ్వి, వానిపై దనకటాక్షములఁ బ్రసరింపజేసెను. కొందగు బాలురు మధురపదార్థము లున్న యంగడులయొద్ద నిలువఁబడి, వానినిఁ గొనుచుండిరి. కొందరుస్త్రీలు పాత్రవిక్రయశాలలయందు బిందెలను, చెంబులను, బేరమాడుచుండిరి. కొందరు పనిలేనియయ్యలు, తీరుబాటుగా పణ్యస్థలములకుఁబోయి రిత్త బేరముల నాడుచుండిరి. అదియే పణ్యవీథియును, నదియే రాజమార్గమును, నగుటచే నధికజనసమ్మర్దమున మనశకట మొక్కొకసారి మిక్కిలి యలఘుగతినిఁ బోవుచుండె. అట్లలఘుగతిని గొంతదూరము పోవగా నొక్కసారి జనసమ్మర్దము తగ్గెను. వెంటనే మనశకటము వేరొకవీథినిఁ బ్రవేశించె. ఆవీథికటునిటు మిక్కిలిపొడవైన మేడలుకలవు! మనకిపుడు ప్రక్కగానున్న మేడకుపెద్దగోపురములు మూఁడుకలవు! ఆమేడనుగడచితిమి. అదే రెండవసౌధము. అది మిక్కిలి సొంపుగానున్నది. ఆహా! ఏమి! ఆకుడ్యములపైఁ జెక్కఁబడిన శిల్పములు! అదికూడ గడచినది! అదే మూఁడవహర్మ్యము! వహవ్వా! ఆమేడ మూఁడవయంతస్థునందుఁ గుటిలకుంతలముల నారవోసికొనుచు నొకమోహిని చేరెతుకన్నులతో మనశకటమువంకఁ జూచుచుండె. ఆమేడనుగూడ మనము గడచితిమి! అదియే నాల్గవమేడ! అబ్బబ్బా! ఏమియందము! ఏమియందము! ఈమేడ యెవ్వనిదై యుండు! ఎవఁడో. ఆసౌధమునకు ముందుగనే మనశకట మాపఁబడియె. పిమ్మట

శాకటికుఁడు తనయున్నతస్థలమునుండి దిగి, శకటగవాక్షములయొద్ద నిలువఁబడి “అమ్మా! రవీంద్రనాథుని సౌధమిదియే” యని వాఁడఱచెను. వెంటనే లోనున్న వారు గవాక్షముం దెఱచి, దానినుండి మేడవంకఁ జూచుచుండిరి? కమలకేమి కాన్పించెను? ఆసౌధ సింహద్వారమునుండి హేమచంద్రుఁడు తమబండియొద్దకు వచ్చుటఁ జూచెను. హేమచంద్రుఁడు కమలకిదివరకే పరిచితుఁడు. హేమచంద్రుఁడు తనదృక్పథమునఁ బడినతోడనే కమలకొకవిషయము జ్ఞప్తికివచ్చె. “మోహిని తానుప్రాణముల విడచుచున్నపుడు హీనస్వరముతోఁ జెప్పినది హేమచంద్రుని నేనొకకంటితోఁ గనిపెట్టవలయుననికదా. వీఁడెట్టియుపాయము నాకుఁ గలుగఁజేయునో?” ఆమె తనలోఁ దాను వితర్కించుకొనునంత యవకాశము లేదు. ఏమనిన, నింతలో హేమచంద్రుఁడు శకటమునుడాసి, కమలకు వినయపూర్వకముగా వంగి నమస్కరించి “అమ్మా! మీకుస్వాగతము. మీరుసుఖముగా వచ్చితిరా?” యని యడిగెను.

ఏమి! వానిమొగమునందుఁ దోఁచుచున్న కపటశాంతరసము! ఏమి! వానికైతవవినయవృత్తులు. పాపము కమల వానికపటమును గ్రహింపలేకపోయె. వాని వినయపూర్వక వర్తన మామె హృదయమున నున్నసందియముఁ బూర్తిగాఁ దొలఁగఁజేసె. వెంటనే “గతవిషయముల లెక్కసేయనిచో మేముసుఖముగానే వచ్చితిమని చెప్పఁగొనవలయు” నని కమల వానికిఁ బదులుచెప్పుచు బండినుండి క్రిందునకుదిగెను. పిమ్మట మాలినీ మాలతులిరువురును దిగిరి. కమల బండివానికి కానిబత్తెము నిచ్చెను. వాఁడును కమల కభివందనము సలిపి, తనబం

డిని తిరిగితోలుకొనిపోయె.

హేమచంద్రుఁడు ప్రక్కరా వారు మువ్వురును సౌధప్రాకారమును దాటిలోనికి బోవుచుండఁగా “రవీంద్రనాథులు, నగరమునందున్నారా?” యని కమల హేమచంద్రునడిగెను.

ఆతఁడు తనరెండుచేతులను జోడించి, యంజలిఘటించి, తలవంచి, నక్కవినయమునమించి “దేవీ! మాప్రభువుగారు కార్యాంతరమున నిన్న ధారానగరమున కేగినారు” అని ప్రత్యుత్తరమిచ్చెను.

తాను వచ్చినసమయమున, రవీంద్రనాథుఁడులేమి, కమలకొకింత యసంతృప్తి తోఁచెను. అదిగ్రహించి “దేవీ! వారచట దీర్ఘకాల ముండరు! రేపటియుదయమున నెనిమిదిగంటలకు వత్తుమని సెలవిచ్చిరి. అంతియకాక మీరిచటికి వత్తురని యెఱిఁగియుంటచేఁ దానులేనిసమయమున మీరువత్తురేని మిమ్ముల నధికమర్యాదతో, నీసౌధమునఁ బ్రవేశింపఁ బెట్టుమని నాకును, గృహదాసికిని, తక్కుగలసేవకులకును, పరిచారికలకును, నాజ్ఞయిచ్చియుండిరి. కావున మీ రసంతృప్తి నొందనక్కఱలేదు.” అని హేమచంద్రుఁడు కమలతోఁ బలికె.

హేమచంద్రుఁడీ ప్రత్యుత్తరమిచ్చునంతకాలములో, వారు సౌధప్రాంగణముఁ జొచ్చిరి. అచట గృహద్వారమును దాటినంత హేమచంద్రుఁడు, వారికిముందై యొకమూలనున్న మెట్లయొద్దకుఁ బోయి, వానిమీఁదుగా కమలామాలినీమాలతులను, మొదటియంతస్థునకుఁ గొంపో

యెను. అచట నొకవృద్ధస్త్రీ (ఈమె యేగృహదాసి) వారికెదురై, వంగినమస్కరించి “మీకు స్వాగతము” అని వినయముగాఁజెప్పె. ఆపె వినయమునకు సంతసమునొంది, కమల చిఱునవ్వునవ్వె. గృహదాసి వారిని తనవెంటఁగొంపోయి, యొక సుందరమందిరమునఁ బ్రవేశపెట్టె. “అమ్మా! మీకు స్నానార్థ ముదకములనిప్పుడే నాయత్తపఱతును. మీకేమిగా వలసినను, నాకాజ్ఞనిచ్చినయెడల తత్‌క్షణమే నెరవేర్చెద” నని పలికెను.

“మీసేవకులలో నొకనినిఁబంపి, విశ్రామగృహమున సేవకుని యొద్దనున్న మా మూఁడుగుఱ్ఱములను దెప్పింపుము” అని తదవసర విషయము నామెతో వాక్రుచ్చెను. ఆగృహదాసియు తత్కార్యాచరణమునకై బ్రయత్నింప నాపెనుండి సెలవుగైకొనిపోయెను.

కమలామాలినీమాలతులు తాముఁబ్రవేశించిన గదియందుఁ బీఠికలపై గూరుచుండిరి. ఆగదియందు శృంగారమొలుకుచుండెను. గోడలన్నియును బంగరుపూత పూయఁబడినవి. హంసతూలికా పానుపొకటియును, దానికనతిదూరమున రెండుసాధారణపాన్పులును నమర్పఁబడియున్నవి. నాల్గుకుడ్యములకును నాల్గునిలువుటద్దములు సంఘటితములై యుండెను. ఆనిలువుటద్దములలో నొకదానికెదుట కమల నిలువఁబడి తనప్రతిబింబమును జూచుకొనెను. ఆహా! ఏమి! ఆవిలాసము! ఆనేత్రరుచి! ఆహాసకౌముది! ఆహేమచ్ఛాయ! నిజముగాఁ దన రూపమునకుఁదానే కమల యచ్చెరువడఁజొచ్చెను. ప్రయాణాయాస

ముచే నామెయణుమాత్రమైన నశక్తురాలుకాలేదు! ఆపెముంగుఱులు కొన్ని నెన్నుదురుపైఁబడి, క్రిందుగానున్న కనులను తొంగితొంగి దొంగలవలె జూచుచుండఁగా మాలిని వానిని వెనుకకుఁద్రోసి తన నఖములతో సవరించె.

ఇంతలోఁ గృహదాసి వారియొద్దకువచ్చి, గుఱ్ఱములువచ్చెనని యు, తమకోష్ఠమునందు వానినిఁగట్టి మేతవేసితిమనియుఁ జెప్పి “అమ్మా! మీరిక లేచి స్నానముజేయుటకురండు” అనిచెప్పి, వారిని దనవెంటనిడుకొనిపోయె.

పాఠకమహాశయులారా! మనమిక వేవేగమున మనకథాసూత్రము నంత్యస్థానమునకుఁ గొంపోవలయుగాన నొక్కొకదానినే మంద్రగతిని వర్ణనలుసేయఁగూడదు. ముందరాఁబోవు విషయములట్టివే. కావున నాఁ గమలామాలినీమాలతులు స్నానముజేసి, షడ్రసోపేతమైన భోజనమునారగించి సుఖముగా నాటిరాత్రి యామందిరమునందు నిదురవోయిరని చెప్పుటయేచాలును.

సూర్యోదయమైన పిమ్మట కమల తన కల్యకరణీయముల ముగించి, యిఁక రెండుగంటలకు రవీంద్రనాథుఁడు వచ్చుఁగదా యని సంతసించుచు ప్రక్కనున్న నిష్కుటములోనికిఁ బోవ నిచ్చెనగలుగు మెట్లనుండి దిగి, దానియందు బ్రవేశించె. అందు పరిపుల్లములైన యనేకవిధ కుసుమములనుండి కమ్మని తావులు బుగులుచుండె. వివిధములగు విచిత్ర పాదపములందుఁ గలవు. వానినిఁ జూచుచుండఁగా, పైనున్న

మేడగవాక్షము తెఱువఁబడినట్లు కమలకుఁ జప్పుడు వినవయ్యె. వెంటనే తనకనులఁ బైకెత్తి, యాదెసఁజూచె! అచట నెవరుండిరి? మోహనుఁడు. వాఁడేమి సేయుచుండె? కమలనుఁ జూచిన సంతోషమునుఁ బట్టఁజాలక మోదవాక్యములు బలుకుచుండె. కాని కమలస్థితి యెట్లుండె. ఆమె నిశ్చేష్టయయ్యె. ఏమి? మనకిదివఱకు దెలిసినవిషయము చేతనే? అది యెట్టిది? మోహనుని వీరరుద్రుఁడే యని కమల తలంచుటయే.

వాని దర్శనముచే నవర్ణనీయమగు భయమును, నాసౌధమున వాఁడుండుటచే ననిర్వాచ్యమగు నాశ్చర్యమును, నామె హృదయమునందు సందడిఁ జేయుచుండ గృహదాసివచ్చి "అమ్మా! మాప్రభువగు రవీంద్రనాథు లిపుడీ ధారానగరమునుండి వచ్చి మీకొఱకై, వారిగదియందుఁ వేచియున్నారు" అని చెప్పెను.

"ఏమి! రవీంద్రుఁడువచ్చెనా!" అని యామెతోఁ బలికి "ఏమి! నాభాగ్యము! నాకీ వీరరుద్రుని భయమికి నణుమాత్రమైన లేదు" అని తనలోఁ దాననుకొనుచు నామెవెంట రవీంద్రునియొద్దకుఁ బోయెను.

వీరరుద్రుఁడచటికి వచ్చుటకుఁ గల కారణమును గృహదాసిని కమల యడుగలేదు. ఏమనిన వీరరుద్రుని విషయమై తాను ముచ్చటింపనని మోహినియొద్ద నిదివఱకుఁ బ్రమాణముఁ జేయఁలేదా.

రవీంద్రుఁడుండిన గదియొద్దకు గృహదాసి కమలను గొంపోయి, నాగది తలుపులఁ దెఱచి తాను వెడలిపోయెను. ఆగదియందొక పీఠికపై నుపవిష్టుఁడై యున్న వృద్ధ రవీంద్రనాథ సచ్చరితుని, వానికిఁ బ్రక్కగా వేఱొక పీఠికపై గూర్చొనియుండి తనచే వీరరుద్రుఁడని యెంచబడిన మనకథానాయకుఁడగు మోహనుని నామె చూచెను.

ఘూర్జరతార.

పండ్రెండవ ప్రకరణము.

రవీంద్రనాథుఁడు.

కమలా మోహనుల హృదయవీధులయం దిపుడత్యద్భుత భావములు సంచరించుచున్నవి.

ఏ సుకుమారి ప్రథమదర్శనము తన హృదయమున ననురాగము జనింపఁజేసెనో, యేజగన్మోహినినిఁ దాను చూచినదాది తనహృదయపీఠికయందు నిల్పి విమలానురాగ కుసుమములతోఁ బూజసలుపుచుండెనో, యేసుందరితోఁ గలసి పయనముఁజేసి, యపార సంతోషపారావారమ్మునఁ శిరస్స్నానమొనర్చెనో, యేచంద్రముఖి తన్నకారణము విసర్జించి తనతోఁ జెప్పకయ యదృశ్యయయ్యెనో, యేహేమగాత్రినిఁ దదాది కనుఁబారఁజూచి యానందము నొందుటకుఁ దహతహ నొందుచుండెనో యట్టికమల తన సమక్షమున నుపవసితురాలై యుండుటకు మోహనుఁ డవర్ణనీయమగు నానందమునుఁ బొందుచుండెను.

ఇఁక కమల యెట్లుండెను?

ఏవాని ప్రథమ ముఖావలోకనము తన విమల హృదయమందుఁ గామవికారమును గలిగింపఁజాలెనో, యేవాని దంతపుబరిణెనుండి జాఱిపడిన యుంగరము వానిని వీరరుద్రునిగా భావింపఁజేసెనో, అట్టివాఁడు ఆ తనకపట వీరరుద్రుఁడు—ఆ దురదృష్ట వీరరుద్రుఁడు—ఆ ఘోరవీరరుద్రుఁడు—తనసమక్షమున నుండుటకుఁ గమల మిక్కిలి భయాశ్చర్యముల నొందుచుండెను. వీడు వీరరుద్రుఁడని రవీంద్రునితోఁ జెప్పుటకుఁ గమలకు వీలులేదు. ఏమనిన వీరరుద్రుని ప్రశంసను తానెన్నిటికినిఁ జేయనని మోహినియొద్ద నామె ప్రమాణముఁ జేసెను. కావునఁ జేయునదిలేక, వానివంకఁ జూచియుఁ జూడనట్లుండె.

రవీంద్రుఁడు రత్నవర్తకుఁడని కదా మనకుఁ దెలియును. వాని వయస్సు డెబ్బదినాలుగేండ్లు. వృద్ధాప్యమగుటచే మొగము ముడుతలు పడియుండె. తలవెండ్రుకలు పూర్తిగా నెఱసియుండె. అట్టి వార్ధక్యదశయందుఁగూడ నాతఁడారోగ్యవంతుఁడై, దేహపటుత్వమును బోగొట్టుకొనకయుండెను. వానిముఖమునందు శాంత స్వభావమును, హృదయనైర్మల్యమును, ధర్మకార్యాసక్తియును బ్రకటింపఁబడియుండెను. రత్నవర్తకముచే నావృద్ధుఁడు, తుదలేని సంపదల న్యాయముగా నార్జించియుండె. ఇరువురు పుత్రులఁగని పదివత్సరములకుఁ బూర్వమే వాని పత్ని మృతినొందె. ఆపుత్రులు పెద్దవారై, యిపుడు వేరు వేరు దేశములందు రత్నవర్తకమును జేయుచున్నారు. రవీంద్రుఁడు తనరత్నవ్యాపారకాలములో ననేక రాజుల మైత్రిని సంపాదింపఁ గలిగె. వానియైశ్వర్యమునకుఁదోడు సన్మార్గప్రవర్తనముండుటచే, జనులందరిచే సంస్తవ

నీయుఁడై యుండె. వణిజులకు సహజమగు తృష్ణ వానియెడ లేదు. ప్రపంచక వ్యవహారములయందుఁ జిరకాలము పరిచయమొంది, తుదకు వానిని రోసి, భగవద్ధ్యానమునందుఁ దన వార్ధక్యమును వినియోగించుచుండె.

కమల గదిలోఁ బ్రవేశించిన తత్క్షణమే యామెకు స్వాగతమిచ్చి, కొంతసే పామె ముఖబింబమును దదేకదృష్టితోఁ జూచి దానియందుఁ బ్రకటింపఁబడియున్న హృదయనైర్మల్యమును రవీంద్రుఁడు గ్రహించి తనలోఁ దాను సంతసమొందె.

కొన్ని నిమిషములవఱకు, పలుకాడలేదు. ఒక మహాయోగి సమ్ముఖమున నున్నటులు కమలామోహాను లంజలిఘటించి రవీంద్రుని ప్రక్కగా నటునిటు నిలువఁబడి యుండిరి. ఆనిలువఁబడియున్న యువతీయువకులఁ గాంచి కడుంగడు సంతసమొందినట్లు చిఱునవ్వునవ్వి వారితో “ప్రియమిత్రులారా! నన్ను మీరు దర్శించుటకిదియే ప్రథమ సమయమైనను, మీరు నావార్ధక్యమునకు మర్యాద సలిపి నాయెదుట నిలువఁబడి యుండుటకు నాకెంతయు సమ్మోదమయ్యె.” “అయ్యా! శ్రీవారా పీఠిక నలంకరింపఁ బ్రార్థితులు” అని కమలవంకఁ దిరిగి “అమ్మా! రాణీవారీ పీఠిక నలంకరింపఁ బ్రార్థితలు” అని కొంచెమాగి “ఇచట నున్న మనము వ్వారి పదవీ స్థితుల నాలోచించిన, మీయిరువురికన్న నేను తక్కువవాఁడనే. కావున మీరలు సంకోచింపక, పీఠిక నలంకరింపవేఁడుచున్నాను” అని రవీంద్రుఁడు పలికెను,

రవీంద్రుఁడు కమలను “రాణీ” యని సంబోధించుట విని “ఏమి? ఈమె రాణియా? ఏదేశమునకు” అని మోహనుఁడత్యాశ్చర్యము నొందెను. “శ్రీవారు” అని సాధారణముగా గొప్ప సామంతరాజులను సంబోధింతురు. కావున రవీంద్రుఁడు మోహనుని “శ్రీవారు” అని సంబోధించుటను విని, వీరరుద్రుఁడు తానొక గొప్పసామంతరాజునని రవీంద్రునికిఁ జెప్పి మోస మొనర్చెనని, కమల, మిక్కిలి యద్భుత మొందెను.

వారి మొగములందుఁ బ్రకటింపఁబడిన సందేహాశ్చర్యముల గ్రహించి “ప్రియమిత్రులారా! మీమీపదవుల కనుగుణ్యములగు బిరుదులతో నేను మిమ్ము సంబోధింప, మీరాశ్చర్యమొందుట నేను గ్రహించితిని. ఇఁక ముందిట్టి యాశ్చర్యములకు మీమనము లెడమీయకుండ, మిమ్ముల నిప్పుడే యొకరికి నొకరినిఁ బరిచయపఱచెద. ఆపరిచయాకృతికి ముందుగా నేనొక పనిని నెఱవేర్పవలయును. అమ్మా! నాయొద్దఁబని సేయుచున్న హేమచంద్రుని మూలముగా నొకయుంగరమును నొకలేఖయును, నేనెవ్వరికిఁ బంపియుంటినో, యట్టి “తారాకమల”వు నీవేయని నిశ్చయించు కొనుటకు నీయుంగరము నిటుతెమ్ము.” అని రవీంద్రుఁడు కమలతోఁ బలికెను.

వెంటనే తన పయ్యెదలోనుండి, యుంగరము నొకదానినిఁ దీసి కమల రవీంద్రున కిచ్చెను.

“ఇదే! నాయుంగరమునుఁ గూడ దీసికొనుఁడు” అని మోహనుఁడుకూడ తన యంగినుండి, యుంగరము నొకదానినిఁ దీసి రవీంద్రున కిచ్చెను.

మోహనుఁడిచ్చిన యుంగరము సర్వవిధముల నణుమాత్రమైన భేదములేక కమలచే నియ్యఁబడిన యుంగరమునుఁ బోలియుండెను. ఆరెండిటికిని, నొకటేవిధమగు నగిషీ చేయఁబడినది. ఒకటే రత్న మొకే చోట, నారెండిటికిని సంఘటింపఁ బడియున్నది. ఆపోలికనుఁజూచి, కమల యెట్టి మహాశ్చర్యమొందెనో, యెట్టి కళవళపాటునొందెనో, మాచదువరు లుగ్రహింపనగు. ఏమి యీమాయ! తాననుకొన్నట్లు వాఁడు వీరరుద్రుఁడుకాఁడా? వానిని నిష్కారణముగా ననుమాన పాత్రునిఁజేసి, వానియెడ తానట్లపరాధ మొనర్చెనా? ఎట్లాలోచించుటకును, నామెకుఁ దోఁపలేదు. ఆమెకేమియును పాలుపోలేదు.

అంత రవీంద్రుఁడు “మిమ్ముల నీయెడకు రమ్మనివ్రాసిన కమ్మలతోఁ బాటు పంపిన యుంగరములే యివి” యని ప్రత్యేకముగా మోహనునితో “ఈమె నామము కమల. ఘూర్జర దేశమును బరిపాలించుచున్న ‘రాణి’ యీమెయే. జగన్మోహన సౌందర్యవిలాసమున నీమె దిగంతరవ్యాపితమైన కీర్తినొందియుంటచే ఘూర్జరదేశప్రజలు, తమరాణీగారైన వీరిని ‘దారా కమల’ యనియు “ఘూర్జరతార” యనియు వ్యవహరించుచుండిరి” అని ప్రత్యేకముగాఁ గమలతో “ఈసుందరుని నామము మోహనుఁడు. ఉదయపురరాజ్యమును బాలించుచున్న వీర

సింహప్రభు శ్రీమోహనుని దత్తపుత్త్రునిగా స్వీకరించెను" అని వారి యందుఁ బరస్పర పరిచయ ప్రవేశముఁ గలిగించె.

అంతఁ గమల ముఖరితస్వరముతో "అయ్యా! వీరినిజూచుట నాకిదియే మొదటిసారి కాదు. మఱియును, శ్రీవారియెడ నాయొనర్చిన కొన్నియపరాధములను, క్షమింపఁ వారు బ్రార్థితులు" అని యనెను.

రవీంద్రుఁ డత్యంతాశ్చర్యముతో "ఎట్టెటులు! ఇదివఱకే మీ రొకరినొకరు చూచియుండిరా." ఇంతవఱకు మీరు పరస్పరముఖావలోకనములఁ జేయలేదనియే నాయభిప్రాయము" అని పలికె.

దానిపైఁ గమల "నిజమే. ఇదివఱకే మేమొకరినొకరు చూచియుంటిమి. ఒక దురనుమానమునొంది నిజముగా శ్రీవారియెడ నేను మిగుల నపరాధమొనర్చియుంటిని. ఆవృత్తాంతమును సంగ్రహముగాఁ జెప్పెదవినుఁడు. ఒకవిశ్రామగృహమున నేను శయనించియుండగా, నిపుడుమీకిచ్చిన నాయుంగరము తస్కరింపఁబడియె. ఆమరునాఁడు మార్గవశమున వీరును, నేనును గలసితిమి. ఒకభిక్షుకునికి ధర్మమీయుచున్న తఱిని, వీరిహస్తమునందున్న దంతపుబరిణె యొకటి భూమిపయిఁబడియె. బరిణె భూమిపైఁబడుటచే, దానియందున్న వస్తువులుకూడ భూమిపై జిమ్మెనట్లుండె. వానియందు తస్కరింపఁబడిన నాయుంగరమునుఁబోలు నొకయుంగరముంటచే నదియే నాయుంగరమని భావించితిని. ఆయుంగరమునుఁగూర్చి యిపుడు తెలిసికొంటినిగాని, యప్పుడు నాకేమి తెలియును?

కావున వీరిపై నేనొక యనుమానమునొంది త్వరలో వీరినుండి విడిపోవుటకుఁ దరుణమునెన్నుచు, నొకసమయమున నట్లువిడిపోయితిని. తరువాత నొకరిమూలముగా నాయుంగరము నాకుఁజేరె." నని చెప్పె.

అంత సంతోషస్వాంతుఁడై మోహనుఁడు కమలతో "అమ్మా! నన్నింతవరకుఁ బీడించుచున్న సందియంబులన్నియు నిపుడు తీరె. సందియమేమంటిరేని, ఆనాడు మీరట్లు నావద్దనుండి హఠాత్తుగా నదృశ్యులగుటకు నేనెంతయు నాశ్చర్యసంతాపములనొందితిని. ఇపుడవియన్నియుఁబోయె. శంకానివృత్తియయ్యె. ఇంతమాత్రపుఁదానికి నానుండి క్షమార్పణఁగోరవలెనా. మీయెడనాకేమేని కోపమున్నచో, దానిని పోద్రోలుటకు మీపలుకొక్కటిచాలదా!" అని యనెను.

మోహనుఁడు తన్నుఁగూర్చి పలుకుచున్న యీసమయమునఁ దారాకమల సిగ్గుచే నవనతముఖియయ్యె.

అపుడు రవీంద్రుఁడు "అట్లయిన మీరిదివరకే పరస్పరపరిచయులైనట్లు తోఁచెడిని." అని కొంచెమాగి "అయ్యో! నాఁటి కమలావియోగమునకు మీరెంతయు సంతాపము నొందిరి కాఁబోలు" నని యనెను.

సంతోషముతోనుండియు మోహనుఁడు తడఁబడియె. తన్నా పలుకులచే రవీంద్రుఁ డవమానపరచుచున్నట్లు కమలకుఁదోఁచుటచే నా కింతకోపమామెకు వచ్చుచుండె.

అదియంతయు గ్రహించి రవీంద్రుఁడు దేవీ! 'వియోగము' అనుపదముచే నిన్నవమానమును సేయుచున్నానని యణుమాత్రమైన నూహింపవద్దు. అచిరకాలస్నేహమున నే, నీవీమోహనుని బ్రేమించితివని నేనెన్నటికిని యనుకొనను. నీసౌందర్య మెంతటిజగన్మోహనమో, నీ సత్ప్రవర్తనయుఁగూడ నంత సంస్తవనీయమని నేనెఱుంగకపోలేదు. అయినను నాపలుకులయందు వేఱొకయర్థముకలదు. దానినిఁజెప్పనిండు. మీరక్తనాళములందొకే వంశరక్తము ప్రవహించుచున్నది. మీరు దగ్గరచుట్టములు. వేయేల! మీరిరువురును మేనత్తమేనమామబిడ్డలు!" అని పలికెను.

కమలామోహనుల మహాశ్చర్యము నేమనివర్ణింతు? అత్యాశ్చర్యమున వారిమనములు చలింపకయుంట చక్కని చంద్రకాంతప్రతిమలవలె వారు కన్పట్టిరి.

అప్పుడు రవీంద్రుఁడు "బిడ్డలారా! ఆశ్చర్యమునొందనక్కఱలేదు. మీరు మేనత్తమేనమామ బిడ్డలెట్లయితిరో, యావిషయమును, మఱికొన్ని ముఖ్యవిషయములను, ఇప్పుడే విశదీకరించెదవినుఁడు" అని పలికెను.

వారును నిశ్చలచిత్తములతో వినుటకై సిద్ధముగానుండిరి.

రవీంద్రుఁడిట్లని చెప్పఁదొడఁగె.

"అమ్మా! నేను జెప్పఁబోవు విషయములలోఁ గొన్ని నీకిదివఱకే తెలిసియున్నవి. కాని మోహనునికేవియును దెలియవు. కావున నేను నాజెప్పబోవునది సంగ్రహముగాఁ జెప్పుటకు వీలుపడదు. మొట్టమొదట నీవు రాజవర్మమహారాజునకు మనుమఁడవనియు, నీవు మనుమరాలవనియు నెఱుంగునది. నీవిపుడు పరిపాలించుచున్న ఘూర్జరదేశమును మా తాతగారు నలువదేండ్లకుఁ బూర్వమునఁ బరిపాలించెనని తెలిసికొనుఁడు. వారిసహజౌదార్యమును, న్యాయాన్యాయ విచక్షణాశక్తియును, సర్వజనశ్లాఘ్యములై యుండెను, నేటికి దాదా పిరువదియైదువత్సరంబులకుఁ బూర్వము—అప్పటికి మీరిరువురలో నేరును బుట్టియుండలేదు. ఒకదినమున నొకమహాయోగి రాజదర్శనార్థియైవచ్చి, మీతాతగారితో నీరీతిజెప్పెను "దేవా! ఒకమహాద్భుత రహస్యమునెఱిఁగియున్నవారీక్షణమున నిరువురీ ప్రపంచమునన్నారు. పదివారములకుఁ బూర్వము మువ్వురుండిరి. కాని వారిలోనొకఁడు మృతినొందుటచేతను, నారహస్యమును తమహృదయములలో డాఁచియున్నవారిపుడిరువురేకలరు. కాని పారంపర్యముగా వచ్చుచున్న యాచారమునుబట్టి, యాపరమరహస్యము నిపుడింకొకనికిఁ దెలియజేయవలయు. ఏలనన, నదిపూర్తిగా నశింపకుండునట్లుగాఁ దుదకీప్రపంచమున తద్రహస్యజ్ఞులు మువ్వురైన నుండవలెనని చెప్పఁబడియున్నది. దాని నెఱుంగదగినవాఁడు మహాస్వచ్ఛచరిత్రుఁడై స్వచ్ఛహిందువుఁడై యుండవలయు. బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులలో నేవర్ణమునకును సంబంధములేనివారి కారహస్యమును దెలుపగూడదనియాజ్ఞ. వాఁడెన్ని యేండ్లవాఁడైననుసరే. హిందూమ

తావలంబనుఁడై యుండవలయు. దేవరవారితో నింతకుఁబూర్వము నేను జెప్పుచున్న రహస్యజ్ఞు లిరువురిలో నొకఁడు కొలఁదిదినములకుఁ బూర్వమే పంచత్వమొందె. కావున నిఁక నేనొక్కఁడనే మిగిలియుంటిని. అట్లగుటనొక మహాసచ్చరితుఁడైన స్వచ్ఛహిందువున కిపుడాపరమరహస్యము నెఱింగించు భారము నాపైఁబడినది. అట్టిస్వచ్ఛహిందువు మీకన్న నాకెవ్వరు గాన్పింతురు! కావునదానిని మీకెఱింగింపవచ్చితిని!" ఈరీతిని, నామహాయోగి, మీతాతగారగు రాజవర్మమహారాజుతోఁ బ్రసంగించెను.

కమలామోహనులు మిక్కిలిశ్రద్ధాభక్తులతో రవీంద్రునిపలుకు లనువినుచుండిరి. మరియుఁ దక్కటివిషయముల నాకర్ణించుటకు వారెంతయుఁ గుతూహలాయత్తచిత్తములతో నుండినట్లు చూపట్టిరి. అంత రవీంద్రుఁడు మరల దానిట్లుచెప్పఁదొడఁగె.

"ఆపరమరహస్యము నెఱుంగదగినదానిగాఁ దన్నెన్నుకొనుటచే, నామహాయోగిని మీతాతగారనేకవిధములఁ బ్రస్తుతించి మర్యాదసలిపిరి." పిమ్మట మహాయోగి మరలచెప్పఁదొడఁగె "దేవా! ఈపరమరహస్యము తరతరములనుండి పారంపర్యముగా సంధింపఁబడుచున్నది. దానినెఱిఁగినవారు ధనహీనులగు మాబోటియోగులే కాక, సర్వైశ్వర్యములననుభవించిన రారాజులుకూడఁ గలరు. మఱియుఁ దానినిఁదెలిసికొనుట యత్యద్భుతైశ్వర్యముల ననాయాసముగాఁ జూఱగొనుటయే! పిమ్మట రాజవర్మకా మహాయోగి, యారహస్యమును బోధించుచున్న

పుడు, వానికిఁ గలిగినసంతోషమును, అద్భుతమును, ఆశ్చర్యమును నాచేఁ జెప్పబడుట కగమ్యములు. ప్రియమిత్రా! ఆపరమరహస్యమెట్టిదో కొన్ని కారణములచే వానినిపుడే విశదీకరించెదను. నీకిపుడు బహిరంగపఱచుటకు వలనులేదు. కమలా! నీకుమాత్రమా రహస్యమును కొలఁది కాలముననే జెప్పెద."

ఇచట రవీంద్రనాథుఁ డొకింతకాలమూఁగెను. 'ఎట్టికారణమో' యని మోహనుఁ డాలోచించుచుండె. అంత రవీంద్రుఁడు మరల జెప్ప మొదలిడె..

"ఆపరమరహస్యము స్వానుభవ్యమగుటకు, మహాయోగితోఁ గూడ రాజవర్మకు నొకప్రయాణము జేయనవసరమయ్యె. ఆపయనమునకు నియమితకాల పరిమాణముకొలఁది దినములే. అట్లాకాలములో నారహస్యమునకు స్వానుభవమునొంది, పిమ్మట యోగినుండి సెలవుఁగైకొని తనరాజధానియగు ద్వారకకుఁ దిరిగివచ్చెను. రెండువత్సరములకు బిమ్మటఁ దానురోగపీడితుడైనట్లును, చిరకాలము జీవింపననినట్లును, చూచిపోవలయునన్నట్లును, మహాయోగి యొకనాఁ డొకమనుజుని మూలముగా రాజవర్మమహారాజునకు సందేశముఁబంపె. వెంటనే రాజవర్మప్రభువు, మహాయోగికడకుఁజని, వానియవసానకాలమునందు వానికి సపర్యలుసలిపి, తదాశీస్సులనుగైకొని, వానిపవిత్రదేహమునకు దహనసంస్కారములనొనర్చి, మరల ద్వారకకేతెంచె. అప్పటికాపరమరహస్యమును దెలిసికొని యున్నవాఁడీప్రపంచమున రాజవర్మయొకఁడే. కా

పున నింకొకనికిఁ దెలుపుభారము తనపైఁబడ దానికి నర్హుఁడగు వానికై వెదకుచుండెను. ఆయన్వేషణకాలమునందు తనకు పరమమిత్రుఁడనైన నన్నుఁబిలచి, యనేకమర్యాదలుసలిపి, తద్రహస్యమును, పారంపర్యాచారము ననుసరించి నాకుఁదెలియఁజేసె."

ఇచట రవీంద్రుఁడు కించిత్కాలమూఁగి మరల నిట్లు వాక్రుచ్చె.

" రాజవర్మకొక కొమరుఁడును, నొక కొమరితయు గలరు. వారిరువురకును వైవాహికములు జరుపఁబడియె. తనపుత్రికా పుత్రులకు పురిలో నెవ్వరికైన నొకరినిఁగాని, తనకోడలికిఁగాని లేక యల్లునికిఁగాని రాజవర్మప్రభువా రహస్యమును దెలియఁజేసియేయుండు. వాని వారలందరును ప్రాపంచిక సౌఖ్యములకు మిక్కిలి చిక్కువడియుండుటచే నంతటి పరమరహస్యమును వారికిఁ దెలియఁజెప్పుట శ్రేయోదాయకము కాదని యూహించె. అంతియకాక, పుత్రుని కెఱుఁగజేసినయెడల వాని భార్యకుఁగూడ తెలుపకమానఁడు. పుత్రికకుఁజెప్పినయెడల నామె మగనికిఁ జెప్పకమానదు. కావున త్రిసంఖ్యకుమించి, రహస్యజ్ఞులుండుట సాంప్రదాయవ్యతిరిక్తము. కావుననే వారికెవ్వరికినిఁ జెప్పక, శ్రీప్రభువువారు నాకుఁ దెలియఁజేసిరి. ఇప్పటికి మిత్రులారా! ఒకవిషయమును సమగ్రముగా వచించియుంటిని. ఇంకొకవిషయముఁ జెప్పెద నాలకింపుడు. రాజవర్మప్రభువున కొక కొమరుఁడును, నొకపుత్రికయును గలరని కదా నేను వాక్రుచ్చియుంటిని. మోహనా! నేటికి, యిరువది సంవత్సరములకుఁ బూర్వము రాజవర్మప్రభు పుత్రికా గర్భసీమను నీవలంకరించి యుంటివి"

"అయ్యో! అయ్యో! నాజననీజనకులా" యనునప్పుడు మోహనుని కంఠస్వనమునందు గద్గదికవొడమె. వానిమొగమున శోకరసము ప్రతిఫలించె. "అయ్యో! వారింకను జీవించియుండిరా! ఉండరు! ఉండరు! జీవించియేయున్నయెడల నన్నింతవరకు జూడకుందురా!"

"మోహనా! నిజమే! నీతలిదండ్రులు పాపమీలోకమును విడచిరి." అని రవీంద్రుఁడు హీనస్వరమునఁ బలికె. శోకసంతప్తుఁడైన మోహనునిఁజూచి కమల కడుంగడు జాలినొందె.

"కటకటా! జననీజనకులారా! నేనెంత మందభాగ్యుఁడను". అనునప్పుడు మోహనుని కనుఱెప్పలనుండి యశ్రుకణములు బొటబొట జెక్కిళ్ళమీఁదుగా జాఱె. వానినిఁ దుడచికొని "రవీంద్రా! వారెట్లు మృతినొందిరో తెలియఁజెప్పఁడు? మిమ్ము బ్రతిమాలెద. చెప్పుఁడు." అని దీనస్వనమునఁ బలికె.

"మోహనా! నీవుజన్మించిన కొలఁది దినములకే నీతల్లి పరలోకమున కేగె. నీజనకునిఁగూర్చి పిదపఁ జెప్పెద. కాని మోహనా! ఏల నీకింత సంతాపము! దైవశాసనము నెవ్వ రతిక్రమింపఁగలరు! జననము గాంచిన వారికి మరణముఁదప్పునా! ఉదయించిన భాస్కరుఁడస్తమింపకుండునా! ఊరటజెందు మూరటఁజెందుము! కమలా నీతలితండ్రులకు నీవు చిరకాలమునకుఁ బుట్టితివి."

“నాజననీజనకులా!” యని నిట్టూర్పువుచ్చి కమల విచారగ్రస్తయై పలికె.

“మిత్రులారా! అధికవిషాదకరములగు విషయముల నేనిపుడు చెప్పఁబోవుచున్నాను. కాన వినుటకు మీరు సిద్ధముగానుండుడు. అమ్మా! కమలా! నేటికించుమించు పదియాఱువత్సరంబులకుఁ బూర్వము మహమ్మదీయు లిపుడు నీచేఁబరిపాలింపఁబడుచున్న ఘూర్జరదేశముపై దండెత్తి, రాజధానియగు ద్వారకను ముట్టడించిరి. అపుడేమియుఁ దెలియని పసిపాపవుసుమీ నీవు. మీతాతగారు మహమ్మదీయుల నెదిర్చి, నాల్గువేల వీరభటులతోఁ గదనమొనర్చిరి. ఎట్టివీరభటులైననేమి? ఎట్టిదృఢకాయులైననేమి? తమకన్నఁబదిరెట్లసంఖ్యాకులైన మహమ్మదీయసైనికుల నోర్చుటెట్లు? అట్లయ్యు, శత్రుసేనాప్రవాహము, ద్వారకాపట్టణప్రాకారముల మీఁదుగా పొఱలి ప్రవహింపకుండునటుల మీతాతగారును, వారివీరభటులను మూఁడునెలలవఱకుఁ బోరాడఁగల్గిరి. ఆయుద్ధసమయమున ద్వారకమహమ్మదీయులచే నన్నిదిక్కులను జుట్టుముట్టఁబడి యుండుటచే, బహిఃప్రదేశమునుండి పట్టణాంతరమున కెట్టి తినుబండారములును రావీలులేకపోయె. ఆకారణమున మాసత్రయకాలములో ద్వారకయందు క్షామదేవత తనపాదమును బెట్టె. ఇదివరకే మృత్యుదేవత యుద్ధరూపమున మూర్తీభవించి, యనేకఘూర్జరులను గబళించుచుండె. ఇంక నీక్రూరదేవతాద్వితయము నక్కసెలియండ్రవలెఁ గలసిమెలసి, ఘూర్జరదేశమునం దెంతసంక్షోభమును బుట్టించిరో నేను వేఱుగఁ జెప్పనలయునా! ఆసమయమున శాత్రవసేనానాయకుఁడీ రీతినిఁ ప్రకటిం

చె “నేఁటిమొదలు మూఁడుదినములలో, ద్వారకాపురిని మాకువదలివేయుఁడు. లేనియెడ, మేము జయశీలురమై, పట్టణమందుఁ బ్రవేశించినతోడనే, రాజును, వానిసంతానమును, కోటబురుజులపై నెక్కించి, యచట వారి నతిక్రూరముగా నురిదీయుదుము.” ఈప్రకటనలకు నొకింతయైన వెనుఁదీయక, ఘోరరౌద్రరసావేశమున, రాజవర్మప్రభుపురస్కృత వీరభట నికాయములు కాయములు దెగునంతవఱకు సంగ్రామమొనర్చెను. కాని, యసంఖ్యాకములగు శత్రుసేనల నెదిర్చి స్వల్పసంఖ్యాకులగు మనవారేమి సేయజాలుదురు. పలుపలుకులేల? సంగ్రహించి చెప్పెదవినుండు. ఘూర్జరులోడింపఁబడిరి. పిమ్మట మహమ్మదీయులు ద్వారకాపట్టణమునఁ బ్రవేశించిరి. వారుప్రవేశించిన తత్క్షణమే, రాజవంశ్యులఁబట్టుకొను నూహతో, రాజమందిరమునకుఁ బోయిరి. అయినను దత్పూర్వమే, శత్రువులబారిఁబడకుండ దప్పించుకొను మార్గముల వారుసిద్ధమొనర్చుకొనియే యుండిరి. కాని మోహనా! తల్లిలేనివాఁడవగునిన్ను తనచేతులయందిడుకొని పాఱిపోయిన నీజనకుండొక్కరుఁడు తక్కపాపము! తక్కటివారందరును శత్రువులచేఁ జిక్కిరి. ఎవనిని తమపాలిదైవముగా భక్తిశ్రద్ధలఁ బూజించి యుండిరో, యట్టి తమరారాజగు రాజవర్మప్రభువును, వాని సంతానమును, జంపివేయుదురు తురకలని యూహించి, యాదేశవాసులు సాష్టాంగములఁ జేయుచుఁ దమరాజవంశము నంతమొందింపకుఁడని శత్రుసేనాపతిని మిక్కిలి బ్రతిమాలిరి. ఆసేనాపతి మొట్టమొదట వారిమొఱల నాలకింపలేదు. కాని కరుణాపాత్రములగు వారిమొఱ లెట్టివారినైనఁ గరగింపక మానవు.

అట్లగుటఁ గొంతకాలమునకుఁ వాఁడు ప్రసన్నుఁడై యిట్లనెను "ఓపుర
వాసులారా! మీరు మాటిమాటికిని, రాజవర్మ ప్రాణములను రక్షిం
పుఁడని మొఱవెట్టుచుండిరి కదా. సరే! ఈక్షణమున నాతఁడీ పురము
నుండి వెడలిపోయి, యేవేని నిర్జన స్థలములందుఁ గాలముఁగడపుచు,
ఘూర్జరులరగు మీతోఁగాని, మీ దేశవ్యవహారములతోఁగాని, లేక, త
క్కటి రాజవంశ్యులతోఁగాని, యెట్టివిధమైన జోక్యమును గలుగఁజేసికొ
నని యమోఘప్రమాణమునుఁ జేసినయెడల, మీరు మొఱలిడినట్లే
చంపక విడచెద." ఏమియుఁ జేయఁజాలమి, పాపము మీతాతగారట్లే స
మ్మతించి వెడలిపోయిరి. నీతలిదండ్రులు చంపఁబడక—అప్పటికి నీవిం
కను జన్మింపలేదు. కారాగృహముల బంధింపఁబడిరి. మోహనా! నీతం
డ్రిని వెతకిఁ బట్టుకొని, తనయొద్దకుఁ దెచ్చినవానికి గొప్పబహుమతి ని
త్తునని యాశాత్రవసేనాపతి ప్రకటించెను. కాని మీజాడ యెచ్చటనుఁ
గాన్పింపలేదు. రాజధానియగు ద్వారక బట్టువడుటచే, ఘూర్జరుల స్వ
దేశభక్తి నశించునని శాత్రవులూహించిరి. కాని త్వరకాలమున ఘూ
ర్జరమునందు దశాంతి ప్రబలె. ఎచ్చోటఁజూచినను తిరుఁగుబాట్లు మెండ
య్యె. మహమ్మదీయులందరిచేతను ద్వేషింపఁబడిరి. వేయేల! ఘూర్జర
మునందొక గొప్పవిప్లవము సంభవమయ్యె. ఆఘోరవిప్లవమునకు భ
యమొంది యామహమ్మదీయులు దేశవాసులతో మైత్రిగానుండుటకుఁ
గడంగిరి. వెంటనే వారు కొందర ఘూర్జరమహామహులఁ బిలువనంపి వా
రితో మంతనము సలిపిరి. ఆమంతనపుఁ బర్యవసాన విషయము లేమన, రా
జవంశ్యులలో నొకనిని ఘూర్జరసింహాసనాసీనునిగాఁ జేయుటయు నాదే

శమునఁగల ముఖ్యపట్టణములలో మూఁటియందు మాత్రము మహమ్మ
దీయ వర్తకవ్యాపారరక్షణకై, మహమ్మదీయ సైన్యము నుంచుటయును
నను నీరెండు. అంతఁ గొలఁదిదినములలో నీతండ్రియును తల్లియునుఁ గా
రాగృహమునుండి విడువఁబడి ఘూర్జరదేశ సింహాసనమున నీజనకుఁడు
ప్రతిష్ఠింపఁబడియె. నీజనకుఁడు రాజ్యాధికారమునట్లు స్వీకరించిన రెం
డేండ్లకుఁ బిమ్మట నీవు జన్మించితివి. తక్కటిసంగతులు నీకు దెలసియే
యున్నవి. అయినను మోహనుఁ డెఱుంగఁడు కావున జెప్పెద. అట్లుతా
ను ఘూర్జరసింహాసనాసీనుఁడైన పిదపఁ గొంతకాలమునకు, భార్యాభ
ర్తలిరువురును పరలోకమున కేగిరి. కావున, వారికుదయించిన, యీ
కమల యపుడు సింహాసనాసీనురాలయ్యె.

"అయ్యో! నాజనకుని గతియేమయ్యె?"

పాపము! తన జననమునకు గర్తయైన వానిఁగూర్చి తెలసికొను
టకు మోహనుఁడు మిక్కిలి యాతురత నొందియుండె.

"చెప్పెదవినుము. అట్లు ప్రాణములఁ దక్కించుకొని నిన్ను చేతు
లయందు బెట్టుకొని పలాయనము సేసిన కొంతకాలమునకుఁ బిమ్మట,
నీవును నీజనకుఁడును మృతినొందినట్లు వదంతులు పుట్టె. ఎట్లుపుట్టెనో
నాకుఁ దెలియదు. కాని నేను ముందువచించురీతిని, నావదంతులన్నియు
నన్నృతములు. ప్రస్తుత మావిషయము నట్లుంచి, రాజవర్మనుగూర్చి ప్ర
సంగింతము. తాను ప్రమాణముఁ జేసినట్ల, రాజవర్మ, తత్క్షణమే ద్వార

కనువిడచి కైలాసపర్వతములకుఁ బోయె. అచట, వెనుకమనచేఁ బ్రసంగింపఁబడిన పరమరహస్యము, వానికెంతయు సహాయమొనర్చె. ఏమనిన, నెచట ప్రాపంచిక విషయములు దూరములైయుండునో, యెచట దురాశలు తొలఁగియుండునో, యెచట మహోపద్రవము లేశమాత్రమైన సంభవింపకుండునో, యట్టి శాంతప్రదేశమునఁ దాను తలఁదాచికొనగలిగె.

ఇచట రవీంద్రుఁడాగె. కమల హృదయమునందు వివిధభావములు పొడసూపఁదొడఁగె. తనతండ్రి గతియేమయ్యెనో తెలిసికొనుటకు మోహనుఁ డెంతయు నాతురత నొందియుండె.

ఘూర్జర తార.

పదమూఁడవప్రకరణము.

అగు కమలాహృదయమునం దత్యద్భుతభావములు జనింపసాగె.

రవీంద్రుఁడు వాక్రుచ్చిన వివిధవిషయములలోఁ జిట్టచిగురు విషయముపై కాశ్చర్యభూయిష్ఠమైయుండె. “సంసృతిక్లేశములు దూరములై యుండుచోటు, దురాశకు నిల్లీయనిచోటు. దీనియర్థమేమి? ఆ పరమరహస్యమునకును, వీనికిని సంబంధమేమి?” అని కమల తనలో వితర్కించుకొనుచుండఁగా రవీంద్రుఁడు క్రమ్మఱనీక్రింది విధమున వచింపఁదొడఁగె.

“ఆరహస్యపరిజ్ఞానమున రాజవర్మ నిశ్చలమగు నేకాంతస్థలములఁ దనదలఁ దాచికొనఁగలిగె. ఆస్థలమునకుఁబోయి తఱచుగా వారిని సందర్శించియుంటిని. రెండుపక్షములకుఁ బిమ్మట తనపుత్రుఁడు ఘూర్జరసింహాసనమున నధిష్ఠింపఁబడినట్లు విని కడుంగడు సంతోషమునొందె. కాని తనయల్లుఁడు—మోహనా! నీతండ్రియే—మనుమనితోఁగూడఁ బ్రాణములదక్కించుకొనఁ బలాయనమొందగలుగుటకు మోదమొందెనే

కాని, మరల వారిజాడ తెలియమి, మిక్కిలి చింతాక్రాంతుఁడై యుండె. నేను, ఘూర్జరాది పరిసరప్రదేశముల నన్నిటిని వెతకివెతకి విసువుఁజెంది యుంటిని. అట్లుండఁ గొన్నినాళ్ళ కుదయపురప్రభువగు వీరసింహుఁడొక కుఱ్ఱను దత్తపుత్రునిగా స్వీకరించినట్లు తెలియవచ్చెను. ఆకుఱ్ఱనుఁగూర్చి యద్భుదపదంతు లనేకములుపుట్టె. వెంటనే నేననుమానగ్రస్తుఁడనై యాకుఱ్ఱని తలిదండ్రులెవ్వరో తెలియఁబఱచుఁడని, మిక్కిలి వినయపూర్వకముగా వీరసింహునికొక యుత్తరమునువ్రాసితిని. ఆసచ్చరితుఁడును, నాకువెంటనే ప్రత్యుత్తరమునువ్రాసె. అందలి విషయము లెవ్వియనఁ దానొకదినమున నడవిలోవేటాడుచుండఁగా నొక సెలయేటియొద్దున రాజాంశాసంభూతుఁడొక పసిపాపను తనచేతులయందిడుకొని యుండుట నాప్రభువుచూచె. మోహనా ! ఆరాజాంశాసంభూతుఁడు నీజనకుఁడే! మరియు నాతనిహస్తకమల మందున్న పసిపాపడవు నీవే! ”

“అయ్యా! ఇవియన్నియు నాకు నూతనవృత్తాంతములు. నా జనకునిగతి యిట్టిదని నేడేనాకువినవయ్యె. కటకటా—జనకా!” అనునపుడు మోహనుని కనుదమ్ములనుండి యశ్రుగుళికలు బొటబొటఁగాఱె.

అట్లు శోకసంతప్తుఁడైన వానియెడమిక్కిలి జాలినొందుచు రవీంద్రుఁడు మరల నిట్లని చెప్పఁదొడఁగె.

“ వీరసింహుఁడు మిక్కిలి దయార్ద్రహృదయుఁడగుటచే నీజనకుని దుర్గతినిఁగూర్చి నీకీవఱకేమియును దెలియఁజేయలేదు, కాని, యీ

సమయస్థితియందు నీకుఁ దద్విషయ పరిజ్ఞాన మత్యంతావసరము. మఱియును, నీవు శ్రీనగరమున కేగుదెంచినతోడనే తద్విషయమునుగూర్చి సర్వమును నానోటనుండివినెదవని వీరసింహుఁ డెఱుగకపోలేదు. ఇఁక నా కథను వచించెదవినుము! అట్లు ఝరీతటంబున, సబాలకుఁడై విశ్రాంతి నొందియుండుటఁ దిలకించి వీరసింహుఁడు వానియూరుపేరుల నడిగె. అపుడు, కటకటా! మోహనా! విషాదకరమగు నొకవిషయము నాలకింప సంసిద్ధుఁడవై యుండుము. ఆమనుజుఁడు పిచ్చివాఁడని వీరసింహునికిఁ దెలియనయ్యె.”

సాంద్రతరములైన దుఃఖాశ్రుబిందువులు మోహనుని లోచనగోళములనుండి బొటబొట ప్రవహించె. ఇపుడు కమల కూడ కన్నుల నీరునించె. రవీంద్రుని హృదయమునందు వారియెడ ననిర్వచనీయమగు జాలి బెనగొనియుండె. అంతఁ గొంతసేపునకు మరల రవీంద్రుఁడిట్లని ప్రసంగించె.

“ అట్లున్నవానినిఁ గాంచి జాలినొంది వీరసింహప్రభువు తనపరిచారకులచే వానిని, పసిపాపనితోఁ గూడఁ దనపురమునకుఁ దీసికొనిపోయె. వారివంశమేదియో, వారిదేశమేదియో, వారినామములేవియో, మొదలుగాఁగలవివిధవిషయములువీరసింహప్రభువునకు ప్రథమమున నేమియుఁ దెలియవు. అట్లుండఁ గొన్నిదినముల కాపిచ్చివాఁడు—నీజనకుఁడే—పరలోకమున కేగె. తండ్రిలేని నిన్నుఁ, దనపుత్రునివలెఁ జూచికొనుచు, నేఁటివఱకు వీరసింహప్రభువు నీయెడ యెట్టికరుణాంతరంగుఁడై యుండు

నో నీకే తెలియును, కొన్నినాళ్ళకు. వదంతుల మూలముగా మీవిషయము నాతఁడు పూర్తిగా గ్రహియించె."

"అయ్యా! వీరసింహుఁడే నాకు తండ్రియని నానమ్మకము. జనకునికి సహజమగు పుత్రిప్రేమ వారికి నాపైఁగలదు. ఎప్పుడైన నేను నాతలిదండ్రుల విషయమై వారినడిగినయెడల నవి నాకుఁ దిన్నగాఁ బదులుచెప్పక వేఱొకవిషయమై ప్రసంగింతురు. అట్లగుట నేనెన్నఁడును వారిని గుఱించి యడుగలేను, ఇఁక నిపుడు మీమూలమున నాతలిదండ్రులవిషయము దెలియనౌటచే నాకెంతయును సంతసమయ్యె."

"ఈసర్వవిషయములను రాజవర్మ ప్రభువునకుఁ జెప్పగా, విని, తనవంశమున జన్మించిన వారలలో నొకపురుషుఁడైన భూమిపై నుండుఁగదా యని సంతసించె. పిదపఁ గొన్నినాళ్ళకు రాజవర్మప్రభువా నిశ్చల నిర్జన ప్రదేశముననే పంచత్వమొందె. ఆస్థలముననే వారికి నేనొక్కరుఁడ నగ్నిసంస్కారముల నొనర్చియుంటిని. తాను మృతినొందుటకు మున్ను, రాజవర్మ ప్రభువా పరమరహస్యమును తన మనుమరాలగు నీతారా కమలకుఁ దెలుపుమని నన్నుఁగోరె. మఱియును నీవును దానినిఁ దెలిసికొనుట కర్హుఁడవే యని తోఁచెనేని నీకుఁగూడ దెలుపవలసినదిగా నాకాజ్ఞ నిచ్చె. కావున, హేమచంద్రుని మూలముగా మీకు నుత్తరములనంపి, మిమ్ముల నీనగరమున నాయొద్దకు రప్పించుకొనినఁ గారణమును మీరిరువురును గ్రహింపక పోలేదు."

"మంచిది; కాని అయ్యా! ఉంగరములేల?" యని కమల రవీంద్రునడిగె.

"ఏలననఁగా వినుఁడు. రాజవర్మ మహారాజు మృతినొందిన పిదప తద్రహస్యము నెఱింగిన మనుజుఁడీ యపారపారావారపరీతమహీతలమున నీరవీంద్రుఁ డొక్కరుఁడే యని గ్రహించుఁడు. వార్ధక్యదశయందు నేనుండుటచే నాజీవము లేక్షణముననైన నీదేహమునువిడచిపోవును. అట్లగుట మీరీ శ్రీనగరమునకువచ్చి నన్నుఁ గలసికొనక పూర్వమే నేను మృతినొందినయెడల మీకాపరమ రహస్యమెట్లు తెలియనగు. కావున నేనొకసూక్ష్మక్రియను దానికొఱకై వినియోగించితిని. ఇంతవఱకు నేను మీతో వాక్రుచ్చిన సర్వవిషయములనుఁ గూర్చియు, మఱియు నాపరమరహస్యముఁ గూర్చియు, విపులముగాఁ గాకితములపై వ్రాసి కట్టగాఁగట్టి నావ్రాతబల్లలో నుంచియుంటి. నావారసునికి నేను మృతినొందిన పిదప, నేయిరువురు సమానరూపముగల రెండుంగరములఁ బ్రదర్శింతురో, వారికాపత్రముల నీయవలయునదిగా వ్రాసియుంటిని. ఆకారణమున మీకు నేనుంగరముల నంపవలసివచ్చినది. కాని, మనకా చిక్కు లీయెడ ననవసరములు. అమ్మా! కమలా! ఆపరమరహస్యము నీక్షణముననే నీకు తెలియజెప్పటకు నాకభ్యంతరము లేదు. కాని మోహనా! నీకారహస్య మచిరకాలమునఁ దెలుపఁబడదు. ఒకింత శాంతచిత్తుఁడవై యున్నయెడల గొంతకాలమునకు గొన్ని కొన్ని విషయసంబంధములు నీకను గుణ్యములగు. అపుడా పరమరహస్యమును నీకెఱుకజేసెద."

"అయ్యా! దానినిఁ దెలిసికొనుటకై నేనెట్టి యర్హతనొందవలయునో తెలియఁజెప్పుఁడు"

,, సరే! అట్లయినఁజెప్పెద. అమ్మా! కమలా! ఒకింతసేపు నీవు మమ్ములవిడచి నీగదిలోనికిఁబొమ్ము. మోహనుఁడు నిర్మలమనస్కుఁడై పలుకుచున్నాఁడు. కావున—ఆవాక్యము సంపూర్తికాక పూర్వమే కమల సర్వమును గ్రహించి వారినివిడచి తనగదిలోనికిఁబోయె.

అచట నున్న తనపరిచారకలగు మాలతీమాలినులను తోటలో నాడుకొనఁబొమ్మని సెలవిచ్చి, తానొక చారుపీఠికనలంకరించి, రవీంద్రుని నోటనుండి తాను వినిన సర్వవిషయములను మరల జ్ఞప్తికిఁదెచ్చుకొనుచు నాపరమరహస్యము, రాజవర్మప్రభువు తలఁదాచుకొనిన నిశ్చలప్రదేశమున కెట్లు సంబంధించియుండె నని యాలోచించుకొనుచుండెను.

ఘూర్జరతార.

పదునాల్గవప్రకరణము.

అట్లు ఘూర్జరతార యాలోచించుకొనుచున్న కాలముననే, శ్రీనగరరాజవీధినుండి హేమచంద్రుఁడు నడచిపోవుచుండుట మనకుఁగననగు. రాజవీధినినిర్గమించి, నిఱుపేదలు కాపురముండు నొకవీధికిఁబోయెను. ఆవీధి కెడమవైపుననున్న యొకచిన్న గృహమునొద్దకుఁబోయి, తలుపుఁదట్టెను. వెంటనే వృద్ధురాలొకర్తు తలుపుఁదెఱచె. ఆమె హేమచంద్రుని నెఱిఁగియే యుండవచ్చును. ఏమనిన వానినేమియును బ్రశ్నింపలేదు. కాని, లోనికిరా వానికిసన్నజేసి, తలుపునకు లోగొళ్లెమువైచి, యొకగదియొద్దకు వానినివెంటఁబెట్టుకొని పోయె. ఆగదియందు దీర్ఘాలోచనజేయుచు నొక్కరుఁడుండె. అచట హేమచంద్రుని విడచి, వృద్ధురాలు తనపనిమీఁదఁ బోయె. ఆమనుజుఁడు గట్టుకొన్న యుపధానములన్నియును మాసియుండె. వానిమొగము పాలిపోయి వెలవెలలాడుచుండె. కాని, హేమచంద్రుని జూచినయంతనే వానికనులు నిప్పులగ్రక్కదొడఁగె. మొగము కందబాఱె. అంత పండ్లుపటపటఁ గొఱికికొనుచు, మేఘగంభీరస్వనమున ,,ఓరీ! వచ్చితివా? నీవేనాపాలిటి పెద్దమ్మవు! ఈ

నాదుర్గతికి నీవేమూలకారణమవు" అని యనెను.

"నన్ను నిందింప నీకుభావ్యముకాదు. అందు నాతప్పేమియు లేదు. నీవన్నుఁగడ విచ్ఛిన్నమగుటకుఁ గారణములు రెండుకలవు. ఒకటి పండలై, మోహానునిచే నీబంట్లోటమి నొందుట; రెండు నీభార్యమోహిని, దురదృష్టపు మృతినొందుట.

"ఛీ! దానిపేరును నాముం దుచ్చరింపకుము! అది కమలకుఁ దిరిగియుంగరము నిచ్చెను! జీవితకాలమున నాయెడ నెంతకృతజ్ఞతతో నుండెనో యవసానకాలమందంత కృతఘ్నురాలయ్యె.

"ఓయి! పిచ్చివాఁడా! చచ్చుటకు సిద్ధముగానుండి నప్పుడామె యుంగరము, నెట్లు వినియోగింపఁగలుగు? కావుననే కమలకు మరలనిచ్చె. ఇందాపె తప్పేమియునులేదు."

"నిజమే! అంతటి వలపుతో నన్నుఁజేకొనిన దానినే నేలనిందింపవలయు?" ఇంతవఱకును జింతనిప్పులవలె నెఱ్ఱగనున్న వానికనులు, తమ శోణరుచులయందు దరిద్రితాగుణమునొంది, సహజనీలరుచులఁ దాల్చె. "ఆవిషయము లిపుడేల? నాకుఁ గర్తవ్యముఁజెప్పుము. ఇంతకు నీయజమానుఁడగు రవీంద్రుఁడు నీపై ననుమానమునొందలేదు కదా?

"వీసమంతైన లేదు."

"ఘూర్జరతార కేమైన ననుమానమా?"

"ఆమెకు రవ్వంతైన లేదు"

"నిజమే? అనుమానమున కెడమేది? నీజాగ్రత్తతో నీవుంటివి. రవీంద్రుని యాజ్ఞననుసరించి, యుత్తరమును, నుంగరములను, దప్పక నియమితకాలమునకుఁ గమలా మోహానుల కిచ్చితివి. ఇట్లు చేయవద్దనియే నేనుపలుమాఱు నీతో మొఱబెట్టితిని. నేను నీకుఁ దొలుత నేజెప్పినట్టులాయుత్తరములను, నుంగరములను, వారికీయక, మాకిచ్చియున్న యెడల నాభార్యయును, నేనును, నిచటికివచ్చి మేమేకమలా మోహానులమని రవీంద్రునితోఁ జెప్పి, వానినుండి యాపరమరహస్యమునుఁ దెలిసికొనియుందుము? అట్లేలఁ జేయవైతివి?"

"ఏలనా? దానికిఁగారణము లేకపోలేదు. సరే! నీవుచెప్పినట్లే నేనుసమ్మతించి, కమలా మోహానులకీయక, రవీంద్రుని యాసకు విరుద్ధముగా నుత్తరములను, నుంగరములను, మీకిచ్చితిననుకొనుఁడు. వానిని మీ రుభయులును వినియోగించి రవీంద్రునొద్దకుఁబోయి నేనే కమలనని మోహినియు, నేనేమోహానుఁడ నని నీవును చెప్పుకొనెద రనుకొనుఁడు. కాని మోహానుని వయస్సిరువదిసంవత్సరములు. నీవయస్సిరువదినాల్గేండ్లు. కమలకు బదునాఱేండ్లు. మోహినికి బందొమ్మిది వర్షములు. భేదములఁ గుఱుతునెఱిఁగి మీపై రవీంద్రుఁ డనుమానమొందినచో నేమికావలయు? నాకు ముందు కారాగృహప్రాప్తియగును? మొదటినుండియు నాకీభయమే"

"భళి! ఎల్లప్పుడును. నీజాగ్రత్తతో నీవుందువు."

"అట్లుండుటకే నేనెల్లయప్పుడును బ్రయత్నించుచుందును. కావున మీకీయకముం దుదయపురమునకుఁ బోయి మోహనునికిని, పిదప ద్వారకకుఁబోయి కమలకును, వారివారికీయవలయు నుత్తరాదుల నిచ్చితి. అట్లిచ్చి, వారివారి స్థానములనుండి శ్రీనగరమునకుఁ బోవుమార్గము——నీవుసూచించినదే——వారికెంతయో నమ్మకముఁజూపి నిరూపించితి. ఇఁకఁ దక్కినసంగతులను నీకేవిడచితి. కాని నీమనుజులు పందలై మోహనునిచే నోడింపఁబడిరి. దొరకినయుంగరము స్మరలచేతినుండి జాఱె. ఈరెండు కారణములును నీయీదుర్గతికిఁ గారణములు. కానినాయకా!

"నాయకా! ఆబిరుదుహాస్యకరము! బంట్లులేనిదే నాయకుఁడగు టెట్లు? సైనికులు లేక సేనానియగు టెట్లు?"

"ఏమి! ఏమి! అట్లనుచుంటివేమి?"

"నీకింకను దెలియదా! ఇంతకుఁ బూర్వము నాయెడ విశ్వాసముతోనున్న నాబంట్లందరును నన్నువిడచి, భీమునిపక్షమున జేరిరి. వాఁడును, వారును నన్నుజావఁగొట్టి నాగృహము నాక్రమించుకొని, యిట్లు నన్ను వెడలఁగొట్టిరి. ఒక్కరుఁడు మాత్రము విడువక నన్నింకను విశ్వాసముతోనే యనుగమించుచున్నాఁడు.

వానిపేరు "అఘోరి"

"అయ్యో! నీకెంతటి దుర్గతిప్రాప్తించినది? అట్లయిన, నీవిప్పుడీ నగరమునందుండిన నపాయకరముకాదా?"

"కాదు. ఏమనిన నాయక పదవితోడను, నాభాగ్యములతోడను, నాగృహముతోడను, భీమునిదురాశాదేవత సంతృప్తినొందె. కావున నేనిచట నున్నానని రక్షకభటులకుఁ జెప్పి నన్ను కారాగృహమునఁ బ్రవేశపెట్టు నూహవానికిలేదని 'అఘోరి' మూలముగా నాకుఁ దెలియనయ్యె." ఏకారణముననో యీసమాచారమును వినినతోడనే హేమచంద్రుని మోము వికసించె. వానికనులు, దేదీప్యరుచులచేఁ బరిపూరితంబులై యుండె. కాని, యాసమయమునందు వీరరుద్రుఁడ వనతముఖుఁడై యుండుటచే హేమచంద్రునివంకఁ జూడలేదు, అంతఁ గొంతసేపునకుఁ బిదప వీరరుద్రుఁ డిట్లనియె. "హేమచంద్రా! ఆదుర్మార్గుని మరల నోడింపవలెనని నాకు గొప్పయాశకలదు. దానికై తగు బలఁగమును సమకూర్చుకొనుటకుఁ దగుధనము కావలయు. నీయొద్ద నేమైనను కలదా!

"నాయొద్ద నేమియును లేదు. అయినను, వచ్చు నుపాయమును నేను చెప్పెద. అట్లు చేయుదువా?"

"చేయకేమి?"

"అట్లయిన, నీరాతిరి పన్నెండుగంటలకు నాయజమాని సౌధప్రాకారద్వారముకొద్దకు 'అఘోరి' ని వెంటఁబెట్టుకొనివచ్చి, తలుపును మూఁడుసారులు మెల్లగాఁదట్టుము. వెంటనే తలుపుఁ దెఱువఁబడును.

అపుడు నేను జెప్పినరీతి నొనర్చినచో నీకుఁ గావలయునంత ధనము నిప్పింతును."

"హేమచంద్రా! అపుడు నాచే నేమిచేయింతువు"

తనపన్నుగడను హేమచంద్రుఁడు విపులముగా వీరరుద్రునికిఁ దెలియఁబఱచె. ఆపన్నుగడయెట్టిదో మన మిపుడు తెలిసికొనుట యనవసరము. ఏమనిన కథాసూత్రము ననుగమించిన కొలఁది, మనకది గ్రాహ్యమగుఁ గావున హేమచంద్రుఁడు తన యూహల వీరరుద్రునికిఁ దెలియజెప్పెనని మాత్రమే మన మిపుడనుకొని తృప్తినొందుదము. వీరరుద్రుఁడు హేమచంద్రుని మేధాశక్తిని గొనియాడి ప్రసంగవశమున నిట్లు ప్రశ్నించె "హేమచంద్రా! ఆపరమరహస్యము విషయమై కొద్దియో గొప్పయో నీకెట్లు తెలియనయ్యె?"

"నాకుఁ జిన్నతనముననే నాతలిదండ్రులు మృతినొందిరి. ఆకాలమునుండియు రవీంద్రుఁడు నన్ను తనపుత్రులలో నొకనివలెఁ బెంచి పెద్దవానినిఁ జేసి తనయొద్దనే యుంచుకొనియె. అప్పటినుండియు, ననేకపర్యాయములు రవీంద్రుఁ డతిరహస్య ప్రయాణములు చేసెనని నాకు జ్ఞాపకము. ఎవరికినిఁ దెలియరానివిధమున నాతఁ డెచటికోఁ బయనము సేయుటచే నాకుఁ గొంత యాశ్చర్యకారణమయ్యెను. జనులందరనుకొనినట్లే, యేదోవర్తకకార్యములకై, యెచటికోఁ బోవుచుండెనని నేనుఁగూడ కొంతకాల మనుకొంటి. కాని, యొకరాత్రి యాయన నిదురించియున్న గదిలోనికి నేను మఱచినకొండొక వస్తువును దెచ్చికొనుటకుఁ బోఁ

గా, నాసమయముననే విచిత్రముగాఁ గలవరించె. ఆకలవరింత విచిత్రసూచకముగా నుండె. దానిపై నాతొల్లింటి యనుమానము బలవత్తరమయ్యె. అట్లుండఁ గొన్నినాళ్ళకు మరల రవీంద్రుఁడు తనరహస్య ప్రయాణమునకు సన్నాహము నొనర్చుకొనుచుండె. ఆప్రయాణ సంబంధమగు మర్మమును దెలిసికొన నిరంతరకౌతూహలముతో నుండుటచే, వానిని వెంబడింపవలెనను బుద్ధిపొడమె. అట్లే వానికిఁ గానరాక రహస్యముగాఁ గొంతదూరము వెన్నంటితిని. కాని, యింకముందు పోఁజాలనైతి. వానిచేఁ జూడబడుటకు సిద్ధమైతి. అట్టి యపాయమునుండి తప్పించుకొని నిష్ఫలమనోరథుండనై మగిడిగృహమునకు వచ్చితి. అంతఁ గొన్ని దినములకుఁ దనపయనమునుండి రవీంద్రుఁడు తిరిగివచ్చె. కాని, యపుడు వానిమొగముపై దుఃఖమేఘములు తారాడుచుండె. అపుడపుడు కంటఁదడిబెట్టుటగూడఁ నేనుజూచియుంటిని. తనప్రాణస్నేహితునిఁ గోలుపోయితినని చింతాపారవశ్యమున, రవీంద్రుఁడు వచించియుండెనని కూడ నాకుజ్ఞాపకము. ఆప్రాణస్నేహితుఁ డెవ్వఁడో నాకప్పటికిని, నిప్పటికిని గూడఁ దెలియదు." ఆప్రాణస్నేహితుఁ డెవ్వఁడో హేమచంద్రుఁ డెఱుఁగకపోయినను నాయనయే రాజవర్మప్రభువని మీచదువరులకు గ్రహింపనగు.

"పయనమునుండి తిరిగివచ్చిన కొలఁది దినములకుఁ బిదప నాయజమాని; తనగదిలోఁ దా నొక్కరుఁడే యుపవసితుఁడై యేవియోపత్రములను లిఖింపమొదలిడె.

కమలా మోహనులు తనయొద్దకు రాకపూర్వమే తాను స్మృతి నొందినయెడల, నా రహస్య విషయములఁ దెలుపుకొఱకై వ్రాసినపత్రములే, యివి యని మా పాఠకులకు గ్రహణీయము.

“ఆమర్మపరిచ్ఛేదమునకై యెల్లయపుడును, నాతురతతోఁ నున్న నా కాపత్రములనుఁ జూచుబుద్ధిపొడమె. దానికై తగు తరుణ మొక నాఁడు సంభవించె. ఒకనాఁడు రవీంద్రుఁడు తనగదికిఁ దాళమువైవమఱచి, యెచటికోపోయె. అంత నేను గదిలోఁ బ్రవేశించితి. వానివ్రాఁత బల్లకుదగ్గరగా నొకలిఖితపత్రముండె. ఆపత్రమును జదువఁగా నాకుపులకలుపుట్టె. అందు నేను చదువఁగల్గిన విషము లెవ్వియన, మనకాశ్మీరదేశమున కుత్తరభాగముననున్నా కైలాసపర్వతములలో, స్వర్గతుల్యమగు, నొకచక్కని ప్రదేశము కలదనియు, దానిచుట్టును, నత్యున్నతములై, నిరంతరము హిమముచేఁగప్పఁబడినవై, దుర్గమ్యములైన పర్వతప్రాకారములచే నదిఁజుట్టబడియున్నదనియు, నాసురనందనమున నెల్లయపుడు వేసవియే ప్రబలుచుండుననియు, నచట చలిమందునకైనఁ గానఁబడదనియు, దానియందనంతములగు, నవరత్నములును, హేమమును, వెండియును, వేయేల, యీప్రపంచమునైనను గొననగునట్టి ధనముకలదనియు, వ్రాయఁబడియుండె. ఇంకను నాపత్రమున నెవ్వియో, యద్భుతవిషయములు వ్రాయఁబడియుండె. కాని, రవీంద్రుఁడు తిరిగివచ్చునేమో యనుభీతిచే, దాని నచటనేవిడచి, మరల నాస్థలమునకు వచ్చితిని. వీరరుద్రా! ఆయద్భుతప్రదేశమును, దన్మనోహరరంగమును, దానియందున్న యపారధనమును దలఁచినపుడెల్ల నాకునోటనూట లూ

రచుండు. అహాహా! ఎన్నఁడు.

“చాలుచాలు. ఊఱకొనుము. దానివిషయమై నీకఁదలఁపోయకుము. దానిననుభవించునంతటిపదవి నిర్భాగ్యదామోదరుల మగుమనకుఁజిక్కునా?” అని కొంచెమాగి “సరే! నీవుచెప్పినట్లే, నేఁటిరేయి దప్పకవచ్చెద. ఇఁకనీపనిమీఁద నీవుపొమ్ము’,

అట్లే హేమచంద్రుఁడు వీరరుద్రునివిడచి, యాగృహమును నిర్గమించి, వీధినుండి, తనయజమానుని గృహమునకేగక యనేకసందుగొందుల మూలముగా మఱియొకవీధిలోఁ బ్రవేశించి, యొకగృహమును జేరె. ఆగృహద్వారమును దట్టినంత నొకసేవకుఁడు తలుపుఁదెరచె. తోడనే, యాగృహప్రాంగణమునందు, పదుగురుకన్యలు జవ్వనులు నిసర్గమనోహర కుసుమవిలాసిను లాడుకొనుచుండుట వానికిఁగాన్పించె.

ఘూర్జరతార.

పదునైదవ ప్రకరణము.

వారివివిధరేఖావిలాసములు, వెవ్వేరుజాతులకు సంబంధించి యుండె. ఒక్కసుందరి వినీలకుటిలకుంతలము లుంగరము లుచుట్టుకొని మృదుల భుజతటములమీఁదుగాఁ బ్రాఁకి పిఱుదులను నిర్గమించి, మోకాళ్ళవఱకునుండె. ఒకసుకుమారి నేత్రకమలములు, చెవులవఱకు విజృంభించి, మిక్కిలిపెద్దవై, వాఁడిదేఱినవై, యాపె సహజమన్మథోద్రేక పరిభావములచే నొకవిధమగు రూపమునొందినవై యుండె. ఇట్లే వారిలో నొక్కరొక్కరు, వివిధరూపవిలాసినులై యుండిరి. వారందరును జగన్మోహినులు. అట్టి జగన్మోహినులొకచోఁగూడియుంట నాప్రదేశమత్యంతప్రభావంతమై, వెలుఁగొందె. ఒకరిరువురుదక్క వారందరును దమ రానున్న సౌఖ్యము, భాగ్యము, పదవి, ఇత్యాదులఁ దలపోయుచుఁ దత్పారవశ్యమున నుండిరి. తక్కినయొకరిరువుర మనోహరనేత్రముల నుండి దుఃఖాశ్రువులు రాలుచుండుటఁ గాననగు. పాపము! వీరికా భాగ్యములు, నా యపారసౌఖ్యములు, నా యత్యున్నతపదవియును రుచింపలేదు. వీరిమనములు వేరొకచో లగ్నములై యున్నవి.

ఆవిలాసినీసంఘమును, నాల్గునిమిషములవఱకట్లె నిలువఁబడి దూరముననుండిచూచి, హేమచంద్రుఁ డావంకనుండి వేఱొకత్రోవను గృహాంతరముఁజొచ్చె. అచట నొక్కరుఁడు "హుక్కా" పీల్చుచుండె. వానికిదాదాపు నలువదిసంవత్సరములవయస్సు. వానిదుస్తుల, నాఱసిన, వాఁడు మహమ్మదీయుఁడని తప్పకతోఁచు. హృదయము కాఠిన్యమున కాలయమని తెల్పురీతి, వానికనులు మాలిన్యమునొంది చుఱుకుచూపుల వెలిబుచ్చుచుండె. ఏమనిన హేమచంద్రుని వాఁ డిదివఱ కెన్నఁడును జూచి యెఱుఁగఁడు.

సలాముజేసి "నేను రవీంద్రనాథునియొద్ద నుండువాఁడను, నాపేరు హేమచంద్రుఁడు"

"ఏపనిమీద వచ్చినారు?"

"నేనువచ్చినకార్యము దమకు నివేదించుటకు ముందుగానొక విషయమును జెప్పెదవినుండు. మీనామము "ముస్తాఫాయాకూబు" కాదా". తా నెఱుఁగకున్నను, తన్నెఱిగియున్న వీఁడెవ్వఁడాయని యాకూబున కొకింత యాలోచనకలిగె. "అగును మీరునన్నెట్లెఱుఁగుదురు?"

"మిమ్ముల నేను ముఖాముఖిని జూడకున్నను, మీనామమును, మీవ్యాపారమును, నెఱిఁగియున్నాను. అదే. ఆసుందరులను రంజాన్ బహుమతులుగా సుల్తానుకడకుఁ గొంపోయెదరా!

“ఔను. రేపుసాయంతన మిచటనుండి బయల్వెడలి, నాలుదినములలో ఢిల్లీని చేరవలయు. ఏమనిన రంజాన్ పండువు పూర్తియగుకాలము సమీపించినది. కాని మీకువచ్చినపనియేమి?”

“ఈక్షణమున నాయజమానియగు రవీంద్రనాథుని గృహము నందొక జగన్మోహినికలదు. ఈవిలాసినులకన్న, నామె మిక్కిలిసుందరి. రంజాన్ బహుమతి—

సరే! నీయూహ తెలిసినది. కానిఅల్లదె! ఆప్రదేశమున నాడు కొనుచున్న కన్యలఁజూడుము. వారి యౌవనవిలాసములఁ దిలకింపుము. వారి సౌకుమార్యములఁ బరిశీలింపుము. వారి—

“అట్లు నాకు వర్ణనసేయనక్కరలేదు. నీవు సామాన్య మానవస్త్రీలవిషయమై పలుకుచుంటివి. కాని నేను దేవాప్సరసవిషయమై పలుకుచుంటి.”

“ఎంతనీవుమాట్లాడినను, వీరికన్న చక్కదనమున మిన్నలగువారులేరవి నాదృఢాభిప్రాయము” అట్లెన్నటికిని ననుకొనకుము. నీవు చూచియుండకపోవుటచే నట్లనుకొనుచుంటివే కాని, యొక్కసారి చూచి నట్లయిన నామాటలయందలి యాథార్థ్యమును గ్రహింపకపోవు.”

“అట్లయినసరే! నాకాసుందరిని సమకూర్పఁగలవా?”

“సందేహమా! కాని నేనుముందొక్కవిషయమై చెప్పెదవిను

ము. ఆమెకు, పైత్యజనితమైన యొకవిధమగు పిచ్చగలదు. ఆపిచ్చచే, మానవసహజమగు బుద్ధియామెయందు లేకపోలేదు. కాని, తనజగన్మోహనసౌందర్యము వేనోళ్ళనందరును బొగడుటచే గర్వముఁజెంది, జగత్ప్రసిద్ధయగు ఘూర్జరతారను నేనేయని చెప్పుకొనుచుండును. దానికిఁ దగినట్లామెనామముకూడ “కమల” యే.

హేమచంద్రుఁ డీరీతిని మోసపుమాట నాకూబునకుఁ జెప్పుటకుఁ గారణములేమనిన యామె ఘూర్జరతారయేయగునెడల నట్టిరాజవంశసంజాతను యాకూబు దొంగవాటునఁబట్టుకొని, రంజాన్ బహుమతిగా సుల్తానునకు నివేదింప నిజముగా వెనుదీయును.

“ఆపెపిచ్చితో మనకుఁబనియేమి? సరే! హేమచంద్రా! నాకాసుందరిని నెట్లప్పగించెదవు? తత్కార్యాచరణమునకై నీకేప్రతిఫలము కావలయు?”

హేమచంద్రుఁడు సర్వవిషయములను విపులముగా యాకూబునకు విశదీకరించె. ఆవిషయములెవ్వియో మనము భావిసందర్భమున దెలిసికొందుముఁగాన నిపుడే యాతురతనొంద ననవసరము. హేమచంద్రుఁడు విశదీకరించిన విషయములన్నిటికి నాకూబామోదించె. పిమ్మట వానియొద్ద ననుజ్ఞఁగైకొని హేమచంద్రుఁడు తనఘోరదుష్కార్యముల నాచరణమునఁ బెట్టుటకై, సంతసించుచుఁ దనయజమాని సౌధమునకేగె.

ఘూర్జరతార.

పదియాఱవ ప్రకరణము.

చదువరులారా! మనమచట వివిధవిషయముల నాలోచించుచున్నపుడు మనము విడిచివచ్చినకమల, యిపుడేమి చేయుచున్నదో చూతమురమ్ము.

ఆసుందరి తనగదియందిపుడు లేదు. రవీంద్రమోహనులతోఁ గలసి ప్రసంగించుచున్నది, ఆప్రసంగము రహస్యవిషయమైకాదు. వేఱొకవిషయముఁగూర్చిసుమా! అది యెట్టిదియని నీవడుగవచ్చు. అట్లయిన వారిసంభాషణము నాలకింపుము.

“అయ్యా! ఆపరమరహస్యమును దెలిసికొనుట కర్హుఁడనగుటెట్లని నీవుపలుమాఱు నన్నతిసంభ్రమముతో నడిగితివికదా! నీప్రశ్నకుఁ బ్రత్యుత్తరము సౌఖ్యవిషయములతో మిళితమైయుండుటచే, సంకోచించుచున్నాఁడను.

“ఎట్టివిషయములు?”

“ఏకారణములచే రాజవర్మప్రభువు, తనకొమరునికిఁగాని,

తనపుత్రికకుఁగాని, యాపరమరహస్యమును, దెలుపుటకు వెనుదీసెనో, నేనుమీకుఁ దొలుదొల్తనే చెప్పియుంటినికదా.”

“ఔను.”

కమలామోహనులు రవీంద్రుని మోమువంక శ్రద్ధాసంభ్రమములతోఁ జూచిరి.

“ఆకారణాంతరము నీయెడఁగూడ బరిణమించునని తెలియునది. ఇంతకన్న నేనుచెప్పుటకు సాహసింపను. అందలిగూఢార్థమును మీరు దీర్ఘవితర్కమునకై గ్రహింపకపోరు.

ఇట్లుచెప్పుచు రవీంద్రవృద్ధుఁడు వారివంకఁ దదేకదృష్టితోఁ దిలకించెను.

కొన్నినిమిషములవఱకును కమలామోహనులు రవీంద్రుని యూహను గ్రహింపలేక తడబడిరి. వారిరువురు నొకరినొకరు రెండుమూఁడు పర్యాయములు చూచుకొనిరి. కొంతవఱకు వారికేమియుఁ దోఁచలేదు. క్రమక్రమముగా, లఘుగతిని సూర్యకిరణములు ప్రత్యూషమున నుదయించురీతిని నొకవిషయము వారిచంచలిత చిత్తములకుఁ దోఁచె. క్రమక్రమముగాఁ గమల స్త్రీసహజమగు లజ్జచే వినమ్రముఖియగుట కాననగును. మోహనునిమోమున సంతోషము వెల్లువలై పాఱుచుంటఁ గూడఁ జూడనగు. కమల తత్తరపాటుఁ జెందె. మోహనుఁడుకూడ తత్తరమొందె

యౌవనవిలాసములు వారియందీసమయమునఁ బూర్తిగావిజృంభించి నిరాఘాటవిహారముల నొనర్చుచుండె. ఆసమయమున నాజగన్మోహినీ జగన్మోహనులఁ గన్నులార జూచినవేఱుగా రతీమన్మథుల నెంచవలెనా!

వారినిఁజూచి రవీంద్రుఁడు మిక్కిలి సంతసమునొందెనని నొక్కి మాచదువరులకు మేమువేఱుగాఁ జెప్పనక్కఱలేదు. తనపలుకులయందలి గూఢార్థమును వారనతికాలమున గ్రహింపఁగలుగుటచే, వారిసూక్ష్మబుద్ధికి నచ్చెరువయ్యె!

ఆగూఢార్థమెట్టిది? అని మాపాఠకులందు గొందరడుగనోపు. ఒకింతసూక్ష్మబుద్ధితో జరగినవిషయముల నాలోచించిన, మాపాఠకులకైన నాగూఢార్థము విశదమగు. అయినను చర్వితచర్వణమని యనుకొనక మరలఁ జెప్పెదవినుఁడు.

పూర్వప్రకరణమున మనచేఁజెప్పబడినట్లు రాజవర్మప్రభువు తన కొమరితకుఁగాని కొమరునికిగాని, యాపరమరహస్యమును తెలియఁజెప్పుటకు సందేహించెనని యెఱుఁగుదురుకదా. దానికిఁ గారణములు కొమరితకుఁ జెప్పినచో, నామెతనమగనికిఁ జెప్పకమానదనియు, కొమరునికిఁ జెప్పినచో, నాతఁడుదనభార్యకుఁ జెప్పకమానఁడనియు నేమనిన భార్యాభర్తలయందొకరికొకరు తెలియఁజెప్పకొనని ముఖ్యవిషయములుండవు. ఏలయని మీరడుగవచ్చుఁగాని యొకింత దూరాలోచనఁజేసిన మీరు కూడ నాయభిప్రాయముతో నేకీభవింతురు. ఎట్లనిన, మీరనుకొనినరీతిని

రాజవర్మప్రభువు తనపుత్రికా పుత్రులలో నొకరికాయద్భుత రహస్యమును జెప్పెననుకొందు. ఆరహస్యపరిజ్ఞానము నొందినవారా సురనందనమును తప్పక ననుభవింతురుకదా! అపుడు—పుత్రుఁడుకాని పుత్రికకాని—ఆరహస్యజ్ఞులు తమతోఁగూడ తనప్రియసియో, తనభర్తయో లేమిని, సురనందన మహాసౌఖ్యముల నెట్లుసంతోషముతో ననుభవింపఁగలరు? కావున, తప్పక పుత్రికాపుత్రులలో తమతమ యర్ధాంగములకుఁ జెప్పక, రహస్యమును గుప్తముగా నుంతురను విషయము ప్రకృతివిరుద్ధము—కావున నట్లుచెప్పినయెడల పరిమితసంఖ్యాత్రయము నతిక్రమింపవలసి వచ్చుననియుఁగదా!

ఈవిషయము మాచదువరులు బూర్తిగాగ్రహించి, పిదప నేను వ్రాయఁబోవు విషయమును చదువుఁడు.

రవీంద్రుఁడా పరమరహస్యమును, నిస్సంశయముగాఁ గమలకుఁ జెప్పెదననుట, మనమిదివఱకే చదివియుంటిమి. ఇఁక మోహనునికిఁ జెప్పుటయందు రవీంద్రుఁడొకింత సందేహించె. ఏమనిన, మోహనుని కా రహస్యమును జెప్పినయెడల వివాహానంతరమున—ఇప్పటికింకను మోహనుఁడు గృహస్థుఁడుకాఁడు, కాని కొలఁదికాలమునకైనను గాకపోవునా! కావున—వానిభార్యకుఁ గూడ తద్రహస్యమునుఁ దెలియఁజెప్పకయుండుట, మనమింతకుఁ బూర్వమే తర్కించిన విషయానుసరణి, నసంభవము. అట్లైన మోహనుఁడింకేరీతినర్హుఁడగు? ఈరీతి కమలకును మోహనునకును బరస్పరానురాగము— ఈవాక్యశేషమును మాచదువరు లూహింతురుగాక!

రవీంద్రుని హృదయమునం దీభావమే ప్రాచుర్యము నొందియుండెఁ. తద్విషయమై యధికాలోచన సలుపుచుండె. ఆతనియంతర్భావమును కమలా మోహనుల యెదుటఁబల్కుట ప్రాడికాదని రవీంద్రుఁ డూహించి గూఢార్థసంయుక్తముగా వచించె. వెనుక మనము చదివిన రీతిని తద్గూఢార్థమును గ్రహించి కమలా మోహనులు తత్తరపాటు నొందిరికదా! అది గ్రహించి రవీంద్రుఁ డిట్లనెను.

“సుందరీ సుందరులారా! మీరు వేరుగాఁ దలంపకేని నేనొక్కవిషయమును తెలిపెదను. మీపరస్పర ముఖావలోకనములును, మీయన్యోన్య సౌజన్యప్రవర్తనములును, నాకొక్కయూహఁ జనింపఁజేసె. అదిమీయందు పరస్పరానురాగము ప్రజ్వరిల్లుచున్నదనియే”

మోహనుఁడు సంతోషస్వాంతుఁడయ్యె. ప్రఫుల్లరాజీవము రీతిని వానిమోము తేజరిల్లె. ప్రమోదకలితాంతరంగియయ్యు నయ్యుత్తరమున స్త్రీకసహజమగు సిగ్గామెకు దొంతరదొంతరలుగ వచ్చుటచే, కడుంగడు దన సుకుమారముఖమును వంచి, నేలను కాలిబొటనవ్రేలితో వ్రాయుచుండె.

“హితులారా! ఇదియే నాయభిప్రాయము. మోహనా! తక్కినవిషయములను నీవేగ్రహింపనోపు. కమలా! మిమ్ముల నిరువుర సృష్టిస్థితిలయ కారణుఁడగు పరమేశ్వరుఁ డెల్లపుడు నాశీర్వదించుఁగాత.”

తదనంతరము కమలా మోహనులు తమతమ మందిరముల కేగిరి.

ఆహా! ఏప్రథమసంయోగ కాలమున మోహనుని కమలాయామన్మథగ్రంథములయందు, తాననురాగాక్షరాభ్యాసమొనర్చెనో, యెపుడు స్వమనోబ్జము మోహనుని ముఖసూర్యావలోకనమునఁ దనకుఁ దానై వికసితమయ్యెనో, యప్పటినుండియు కమలాహృదయ నిమ్నకోశమున మోహనుని ప్రతిబింబము ముద్రితమై యుండకపోలేదు. అట్టివానినిగూర్చి నవ్వుచులోలోనఁ దలపోయుచు, దనవృత్తములను రహస్యములను గాక యితరములను దన ప్రియపరిచారికలకుఁ జెప్పుచు వారి సంతోషమును బరిశీలించుచుఁ దాను తనమృదుశయ్యను మేనుసేర్చి నిదురబోయె.

మోహనుఁడు కూడ, నట్లేనిదురవోయె.

ఘూర్జర తార.

పదిపడవ ప్రకరణము.

ఎయ్యది ప్రపంచసృష్టికి పూర్వమే వెలసియుండెనో, యెయ్యది సర్వకారణములకు మూలకారణమై యుండెనో, యెయ్యది యదృశ్యమై యగణనీయమై యాదిమధ్యాంత రహితమై యిదియిట్టిదంచు నిరూపింపనలవి జెందకుండెనో, యెయ్యదిపరిమాణ నామమున ప్రాపంచికవిషయరంగమున వ్యవహరింపఁ బడుచుండెనో, యెయ్యదియనేక మహాసామ్రాజ్యము లుదయించుటయు, విజృంభించుటయు, బిమ్మట నస్తమించుటయునను ముఖ్యస్థితిత్రయమునకు సాక్ష్యమిచ్చునో, యెయ్యది సూర్యచంద్రాది వివిధగ్రహములఁ దనగడియారములుగా జేసికొని, వానిమూలమునఁ జరాచరప్రపంచ జీవితమున కనుగుణ్యమైయున్నదో, యెయ్యదిచేతనాచేతనములగు సర్వవస్తువులకు జననమరణములను ముద్రలవేయునో, యెయ్యది యవిచ్ఛిన్న మహావేగమున గ్రమించుచుఁ దనతోడ గత లోకచరిత్రను గొంపోవుచుండునో, యెయ్యది భగవత్స్వరూపమునకుఁ బ్రతినిధియై సర్వముఁ బరిపాలించుచుండునో యట్టికాలము, మహావేగమున బరువెత్తుచుండె.

రాత్రి పదిరెండుగంటలకుఁ బదియున్నైదు నిమేషములు తగ్గి

యుండె. రవీంద్రుని సౌధమున నిశ్శబ్దము ప్రబలియుండె. అప్పుడు హేమచంద్రుఁడు తనదుష్కార్య నిర్వాహణమునకై సన్నాహోత్సాహముతో నుండెను. పన్నెండుగంటలయ్యె. తనగదినివీడి, సౌధమునుజుట్టుముట్టియున్న నిష్కుటములోనుండి దొడ్డిగుమ్మము నొద్దకుఁ బిల్లియడుగులతో మెల్లగా నడచిపోయె. పోవుచుఁబోవుచు నచ్చటచటనాగి, యటునిటు బరీక్షించి, యెవ్వరును లేరని గ్రహించి మరల మరల నడచి దొడ్డిగుమ్మమునుఁజేరెను. చేరిన, యొక్కనిమిషమునకు వెలుపలినుండి యాద్వారము మూఁడుసార్లు మెల్లగాఁ దట్టఁబడియె. సత్వరమే హేమచంద్రుఁడు నిశ్శబ్దముగాఁ దలుపుదెఱచె. అంత వీరరుద్రుఁడును వానిసేవకుఁడగు 'అఘోరి' యును లోనికిఁబ్రవేశించిరి.

ఒకపలుకైన నాడక హేమచంద్రుఁడు వారిని తనవెంటరాసన్నజేసి, వేఱొకరహస్య ద్వారమూలముగా గమలా మాలినీమాలతులు నిదురించియున్న గదియొద్దకుఁబోయెను. ఆగదితలుపునుజూపి "మీ పనిముట్లనిపు డుపయోగింపుఁడు" అని హేమచంద్రుఁడు రహస్యముగా వీరరుద్రుని చెవిలోఁజెప్పెను. వెంటనే వాఁడు తనయంగీనుండి పట్టుకారును, మరమేకునుదీసి, యామరమేకుచే ద్వారగ్రంథుల సడలించి, పట్టుకారుతో లాగెను. వెంటనే యాతలుపు బెట్టుసడల, నిశ్శబ్దముతో వానిని వెలుపలికిఁదీసి, యఘోరితో లోనికిఁబ్రవేశించె.

"ఇఁక మీపని మీరొనర్పుఁడు. నేనేగెద. నీకు నేను వాగ్దత్తముఁజేసినరీతి ముస్తఫాయాకూబుతో సర్వము సిద్ధపఱచినాఁడ" నని

హేమచంద్రుఁడు వారితో మెల్లఁగాఁజెప్పి, యచ్చోటు వాసిసౌధమునుండి మెట్లమీఁదుగా క్రిందునకుఁదిగి, తోఁటలోనున్న యొకచెట్లగుంపున నక్కియుండె. అచటనుండి, తనపన్నుగడ, యేరీతినాచరింపఁ బడుచున్నదో పరిశీలించుచుండె.

ఇఁక నిచట కమలా మాలినీమాలతులు తమకురానున్న ఘోరాపాయము నిసుమంతైన నెఱుఁగక హాయిగా వేర్వేఱు తల్పములపై నిదురఁజెందుచుండిరి. వారు గాఢనిద్రాపరవశులై యుండుటకు సంతసించి తస్కరనాయకుఁడును, 'అఘోరి' యును మెల్లగాఁ గమలయొద్దకుఁ జేరిరి. ఏమనిన మాలినీమాలతులతో వారికెట్టిపనియును లేదు. అట్లు మెల్లగాఁజేరి వీరరుద్రుఁడు తనయంగీనుండి, దేనినో ద్రవపూరితమైన, యొకచిన్నసీసా నాపె నాసికారంధ్రములకుఁ దగ్గరగానుంచె. ఆయుదాహరణము ననుసరించి 'అఘోరి' కూడ మాలినీమాలతుల యెడ నట్లే చేసె. వెంటనే యారోగ్యసూచకమైన హారిద్రవర్ణము వారి గండఫలకములనుండి యదృశ్యమై, యాస్థానమున పాండురవర్ణము ప్రవేశమొందె. పెదవులు సహజారుణచ్ఛవినిఁబాసి వెలవెలలాడె. వేయేల! ఆద్రవ వాసనాపటుత్వముచే, వారు తమయొడళ్ళను బొత్తుగామఱచిరి. ఇందునకు సంతసించుచు వారొకరినొకరు సంతోషముతోఁ జూచుకొనిరి. పిమ్మట వీరరుద్రుఁ డాకమలను పాన్పునుండి లేవనెత్తి తనకఠినబాహువులయందు బెట్టుకొని, 'అఘోరి' వెంటరా, మెట్లమీఁదుగాఁ గ్రిందునకుఁ దిగుట కారంభించె.

ఇచట వీరినివిడచి, హేమచంద్రుని దెసకుఁ బోవుదమురండు !

వాఁడు వృక్షసంఘమునకుమధ్యనిలువఁబడి, బిత్తరపుజూపులతో నన్నిదిక్కులను బరిశీలించుచుండె. రెండునిమిషములకుఁ బిమ్మట దూరమున నెవ్వరో నడచుచున్నచప్పుడు వానికివినవయ్యె. వాఁడెవ్వఁడై యుండును? క్రమముగా నాచప్పుడు స్ఫుటితమగుచుండుటచే వాఁడెవ్వఁడో తానున్న దెసకే వచ్చుచుండెనని హేమచంద్రుఁ డూహించె. వెంటనే భయకంపితగాత్రుఁడై, చెట్లకొమ్మలనుండి, యాదెసకుఁజూచె. కాని చీకటియగుటచే, యానడచుచున్నవానిని గుర్తింపలేకపోయె. ఇంతలో వాఁడును తానున్నదెసకు నడచివచ్చె. అయినను హేమచంద్రుఁడు చెట్లకొమ్మలచే మఱింతచీకటిగా జేయబడిన తమఃప్రదేశమున నుండుటచే, తాను గాన్పింపనుగదా యని సంతసించి, వచ్చుచున్నవానివంక కొమ్మలనుండి చూచె. వాఁడెవ్వఁడు? రవీంద్రనాథుఁడె. అంతటి నడురేయినట్లు తోఁటలో నడచుచుండుట కేమికారణము?

"నేఁడేదియో యశుభము ప్రాప్తింపనున్నదని నాహృదయమునకు దోఁచుచుండె. సాయంతనము నుండియు, నేకారణముననో, నా మనమునఁ గళవళపాటు హెచ్చియుంట నిదురపట్టక, నిచట తోఁటలో చల్లనివాయువులచే నొకింతవిశ్రాంతిని గనుటకై వచ్చినను, నామనోవ్యథతగ్గకున్న యది" అని రవీంద్రుఁడు తనయభిప్రాయముల వచించుచు, కాలిబాటమీఁదుగా నడచిపోవుచుండె.

రవీంద్రుఁ డానడురేయిని, యట్లు విహరించుటకుఁ గారణమును హేమచంద్రుఁ డిపుడు తెలిసికొనెను. కాని వానికిపుడొక మహాఘో

రమగు విషయము తలఁపునకువచ్చె. కమలను బాహువులయందు బెట్టుకొని వచ్చుచున్న వీరభద్రుఁడును, వానితోఁగూడ వచ్చుచున్న "అఘోరి"యును రవీంద్రుని కంటఁబడిరేని, తానుకలలోనైన దలువనియొక ఘోరాపాయము సంభవించునని హేమచంద్రుఁడు తద్దయుభీతి నొందెను.

రవీంద్రుఁ డింతలో బాటమీఁదుగా నడచిపోవుచుండగా, నిరుపురుషమనుజులు వానిదృష్టిపథమునఁబడిరి, ముందుగానడచుచున్న వాని చేతులయందేదియో గొప్పబఱువుకలదు, రెండవాఁడు వానికిఁబ్రక్కగా నడచుచుండె. యేదియోదౌర్జన్యము జఱుగుచున్నదని త్వరలోగ్రహించి, రవీంద్రుఁడొక్క పెనుకేకనువైఁచెను.

కుడిచేతనొక చుఱకత్తినిబట్టుకొని యఘోరి, రవీంద్రనాథునిపై దుమికిన మహావేగముతో సింహమైనను తానుభుజింపనెంచిన లేడిపై నుఱుకదు. ఆపనియంతయు నొక్కక్షణమాత్రమునను ముగిసె! రవీంద్రుఁడు నేలపై నొక్కుమ్మడిఁద్రోయఁబడియె. వానికుత్తుక నొకకరినహస్తముచే బిగియఁబట్టి, చుఱకత్తితో గుండెలలోనికి లోతుగాఁబొడిచి, యఘోరి మరల తననాయకుని గలసికొనియె.

ఎద్దియోదౌర్జన్యము జఱుగుచున్నదని గ్రహించి రవీంద్రుఁడు కేకవైచినతోడనే హేమచంద్రుఁడు తానుడాగినస్థలమునువిడచి, యా కేక వినవచ్చినదెసకుఁ బరువెత్తనారంభించెను. ఒకటే కేకనువైచి మరల

రవీంద్రుఁడు పలుకకుంటచే, దాననుకొనినరీతి వాఁడు మడియింపఁబడెనని హేమచంద్రునికి మిక్కిలిభీతిఁదోఁచె. తానుబట్టువడుదుననియు తనస్థితి బహిరంగమగుననియు, నిసుమంతైన తలపోయలేదు.

అట్లుపరువెత్తి, యచ్చోటుడాసెనుకదా! ఏమనివచియింతు! రవీంద్రనాథుఁడు తన్ను దనతలిదండ్రులు మృతినొందిన బాల్యమునుండియుఁ బెంచిపెద్దనుజేసిన రవీంద్రుఁడు—తనపై నెప్పుడును కోపమునొందక సంతతకృపార్ద్రదృష్టితోఁ దనకుసర్వసౌఖ్యములఁ గూర్చుచున్న రవీంద్రుఁడు—అట్టివాని యకాలమరణమునకు తానుమూలకారణమైన రవీంద్రనాథుఁడు—నిర్జీవియై భూమిపై దీర్ఘనిద్రజెందియుండె. ఆతస్కరగ్రామణులిరువురును శీఘ్రగతితో తమతోవను బోవుచుండిరి.

అక్కటకటా! ఏమనిలిఖియింతు! కనుల దుఃఖాశ్రువులు ఝరీవేగమున జలజలప్రవహింప, హేమచంద్రుఁడు! 'హా! రవీంద్రా! తండ్రీ! యని వానికళేబరముపైఁబడి వెక్కివెక్కి యేడ్చె. యెంతదుర్మార్గుఁడైనను, నెంతమోసకారియైనను, పాపమువానియందిపుడు సద్భావములంకురించె. కమలకు హానితలఁచెనేకాని, రవీంద్రునికెన్నఁడును హేమచంద్రుఁడు హానిదలంపలేదు. ఇట్లగుననికాని, కావలయుననికాని, వాఁడుకలనైనఁదలంపలేదు. రవీంద్రుఁడు తన్నధికకృపాదృష్టితోఁ జూచినచూపులన్నియును, తనవృద్ధికై వానిచేఁజేయఁబడిన కూరిమిచేతలన్నియును, హేమచంద్రుని తలఁపునకురా, చిన్నబిడ్డవలె నేడ్వదొడఁగె.

అట్లు కొన్నినిమిషములుగడచె. తదనంతరము వానికొకయూహ తోఁచె. ఒడలెఱుఁగక దానట్లురవీంద్రునొద్ద నుండుట నెవ్వరైనఁ జూచినచో, తానేవాని హంతకుఁడని రక్షకభటులకుఁ బట్టియిత్తురేమో యని భీతినొందె. హేమచంద్రుఁడు పందయని మాచమువరులకుఁ దెలిసియేయున్నది. కావున వెంటనేవానికిఁ దనముఖ్యగుణమగు నాత్మరక్షణము తలఁపునకురా, రవీంద్రునివిడచి సౌధమునకునడచి, దానియందుఁ బ్రవేశించి తనగదిలోఁజొచ్చె. అచటఁజదికిలఁబడి, తన రెండుచేతులతో మొగము గప్పుకొని యొక్కపట్టున గన్నులనీరునించె.

అట్లు కొంతవడి, వలవలనేడ్చుటచే, దుఃఖాశ్రువులు వాని వ్యథాభారమునుఁ బూర్తిగానడచెను. ఒకింతశాంతచిత్తుఁడైన పిదప నాదుర్మార్గుని కొకవిచిత్రపు టూహపుట్టె. వెంటనే, వానిమొగము వికసితమయ్యె. ఈతరుణమునేల చేసేతలవిడువవలయు? ఇదియే హేమచంద్రునితలఁపు.

ధైర్యమువహించి, దుఃఖమునుదూరముగావిదల్చి, లేచి, వెంటనే తనగదినుండి, బయల్వెడలి రవీంద్రుని కళేబరమునొద్దకుఁబోయెను. దానినిఁజూచినతోడనే హేమచంద్రునిగుండెలు జల్లుమనియె. వానికిఁ గాళ్ళఁదొట్రుపాటునుగలిగె. గద్గదికవొడమె. నోరుకట్టువడియె. అయినను, వారితో నతిసాహసమునఁబెనఁగి, తుదకు కనులుమూసికొని—ప్రమనిన కళేబరము భయప్రదముగానుండె—తనకుడిహస్తమును వాని యంగీలోనికిఁ బోదూర్చి, యందుండిన తాళపుఁజెవినొకదానిని సంగ్రహించి యచటనుండి బయల్వెడలి మరలతనగదియొద్దకుఁజేరె.

కమల తస్కరులపాలయ్యె. రవీంద్రుఁడు పరలోకమున కేగె. ఇఁకవానికడ్డేమి? అంతయు నిశ్శబ్దముగానుండుటఁ బరిశీలించి మెల్లగా మెట్లనెక్కి రవీంద్రునిగదియొద్దకుఁ జప్పుడుకాకుండపోయి తానుసంగ్రహించి తెచ్చినతాళపుఁజెవితోఁ దలుపునుదెఱచి లోనికిఁబ్రవేశించె. అచట దీపమువెలుగుచునే యుండెఁగాన దానిసాహాయ్యమున వానివ్రాతబల్లనుండి కొన్ని లిఖితపత్రములఁ బయటికిఁదీసె. వానియందొక చిన్నిపెట్టియలోఁ గొన్నిలిఖితపత్రములు కట్టఁగాఁగట్టఁబడియుండె. ఆ కట్టకు నుపరిభాగమున నిట్లనివ్రాయబడియుండె. నాముద్రిలతోనుండి, యొకచేయూపముగలిగి, యొకేపరిమాణమునొందిన రెండుంగరములఁ బ్రదర్శించు కమలామోహనుల కీలిఖితపత్రములనీయునది” తాను సంగ్రహింపఁదలఁచిన పత్రములివియేకదాయని సంతసించి, మరల నాకట్టను పెట్టియులో బెట్టిమూఁతవేసి దానినితన దుస్తులలోడాఁచి గదినుండివెడలి, యెప్పటియట్ల తలుపునకుఁ దాళమువైచి, మెల్లగా మెట్లనుండి క్రిందునకుడిగి, తానువెనుకడాగిన చెట్లగుంపువంకకు బోవ మొదలిడె. త్రోవయందచ్చటచటనాగి, యెవరును లేరుకదాయని పరిశీలించుచు, నాచెట్లగుంపునుడాసి, లోనికిఁజొచ్చె. అచటనొకచోఁ గూర్చుండి, తనచేతులతో నొకగుంటను ద్రవ్వనారంభించె. అది సైకతప్రదేశమగుటచే ననాయాసముగా లోతైన యొకగుంటయేర్పడియె. దాన్నియందాపెట్టెను బంధించి, యెప్పటియట్ల దాని నిసుకతోఁబూడ్చి యెట్టియనుమానమునకైన నెడమీయకుండునట్లు పైభాగమునుఁ జక్క

బలచి, సౌచటినుండి బయల్వెడలి మరల రవీంద్రుని కళేబరమునొద్దకుఁ బోయి, తాను మొదట సంగ్రహించిన తాళపుఁజెవిని, మరల వానియంగీయందు పూర్వస్థలమునయుంచి, సౌధమువంకఁదిరిగె. పదియడుగులు నడచెనో, లేదో, తనదెసకే మువ్వురుమనుజులు వచ్చుచుంట వానికిఁ గానవచ్చె.

ఏమిచేయఁగలఁడు? ఏదిగతి? తనకుఁగొలఁది దూరములో రవీంద్రుఁడు నిర్జీవియైయుండె. తానొక్కరుఁడుతక్క వేఱెవ్వరు నాస్థలమున లేరు. కావున వీఁడే హంతకుఁడని వారుతన్ను బట్టుకొనక మానరుకదా! అట్లగుట భీతినొంది హేమచంద్రుఁడు పలాయనముసేయ నారంభించె. కానిసత్వరమే వాఁడామువ్వురిచేతను వెంబడింపబడి, యనతిదూరములోఁ బట్టువడియె. ఈమువ్వురును, మోహనాంగదబలభద్రులు. ఆపట్టువడిన వాఁడు హేమచంద్రుఁడని తెలసినతోడనే "ఇచట నిట్టియర్ధరాత్రమున నేమిచేయుచుంటివి? మమ్ములను జూచినతోడనే నీవేలపలాయన మొందితివి? ఏలనీకంతతొట్రుపాటు? మఱియును, అరగంటకుఁ బూర్వ మెవ్వరువైచిరా పెనుకేకను?" అని మోహనుఁడు గదిగి యడిగె.

"హా! ఘోరము! ఘోరము! ఇదిరక్తమే" అని యాసమయముననే బలభద్రుఁడఱచె. తానువానిని బట్టుకొనినతోడనే, వానిదుస్తులు తడిగానున్నట్లు బలభద్రుని హస్తమునకుఁదగిలె. వెంటనే వాఁడాదుస్తుల నంతకుఁబూర్వమే యుదయించిన చంద్రునిసహాయ్యమునఁ బరీక్షింపఁగా, వానిదుస్తులు రక్తపరిసిక్తములై యుండెను. వెంటనే మోహనుఁడిట్ల

నెను. "రక్తము! హేమచంద్రా! నీవు దెబ్బలుతింటివా? ఏమిసంభవించినది? చెప్పుము. త్వరలోచెప్పుము"

హేమచంద్రుఁడు వెలవెలబోయి మోహనునివంకజూచెను. కాని యెల్లయప్పుడు ననుమానములనొందుచుండు బలభద్రుఁడు మోహనునితో నిట్లనెను. "దేవా! దీనియందేదియో గొప్పమర్మముకలదు. దానిని తాము పరిశీలింపవలయు" ఆసమయముననే యంగదుఁడు పెద్దపెట్టున గద్గదికగాత్రుఁడై యిట్లఱచె.

"హా! ఘోరము! అల్లదె! అచటనేదియో కళేబరమువలె కాన్పించుచున్నది! రండు. రండు" అని యాదెసకుఁ బరువెత్త నారంభించె. హేమచంద్రుని విడువకఁదనచేతితోఁ గట్టిగాఁబట్టుకొని యంగదుఁడును, ప్రక్కగా మోహనుఁడును, నాకళేబరము కాన్పించుచున్నదెసకుఁ బోయిరి. వానినిజమిపుడు తెలసినది! వెంటనే వారలందరొక్కసారి యులుకుజెంది కేకవైచిరి! చిత్రప్రతిమలవలె నందఱును నిలువఁబడిరి.

తాను నిరపరాధినని మొఱపెట్టుకొనుచు, వారికాళ్ళపై హేమచంద్రుఁడుపడియె. వాఁడభిన్నవాక్యములతో, తానుఁగూడ వారివలెనే కేకవినివచ్చితిననియు నచటతనయజమాని నిర్జీవియైయుండుటఁ జూచితిననియు నధికదుఃఖావేశమున వానికళేబరముపైఁ బడితిననియు నందుచే రక్తము తనదుస్తుల నంటికొనెననియు జెప్పెను. మఱియును, దానుతన యజమాని నిర్జీవియైయుంటఁ జూచినవెంటనే, సౌధములోనున్న యందరను మేలుకొలుపవలెనను తలఁపుతో సౌధమున కేగుచుంటిననియు

నాముప్పురినిఁ జూచుటతోడనే తానే హంతకుండనుచు వారుపట్టుకొనెదరని భయపడితినని యు నాకారణమున నాత్మరక్షణమునకై బరువిడినని యుచెప్పెను.

ఎంతఁజెప్పినను, వానియెడ నపరాధిశబ్దము నిరుపయోగమని వారికిఁదోపలేదు. వెంటనే న్యాయాధికారులఁ బిలచికొనిరమ్మని తన పరిచారకులకు మోహనుఁడాజ్ఞనిచ్చె. ఆపలుకులు వినఁబడినతోడనే యొడలుమఱచి హేమచంద్రుఁడు భూమిపైఁబడి మూర్ఛనొందెను. వానిని యంగదబలభద్రులు సౌధాంతరమున కెత్తుకొనిపోయిరి. ఇంతలో రవీంద్రనాథుఁడు చంపఁబడెనని సౌధవాసులందఱకును మోహనుఁడు వాక్రుచ్చె. ఒక్కనిమేషమాత్రమున సౌధమంతయు నల్లకల్లోలముగానుండె.

ఇంతలో న్యాయాధికారులేతెంచి, రవీంద్రుఁడెట్లుచంపఁబడెనో కనుఁగొనుటకు ప్రయత్నించుచుండగా, కమల తనగదియందులేమిని, వారు కనుఁగొనిరి.

ఈవిషాదకరవృత్తాంతమును వినినప్పుడు మోహనుఁడొందిన దుఃఖము నేమనివచింతుము? ఏయువతి తనహృదయమును దస్కరించినదో, యేసుందరితనకుఁ బూజనీయయగుదేవతయో, యేవిలాసిని తనసౌఖ్యమునకు గమ్యస్థానమో, యట్టిచెలినిఁబాసియుండు టెంతటికష్టకార్యమో, మాచదువరులలో స్వానుభవపరులకే దెలియనగు. ఆమె యెచటికేఁబోయెను? ఆమెనుదీసికొని పోయినవారెవ్వరు? ఆమె, యట్లదృశ్యయెట్లయి

యుండనోపు? యేదియెట్లయిన నామెను దస్కరించినవారు మరల నెప్పటి యట్ల తలుపువేయుటచే, దామొనర్చినచౌర్యము త్వరలోఁ దెలియకుండుటకు నాలోచించియే చేయుటయని స్పష్టముగా నూహింపనగు. అట్లగుటచే, నాదుండగు లిప్పటికైనను పట్టువడవచ్చునని యూహించి, సౌధముననున్న పురుషులనందరిని తదన్వేషణమునకై నియోగించి, మోహనుఁడును, భృత్యద్వయమును హయములనెక్కి, కమలను వెదకుటకై పోయిరి.

మూర్ఛనుండిలేచి, తెలివినొంది, యిపుడున్యాయాధికారిచేఁ బట్టువడిన హేమచంద్రుఁడు తాను నిరపరాధినని మొఱవెట్టుచుండె. కమల, యట్లద్భుతముగా నదృశ్యమునొందుటకుఁ గలకారణ మిసుమంతైన వానిపెదవులనుండి బయల్పడలేదు. కావున నావిషయమింకను, మర్మకలితముగానేయున్నది.

ఘూర్జరతార.

పదునెనిమిదవ ప్రకరణము.

అయ్యమోఘద్రవ వాసనావశమున జనించియున్న మత్తునుండి తెలివినొందునెడ, మిక్కిలి వేగమునఁ బరువెత్తింపఁబడుచున్న, నొకవిశాల శకటమునఁ దానున్నట్లు తారాకమల గ్రహియించె. కాని వెంటనే తాను స్వప్నమున నుండెనని యూహించె. నిన్నటిరేయి నిదురఁబోవక పూర్వము సంభవించిన దైవిక సంఘటనముల నాలోచింప, దాను రవీంద్రమోహనులతోఁ బ్రసంగించిన పిదపఁ దన శయ్యామందిరమునకు వచ్చుటయు, నచటఁ దనపరిచారికలతోఁ గలసి వెవ్వేరుపాన్పులపైఁ బవళించుటయు మొదలగు పూర్వసంగతు లాపె తలఁపునకువచ్చె. అట్లు గదిలో శయనించియుండిన తా నెఱుఁగకయే మెలఁకువనొందకయే, నిర్నిమిత్తముగా, నాబండిలో నెచటి కేఁగుచున్నదో—తానెఱుఁగనిబండిలో నెట్లు ప్రయాణముసేయుట సంభవించు?—కావున నిక్కువముగాఁ దానొక కలలోనుండెననియే కమల యూహించె.

అట్లయ్యు నామె స్వప్నమున ముమ్మాటికిని లేదు! తాను ఒక్కరితయే, శకటాంతర్భాగమున నొకశయ్యపైఁ బరుండియుండుటఁ దెలిసికొనెను. సత్వరమే లేచి, శకటగవాక్షముల మీఁదుగా జాఱవిడువఁబడిన తెఱనుదొలఁగించి బహిఃప్రదేశమును జూచెను. అట్లు చూచుటచే శకటమొక యేకాంతపథమునఁ బరువిడుచుండుటయు, తాను జూచుచున్న ప్రక్కనందందు మహావృక్షములు నిశీథినీవాతముల కల్లలనాడుచుండుటయు నామెకుఁ గానవచ్చె. వెంటనే గుండియజల్లుమనఁ దన పానుపుపైఁబడి "హా దైవమా! ఇదియంతయు నిజమేనా!" యని నిస్పృహాతంకోప గద్గదికతో వచించె.

కాదు! కాదు!! అది నిశ్చయముగా స్వప్నముకాదని యామెకుఁదోఁచె! అంతయు సత్యమే! కాని దానిచేఁ దెలియఁదగిన దేది? వేనవేలు ఘాతుకవిషయము లాపె హృదయమునందు సందడిసలిపె. హేమచంద్రుని స్వరూపమాపె హృదయపథమునఁ బ్రదర్శనమొందె. వీరరుద్రుఁడామె తలఁపులందుఁ జొచ్చె. కొంతవఱకు రవీంద్రుఁడుకూడఁ గమలకు సందేహాస్పదుఁడయ్యె. కాని, యొకింత దూరాలోచనానంతరమున, నట్టిసద్గుణఖనిని—దయార్ద్రస్వభావుని—తాననుమానముతోఁ దలంచుట భావ్యముకాదని తోఁచె.

అట్లయ్యె దానియర్థమేమి? మిక్కిలి వేగముతోఁ బరువిడుచుండిన, యావిశాల శకటాంతరమునఁ దనకు మెలఁకువఁ గలిగింపకయే, యెట్లు తానుంచబడియె? మాలినీమాలతు లెచ్చటనుండిరి? తానెవ్వరి యధికారమునందుండె? తన గమ్యస్థానమెయ్యది? ఆమహామార్మిక ప్రయాణమునకుఁ గారణమేమి? హా! క్షణకాలపరిమాణములో నాపె కొక్కయూహతోఁచె—కాని, యాతనయూహ వర్తమాన మర్మపరిచ్ఛేద

మునకు సహాయకారిగాఁ గాన్పింపలేదు. అట్లగుట, నాయూహాయు, నదృశ్యుఁడగుడుఁ, గమల గుండియలు మరల జల్లుమనియె. కైలాసపర్వత పంక్తులం దెవ్వరు నెఱుఁగని రహస్యప్రదేశమగు సురనందనమునకు— తొల్లితన పితామహుఁడు తనయంత్యజీవితమును గడపిన. సురనందనమునకు— దేనిని తనకుఁ జూపింతునని రవీంద్రుఁడు వాగ్దత్తముసేసెనో, నాసురనందనమునకు— రవీంద్రుఁడు తన్నుఁ గొంపోవుచున్నాఁడేమో యని కొంతవఱకుఁ గమల తలంచెను. ఏమనిన రవీంద్రుఁ డంతకుఁ బూర్వమే నిర్జీవియగుట కమలకుఁ దెలియదు.

అట్లు తనయూహ సరియైనదేనా యని తలఁపోయుచుఁ గమల శకటగవాక్షములపై జాఱవిడువఁబడియున్న తెఱను మరలఁ దొలంగించి బాహ్యమునకుఁ జూచెను. వెంటనే, మహమ్మదీయులు ధరించుదుస్తులనుదాల్చి యొత్తైనహయముపై శకటమునకుఁ బ్రక్కగా ననుగమించుచున్న, యొకతురక, యామెవద్దకుఁ దనగుఱ్ఱమును నడిపించి “అమ్మా! నీకేమికావలయును?” నని కమల నడిగెను.

చంద్రికా సాహాయ్యమునఁ దన్ను బ్రశ్నించిన వానిరూపమును గమల తెలిసికొనియె. వానిదుస్తులు మిక్కిలి వెలగలుగునవి కావు; కాని వానియొద్ద ఘోరమారణోపకరణములుకలవు. వానివయస్సు ముప్పదిరెండు వర్షములై యుండునని తోఁచె. అతికఠినత్వమును, దారుణమగు క్రౌర్యమును, వానిమొగమున వైశద్యము నొందియుండె. వానిని బ్రశ్నింపఁ గమల తలంచుచున్నతఱిని, మఱియొకఁడు— మొదటివా

నిపై నధికారి కానోపు. వాఁడును మహమ్మదీయుఁడే— తనగుఱ్ఱమును, వారిదెసకు నడిపించి “జవ్వనిచెప్పినదేమి?” యని మొదటివానిని బ్రశ్నించె.

“ఇంతవఱ కేమియును బలుకలేదు. కాని రెండుసారు లామె తెఱను దొలఁగించి చూచుటచే నామె కేమికావలయునో తెలిసికొనుటకై వచ్చినాఁడ.”

“సరే! నీవు వెనుకకుఁబొమ్ము. నేనేయామెతోఁ బ్రసంగించెద.”

దానిని విని “నీవెవ్వఁడవో? యధికారివలె దోఁచుచున్నావు. దయామయా! నిన్ను వేఁడుకొనెద. నేనీశకటమున నేలయుంటినో వచింపు” మని కమల మిక్కిలి వ్యాకులమున వానినడిగె.

“జవ్వనీ! నాధనముచేఁ గొనఁబడిన పదువురు సుందరీమణులలో నీవొకర్తువని తెలిసికొనుము!”

ఆదారుణ ప్రత్యుత్తరమీయఁబడినంత, దిగ్భ్రమనొంది, మహావిస్మయావేశమునఁ గమల కెవ్వుమని కేకవైచి “కాదుకాదు! ఎన్నటికి నిగాదు! ఇదియసంభవము! ఈకథయంతయు విపరీతము! నేను నిజముగా స్వప్నమునే కాంచుచుంటి “నని సగము మహాగ్రహముతోను, సగముతిపరితాపముతోను వానినిజూచి “ఓరీ! నేనెవతెనో నీవెఱుఁగుదువా” యని ప్రశ్నించెను.

"ఆఁ, ఎఱుఁగకేమి? ప్రపంచమున జననమొందిన సుందరీమణులలో నగ్రగణ్యవని యెఱుంగుదు.

"ఛీ! నీదురహంకారమును గట్టిపెట్టుము. ఎవరితో మాట్లాడుచుంటివో నీవెఱుఁగవు. కాని నా హోదాను నీకుఁ దెలియఁబఱిచిన యెడలఁ దప్పక గుఱ్ఱమునుండి దిగి నాకుసాష్టాంగమొనర్చి క్షమాపణను గోరుదువు."

"హో! సెబాసు! పిమ్మట నేమిచెప్పెదవు?"

"విను. కొన్నికొన్ని కారణాంతరములచే నాపదవిని బహిరంగము సేయక, కాశ్మీరమునకు వచ్చి, ప్రస్తుతము రవీంద్రనాథుని గృహము నందున్నను, నేను ఘూర్జరప్రభ్వినియు, నా పేరు తారాకమల యనియు నెఱుంగుము."

"అమ్మా! ఈకథకు నేనేమియు భయమునొందను. ఎవరైన మోసపోవుదురు కాని, సర్వవిషయములం దారితేఱిన ముస్తఫాయాకూబు త్వరలో వంచింపఁబడఁడని యెఱుంగుము."

"ఔను. నీవు నామాటలను విశ్వసింపకపోవచ్చు. ఏమనిన నా కథ విచిత్రముగా గన్పట్టు. అట్లయ్యును, దైవసాక్షిగా నేను ఘూర్జర రాణినని యెఱుఁగుము. నమ్ముము."

"పాపము! ఇట్టిజగన్మోహినికి, నీమతిభ్రణమును బెట్టుయందు భగవంతుని యూహయెట్టిదోకదా. యోసుందరీ—

"ఆగుమాగుము. కారులఱవకుము. నేనునీకు బానిసనుగా విక్రయింపఁబడితినని కదా నీవింతకుముందు చెప్పియుంటివి? అట్లయిన నన్నమ్మినవారెవ్వరు?

"యోగ్యుఁడగు రవీంద్రనాథుని కొలువునందు తైనాతినని చెప్పిన, యొకయావనుఁడు—"

"దీర్ఘకాయుఁడు—స్త్రీముఖమును బోలుమోమును సచ్ఛమైన ముఖవర్చస్సును నల్లని దీర్ఘకుంతలములును గలిగినవాఁడేనా" యని కమల, యత్యధికమగు నాతురతతో యాకూబునడిగెను.

"సంశయమా!"

"హా! హేమచంద్రుఁడా!" అనునపుడు కమలకత్యధికమగు నింద్రియక్షోభముకలిగె. "అక్కటా! ఎంతపనిజర్గె! ఎవనినిఁగూర్చి నేను భయమొందవలయునో, యట్టివానినే నమ్మితినిగదా! ఎంతబుద్ధిహీనము! మోహిని తనయవసానకాలమందు వచించినపలుకుల నేల తిరస్కరించితి? ఏలనమ్మకుంటి?"

జవ్వనీ! ఏమనిపల్కుచుంటివి?—ఆసంగతినాకేల?" యనిమరల దనలోననుకొని—ఏమనిన హేమచంద్రుఁడు చెప్పినట్లు, కమలకు వెఱ్ఱి

తనపుత్రికలదని యూకూబు హేతుకునియూహా. కావున నాపెపలుకులు నెత్తిఁగూడుకొనినవే. "అనఘా! అట్లుమూఁకిపురకును, నీసోదరుల పక్షమున—"

"నాసోదరులారా! ఎవ్వరునులేరే!" ఇపుడు కమలకు మిక్కిలి విస్మయమును, మనస్తాపమును కలిగె.

"జవ్వనీ! దైవమేసాక్షి! నామాటలనమ్ముము! ఆహేమచంద్రునిచే వెంటఁబెట్టుకొనిరాఁబడి నీసోదరులమేయుచు వచించిన, యిరువురుపురుషులు నిన్ను నాకువిక్రయించిరి."

"అట్లయిన నన్నెంతకుఁగొంటివో తెలుపుము. ఈక్షణమున నన్నువిడిచితివేని, నీకుమూఁడురెట్లు, హెచ్చుధనమిచ్చెద! నేను రవీంద్రునకొక చిన్నజాబును వ్రాసినయెడల—"

"నిస్సంశయముగా పలువురు గుఱ్ఱపురౌతులు మనకు వెన్నంటి తత్తిమిపట్టుకొనుటకై పంపఁబడుదురు"

"పోనీ. నేనువ్రాసినయుత్తరము నీవుకూడఁజదివి, పిమ్మట నే పంపుము! నీప్రియభృత్యులలో నెవ్వనిమూలముననైన, రవీంద్రునికి నాయుత్తరముచేరెనేని, తప్పక, నాయోగ్యుఁడు నీకు నేనింతకుమున్ను నిరూపించిన ధనమునిచ్చు."

"జవ్వనీ! సారాంశముల నొందఁబోనియూహాలతో నీవేల తపించెదవు?"

"పోనీ! ఇవిగో! నారత్నాభరణముల నిచ్చెదఁదీసికొనుము"

"నాకేమియు నక్కఱలేదు" అని చివాలున వెనుకకుఁదిరిగి, శకటపురోభాగమునకుఁ దానెక్కియున్న హయమును త్వరలో నడిపించుకొనిపోయె.

ఏదిదిక్కు? ఎవ్వరుతన్ను రక్షింపఁజాలుదురు? ఏదయామయుఁడు తన్నోదార్పఁజాలు? కటకటా! అపారములగు విచారతరంగము లామెను పూర్తిగానల్లలనాడించె. తనకెవ్వరును సహాయులులేమిని, యామె మిక్కిలి నిరాశనొందె. అనేకదారుణవిషయము లామెహృదయమునకుఁ దోఁచె. ఆదారుణములకెల్ల దారుణమగు ఘోరవిషయమొకటి యామె స్మరణకిపుడువచ్చె. అదేదనిన దైవికముగాఁ దానుఁగలసికొనిన పూర్వవాసిని, తనఁ'అయేషా' యెట్లొకదుర్మార్గునిచేఁ దొంగిలింపఁబడి డిల్లీ సుల్తానునకు లంజాకబహుమతిగాఁ దీసికొనిపోఁబడియెనో, యావిషయమునుఁగూర్చి వచించినదెల్లను కమలకు జ్ఞప్తికివచ్చె. అయ్యో! తానుగూడ నారీతినే సుల్తానునకు నివేదింపఁబడునాయేమి? మహావిస్మయమున స్తంభీభూతయై కమల చిత్రప్రతిమవలె నిశ్చేష్టనొందె. ఆమెకు నోట మాటరాలేదు? హృదయము పంజరబంధితంబగు బిట్టవలెఁ దడదడ గొట్టుకొనసాగె మేధాస్థానము లోలకసూత్రము ననుసరించినట్లు పరిభ్రమణము కాఁజొచ్చె. ఆపె జ్ఞానేంద్రియములు సొమ్మసిల్లి, తమతమ

సహజకార్యముల నెఱవేర్చుటకు వెనుదీసె. కొన్నినిమిషములకుఁ బిదప శకటాంతరమున నున్న పాన్పుపై కమల, బాధితయగుకమల—నిహత హృదయయగు కమల—పాపము! మూర్ఛనొందె.

ఇంతలో, నాశకటమతివేగమునఁ బరువెత్తుచుండె. ఏస్థలమునందు నాగక, పోఁబోవ, సూర్యోదయమయ్యె.

బాలభాస్కరుఁడు తేజఃప్రదములగు తనకరములచేఁ బ్రకృతిని స్పృశింపఁసాగె. ఆకిరణగణములు ప్రాతఃకాలతమోరేఖల నంటిపోవుచున్నపుఁడు, వానినిఁజూచినయెడల ముగ్ధయగుకాంతను ముద్దువెట్టుకొన వెంబడించెడు యువకుఁడు స్మరణకువచ్చును.

ఆయుదయ సమయమునకు, మనశకటము ''జూవిలూ'' అను చిన్నపట్టణమును జేరెను. అచట శకటమాఁపఁబడియె. ఆకూబును, వాని సేవకుఁడును, శకటగవాక్షములనుఁ డాసి కమలతో ''అమ్మా! జవ్వనీ ! ఇచట నొక గడియకాలమాగి మరల ప్రయాణముసేయుదము. రమ్మ. క్రిందునకు దిగి యెంకింతభోజనము సలిపి, పిమ్మట, నదే, యాచోటపదుపురు నీబోటి సుందరీమణులుగలరు; వారితో బరిచయమొనర్చుకొనుము" అని పలికిరి.

చదువరులారా! ఆసుందరీమణు లెవ్వరో మీకు జ్ఞాపకముకలదా! లేనియెడ వారు రంజాక్ బహుమతులుగాఁ గొనిపోఁబడుచున్న వారని పునస్స్మరణఁ జేసికొనుఁడు. కమల, యెట్టిభోజనమును సేయలే

దు. ఆమె రసపుత్రవంశ సంజాతయగుటచే మహమ్మదీయులచేఁ బరిపచితమైన యాహారమును దీసికొనదని దూరాలోచనచేసి యాకూబు ప్రత్యేకముగా నామెకొఱకై యొకవంటవానిని దీసికొనివచ్చె. ఈవంటవాఁడు బ్రాహ్మణకులస్థుఁడు. అయినను, కమల యొకింతయైనను భోజనముసలుపలేదు. ఏమనిన నాపె కన్నముపై వెగటుపుట్టె. అయ్యో! కమలా! నీకెంతటి దుర్గతిప్రాప్తించె.

భోజనము నొనర్పకపోయినను, తక్కిన సుందరీరత్నములతోఁ గలసికొనుమని యాకూబు కమలనడిగెను. కాని కమల సమ్మతింపలేదు. అంత నాకూబీరీతిని నుడివెను. ''జవ్వనీ! ఏల నీవిట్లు, నిర్హేతుక సంతాపమున వేఁగెదవు. ఆదిశనొకసారి తిలకింపుము! అచట వికసితముఖులై, మిక్కిలి సంతోషముతోఁ దమకురానున్న, తామనుభవింపనున్న, తాముకోరుకొనుచున్న, ఢిల్లీసుల్తానుగారి మహైశ్వర్యములు, వానిమనోహరాంతఃపురములోఁ దమకుఁగలగబోవునివాసము నపారభోగపరికల్పితుఁడగు వానితోఁ దాముగోరుకొనుచున్నవిషయసంయోగము; నీమనోజ్ఞసుధాకథాలహరిని, సుందరు లెట్లుముచ్చటలాడు కొనుచుండిరో చూడుము! వారికథ నెఱుగఁదలఁచితివేని సంగ్రహించిచెప్పెదవినుము. వారందఱును, ఢిల్లీసుల్తానుచే రంజాక్ బహుమతిగా నెన్నఁబడుటకుఁ గోరియున్నవారే. వారిలోఁగొందఱు తమంతటఁదామే తమమనోరథముల నాతోఁజెప్పి నన్ననుసరించిరి. కొందఱు తలిదండ్రుల యనుమతిపై వచ్చిరి. మఱికొందఱు తలిదండ్రులతోఁ జెప్పకయేవచ్చిరి. వింటివా! వీరివృత్తాంతము! జవ్వనీ! వారికన్న నీవుజగన్మోహినివి! వీరం

దత్తిలో నిన్నే ఢిల్లీసుల్తాను తప్పక రంజాన్ బహుమతిగా నెన్నుకొని స్వీకరించును! అపుడు—- నీవువానిచే స్వీకరింపఁబడినపుడు, నీకుఁగలుగు మహైశ్వర్యములును, నీవనుభవింపనున్న యింద్రభోగములును, నీకను సన్నను మెలఁగు పరిచారికాసహస్రమును, నీకువంగిసలాములుసేయు తక్కటి యుంపుడుకత్తెలును, నీకునివాసముగా నొసంగఁబడు చంద్రకాంతోపల నిర్మితమగు రమ్యహర్మ్యమును, నీవిహారమునకై యేర్పరింపఁబడు మనోహరమగు శృంగారవనమును; ఆహా! జవ్వనీ! అట్టి యవర్ణనీయమహాభోగముల ననుభవింపనుంటినని నీలోనీవు గర్వమునొందుటకు మా అజ్ఞానియగు బిడ్డవలె, నేలపలుమాఱు దుఃఖమునొందెదవు? ఇంతకుమించిన వెఱ్ఱికలదా! ఊరడిల్లుమూరడిల్లుము! పాపము! నిన్ననవలసినపనియేమి? చుప్పనాతివై నిన్ను వెఱ్ఱిదానిసిగా సృజించినఁ "అల్లా"నుఁ దిట్టవలయు!"

ఇట్లుచెప్పినను. కమల కవి యణుమాత్రమైన రుచింపలేదు. ఇచ్ఛాప్రకారము సంచరింపనగు తమస్వగృహంబులవీడి, పరువునష్టములకై భయఁపడుచున్న తమతలిదండ్రులవీడి, మదోన్మత్తతచే నింద్రభోగాసక్తికిఁజిక్కి, తమకుఁదాము ఢిల్లీసుల్తానునొద్దకు నాకూబుమూలముగాఁ బోవుచున్న, యీసుందరీమణీదశకమును జూచినంత, కమల, యాశ్చర్యసంభ్రమవిషాద సందేహహృదయయయ్యె.

ఓసుందరీమణులారా! మీనొసటఁ దప్పింపనలవిగానిరీతి సృష్టికర్తచే లిఖింపఁబడిన నాలుగక్షరముల మీరెఱుఁగరుకద! పాపము!

గడియపూర్తయయ్యె. వెంటనే మరలఁబ్రయాణసన్నాహముపక్రమింపఁబడియె. ఇపుడు రెండుశకటములు పయనముసేయుచున్నవి. ఒకశకటమున రంజాన్ బహుమతీకాంతలును, వానివెనువెంట శకటమున మనకథానాయకియగు కమలయునుగలరు.

సౌందర్యవణిజుఁడగు ముస్తాఫా యాకూబుచే బురస్కృతములైన, యీశకటములట్లు మూఁడు దినములురాత్రింబవళ్లు, ప్రయాణముచేసి నాల్గవదినము సాయంతనమైనగంటలకుఁ యమునానదీతటమున జేరిరి. వారుదిగినదియొకరేవుచోటు. అచట యమునానదినిదాటుటకు కొందరు నావకై యందుగూర్చుండిరి. అంతలో మనజనసమూహము సమీపించి తత్కాలమునందే వచ్చిన పడవయందెక్కిరి. ఆసమయమున నొక విచిత్రమగు సంఘటనము సంభవించె.

ఇంతవఱకు నిరాశనొందియున్నకమలకు, నిపుడొకింత యాశ కలిగె. ఇంతవఱకును ముకుళించియున్న యామెముఖారవింద మిపుడొకింత తెలివినొందె. ఇంతవఱకును దైన్యసూచకములైన నేత్రములిపు డొకింత సంతోషభావముల వెలిబుచ్చె. ఏమి? ఏ కారణమున? ఇదే! ఆపెకూర్చున్న దెసకు నుత్తరముగా, నానావయందే సుందరకూడ నాసీనయైయుండెను. ఆసుందరకును, కమలకును, బరస్పరావలోకనములు జరగినవి; కాని యేమియుఁబలుకవద్దని సుందర, కమలకుఁగనుసన్నఁజేసె. కావునఁ గమలపెదవుల విప్పలేదు. యాకూబు వేఱుదెసఁ జూచుచుంటచేత, నాసుందరాకమలల పరస్పరావలోకనములఁగాని, కనుసన్నలఁగాని, వానికి గుర్తింప నవకాశములేకపోయె.

కమలనుజూచి “నీకేమియు భయములేదు. నేనునీకుఁ దగినసహాయము తప్పకనొనర్తు” నన్నట్లు, కనుసన్నల మందరచేసె. ఆపెప్రక్కనేయున్న మఱియొకవనితయుఁగూడ, నారీతినే కమలకు ధైర్యసంజ్ఞలనొనర్చె. ఆవనిత మందరకున్నేహితురాలు. ఆమెమిక్కిలిరూపవతి. ఆమెకిరువదిరెండేండ్లవయస్సుండును. ఆపెదేహవర్ణము హేమవర్ణమును బోలియుండెను. ఈనూతనవనితామణియెవతెయో కమలకుఁ దెలియదు. ఐనను, మందరతోడిపాటు బాటుబఱపిన, యాపెధైర్యసంజ్ఞలకుఁ గమల స్వాభివందనముల తనముఖమునఁ బ్రదర్శించెను.

ఇంతలో నావ యమునానది యవ్వలియొడ్డునుజేరె. అచట నావలోనివారందఱును దిగిరి. మందరయు, నాపెస్నేహితురాలును, కనుసన్నలమూలముగాఁ గమలనుండి సెలవుఁగైకొని, యచటికి రెండుమైళ్ళదూరముననున్న ఢిల్లీపురమునకు నడచిపోయిరి.

వేఱుశకటముల నచట ముందుగానే, యాకూబు సిద్ధముగా నేర్పరించెను. వానిని మనసుందరీమణీసమూహమారోహించి, యాకూబుచేఁ బురస్కృతలై, ఢిల్లీనగరమును గడియలోఁజేరిరి.

ఆమహానగరమును జొచ్చిన పిదప, నొకరమ్యవీధియందొకగృహమునకు ముందుగా మనశకటములన్నియు నాపఁబడియె. ఆకూబు దిగుఁడని చెప్పినపిదప, నాసుందరీమణులందరు నచట దిగి వెంటనే యాగృహాంతరమునకుఁ గొంపోవఁబడి, వెవ్వేఱుగదులయందుఁ బ్రవేశపెట్టఁబడిరి. పిమ్మట నొకసేవకుని మూలముగాఁ దాను బహుమతుల నర్పింపఁ

దెచ్చితినని ఢిల్లీసుల్తానున కాకూబు వర్తమానమంపె. ఆవర్తమానమునకు, వెంటనే, యాబహుమతులఁ దీసికొని తన్నుఁ జూడవలసినదని సుల్తానాజ్ఞయిచ్చె. అధికసంతోషముతోఁ దనయొద్దనున్న సుందరీమణులందఱు నమూల్యములగు భూషణములతో నలంకరించి పిమ్మట వారిని శకటములయందుఁ గూర్చుండనియోగించి, సుల్తానుని, రాజభవనమునకుఁ గొంపోయెను.

ఆశలనొందుచు, నాకాంతలలో గొందఱు తమకురానున్న భోగములను లెక్కపెట్టుకొనుచుండిరి.

ఘూర్జరతార.

పందొమ్మిదవ ప్రకరణము.

రంజాన్ పండువును మహమ్మదీయు లత్యంతభక్తి శ్రద్ధలతోఁ దిలకింతురు. ఆపండువొక చాంద్రమాసమువఱకు నుండును. ఆపవిత్ర దినములలో మహమ్మదీయు లెల్లరు పగటిపూట నన్నపానములఁ బూర్తిగా విసర్జింతురు. వారికి బహుప్రీతికరములగు హుక్కా, మద్యము, భంగు, మాంసము మొదలగు మత్తుపదార్థము, లాపండువు దినములలో బొత్తుగాముట్టుకొనరు. కొందరధికాచారపరాయణులు, మంచినీరైనను ద్రావరు. ఆరంజాన్ పండువుదినములలోఁ బగటిపూటల ఢిల్లీపట్టణవీధు లెంతయు వర్ణనీయములై యుండు. ఉపవాసముతో నుండుటచేఁ బణ్యస్వాములు తమతమ పీఠికలపై వ్రాలి, యుస్సురనుచుఁ దూఁగుచుందురు. బరువుమూటలను మోయుచుండుకూలీలు, తొట్రుపాటువడుదురు. బావినుండి యుదకమును దోఁడుచున్న యువతుల కరపల్లవములు నొప్పి పుట్టనొచ్చుకొందురు.

సూర్యుఁ డస్తమించినతోడనే ఢిల్లీనగరమునకుఁ బరిసరమున నొక మైదానమునందుఁ బెద్దఫిరంగి యొకటి ప్రేల్పఁబడును. ఆమ్రోఁతను విని

నతోడనే యుపవాసముతో నున్న వారందఱుఁ దమతమ గృహములందు విందులుసలుపుకొందురు. ధనికులు వెండిపాత్రలయందు భోజనములొనర్చినను, నిఱుపేదలు మట్టిపాత్రలయందు భోజనములొనర్చినను, తుదకు వారివారి సంతోషములు సమానములే.

మనకథాకాలమగు పదునెనిమిదవ శతాబ్దమున నహమ్మదుషా చక్రవర్తి ఢిల్లీసింహాసన మధిష్ఠించియుండెను. ఆచక్రవర్తిచరిత్ర జగత్ప్రసిద్ధము.

రంజాన్ బహుమతుల నెన్నుకొనుటలోఁ జక్రవర్తిజోక్యముకలుగఁజేసికొనక తనతల్లియగు సుల్తానాను నియోగించె. ఆమె, తనకొమరునియెడ నత్యధికానురాగము కలదియగుటచే, రంజాన్ బహుమతులలో సుప్రసిద్ధమైన దానిని దీర్ఘపరీక్షానంతరమెన్నుట యలవాటుగా నుండెను.

ఈముఖ్యవిషయలేఖనానంతరమిఁక మనకథాసూత్రము ననుగమింతము.

సూర్యుఁడస్తాద్రి నలంకరించె. తోడనే పెద్దఫిరంగి ప్రేల్పఁబడియె. అదిసూచనముగా పురవాసులందరు తమయుపవాసముల మాని, స్వగృహములందు బంధుమిత్రాదులతో విందులు గుడుచుచుండిరి. మఱికొందఱు దైవప్రార్థనముఁ జేయుటకై మసీదులకుఁ బోవుచుండిరి. ఇఁకఁ గొందఱు తమతమ వర్తకస్థానముల మూసి, యిండ్లకేగుచుండిరి. ఎచ

టంజూచినను జనసమ్మర్దము మిక్కుటముగా నుండెను. నగరవీధులన్నియు గోలాహలభూయిష్ఠములై యుండెను.

అట్టియెడ హయశకటములు రెండు—మిక్కిలి విశాలములైనవి—రాజభవనమునకుఁ బోవుచుండుట గన్పట్టె. వానికిముందు హయారూఢుఁడై యాకూబు నడచుచుండుటగూడ గానఁబడె. కావున శకటములయందు రంజాత్ బహుమతులకై కొనిపోఁబడుచున్న సుందరీమణులుండిరని మాచదువరులకు మేము వేఱుగాఁ జెప్పనక్కఱలేదు.

తానే యెన్నఁబడుదుననియు, తనసౌందర్యమే తక్కటి సుందరీమణీ సౌందర్యములకు మించియున్నదనియు, దనకే యాదేవేంద్రభోగములు సంభావ్యములగుననియును, నాశకటములయందున్న ప్రతి జవ్వనియును—ఒకర్తు మాత్రము తక్క—యువ్విళులూరుచుండిరి. అట్లుండని, యాసుశీలయొకర్తు కమలయని సులభముగా గ్రాహ్యమగు. ఆమె వారివలె దేవేంద్రభోగములను దలంచుటలేదు. కాని తనచెలికత్తెలను దనఘూర్జరదేశమును, ప్రియుఁడగు మోహనుని, దలంచుచుండెను. అయ్యో! తనికిఁక మోహనునిఁజూచు భాగ్యముకలుగదు కాఁబోలు. ఏమనిన, తనసౌందర్యము ప్రతిమానమగుటచే నామెయే తప్పక రంజాత్ బహుమతిగ నెన్నఁబడునని యనుకొనెను. యాకూబునట్లె చెప్పెను. అట్లగుట నామె నిరాశనొంది యాశకటాంతర్భాగమున—నాసుందరీమణీ సమూహమధ్యమున—కన్నుల వేడివేడిబాష్పముల గార్చుట • మనము చూడకపోము. అహా! ప్రస్తుతస్థితి పరీక్షించినఁ దనసౌందర్యమే తనకు

ఘోరశత్రువై పరిణమించెఁగదాయని యామెకుఁ దోఁచెను. సంభవమైనయెడలఁ దననిరుపమాన మనోహర సౌకుమార్యము నొకకురూపకిచ్చి యాకురూపము తాను గ్రహించియుండును. ఇట్టి వివిధవిషాదకరభావముల మధ్యనప్పుడప్పుడు తన మేనత్తకొమరుఁడగు మోహనుఁడు స్మరణకు వచ్చుచునేయుండెను. ఆసుకుమారుని యెడఁ దానిదివఱకుఁ బొందియున్న ప్రియభావము లిప్పుడు పూర్తిగ విశదములుగాఁ జొచ్చె. వానిని సామాన్య స్నేహభావముతో గాక దివ్యానురాగముతో దాను బరిగణించుచుండెనని కమల తెలిసికొనుట కిదియె ప్రథమతరుణము. కావునఁ దక్కటి జవ్వనులతో రాజభవనమునకుఁ బోవుచున్న కమల మిక్కిలి విషాదాక్రాంతయై యుండెను. తాను నిరసించినను—దన్ను సుల్తానా రంజాత్ బహుమతిగా నెన్నుకొనినపక్షమునఁ దప్పించుకొనుటకనేకోపాయము లాపె హృదయమునకుఁ దట్టెను. ఆసుల్తానాతో దాను ఘూర్జరరాణినని భీకరముగ ఘోషించును. లేనియెడఁ దన్ను విడువవలసినదని సుల్తానాకాళ్ళపైఁ బడి బ్రతిమాలుకొనును. అట్లుకానియెడఁ దానెన్నియుపాయములకైన నెన్నిశిక్షలకైన నెన్నినిర్బంధములకైన వెనుదీయక తానాపదవిని స్వీకరింపనని నిర్భయముగా జెప్పును. కాని యీయుపాయములేవియును, దనకు సహాయము నొనర్పఁ జాలవని దీర్ఘాలోచనపై గ్రహించెను. ఏమనిన తాను, తనరాజ్ఞీత్వమును వెల్లడిచేసినయెడల వెంటనే తానుపైత్యజనితమైన మతిభ్రమణముచే బాధపడుచున్నట్లు గోబుతప్పక చెప్పును. అట్లగుట తనమాటలనెవ్వరును విశ్వసింపరు. అట్లామె తలపోయుచుండగా శకటము రాజభవనప్రాకార

ముల దాటి లోనఁ బ్రవేశించెను.

అచ్చట శకటము లాపఁబడిన పిమ్మట వానినుండి సుందరీమణులు క్రిందునకు దిగిరి. వెంటనే యనేకులగు రాజదాసీలు వారికిస్వాగత మిచ్చిరి. ఆదాసీలచేఁ బురస్కరింపఁబడి మనవిలాసినీ సంఘము వివిధమనోజ్ఞమందిరములలోఁగా సుల్తానామందిరమునకుఁ గొంపోఁబడెను.

ఆసుల్తానాపేరు 'జౌలీబేగం' ఆపె తన యౌవనమునందు మిక్కిలి సుందరియై యుండవచ్చు; ఏమనిన నేబదియేండ్లవయస్సు నంది యింకను నాపె సౌందర్యము పూర్తిగా వాడు సెందకయుండెను. ఎల్లపుడును సౌధాంతరమునుండి, సూర్యుని వెలుంగునైన చూడకుండెడి యంతఃపురస్త్రీయగుటచే, యాపె దేహవర్ణము మిక్కిలి తెల్లగానుండెను. మొగము కొద్దిగాముడుతలు పడియుండె. దానియందుఁ గొలదిగా హృదయ కాఠిన్యము విశదమగుచుండె. మహమ్మదీయస్త్రీలు సామాన్యముగా ముఖములపైఁ గప్పుకొనెడి, ముఖాచ్ఛాదనమునం దాపె యాస్యముడాగియుండె; అయిన నది మిక్కిలి సన్నని 'ఢక్కామజిలి' నగుటచే, నందుండి ముఖముపూర్తిగాఁ గానుపించుచుండె. వివిధమణులచేఁ జెక్కఁబడిన హేమపీఠిక నాపె యలంకరించియుండె. ఆపీఠికా భాగములపైఁ బడి యామె ధరించిన మృదులపీతాంబరము మిలమిలలాడుచుండె. పీఠికకటునిటు నిరువురుపరిచారిక లొకవిధమగువీవనలతో, సుల్తానాకు విసరుచుండిరి.

బహుమతీ సుందరులందఱు నొకమాలగా—జగన్మోహన సౌం

దర్యవిలాసినీ కుసుమములచే గ్రుచ్చఁబడిన యమూల్యమాలగా—నిలువఁబడిరి. ఆమాలకుఁ బశ్చిమాగ్రమున—విలాసినీ విలాసిని—మోహినీ మోహిని— దేదీప్యమానములగు రుచులతోఁ గనులమిఱుమిట్లు గొలుపు దివ్యమణి—మనకథానాయకి—మోహానుని యౌవనప్రాణము—ఘూర్జరరాణి—ఘూర్జరతార— తారాకమల—కమల, వినమ్రముఖియై, మిక్కిలి కుశాగ్రబుద్ధియగు చిత్రకారునిచేఁ జిత్రితమైన ప్రతిమవలె—మనోహరజీవ ప్రతిమవలె—నిలువఁబడి యుండెను.

తక్కిన జవ్వనులలో ననిష్టలగు నొకరిరువురు తక్క—మిగిలిన వారి హృదయములెట్లు కొట్టుకొనుచున్నవి ! వారికెట్టియాశలు కలుగుచున్నవి! ఎట్టియుద్రేకము కలుగుచున్నది!

వారినందఱ నొకసారి చూచాయఁగఁ దిలకించి, సుల్తానాతన పీఠికనుండి లేచె. రాజఠీవిని సంపూర్ణముగాఁ బ్రదర్శించుచున్న మెల్లనియడుగులతో, మాలయందుఁ బ్రథమస్థానము నలంకరించియున్న సుందరిని దనహస్తపల్లవములచే స్పృశించి, యొకింతముందునకు రాఁజేసె. ఒకనిమేషమాత్రమా సుల్తానా సూక్ష్మవీక్షణము లాసుందరీ ముఖారవిందముపైఁ బ్రసరించినవి. ఓహో! ఆసమయమున నాసుందరిమనమునం దెట్టి సందిగ్ధవిషయములు ప్రబలియున్నవో మన కవర్ణనీయములు ! పాపము తానే రంజాన్ బహుమతిగా నెన్నఁబడునని యనుకొనెను.

ఒకనిమేషకాల మాసుల్తానా తనచుఱుకుఁజూపులనామెనువీక్షిం.

చిన పిమ్మట, నామెనుండి మరలి రెండవసుందరిని డాసెను. ప్రథమసుందరి సౌందర్యమామె హృదయమునకు రంజకముగా నున్నదో లేదో మనమెంతమాత్రము నూహింపలేము; ఏమనిన నామెముఖము, సహజస్వభావ ప్రకటనమునందు హెచ్చుగాని, తగ్గుగాని, మఱెట్టి విపరీతముకాని కాన్పింపలేదు. మునుపటివలెనే నిశ్చలమై, గంభీరస్వభావమును దాల్చియుండెను. అట్లగుటచే నామె ముఖమునుజూచి ప్రథమసుందరి, యెట్టియంశమును నిర్ధారణముఁజేసి కొననేరకపోయెను.

వెనుకటిరీతినె, రెండవజవ్వనిని తనహస్తపల్లవములచే స్పృశించి యామెనెకింతముందునకు రాజేసి, వెనుకటియట్లే యొకనిమేషకాల మామె ముఖారవిందమును, దద్దేహలావణ్యమును, సూక్ష్మబుద్ధితో దిలకించెను. వెనుకటియట్లే యాసుల్తానా, గంభీరముఖియై మూకీభావముఁదాల్చియుండె. అట్లగుట రెండవసుందరియు నేమియు నిర్ధారణఁజేసికొన నేరకపోయె.

ఆరీతి నాపదుగురిని వరుసగాఁ బరీక్షసేయుచుండెను. ఇఁకఁ గమల ప్రక్కగాఁ బరీక్షసేయఁబడిన సుందరులిరువురేయుండిరి.

అంతవఱకును గమల కేమియుఁ దోఁచకుండె. ఆమెదృష్టిపథమున నున్న వస్తువులన్నియు, వానివానిరూపములను ద్యజించుచున్నట్లామెకుఁ గనఁబడెను. వెంటనే, యావైచిత్ర్యమునకుఁ గారణము తనయస్థిరచిత్తమేయని కమలగ్రహించె. తోడనే చెదరియున్న మనమును ఘనీభూతముగా నొనర్చుకొనియె. అంతలో నామెయందొక వింతపొడసూపె.

అనేకులగు మానుజుల నమస్కృతులకుఁ బాత్రురాలై నిరాఘాటపరిపాలనము నొనర్చుచున్న తనబోటిరాణి యొకదాసీగా సుల్తానున కమ్మఁబడుటకు రోషపూరితయయ్యెను.

ఆహా ! ఘూర్జరరాణి దాసిగా విక్రయింపఁబడునా? అనిష్టముగానున్న కాంతనునిర్బంధించి సుల్తానునకుఁ గట్టుదురా! ఎంతఘోరము! ఎంతదౌర్జన్యము!!!

అంతవఱకు, నేమూలనో బంధితమైయున్న రాజరక్తకోశ మిపుడు బ్రద్దలై, దానినుండి సర్వరక్తనాళములయందును రాజరక్తము జలజలప్రవహించెను. ఆనూతనరక్తోద్రేకమున, నామెముఖ మెఱ్ఱనిదై మిగుల మోహనముగానుండె. పెదవు లదివరకెన్నఁడులేని కెంజాయలతో నిగనిగమెఱసె. ఆమెదేహవర్ణమునకు మఱింతమనోజ్ఞచ్ఛాయ కూడికయయ్యె. పాపము! ఆమెరోషమే యిపుడామెభావములకుఁ బ్రతిబాధకమయ్యె. ఏమనిన నారోషోద్రేకకారణమున నామెసహజసౌందర్యము వాడియును శోభనొంది మిక్కిలి మనోహరముగాఁ జూపట్టె.

ఆసమయముననే తక్కటివారలఁ బరీక్షజేసి సుల్తానా కమలను డాసె. వెనుకటియట్లే, సుల్తానా తన సూక్ష్మవీక్షణముల నామెముఖమునఁ బ్రసరింపఁజేసెను. తదేకదృష్టితో నొక్కనిమేషముచూచి వేఱొకనిమేషముచూచె—ఇంకొకనిమేషము—మఱియొకనిమేషము. విచిత్రము, అంతవఱకును మూకీభావముఁదాల్చి, హృదయాంతర్గత మిసుమం

తయైన వెల్లడిపఱుపక, తోఁకనినిందుకుండవలెనన్న సుల్తానాయం దిపుడొక మార్పుకలిగె. మొఁగమొకింత వికసితమయ్యె. మందహాసాంకురములు తలలెత్త సాగె. ఏదియో మాట్లాడుటకాపె పెదవులువిప్పె. పిమ్మటఁ గమలహస్తముల తన హస్తమునఁ గ్రహించి. ''సుందరీ! నీపేరెవ్వరు?'' అనిసుల్తానా ప్రశ్నించెను. ఇట్లుసుల్తానా, తక్కినసుందరీమణుల నడుగ లేదుకావున దీనియందితరార్థము కలదని కమలగ్రహించె. వెంటనే యామెతడఁబడె. ''నాపేరుకమల'' యనినప్పుడు, మిక్కిలినేర్పుగల గాయకుఁడొకఁడు మధ్యమశ్రుతిననుసరించి మంద్రస్థాయిని పంచమస్వరాలాపనమును వీణియపై జేసి నట్టులాపెకంఠము, మ్రోగింపఁబడిన కంచుగిన్నెవలె ధ్వనించె.

తనపేరు 'కమల' యని వచించిన తత్‌క్షణమే కమలమరల నేదియోచెప్పఁ బోయి, యూరకుండె. అదెట్టిదియని మాచదువరులెఱుఁగఁ బోదురేమో? 'రాణీ కమల' నని చెప్పుటకు బదులుగా తడఁబాటునఁ 'కమల' నని మాత్రమేచెప్పెను. తనరాజ్ఞీత్వమును వెల్లడించి సుల్తానాకుఁ గొంత యచ్చెరువుగలిగింపవలెనని కమలయాలోచన. కాని తడబాటు చేత, నాయాలోచన ప్రతిఫలమునొందుట కవకాశము దొరకదయ్యె.

''కమలా! ఈసుందరీమణులందఱిలో నిన్నే నాకొమరుఁడగు 'అహమ్మదుషా' సుల్తానునకుఁ బ్రియురాలినిగా, నెన్నుకొంటిని.''

వెంటనే, సిగ్గునొంది, తలలువంచుకొని తక్కటిసుందరీమణులు కమలను లోలోన దిట్టుకొనుచు, నామందిరమునుండియదృశ్యులైరి. తానెన్నఁబడెనని వినినతోడనే ప్రతిమవలె కమల నిలువఁబడియె.

ఘూర్జర తార.

ఇరువదవ ప్రకరణము.

[illegible]మైన కమలనుజూచి సుల్తానా ''జౌలిబేగము'' కొం[illegible]చ్చెరువునొంది యధికాదరమున నాపె హస్తపల్లవములు తనహస్తపల్లవములచేఁ గ్రహించి యిట్లనెను. బాలికామణీ! కమలా! అల్లల దిగ్భ్రమఁజెందితివి.

ఈపలుకులయందొకింత కరుణారసము ప్రసరించినట్లు కమలకుఁ దోఁప నొకింత ధైర్యముతెచ్చుకొని యంజలిఘటియించి జాలిగొలిపెడు—ఎట్టిపాషాణ హృదయములనైన వెన్నవలె గఱఁగించెడు—దైన్యస్వరముతో నిట్లనె. ''ఓ! నిర్మలకరుణా మనోవిలాసినీ! రాజమాత నామనవి నొకింత జెవిఁబెట్టుము''

''ఎట్టిది! ఎట్టిది?'' అని యాతురతతో సుల్తానా కమల నడిగెను.

''అమ్మా! నేను ఘూర్జరదేశమును బరిపాలించు రాణిని.

''ఏమి ! ఎంతటివింత! జగత్ప్రసిద్ధిగాంచిన ఘూర్జరతారయను బిరుదునొందిన సుందరీమణివి నీవేనా.

''చిత్తము. కొన్నికారణాంతరములచే రాజ్ఞీత్వమును బయల్ప

ఉపక, శ్రీనగరమునకు రహస్యముగా వచ్చియుంటిని. అచట దుష్టులెవ్వరో నన్నాకూళ కూబునకు విక్రయించిరి. ఇదియంతయు నాకు ననిష్టముగా నుండుటచే, నన్నీ దైవికమునుండి తప్పింపవేఁడుకొనుచున్నాను."

కమలయొక్క మొగమునందుఁగాని, వీక్షణములందుఁగాని, యెట్టికపటభావమును బ్రచురింపఁబడి యుండకపోవుటచే సుల్తానా తఁలకి, యాపెమాటలను విశ్వసించి "అమ్మా! రాణీగారూ! ఎఱుఁగక మీయెడ నే నింతవఱకుఁ సల్పిన దురాచరణములకుఁ గోపగించుకొనకుందురుగాక! అన్యాయముగా మిమ్ముఁబట్టి తెచ్చిన యాకూ బిపుడే శిక్షింపఁబడుగాక! అమ్మా! మీరేమియు భయమునొందకుఁడు. మీమాటలు నేను విశ్వ—

"అమ్మా! మీతో నేవియో యత్యంతరహస్యములగు ముఖ్యవిషయముల నణుమాత్రమైన జాగుసేయక జెప్పవలెనని, దానికై మీదర్శనము కోరుచుంటినని, యొకడెవ్వఁడో ద్వారమునొద్ద నున్నవాఁడు" అని యొకదాసీ సుల్తానాసమ్ముఖమునకు మందిరద్వారమునుండి వచ్చిపలికెను.

"అవి యంతటిముఖ్యములు రహస్యములు నైనయెడల నేనే వానియొద్దకువచ్చెదను." అని కమలవంకఁదిరిగి "దేవీ! రెండునిమేషములలో మరలవచ్చెద" నని చెప్పి, దాసీముందునడువ నామందిరద్వారమును బ్రాపెను, అచట నాకూబు నిలువఁబడియుండె. సుల్తానాను

జూచినతోడనే, యాచారానుసరణి సాష్టాంగమొనర్చి "తల్లీ! నాచేఁ దీసికొనరాఁబడిన వారలలో నొక్కరితయగు కమలను తాము బహుమతిగాఁ నెన్నుకొనుటకు నాకత్యంతసంతోషమైనది. కాని యాకమలకుఁ బైత్యరోగజనితమగు మతిభ్రమణముకలదు. ఆమతిభ్రమణముచేఁ తానేఘూర్జరతారననియు, తానే, యాదేశపరిపాలనమునుసేయురాణిననియు, చెప్పచుండు. కావున నాపెమాటల నెంతమాత్రమును విశ్వసింపకుఁడు" అని వినయవిధేయతాపూర్వకముగా యాకూబు చెప్పెను.

సుల్తానా, యాకూబువచించినది వినినతోడనే నమ్మి, మరల గదులయొద్దకుఁబోవక, యచటనుండియే తనభవనమునకుఁ బరిచారికాసమేతయై వెడలిపోవుచు, నాదాసీని గమలకు వలయుసపర్యలు సేయుఁగా నియమించె. ఆదాసియును దిరిగి కమలయొద్దకు నేగుదెంచి యామెకు వినయపూర్వకవందన మాచరించి "అమ్మా! మీకు సపర్యసలుప నన్ను సుల్తానాగారు పంపినారు" అని చెప్పినిలువఁబడియె.

"ఆమె యెచటికేగెను?"

"వారిమందిరమునకు"

"మరల వచ్చి నాకు దర్శనమిత్తుననెను గదా!"

"అగును. కాని, యెవఁడో యొకమహమ్మదీయుఁడు మాయమ్మగారితో దమకు బిచ్చికలదనియు, దానిచే దమమాటలను విశ్వసిం

పరాదనియుఁ జెప్పెను. ఆకారణమున వార్తప్రకారము మిమ్ముఁజూడకయే పోయిరి.

అయ్యో! ఈదారుణ సమాచారమునకు నీగర్భనిర్భేదకమగు వృత్తాంతమునకు కమల తల్లడిల్లె. ఆమహమ్మదీయుఁడు ముస్తఫాయాకూబనియే కమల నిస్సంశయముగా గ్రహించె. ఎంతటిమోస మెంతటిమోసము! తనదీనప్రార్థనలచే—తనవిచారకర విజ్ఞాపనములచే—తనవినయపూర్వక ప్రవర్తనములచే—సుల్తానా హృదయమును దఱచి తఱచి, యందుండి కరుణారసము నుద్భవింపఁజేసి, తన్మూలమునఁ దనవిముక్తిని సంపాదింపఁ బ్రయత్నించెడు కమలకు, సైంధవునివలె ముస్తఫాయాకూ బడ్డముగలిగించి, యన్నియాశలను నిరాశ నొందించుచుండె. అక్కటా! కమల కింకేదిదిక్కు? ఆఘోరవిపత్తునుండి తప్పించుకొనునుపాయ మేది? ఆసంతాపమను గొప్పయగాధమునుండి సప్రాణముగా బయల్పడు టెట్లు! రసపుత్రవంశ సంజాతయై, రసపుత్రవీరరక్తము, తనరక్తప్రణాళికలయందుఁ బ్రవహించుచుండ, స్వేచ్ఛాప్రచారముల నొనర్చు తాను—ఘూర్జరరాణి—తారాకమల—యన్యాయముగా సుల్తానునకుంపుడుకత్తెయై యుండుటెట్లు? ఓదైవమా! స్వేచ్ఛాప్రవర్తనలచే మెలగుచుండు మనుజుల నందు ముఖ్యముగా నబలల, నందును తారాకమల నీరీతిని హింసించుట నీకేల?

తాను గాన్పింపకపోవుటచే, మోహనుఁ డెంత చింతించునోకదా! తనచెలిమికత్తియ లేమని యనుకొందురో! ఎట్లుకుందెదరో! వాన

కురియమి మూలము లెండిపోయి క్రమముగా వర్ణక్షయమునొందు సుకుమారలతికవలె, కమల నిరాశాపరితప్తయై, యుస్సురనుచు, నాప్రక్కనున్న యొకపీఠికపై మేనుసేర్చె. ఆపె మనోహరముఖచంద్రబింబమున, నిపుడు దేదీప్యమానరుచు లేమియు లేవు. ఆపె విశాలనేత్రములం దిపుడు సహజతేజఃప్రజ్వలనము కాన్పింపదు.

ఆస్థితినిగ్రహించి దాసి జాలినొంది కమలనుడాసి యామెనోదార్పఁజూచెను. కాని, యాపె భావసముద్రము దుఃఖమేఘములచే గప్పబడియుండి యావిపరితాపమహావాతసాహాయ్యమున, నిరాశావృష్టిని కుంభములతోవలె గుమ్మరించుచుండె. ఆఝుంఝామారుతముచే దల్లడిల్లుచున్న యామె కూరట కలుగుటెట్లు?

అట్టిస్థితిని యాదాసిగ్రహించి, పునఃప్రయత్నము సలుపక వెనుకకుఁదగ్గె.

చేయిపెట్టి కెలికినయట్లు లాపె హృదయ మెంతయుఁ దల్లడిల్ల, శోషిల్లి, యాపీఠికయందే కనులు మూసికొని నిదురవోయినట్లు కాన్పించె.

ఇది ప్రథమభాగము.

సంపూర్ణము.

Scape & Co., Printers, Cocanada:—22-4-1915.

శ్రీ

ఘూర్జరతార.

(ద్వితీయభాగము)

ఇది

కొప్పరపు వేంకటసుబ్బరాయకవిగారిచే
రచింపఁబడి

గుంటూరుపురస్థితంబయిన శ్రీసమ్మోదిని గ్రంథమాల కైదవప్రచురణముగ
నేతద్గ్రంథమాలాధికారులగు

గరికిపాటి సేతుమాధవరావుగారిచేఁ
బ్రకటింపఁబడియె.

(1915 సం॥రం సెప్టెంబరు, అక్టోబరు నెలల ప్రచురణము.)

1915.

శ్రీసమ్మోదినీగ్రంథమాల

రాజపోషకులు.

1. శ్రీ పిల్లలమర్రి సోమయాజులు పంతులుగారు, తహశ్శీలుదారు, నర్సారావుపేట.
2. శ్రీ చిరుమామిళ్ళ నారాయణప్రసాద్ గారు, తహశ్శీలుదారు, గుంటూరు.
3. శ్రీ జొన్నలగడ్డ వేంకట గోపాలరావు పంతులుగారు, హంసవరం, తునిపోస్టు.
4. శ్రీ మోతే గంగరాజుగారు, జమీందారు, ఏలూరు.

పోషకులు.

1. శ్రీ నల్లపాటి శేషగిరిరావుగారు, ప్లీడరు.
2. శ్రీ మేళ్ళచెర్వు వెంకట్రామయ్యగారు, కంట్రాక్టరు, కాకినాడ.
3. శ్రీ రాజా సూరనేని వెంకటపాపయ్యారావు బహద్దరు జమీందారు, మైలవరం.
4. శ్రీరాజా కందుకూరి శివప్రసాదభూషణరావు బహద్దరుగారు, నర్సాపురం.
5. శ్రీ యస్. వెంకటేశ్వరరావు పంతులుగారు, డిప్యూటీకలెక్టరు,
హనుమకొండ, (దక్కను)

సహాయులు.

1. శ్రీ నడింపల్లి వెంకటహనుమంతరావుగారు, ప్లీడరు, నర్సారావుపేట.
2. శ్రీ దుర్భా వెంకట శివరామరాముగారు, ప్లీడరు, కాకినాడ.
3. శ్రీ దివాన్ బహద్దరు దురిశేటి శేషగిరిరావుపంతులుగారు, కాకినాడ.
4. శ్రీ రావుబహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తిగారు, కాకినాడ.
5. శ్రీ పాణంగిపల్లి వెంకట్రావుగారు, ల్యాండుహోల్డరు, పెద్దాపురం.
6. శ్రీ మంత్రిరావు వెంకటరత్నంగారు, ప్లీడరు, తణుకు.
7. శ్రీ సారంగు సోమసుందరరావుగారు, ప్లీడరు, తణుకు.
8. శ్రీ ఘట్టు లక్ష్మీనాగభూషణరావుగారు, సబురిజిస్ట్రారు, తణుకు.
9. శ్రీ మాచేపల్లి మాణిక్యంగారు, మేనేజరు, హిందూ ఐ. సి. స్కూలు, పాలకొల్లు.
10. శ్రీ చిరావూరి వరదరాజుపంతులుగారు, డిస్ట్రిక్టు మునసబు, నర్సాపురం.
11. శ్రీ రాయసం కృష్ణమూర్తిగారు, ప్లీడరు, నర్సాపురం.

12. శ్రీ శ్రీపాద రామమూర్తిగారు, ప్లీడరు, నరసాపురం.
13. శ్రీ రాజా కె. ఆర్. వి. క్రిష్ణారావు బహద్దరు జమీందారుగారు, పోలవరం.
14. శ్రీ కామరాజు వెంకటప్పయ్యపంతులుగారు, మేజస్ట్రీటు, నరసాపురం.
15. శ్రీ కుర్తివెంటి పేర్రాజుగారు. కాకినాడ.
16. శ్రీ అయ్యగారి త్రియంబకంగారు, ప్లీడరు, నర్సాపురం.
17. శ్రీ పులివెందల తిరుమలరావుగారు, రైల్వేగూడ్సుమేష్టరు, బెజవాడ.
18. శ్రీ వేండ్రప్రగడ కాశీవిశ్వనాథంగారు. జగ్గంపేట.
19. శ్రీ వేధగిరిరావుగారు, వకీలు, కమ్మమెట్టు.
20. శ్రీ ఇటుకాల రాజేశ్వరరావుగారు.
21. శ్రీ సద్దుదేవభట్ల జగ్గయ్యగారు వకీలు, కమ్మమెట్టు.
22. శ్రీ కలవల రాజారావుగారు, మొఖాసాదారు, కమ్మమెట్టు.
23. శ్రీ మాదిరాజు సత్యనారాయణరాజుగారు, జయంతి.
24. శ్రీ రావుబహద్దరు చెమిటిగంటి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ప్లీడరు, తెనాలి.
25. శ్రీ సూరి వెంకటకృష్ణయ్యగారు, మసునూరియస్టేటు, నూజివీడు.
26. శ్రీ రామదేను శ్రీరాములుగారు, జనరల్ మర్చెంటు, కాకినాడ.
27. శ్రీ కాపతిశ రంగన్నగారు, హైదరాబాదు.
28. శ్రీ మంత్రిప్రగడ వసంతరావుగారు, పోలీసు సబుయినస్పెక్టరు, దుద్దుకూరు.
29. శ్రీ పి. రంగారెడ్డిగారు, Brother of రాణీ రామక్రిష్ణదేశాయి, దుబ్బాక.
30. శ్రీ యస్. సిద్దప్పగారు, బళ్ళారి.
31. శ్రీ పి. గోపాలాచార్యులుగారు, ప్లీడరు, హైదరాబాదు.
32. శ్రీ యస్. యన్. గుప్తగారు, ప్లీడరు, హైదరాబాదు.
33. శ్రీ అద్దేపల్లి హరిశ్చంద్రుడుగారు, జనరల్ మర్చంటు, కాకినాడ.
34. శ్రీ పొత్తూరి ఆనందరావుగారు, పాతగుంటూరు.
35. శ్రీ గంగరాజు కామేశ్వరరావుగారు, పాతగుంటూరు.
36. శ్రీ రామరాజు రామారావుగారు, పాతగుంటూరు.
37. శ్రీ పొత్తూరి పాపయ్యగారు, ల్యాండుహోల్డరు, పాతగుంటూరు.
38. శ్రీ ముప్పవరపు రామారావుగారు, ల్యాండుహోల్డరు, పాతగుంటూరు.
39. శ్రీ యేకా లక్ష్మీనృశింహం, బి. ఏ. బి. యల్. ప్లీడరు, గుంటూరు.
40. శ్రీ ఆకుల పూర్ణానందంగారు, కమ్మమెట్టు.
41. శ్రీ తోట బసవయ్యగారు, కమ్మమెట్టు.

42. శ్రీ కోన వెంకటరావుగారు, ప్లీడరు, బాపట్ల.
43. శ్రీ రాచపూడి జగన్నాధరావుగారు, ప్లీడరు, బాపట్ల.
44. శ్రీ పిల్లలమర్రి ఆంజనేయులుగారు, ప్లీడరు, తెనాలి.
45. శ్రీ మెట్టా సూర్యనారాయణగారు, కంటాక్ట్రరు, తెనాలి.
46. శ్రీ ప్రభల వీరరాఘవులుగారు, ప్లీడరు, తెనాలి.
47. శ్రీ పోలిపెద్ది హనుమంతరావుగారు, ల్యాండుహోల్డరు, తెనాలి.
48. శ్రీ ముంగమూరి వెంకటరావుగారు, పోలీసు సబుయిన్స్పెక్టరు నెల్లూరు.
49. శ్రీ సింహ వెంకటసుబ్బారెడ్డిగారు, నెల్లూరు జిల్లా.
50. శ్రీ తూములూరి శివరామయ్యగారు, ప్లీడరు, నెల్లూరు.
51. శ్రీ గుండా సుబ్బారాయుడుగారు, జనరల్ హార్డువేరు మర్చెంటు, బెజవాడ.
52. శ్రీ దొంతరాజు హనుమంతరావుగారు, కంట్రాక్టరు, బెజవాడ.
53. శ్రీ సింగరాజు చినమహాలక్ష్మమ్మగారు, బెజవాడ.
54. శ్రీ యల్లంరాజు శాస్త్రులుగారు, ప్లీడరు, బెజవాడ.
55. శ్రీ గొర్తి సుబ్బారావుగారు, పోలీసు సబుయిన్స్పెక్టరు, బెజవాడ.
56. శ్రీ గురుమహాంతు అప్పలస్వామిగారు, కంట్రాక్టరు, బెడవాడ.
57. శ్రీ పోలూరు హనుమంతరావుగారు, మద్రాసు బాంకి మేనేజరు, బెజవాడ.
58. శ్రీ మిన్నగంటి సాంబశివరావుగారు, ఖిల్లాజాగీర్, పేష్కార్, కమ్మమెట్టు.
59. శ్రీ కల్వల నారాయణరావుగారు, దేశముఖు దేశపాండ్యా, కమ్మమెట్టు.
60. శ్రీ ఆదారపు రంగయ్యగారు, మర్చెంటు, కమ్మమెట్టు.
61. శ్రీ బొడ్డు వీరయ్యగారు, కమ్మమెట్టు.
62. శ్రీ చిల్కా వెంకటప్పయ్యగారు, ల్యాండుహోల్డరు, బెజవాడ.
63. శ్రీ మోపేపల్లి సత్తెయ్యగారు, ల్యాండుహోల్డరు, బెజవాడ.
64. శ్రీ గూడూరు లక్ష్మణరావుగారు, ల్యాండుహోల్డరు, బెజవాడ.

ఘూర్జరతార

ఇరువదియొకటవ ప్రకరణము.

అధికసంతాపపీడితములైన యాపెధేంద్రియములు కాలక్రమమున దమతొల్లిటి నిర్మలతకుఁ బునరుద్ధరింపఁబడఁ దారాకమల కొంచెము కనులువిచ్చి యఱమోడ్పుచూపులతో నెదుటనుండిన యిరువురుపరిచారికలఁజూచి వారిని దనసమీపమునకురాఁ గనుసన్న చేసెను.

అధికవినయవిధేయతలతో నాపరిచారికలు కమలను డాసిరి. కమల వారియూరుపేరుల నడిగెను. వారును సక్రమముగాఁ బ్రత్యుత్తరమిచ్చిరి. "రంజాన్ బహుమతిగా నెన్నుకొనఁబడిన యువతులలో నెవరికైన"—ఇచట కమల కొద్దిగాఁ దటబాటుచెందె; కాని, వెంటనే ధైర్యమువహించి "ఎవరికైన మీరు సపర్యసలిపియుండిరా?" యని ప్రశ్నించెను.

"చిత్తము. రెండేండ్లనుండి నేనును, నాయీస్నేహితురాలు నొకరియొద్దనుండియే యున్నారము." అని యాపరిచారికలలోఁ బెద్దది ప్రత్యుత్తరమిచ్చెను.

"రెండేండ్లనుండియునుండిరా? సరే. అట్లయిన నేటికి దాదాపు రెండేండ్లవెనుక రంజాన్ బహుమతిగ నెన్నఁబడిన యామెను మీరెఱిఁగి యుంటిరా?"

ఈప్రశ్నను కమల మిక్కిలి యాతురతతో నడిగెను.

"అవును. మేమెఱుఁగుదుము. ఆపె మిక్కిలి మోహనరూపిణి. ఆపెపేరు 'అయేషా.'"

" నిజమే! ఆపెసమాచారము లెవ్వియైన నాకుఁ జెప్పఁగలరా? ఏమనినఁ గొన్నికొన్ని కారణాంతరములచే నామెతో నాకుఁ బనికల్గినది."

"ఆపె యిచట "తార్ఖానా" యను నామముచే వ్యవహరింపఁబడుచున్నది. ఆపె సుల్తానాపదవి ననుభవించుచు నొకకొమరితను గాంచెను."

కొన్నినిమిషములవఱకుఁ గమల పలుకాడక శాంతముగానుండె. ఆదురదృష్టపుఁ బూర్వసువాసినికిఁ దన ముద్దులకొమరితను మరలఁ గనులారఁజూచు భాగ్యమైనను గలుగదుగదా యనుసంగతినిఁ గమల నిట్టూర్పుతో, చింతావ్యాకులితచిత్తముతో స్మరించెను. ఏకుటుంబమధ్యమునుండి తాను పరమక్రూరముగాఁ జీల్పఁబడియెనో, దానికిని దనకును బూర్తిగా ఋణముఁదీరెనని చిరకాలమువెనుకనే తార్ఖానాగ్రహించి, వెనుకటి సంబంధబాంధవ్యముల మఱచుచుఁ గ్రమక్రమముగాఁ దన ప్రస్తుతస్థితియందే యానందము నన్వేషింపఁబ్రయత్నించెఁగదా యను సంగతికూడ కమలానూక్ష్మబుద్ధికిఁదోఁచెను.

"ఆపె సుఖముగానున్నదా"?

ఎట్టకేల కీరీతినిబ్రశ్నింప—కొంతవఱకు జంకుచునే—కమల సాహసించెను. ఎంతవఱ కేయేసంగతుల నాపరిచారికలతో మాట్లాడ సగునో, యాయంతఃపురమర్మములలోని కెంతవఱకుఁ జొరనగునో కమలకు బొత్తుగాఁ దెలియదు.

"అయ్యో! అమ్మా! 'సుల్తాన్' గారి యనుగ్రహ సూర్యరశ్మిచే స్పృశింపఁబడువా రెవ్వరైనను సుఖవంతులుగాకుందురా? ఈప్రాకారములలో నందఱును సంతోషముతోనేయుందురు. లేక యధమపక్షమట్లున్నట్లయినను గాన్పింతురు."

"ఇప్పుడు మనము ప్రసంగించుచున్న సుల్తానాగారి దర్శనము నేనభిలషించు టీయంతఃపురాచారములకు వ్యతిరేకభావముగా నుండును గాఁబోలు" నని కమల సగము సందేహముగా సగము నిర్లక్ష్యముగాఁ బ్రశ్నించెను.

" అమ్మా! ఈయంతఃపురమహాభర్మహర్మ్యములలోనుండు నెవ్వరితోనైనను, సుల్తానాగారు మాట్లాడవచ్చును. అది మీకిష్టమేని నేనే రేపు వారియొద్దకేగి, వారిదర్శనము మీరభిలషించుచున్నట్లు వారితోఁ జెప్పెదను."

"మంచిది. మంచిది. ఆపె దర్శనము నాకిపు డత్యంతసంతోషకరము."

మహాప్రవాహ వేగమునఁబడి కొట్టుకొనిపోవుజీవి కవలంబనీయముగా నొడ్డుంజేర్చువస్తువుదొరకినట్లే కమల కత్యంతసంతోషము మొలకలెత్తె. ఆసంతోషమును దాఁచికొనలేకపోయెను.

"అమ్మా! ఇప్పటికే మిక్కిలి ప్రొద్దుపోయినది. కావున నేను దార్ఖానాగారియొద్దకుఁ బోవీలులేదు. రేపు ప్రాతఃకాలమాది సాయంతనము ప్రతిదినాచారసరణిని బేల్పఁబడు శతఘ్ని మ్రోఁతవఱ కంతఃపుర స్త్రీ లెచటికినిబోక తమతమహర్మ్యములయందే యుందురు. కావున దదనంతరము మీసందేశమును దార్ఖానాగారికి విన్నవించి మీయొద్దకుఁ దోడ్కొనివత్తును. అమ్మా! ఇఁకఁ దామీచోటునుండిలేచి మీకొఱకై యేర్పఱుపఁబడినహర్మ్యములోనికి రండు" అనుచు నాపరిచారికలిరువురిలో నధికలావణ్యవతియగుపెద్దది నిరూపితహర్మ్యములోనికిఁ గమలం దీసికొనిపోయెను.

ఆహర్మ్యవిలాసమును బ్రజ్వలితముచేయుట కెట్టిధనవ్యయమునైనను వెనుకఁబడవేయలేదు. కుడ్యాంతరభాగములన్నియు లేలేఁత గులాబిరంగును బురుడించుపూఁతఁ బూయఁబడియుండె. భూమినుండి మూఁ

డుగజములెత్తున నొక్కటే చక్కనివరుసగాఁ గుడ్యములపై నతివిశాలములును, అత్యంతసూక్ష్మగ్రాహులగు చిత్రకారులచే వ్రాయఁబడినవియునగు చిత్రఫలకము లమర్పఁబడియుండెను. పట్టెలమంచమునకుఁ బందిరివలె నాసుందరమందిరములోన మిద్దివలెఁ గూర్పఁబడిన పైబల్లకూర్పు మిక్కిలి చిత్రముగానుండె. ఆకూర్పున కడుగుభాగమున మనోహరవర్ణములతో విచిత్రములగు వలయములు గలవు. అందొక్కదానినుండి బంగరుగొలుసులతో క్రిందుగా వ్రేలాడదీయఁబడిన పెద్దగాజుదీపపుబుడ్లుకలవు. ఆబుడ్లయందుఁ బోయఁబడినతైలము స్వచ్ఛమై, పరిమళద్రవసంకలితమగుటచే నాదీపములనుండి వెలువడుధూమము సౌరభ్యమును వెదజల్లుచు నానందజనకమైయుండె. ఆదేదీప్యమానమగు వెలుతురు పసపుఁబచ్చని గాజుగొట్టములలోనుండి వెలువడుటచే మందిరాంతరమంతయుఁ బచ్చగానుండె. ఒకమూల నొకవ్రాఁతబల్లయు దానికిముందుఁ జక్కగా నగిషీచేయఁబడిన నాలుగుపీఠములును, వానికిఁ గుడిచేయిప్రక్క నద్దపుఁదలుపులుగల యొక పెద్ద ‘బీరువా’ యును గలవు. జ్ఞానబోధనమునకుఁగాని జ్ఞానగ్రహణమునకుఁగాని తమభాషయేకాక, యన్యదేశభాషలుకూడ మిక్కిలి యనుసరణీయములగుటచే నా “బీరువా” వివిధలిపులతో లిఖితములైన యనేకపుస్తకరాజములచే నలంకరింపఁబడియుండె. ఈపీఠికలకు వెనుకగా నైదుగజములదూరమునందు చక్కనిపాన్పు కలదు. ఆశయ్యా కమలకు నిర్దేశితము. పాన్పునకు నెదురుగా భోజనాదుల గ్రహించుటకు ముత్తియములఁగుట్టఁబడిన మెత్తని పట్టువస్త్రముచే నలంకరింపఁబడి యొకపీఠిక ముద్దులమూటగట్టుచుండెను.

ఈసుందరమందిరమునకునంటి చక్కనిగది కలదు. ఆగదియందు స్నానాద్యనుష్ఠానములకుఁదగిన సౌకర్యము లేర్పఱుపఁబడినవి. సృష్టికిఁ బ్రతిసృష్టిచేయఁజాలు నొక విశాలముకురబింబ మెదుట గాన్పించుచుండెను. ఆముకురబింబమున కుపరిభాగమున జలయంత్రముకలదు. వర్త

మానకాలమునఁ గాలమును విభజించి గంటలఁబ్రదర్శించు గడియారముల కాజలయంత్రములు సాదృశ్యములు. బింబఫలకమునకుఁ బ్రక్కగా నొకజాజిచెక్కలపెట్టియ కలదు. అందలి వివిధములగు నమూల్యవస్త్రాలంకారములు మునిముచ్చులనైన భ్రమింపఁజేయునంతటి సొగసుందనమున మెఱయుచుండు. ఈగదికి రెండుద్వారములు కలవు. ఒకటి మందిరమునుండి గదిలోనికిని, రెండవది గదినుండి బాహ్యవనమునకును గొంపోవును. ఈవనము చక్కనిదై, విశాలమై, నేత్రపర్వమైయుండెను. దాదాపు మూడువేలగజముల నెడల్పునకును, అంతియ పొడవునకును వ్యాపించి యత్యున్నతప్రాకారములచే నాలింగితమయియుండెను. తక్కుఁగల యంతఃపురనిష్కుటములనుండి ప్రాకుచు నొకచక్కని సెలయేరు మనోహరమర్మరధ్వనులతో నీవనమధ్యమునుండి వక్రగతుల నెచటికోఁ బరువెత్తుచుండును. ఈఝరీతటముల రెండంగుళులయెత్తువఱకుఁ బెరిఁగిన పచ్చగడ్డి, ప్రకృతివినిర్మితమైన కంబళమువలె వ్యాపించియుండె. వనాంతరములనుండి ఝరీతీరముల కటునిటుఁ గలయుమార్గము లాశాద్వలస్థలములనుండి వ్యాపించుచుండు. రాకపోకలకు వీలగునట్లు చక్కని వంతెన లటనటఁగట్టఁబడియుండెను. అందొక్క వంతెనమీఁదుగా నడచి వనాంతరమునఁ బ్రవేశించి నలుదిక్కులఁ బరికింతము. ఒక కాలిబాట కిరుప్రక్కల మనోహరములగు నికుంజములు వివిధవర్ణవర్ణితములగు పరిమళకుసుమగుచ్ఛములతో నలంకృతములై సుందరలతావళులచే నాలింగితములై యుండె. ఇనుపతీఁగెలతో నిర్మితమైనపందిరి బాటపొడుగునను వ్యాపించియుండె. ఆపందిరిపై నేయేదేశములనుండి తేఁబడినవో చక్కని సుకుమారలతావితానము లల్లిబిల్లిగా నల్లుకొనియుండె. ఈపందిరిక్రిందుగా నడచిపోయిన తుట్టతుద కొకశృంగాటకమును జేరుదుము. ఈశృంగాటకమునఁ గలియు నాలుబాటలును చతుర్దిశలనుండి వనాంతరమూలముగావచ్చును. అచట

నిలువఁబడి యొకింత నిశ్చలచిత్తముతో సమ్ముఖముననున్న మనోహరరంగమును దిలకించిన నెట్టివాఁడైనఁ దాను స్వర్గలోకముననే యుండినట్లు భ్రాంతిజెందకపోఁడు. అట్టి గురుతరసంస్తోత్రములకుఁ బాత్రమైన యారంగమనోజ్ఞ మిట్టిదని లోకమునకు వెల్లడింపఁ జిత్రకారులెకాని యస్మదాదులు సమర్థులు కామి నయ్యదిట్టిదనియూహించుకొనుభారము చదువరులకే విడిచితి.

జలయంత్రములనుండి సన్నని నీరధారలు చివ్వునఁ బదియడుగుల యెత్తునకుఁ బ్రవహించుచుండెను. ఆనీరధారలు వలయాకారములుగ నున్న నికుంజపుంజములను నిరంతరముఁ దడుపుచు, వానివృద్ధికి సహకారులై పరిణమించుచుండె. గుడిపైన గోపురములవలె నికుంజపుంజములకుఁ బ్రక్కగా నత్యున్నతములైన వివిధవృక్షములు ఫలభరితనమ్రములై యుండెను. వానికివెనుక నినుపతీఁగెల పందిరులపై ద్రాక్షలతలు వ్యాపించి సోమరిపోఁతులవలెఁ జలనములేకయుండెను. ఆమనోహరస్థలమున సార్వభౌముఁడు తనప్రియురాండ్రతోఁగలసి యెన్నిసారులు సరసవిహారముల నొనర్చెనోకదా!

ఒకింతసే పీమనోజ్ఞరంగావలోకనమునుండి మనదృష్టిని వెనుకకు మరల్చి మందిరమున మనచేఁ బ్రవేశపెట్టఁబడిన కమలదెసకుఁ బ్రసరింతము. పరిచారికచేఁ బురస్కరింపఁబడి మందిరమునఁ బ్రవేశించినతోడనే యచటి పరికరవిలాసములకును, ఆవివిధవిచిత్రములకును గమల మిక్కిలి సంతసమొందెను.

“దేవీ! ఈమందిరమును, ఆగదియును మీకు సార్వభౌమానుజ్ఞసరణిని నిర్దేశితములు.” అని పరిచారిక వినయాంజలితో వచించు సమయమునఁ బ్రతిసాయంతనమునఁ బేల్పఁబడుఫిరంగి మేఘగంభీరనిర్ఘోషములతో మ్రోగెను.

“అమ్మా! సాయంతనమైనది. ఇఁకమీరు తగువిశ్రాంతి దీసికొనుట యాచరణీయము.”

నాటిరాత్రి భోజనాదికృత్యములఁ దీర్చికొని ప్రక్కనున్నసోఫాపైఁ బరిచారిక విశ్రమింప కమల తనకై యేర్పఱుపఁబడిన మృదుశయ్యపై నిజసుకుమారదేహమును జేర్చి నిదురవోయెను.

మరుసటిదినమున భానుఁడు తూర్పుదిశ నలంకరింపకపూర్వమే కమలయును బరిచారికయును నిదురమేల్కాంచిరి. వెంటనే కాల్యకరణీయసంధానములలోఁ గములకుఁ బరిచారిక మిక్కిలి సపర్యలొనర్చె. స్వపరిహాసచంద్రికాపటలముకన్న తెల్లనిదగు నొకసన్నని పారసీపట్టుచీరనుగట్టుకొనియున్న కమల, ఆసమయమున మిక్కిలి రూపవతిగాఁ గన్పట్టె. క్రమక్రమముగా సూర్యుఁడు రాజవీథితోఁ దన యేకాంతనిరాలంబపదమున నడుగులు లెక్కనిడుకొనుచుఁ బయనముసేయుచుండెను. ఏఁడుగంటలైనది. అపుడు కమల పరిచారికతో “ఓసీ! నిన్న నీవు నాతో ముచ్చటించినపలుకులు జ్ఞప్తియందున్నవా?” యని ప్రశ్నించెను. “అమ్మా! లేకేమి. ఇదేపోవుచున్నాను” అని కమలయొద్ద ననుజ్ఞ దీసికొని పరిచారిక వెడలిపోయెను.

పరిచారిక తిరిగి వచ్చువఱకుఁ గమల మిక్కిలి యాత్రమునొందఁ జొచ్చెను. ఆపెహృదయమునందు సంతోషసంతాపములు సందడిచేయుచుండెను. పదునైదునిమేషములకుఁ బిదప “దార్ఖానా” ను వెంటనిడుకొని పరిచారిక వచ్చెను.

ఘూర్జర తార.

ఇరువదిరెండవ ప్రకరణము.

తనవిజ్ఞాపనము ననుసరించివచ్చిన తార్ఖానాను జూచి యానందమును బట్టఁజాలక కమలలేచి సంతోషోద్రేకమధ్యమునఁ దనరాజ్ఞీత్వమును మఱచి యాపెకు సాష్టాంగము సేయుటకు సిద్ధపడుచుండ, మృదులహృదయ యగు తార్ఖానా గ్రహించి కమల నద్దానినుండి నివారించి యాపె కోమలకరమును దన చేత నుంచుకొని, మృదుమధురకంఠస్వరముతో నిట్లని వచించెను. "కమలా! నిన్ను గాఁగిలించుకొననిమ్ము నా కెల్లయపుడును ప్రియముఁగూర్చువారినుండి వచ్చితివని, వారి క్షేమసమాచారములఁ దెచ్చితివని నేను వింటిని. నీవు నాజననీసోదరీమణులకు స్నేహితురాల వగుటచే నాకును స్నేహితురాలవే కదా!"

దయారసపరిపూరితములైన యిట్టి వాక్యములకుఁ గమల మిక్కిలి యానందము నొందెను. "నీ తల్లియును, జెల్లెండ్రును క్షేమముగా నున్నారు" అని తారాకమల సత్వరమే చెప్పెను. ఏమనినఁ దమవారి క్షేమములు వినుటకుఁ దార్ఖానా మిక్కిలి యాతురతతో నున్నట్లు కమల గ్రహించెను. "ఓ దైవమా! కృపాకరా! నీకు వందనములు" అని వెంటనే తన మృదుకమలములనెత్తి నిమీలిత నేత్రములతో దేవునికిఁ దన కృతజ్ఞతను తార్ఖానా తెలిపెను.

తదనంతరము కూరుచుండుమని ప్రక్కనున్న యొక పీఠముం జూపింపఁ దార్ఖానా దానియందు దుపస్థితయయ్యె. వారి సంభాషణము

ను విననట్లు పరాఙ్ముఖియై తార్ఖానాను ప్రవేశపెట్టిన దాసి దూరమున నిలువఁబడి యుండెను. దానిని పొమ్మనవచ్చునా కూడదాయని కమల శంకించుచుండెను. పొమ్మనుట యంతఃపురాచారములకు వ్యతిరేకమేమో! ఆపె సంశయమును వెంటనే తార్ఖానా గ్రహించి పరిచారికకుఁ బోననుజ్ఞ యిచ్చెను. అదియును వంగి సలాముచేయుచు నిష్క్రమించెను. ఇపు డామందిరమునఁ దార్ఖానాయును ఘూర్జరరాణియును దక్క మరెవ్వరును లేరు. "అమ్మా! కమలా! చెప్పుము. నా తల్లియును, ముద్దు చెల్లెండ్రును నా వియోగము నెట్లు సహించుచున్నారో చెప్పుము." అని తార్ఖానా మెల్లగనడుగ "దేవీ! చెప్పుట కేమికలదు. మీతల్లి కాపురముండిన ప్రదేశమునుండి నే నొకనాఁడు ప్రయాణముచేయుచుంటిని. ప్రయాణవశమున మీయింటియందు విశ్రమించితి. అపుడు నీ విషాదచరిత్రమును నీజనని నోటినుండియే వింటిని. నీవు వెనుకటి సంగతుల గతజలసేతుబంధనముగా నెంచి నీప్రస్తుతపదవియందైన నానందమును జెందుచుంటివని తెలిసికొంటిరేని వారును శాంతిజెందుదురు.

ఈవిషయములఁ గమల వచించుచుండగాఁ దార్ఖానా వెక్కివెక్కి యేడ్వఁదొడఁగెను. కొంతసేపున కూఱటజెంది మెల్లని కంఠస్వరముతో నిట్లని ప్రశ్నించెను. "ప్రస్తుతమున నారక్షకుఁడును, పోషకుఁడును, అధికారియునగు నా సార్వభౌమునికి నేను జూపవలసిన కృతజ్ఞతయును, భక్తికిని నీచే నింకఁ జెప్పఁబోవు పలుకులు భిన్నభావము కలిగింపవేని నొకని క్షేమమును—ఆతనియెడ స్నేహభావమునకు మించి వేరుభావముంచెడికాలము గతించినది కావున—స్నేహితుఁడని మాత్రమే యెంచియడుగుటకు సంశయింపను."

"ఆయవనుఁడు" అనుచుఁ గమల మెల్లగాఁ జెప్పఁదొడఁగెను. ఆ యవనుఁడు చిరకాలమువెనుక నయేషాను ప్రేమించినవాఁడేయని కమల గ్రహించెను. "నీ వియోగభరమునకు మిక్కిలి కృశతనొంది

యున్నాఁడు." కొన్ని నిమిషములవఱకుఁ దార్ఖానా చింతానిమగ్నయై దీర్ఘనిశ్వాసముల విడుచుచు నూరకుండి తదనంతర మిట్లు పలికెను.

« నేను సంతోషముగ లేకుండినప్పటికిని, నా వర్తమానస్థితి యుండెట్లో కాలము గడపుచుంటినను నొక్క వార్త వారికిఁ బంపఁగల్గినయెడల నాహృదయమునుండి పెద్ద బఱువును దీసివేసిన ట్లుండును. కాని యయ్యది యసంభవము. ఈయంతఃపురములో నెందఱు పరిచారకులచేనైనను సపర్య చేయించుకొననగు—ఎంతటి విలువగల మణులనైనను గోరి స్వీకరింపవచ్చు—ఎన్ని మహాభోగములనైనను దులదూఁగనగు. కాని యొక్క విషయమున నా బంధువులకు నా క్షేమ సమాచారములఁ దెలుపుటకుమాత్ర మనుజ్ఞ లేదు. ఇది యీయంతఃపురాచారము!"

అపుడు తార్ఖానా వదన కమలమును మిక్కిలి సంభ్రమముతోఁ దిలకించుచు « దేవీ! ఈ దుర్భరస్థితినుండి నాకు విముక్తి దొఱకినయెడల నీ వ్యథాగాధమునుండి బయల్వెడలు సూత్రము నాకు సంభవమైనయెడల, నేనే నీక్షేమ సమాచారములు నీవారికిఁ దెలియఁ జెప్పెదను."

« అయ్యో! కమలా! నావలెనే నీవును సంతాపముచేఁ గుందుచుంటివా" అని మిక్కిలి యాశ్చర్య సంభ్రమాభిలాషములతోఁ దార్ఖానా వచించెను.

« నిజమే! నీతల్లినుండియు, సోదరీమణులనుండియు నిన్ను ఘోరముగా విడఁదీసి తస్కరించుకొని వచ్చిన క్రూరుఁడే—ఆదుర్జనుఁడే—ఆముస్తఫాయాకూబే—నా యీదుర్భర దుస్థితికి మూలకారణుఁడు—గ్రంథకర్త! చక్రవర్తితల్లియెడ నావిన్నపము లన్నియు నా మొఱలన్నియుఁ బూర్తిగా నిష్ఫలములయ్యెను"

« నిజమే! నిష్ఫలములయ్యెనన నద్భుతమేమి? కమలా! నీవు మిక్కిలి సౌందర్యవతివి కావున రంజాన్‌పండువు పూర్తిజెందిన పిదప దనకుమారునికి రంజాన్ బహుమతిగా నిన్ను నివేదించుటకు సుల్తానుని

తల్లి మిక్కిలి యూటలూరుచుండును." అని మిక్కిలి జాలిగొలుపఁ దార్ఖానా చెప్పెను.

« నా మొఱలచేతను, దీనవిజ్ఞాపనములచేతను జక్రవర్తితల్లికి జాలిబుట్టించి నేను నావిముక్తిని సంపాదించుకొనుటకు సిద్ధముగా నుంటిని గాని నాదురదృష్టవశమున నాసమయమునందే ముస్తఫాయాకూబాపెతో నేను వెఱ్ఱిదాననియు నట్లగుట నిర్నిమిత్తముగా ఘూర్జరరాణిని నేనేయని చెప్పుకొందుననియుఁ జెప్పెను. ఆకారణమున నాప్రయత్నములు నిష్ఫలములయ్యెను. కాని దేవీ! లోకసృష్టియొనర్చిన దేవుఁడొకఁడుండుట యెంతనిజమో—పరులు వినకున్నను, మన యీప్రసంగమును తప్పక వినుచున్న పరమాత్ముఁడొకఁడుంట యెంతనిజమో—అంతటి సత్యముగా నే నాదురదృష్టపురాణినని చెప్ప నామాటల నమ్ముము."

« పాపము! కమలా! నిజమే" అని సానుభూతితో నాపెను గౌఁగిలించుకొని « నీకనులు నీహృదయనైర్మల్యమును జాటుచున్నవి. నీపలుకులయం దిసుమంతయు నసత్యము లేదు. అంతియకాక యిట్టి యనన్యసామాన్యమగు లావణ్యము ఘూర్జరతారకుఁ దక్క వేరొకరికిఁ గల్గఁబోదు. అకటా! రాణీ! నీకీదురదృష్టస్థితి యెట్లుసంఘటిల్లినది. నేను నీకెట్లు సహాయము చేయఁగల్గుదును?"

తాను ఘూర్జరమునుండి శ్రీనగరమునకుఁ బోవుటయు, నచట రత్నవర్తకుఁడగు రవీంద్రునింట నుండుటయు, నావల ముస్తఫాయాకూబుచే దొంగపాటుగాఁ దీసికొని రాఁబడుటయు నాదిగాఁగల స్వవృత్తములను బూర్తిగాఁ గమల తార్ఖానాకు వచించెను. తార్ఖానా మిగులజాలినొంది కనులనుండి యశ్రుబిందువులుగార « కమలా! ఏమియు దాఁపక నీవృత్తాంతమును నీవు నాతో వచించుటచే నాయంతరాత్మ నాయాలోచనలను నీతోఁ జెప్పఁ ద్వరపెట్టుచున్నది. చక్రవర్తి తల్లితో విన్నపము జేసికొనినచో నెట్లు నిష్ఫలమగునో తెలిసియే యున్నదికదా.

ఇఁకఁ జక్రవర్తితోనె మొఱవెట్టుకొనవగునన్న నదియుఁగూడ నస్లై యగును. ఆయన కృపాళుఁడేయగును. అయినను బూర్వమునుండియు జరుపఁబడుచున్న యాచారములకు వ్యతిరేకించి నడచుట భంగకరమని తలఁచి యూరకొనును. అంతియకాక తనతల్లిచే నెన్నఁబడి యామెచేతనే తనకు నివేదింపఁబడెడు నీసుకుమార బహుమతిని నిరసించుటకుఁ జక్రవర్తి యెంతమాత్రమును సాహసింపఁడు. కావున, వారలయందు నీ వాశబెట్టుకొనిన నిష్ఫలమేయగు. పోని యెట్లు జరుగఁబోవునో చూడనగునని చక్రవర్తితో నీవిషయమై ప్రసంగించెదమన్న నాతఁడు రంజాన్‌పండువు పూర్తియగువఱకు నంతఃపురమునఁ బ్రవేశించుటకుఁ గులాచారము లొల్లవు. సంగతులిట్లుండె. కమలా! నీకొఱకేమిచేయనగు? ఏ తెరువును గాన్పింపదే? కాని యీయంతఃపురమునుండి తప్పించుకొనిపోవుట యను పిచ్చియూహను మాత్రము పెట్టుకొనఁగూడదు సుమీ! ఏమనివ నట్టి ప్రయత్నము తప్పక విషాదముతో నంతమొందును! మోసముతోఁ బూర్తియగును!!”

తుట్టతుద కీయాశయు నిష్ఫలమయ్యెఁ గదాయని కమల లోలోన ననిర్వాచ్య చింతాభరంబున మ్రగ్గుచుండె. ఏయువతి తనకు సాహాయ్యము చేయునని తలంచెనో, ఆవనితయే—ఆతార్ఖానాయే— నిరాశా సూచకములగు పలుకులఁ బలుకుటచేఁ గమలకు మిక్కిలి సంతాపము కలిగె.

“అట్లయ్యును గమలా! నాచేఁ జేయనగునదంతయు నొనర్చెదను, సర్వప్రయత్నములను జేసెదను. ఊఱడిల్లుము.

ఇంతటఁ బరిచారిక లోనికిఁ బ్రవేశించి కమలాతార్ఖానాలకు వంగి సాష్టాంగమొనర్చి “అమ్మా! వెనుక మీకుఁ బరిచారికగానుండిన చిన్నదియఁట—అంతఃపురద్వారమున నిలచి మీదర్శనమునకై కుతూహలముఁ నొందుచున్నది” అని కమలకుఁ జెప్పెను. సత్వరమే యధికమగు

సంతోషము కమలకుఁ గలిగెను. ఇంతవఱకును దుఃఖమేఘముచే నావరింపఁబడిన యామె సుకుమారముఖబింబము తొంటి సహజతేజః ప్రజ్వలనముతో భాసిల్లెను. దర్శనకుతూహలముతో నున్న యాచిన్నది తన ప్రియపరిచారికలగు మాలినీ మాలతులలో నొక్కరితయై యుండవచ్చునని యూహించెను. వెంటనే “తన పేరేమని చెప్పినది? అయినను పేరుసంగతియేల? వెంటనే లోనికిఁ బ్రవేశపెట్టుము” అని కమల వాక్రుచ్చెను.

“కాదు కాదు. అట్లుకాదు. ఆచిన్నదాని నంతఃపురమునఁ బ్రవేశపెట్టుటకు ముందుగాఁ జక్రవర్తితల్లి యనుజ్ఞ నొందవలెను. కావున నేనే యామెకడకేగి తదనుజ్ఞను గైకొని మరల త్వరలో వచ్చెద”నని చెప్పుచుఁ దార్ఖానా కమలను విడిచి నిష్క్రమించెను. నూతన పరిచారికాగతమును దెలిపిన దాసియును తార్ఖానాను వెంటనంటి పోయెను. ఇపుడు మందిరమునఁ గమల యొక్కతెయే యున్నది.

శ్రీనగరమునుండి ముస్తఫాయాకూబుహాతకునిచేఁ గొంపోవఁబడినదాది తనకుఁ దోడునీడయై యున్నవారెవ్వరును లేకపోవుటచే నిష్పడీపరిచారికాసంపర్కమునఁ గొంతవఱ కూఱటఁ గల్గునని తలంచెను. ఆవచ్చినవారివలనఁ దన హృదయమును మొన్నమొన్ననే యాకర్షించిన మోహనునివిషయముకూడఁ దెలియనగునేమోయని యోజించెను. అంతియకాక తనవిముక్తికి నేమైన నుపాయముఁ జూపట్టఁగలుగునేమోయని యాలోచించెను.

ఈరీతిని ఘూర్జరతార తలపోయుచుండఁగా నొక యఱగంటలోఁ దార్ఖానా తిరిగివచ్చి మిక్కిలి సంతోషముతో “గమలా! చక్రవర్తితల్లిగారి యనుజ్ఞను సులభముగా సంపాదించితిని. ఆమె పూర్వాచారమును మాత్రము విడువలేదు. నీవు జీవములతో నీయంతఃపురమున నుండునంతకాలమును, నిన్ను విడిచికాని యీయంతఃపురమును విడి

చికాని యీపరిచారిక బాహ్యమున కేగగూడదఁట. ఏలయన రంజాక్ బహుమతిగా స్వీకరింపఁబడినవారింగూర్చి వారిబంధువుల కడకేగి పరిచారికలు క్షేమసమాచారములఁ దెలుపుటకు వీలులేకుండును. అట్లగుటచే నీయాచారము సార్వభౌము నాజ్ఞానుసరణిఁ బ్రవర్తింపఁబడుచున్నది” అని చెప్పెను.

“అయ్యో! ఆచిన్నదాని నట్టినిర్బంధములచేఁ గట్టుట న్యాయమా” యని జాలిగొలుపఁ గమలపలుక “నీకాచింతయేల? ఏసంభ్రమకౌతూహలము లాసేవకురాలిని నిన్నుగాంచు నుద్దేశముతో శ్రీనగరమునుండి కొనివచ్చినవో యవియే నిస్సంశయముగా నెట్టినిర్బంధములకైన నొడంబడునట్లు చేయును. ఇంతయేల? ఆవిషయమిప్పుడే తెలియనగు. దానితోఁ బ్రసంగించుటకు మనదాసిని బంపితి—” ననునంతలో దాసి ప్రవేశించి యెప్పటివలె సలాములొనర్చి “ఆనిర్బంధముల కొడంబడినది. త్వరలోఁ దమ దర్శనమునకై యెదురుచూచుచున్నది.” అని కమలతోఁ బలికెను.

వచ్చినది మాలినియా లేక మాలతియా యని తనలోఁ దాను కమల వితర్కించుకొనుచుండగా “అమ్మా కమలా! నీపరిచారికయును నీవును బ్రసంగించుకొను విషయములు చాలగా నుండవచ్చును. కావున నేనిఁక నిన్ను విడిచి వెళ్లెదను. మరల రేపు సాయంతన మాఱుగంటలకు వచ్చెద” నని తార్ఖానాపలికి నిష్క్రమించెను. అంతట వచ్చునది మాలినియో మాలతియో యని తలపోయుచు నువ్విళులూరుచుండ మందిరద్వారము తెఱువఁబడి దాసిచే నొక క్రొత్తవనిత—మాలినియునుగాదు మాలతియునుగాదు—లోనికిఁ బ్రవేశపెట్టఁబడెను. సత్వరమే కమల నిశ్చేష్టయయ్యె. ఆపె హృదయమునఁ బెద్దరాయిపడినట్లయ్యె. ఏదియో యొక గొప్పపొరపాటు సంభవించెనని యామెతలఁచెను. కాని మరుసటితక్షణముననే కమల కొకయూహ జనించెను; తోడనే యా

శాంకురములు మొలకలెత్తసాగెను. ఢిల్లీపురమును దాను బ్రవేశించుటకు ముందుగా నొకనావలో నదిని దాఁటుచుండ దానియందే మందరయుండుటయు, నాపెప్రక్క నొకజవ్వనియుండుటయుఁ గమలకు జ్ఞాపకము వచ్చెను. ఆజవ్వనిరూపము నీవసితారూపము నొకటియే కావున నామెయే యీయామెయని కమల క్రమముగా గ్రహించెను.

మందిరద్వారము మూసివేయఁబడి యుండెను. ఇపుడచట కమలయును నూతనపరిచారికయుఁ దక్క మఱెవ్వరును లేరు. అధికవినయవిధేయతలతో నాయువతి తన్ను డాయుచుండ దానివివిధాంగసౌష్ఠవవిలాససౌకుమార్యములను కమల త్వరితముగాఁ దిలకించెను. ఆపెదేహవర్ణ మదియొకరీతిగాఁ గన్పట్టె. ఉత్తరదిశను మిక్కిలి శీతలప్రదేశములలోనుండు స్త్రీలకు సహజమగు పాండురవర్ణచ్ఛాయయును గాక, మిక్కిలి దక్షిణదేశములలోనుండు స్త్రీలకు సహజముగానుండు హరిద్రవర్ణచ్ఛాయయును గాక హరిద్రపాండురవర్ణ మిశ్రమమై ముగ్గియు ముగ్గక సగముపండిన వంగపండువంటి ఛాయతో నాపె దేహము ప్రజ్వలించుచుండె. గండఫలకములం దచ్చటచ్చటఁ గందినట్లు తరుణాంగారవర్ణము జూపట్టె. దంతములు పరిశుభ్రములై యెట్టివక్రగతులనైనను బోక ముఖవిలాసమునకు మఱింతవన్నెఁ దెచ్చెను. చక్కఁగా ముచ్చటముడి వేయఁబడిన యాపె కోమలకుంతలములు కారుచీఁకటులచేఁ గప్పఁబడినట్లు మిక్కిలి నల్లనివై యుండెను. దాదాపైదడుగులయెత్తుండును. ప్రాయము పదునెనిమిదేండ్లకు మించదని తోఁచెను.

క్రమక్రమముగా సమీపించి యాజవ్వని కమలకు సాష్టాంగమొనర్చ భూమిపై వ్రాలెను. అది గ్రహించి “లేలెమ్మ, నీవెవ్వతెవో త్వరలోఁ జెప్పుము” అని యాతురతతోఁ గమల ప్రశ్నించెను. “దేవీ! నా పేరు “క్లోడిస్సా” అని ప్రత్యుత్తరమిచ్చునప్పు డాజవ్వని కంఠనిస్వన

ము మిక్కిలి పేశలమై శ్రావ్యమై యుండెను. ‘‘క్లోడిస్సా!’, అని దానిని లేవఁదీయుచు ‘‘నీవిట్లు నాకై స్వార్థత్యాగమొనర్చుటకుఁ గలకారణమేమి? ఇందేదియో గూఢార్థముకలదు. త్వరలో చెప్పుము. నన్నీదుర్భర సంశయాందోళనమునుండి విడదీయవచ్చితివా!” అని కమల పలికెను.

తాను జెప్పఁబోవు సంగతుల నెవ్వరును వినుటలేదు కదాయని మందిరాంతరమున నన్నిదిశలను బరికించి రహస్యముగా ‘‘దేవీ ! నన్ను మందర పంపించెను.” అని క్లోడిస్సా చెప్పెను.

‘‘క్లోడిస్సా! క్లోడిస్సా!! అట్లయిన నేనింకఁ జింతనొందనక్కఱలేదు. ఈదుస్థితినుండి విముక్తి నెందుటకు మార్గము కలదు.” అని కమల గద్గదస్వనముతో వచించెను.

‘‘దేవీ! నీవిముక్తి కనేకమార్గములు కలవు. ఊఁ అడిల్లుము.”

అనిర్వచనీయ సంతోషసూచకములగు చూపులతోఁ గ్లోడిస్సాను దిలకించి, పిదప భక్తిని బద్ధాంజలియై నిమీలితనేత్రములతో దీనరక్షకుఁడగు పరమాత్మను కమల ధ్యానించెను.

ఘూర్జర తార.

ఇరువదిమూఁడవ ప్రకరణము.

ఇంతవఱకును భూమిపై వ్రాలి సాష్టాంగమొనర్చుచున్న క్లోడిస్సా యిపుడు లేచి భక్తిని బద్ధాంజలియై కమలచేఁ బ్రక్కనున్న యొకపీఠముపైఁ గూర్చుండ సన్నచేయఁబడి ‘‘దేవీ! మీయెడ నేనింత వినయవిధేయతలతోఁ బ్రవర్తించుటకుఁ గారణమేమనిన మీరు ఘూర్జరదేశపు రాణిగారని నేను పూర్తిగా నెఱిఁగియుంటిని. నాయట్టిపేదరాలు మీయట్టిరాణిగారియెడ నిట్లుమెలఁగుట విధియేకదా” యని పలికెను.

‘‘క్లోడిస్సా! సంతోషము సంతోషము!! నీవు నన్నీయంతఃపురమునుండి తప్పించినను, లేకపోయినను నిన్నుమాత్ర మెన్నటికిని మఱువనుసుమీ” అని కొంచెమాగి ‘‘క్లోడిస్సా! చెప్పుము! చెప్పుము! ఇటనుండి పోవుటకు వీలుకలదా?” అని మిక్కిలియాతురతతోఁ గమల యడిగెను.

‘‘అమ్మా! మిక్కిలి మేధావతియగు మందరచే నూహింపఁబడిన యొక సూక్ష్మోపాయము మీవిముక్తికి మూలకారణముగాఁ బరిణమించును. దానిని రెండుమూఁడుమాటలలోఁ జెప్పుటకు వీలులేదు కాని ప్రస్తుత మొకవిషాద ఘోరవార్తను వినుటకు సిద్ధముగానుండుఁడు.” అని క్లోడిస్సా యొకింతవిచారమును సూచించెను.

‘‘ఏమిసమాచారము? ఎట్టిది—ఎట్టిది—” అని మిక్కిలి భయకంపితగాత్రియై కమల యడిగెను.

‘‘దేవీ ! మీపరమస్నేహితుఁడు—వందనీయగుణుఁడు—వృద్ధుఁడు—రవీంద్రుఁడు.........

"రవీంద్రుఁడా! వానికేమిసంభవించినది? అయ్యో—"

"దేవీ! ఆదయామయుఁడిపుడు మనలోలేఁడు— ఈలోకమును విడిచిపోయెను—ఇంతయేల రహస్యముగాఁ జంపఁబడియెను." అని మిక్కిలి సంతాపముతోఁ గ్లోడిస్సా చెప్పెను.

కమల నిశ్చేష్టయయ్యెను. కొంతసేపున కామె కనుదమ్ములనుండి యశ్రుజలములు బొటబొట గాఱెను.

"అమ్మా! ఇందుసందియమేమియు లేదు. వానింజంపినవాఁడు హేమచంద్రుఁడఁట. అతఁడు రక్షకాధికారులచేఁ బట్టుకొనఁబడెను. ఇపుడతఁడు కారాగృహముననే యున్నవాఁడు."

"నాకు మొదటినుండియు వాఁడు కడుక్రూరుఁడని యనుమానముకలదు. ఆసంగతి రవీంద్రునికిఁ జెప్పకుంటినిగదా."

"హేమచంద్రుఁడే రవీంద్రుని హంతకుఁడగుట నిస్సందేహవిషయమే. ఏమనిన రక్తముచేఁ దడుపఁబడిన కట్టుబట్టలతో వాఁడు రవీంద్రుని కళేబరమునుండి కాలికొలఁదిని బాఱిపోవుచుండఁగా మోహానునిచేఁ బట్టుపడియె. ఆహంతకుఁడే నీయీఢిల్లీనగరప్రదేశమునకుఁగూడఁ గారకుఁడని యూహింపఁబడియె. ఎట్లోయీసంగతిని మందర యూహించెను. ముస్తఫాయాకూబు నిన్నుఁ దస్కరించుకొనిపోవుచున్నాఁడని యామె సూక్ష్మముగా గ్రహించి వెంటనే నీకు సహాయముసలుప నన్నిచటికిఁ బంపెను. ఆకూబు వ్యాపారవిషయ మిదివఱకు మందర యెఱిఁగియేయున్నది. కావున నిన్నిచటి కేకారణమున వాఁడు పట్టుకొని వచ్చెనో యామె పూర్తిగా నెఱుఁగును. వానిచే నీవట్లు కొంపోవఁబడుచున్నావని తెలిసికొనినవెంటనే యొక సేవకునిమూలముగా సర్వవిషయములను మోహానునికిఁ దెలియఁబంపి తానుగూడ నీనగరమునకు విచ్చేసెను. ఆసేవకుఁ డేగునప్పటికి. మోహానుఁడు రవీంద్రునిసౌధమున లేనట్లు తెలియవచ్చె. మీకొఱకు వెదకుటకై వెడలియుండనగు. అయి

నను, మోహానుఁడు తిరిగివచ్చినపిదప సేవకుఁడు మందరాసందేశమును వినిపించెను. కావున డా నీపురమునకు వచ్చినయెడల నెచట మందర వసించియుండునో మోహానుఁడు తెలిసికొనును. దేవీ! మీరిచటికెట్లు తీసికొనిరాఁబడిరో యడుగనగునా?"

"ఆదురదృష్టపు రవీంద్రునిసౌధమున నేనారాతిరి నిదురఁబోయితిని. నిదురఁదెలసి, కనులఁదెఱచిచూచునంత మిక్కిలివేగముతోఁ బరువెత్తింపఁబడుచున్న యొక గుఱ్ఱపుబండిలో నేనుండుటనుగాంచితి. నిస్సంశయముగా నాకేదియో మత్తుమందు పెట్టఁబడియె. నేనే శకటములో నెక్కితినో, యెవరైన నన్నెక్కించిరో నాకేమియుఁదెలియదు. కాని హేమచంద్రుఁడే దీనికిఁ గారకుఁడనుట యొప్పుకొనఁదగినవిషయమే. వాఁడొక్కఁడేకాఁడు. ఇరువురు సహచరులుకూడ గలరన్నట్లు తెలియవచ్చెను. ఆయిరువురు నాకు సోదరులైనట్లును, వారిసమ్మతినే నన్నా యాకూబునకు విక్రయించినట్లు నిటీవలఁ దెలియవచ్చెను. ఆవిషయములనట్లుంచి గ్లోడిస్సా! నావిముక్తికి నిర్దేశింపఁబడిన పన్నిదమేదియో చెప్పుము. వినుటకు మిక్కిలి యాతురతతో నున్నాను."

"అమ్మా! మీవిముక్తిని మీరు తప్పక యభిలషించునెడ నెట్టికృత్యములకైనను భయమొందఁగూడదు."

"భయమా! మృత్యువెదుర్కొననున్నను భయమొందను" అని గంభీరముగాఁజెప్పెను.

"మీకామాత్రము ధైర్యముకలదేని వినుఁడు. మీరీయంతఃపురమునుండి చనిపోయినవారివలెనే తప్పించుకొనవలయు!"

ఈపలుకులఁ బలుకుచుఁ గ్లోడిస్సా కమలవంకఁ జుఱుకుచుఱుకునఁ జూచెను. ఆచూపులయందేదియో గూఢార్థముకలదని కమల గ్రహింపకపోలేదు.

"ఏమి—ఏమి? చచ్చినదానివలెనా? అందర్థమేమి?"

“అమ్మా! తొందరతో నాలోచింపకుము!” అని యొకింత యాగి “ఒకవేళ నేనెద్దియో మోసమును మీయెడఁ దలంచుచున్నానని మీరెంచుచుంటిరి కాఁబోలు! అమ్మా! మోసముదలంచుట కిదివఱకు మీరు నాకేమైన నపకారమొనర్చియుండిరా!

“నిజమే! క్లోడిస్సా! నీయెడ నేననుమానముఁ దలంచుట మిక్కిలి తప్పే. కాని నీపలుకులయం దేదియో మర్మార్థము—గూఢార్థముకలదు—అంతియకాక నీచూపులయందు—ఇట్లనుచున్నానని కోపము నొందకుసుమీ—నీచూపులయం దేదియో యంతరార్థముకలదు.

“ఓహో! అదియా! సరే! తెలిసినది.” నవ్వుచు “నాచూపులా! అట్లుచూచుటకుఁగలకారణ మంతగాఁ జెప్పవలెనా! సరే! చెప్పెదవినుఁడు. మీరీయంతఃపురమునుండి విడివడుటకు మృత్యువుతోనైనను బోరాడెదమనిరికదా! అట్లుచేయఁగలరా లేరా యని మీదెస తీవ్రముగాఁ బరీక్షించుచుంటిని.

“ఓహో! ఇంతకును మృత్యువుసంగతియేల? నీపన్నిదమెట్టిది? ఇదియంతయు గోలగానున్నది. త్వరలో విశదీకరింపవేఁడెదను.

“మందరాబుద్ధినిబద్ధంబగువ్యూహవిన్యాసములను మీకు వెల్లడించుటకుముందు నిర్మలమనస్కులై యుండవలెనని మిమ్ము వేఁడెద.”

“సరే. అట్లేయుండెదను చెప్పుము” అని సత్వరమే తనయాతురత నణఁగఁద్రొక్కి శాంతిసూచకమగు ముఖవర్చస్సుతోఁ గ్లోడిస్సాచే నిర్వచింపఁబడఁబోవు విషయములనాలకించుటకు సంసిద్ధమైయుండెను.

“మందర గొప్పవైద్యురాలనుసంగతి మీరెఱుఁగుదురుకదా. ఆమె కన్నియోషధులగుణములును వానిప్రక్రియలును బూర్తిగా విదితములు. ఇదిగో, ఆమెచే నీయఁబడిన యొకచూర్ణము నాయొద్దకలదు” అని తనయొడిలోనుండి యొకపొట్లమునుదీసి, దానినివిప్పి యందుండినచూర్ణమును జూపించుచు “ఈచూర్ణము నుగ్గుగిన్నెఁడునీళ్ళలోఁ గలపి యా

మిశ్రమమును ద్రావినయెడల వెంటనే మత్తుకలిగి నిర్జీవవలె నెట్టివారైనను నిద్రింతురు. మృత్యువువాతబడినట్లు దేహము చల్లగానుండును. ఉచ్ఛ్వాసనిశ్వాసములుండవు. ఎట్టిమహావైద్యుఁడువచ్చి నాడీపరీక్షఁ జేసినను తప్పక మృతినొందెననియే చెప్పును. జీవస్థాపనకుఁ బ్రధానభూమికలగు హృదయజఠరాదికోశము లడ్డగింపఁబడునే కాని, నిర్మూలితములుకావు. ఈసంగతుల గ్రహించినపిదప మందరచే నిబద్ధితమగు పన్నిదమేదియో మీకు దురూహ్యముకాదు. ఇఁక నాపన్నిదము నాచరణలోనికిఁ దెచ్చుటయో, తేకుండుటయో మీయాలోచనచే విశదీయము.” అని కొంచెమాగి దేనినో స్మరణకుఁదెచ్చికొని “ఇంకొకవిషయము వినుండు. మీ రాచూర్ణమును సేవించినపిదప హిందూమతాచారముల ననుసరించి మీకు దహనాదికర్మముల—అమ్మా! ఇట్టియమంగళములు నానోటనుండి——” అని చెప్పకముందే “అట్టివి మనప్రస్తుతప్రసంగమున వచ్చెనేని తప్పింపవీలులేదు. నేనెంతమాత్రమును నొచ్చుకొనను” అని క్లోడిస్సా పలుకులకడ్డమువచ్చి కమల పలికెను.

“అట్లయిన మీకు నాహృదయపూర్వకవందనములు” అని తన వెనుకటిసూత్రప్రసంగమునందుకొని మరలక్లోడిస్సా యీరీతినివచించెను. “అట్లు మీ కాయాకర్మములనలుపుటకు మీకళేబరమును ప్రేతభూమికిఁ దీసికొనిపో నధికారుల నడిగెదను. దానికి వారొప్పుకొనిరా మంచిదే లేనియెడ నింకొకచోటికిఁ దీసికొనిపోవుట కనుజ్ఞయీయఁబడనేని లేకట్టిదియేకాక, మనపన్నిదమున కేవిధమగు విరోధము సంభవించినను, ఈచూర్ణక్రియకుఁ బ్రతిక్రియ—అనఁగా విఱుగుడు—ఒకటికలదు. అది కొన్నియోషధులనుండి తీయఁబడినసారము. ఆసారబిందువులు రెండుమూఁడు పుచ్చుకొనినంత, జీవము వెంటనే పునఃప్రతిష్ఠితమగు. ఇంతయేల! మీయెదుటనే, నేనీప్రక్రియలఁ బ్రయోగించెదను చూడుడు. ఇదిగో, ఈగాజుకుప్పెను దీసికొని యందుఁగలసారము నాయెడ నుపయోగింపుఁడు.”

"అయ్యో! అయ్యో! క్లోడిస్సా! ఏమిచేయఁబోవుచుంటివి?" అని మిక్కిలి భయముతో కమలయడిగెను. ఏమనిన క్లోడిస్సా తన హస్తమందనున్న పొట్లమునందుఁగల చూర్ణములోఁ గొంత నొక కాచపాత్రయందునిచి దానిని నీళ్ళలోఁ గలఁగించెను.

"దేవీ! ఏమిచేయుదునో చూచెదరుగాక! అడ్డముమాత్రము చెప్పకుఁడు" అని క్లోడిస్సా పలికెను.

చూర్ణోదకమును త్రావి మృతినిబోలు మూర్ఛతోఁ బడుననియు ప్రాణములు మరల వచ్చుటకుఁ దనచేతనున్న యౌషధసారమును బ్రయోగింపవలెననియుఁ గమల యిపుడు గ్రహించి వెంటనే క్లోడిస్సాకు నిరోధముఁ గలిగించి "వద్దు వద్దు. ఆపనిచేయవద్దు. నీయెడ నాకెట్టియనుమానమును లేదు, నీవు విశ్వాసమునకు మిక్కిలి పాత్రురాలవు. నిన్ననుమానముతోఁ జూచినందులకు నేను మిక్కిలి నింద్యురాలను. హృదయపూర్వకముగా నన్ను మన్నింపుము" అనుచు నాచూర్ణోదకమును బ్రక్కనున్న గవాక్షమునుండి బహిఃప్రదేశమునకు—అనఁగా వనమువంక—పారబోసెను. అట్లుచేసిన వెంటనే "చాలును, నీయెడ నాకింక నణుమాత్రమైన ననుమానము కలుగఁబోదు. నీవు నాస్నేహితురాలవు—మందర నాస్నేహితురాలు—మీయిష్టానుసారము తప్పక వర్తించెద" అని కొంచెమాగి "రంజాన్ పండువు పూర్తియగుట రేపేకదా! కావున నీసాయంతనమే మందు పుచ్చుకొనవలెను. ఇపుడు రెండుగంటలైనది—ఆఱుగంటలకు చూర్ణోదకతో సిద్ధముగా నుండుము" అనిచెప్పి క్లోడిస్సానువిడిచి ప్రక్కనున్న శయ్యామందిరమున కేగెను.

అట్లేగి యొక కాగితముపై నీరీతిని వ్రాసెను.

"దయామయవగు నోదేవీ,

తాము రేపు సాయంతనము వత్తుమని చెప్పివెడలిపోయిరి. అంతవఱకును మీదర్శనము నభిలషింపకుండుట ముఖ్యముగా నాచరణీయమే! కాని, కొన్ని కొన్ని కారణాంతరములచే మీదర్శనమిప్పుడే యభిలషితమయ్యె? ఆకారణములు మీప్రత్యక్షమున మాత్రమే ప్రసంగింపఁదగినవి. కావున మీరు నాపై దయయుంచి సత్వరమే యిటకు వచ్చెదరుగాక యని నాహృదయపూర్వక ప్రార్థనము.

ఇట్లు,
ప్రియస్నేహితురాలు,
కమల"

ఈయుత్తరమును చేతఁబట్టుకొని మరల క్లోడిస్సాయున్న మందిరములోనికి వచ్చి యామెకాయుత్తరము నిచ్చి తార్ఖానా కీయుమని పుత్తెంచెను. అదియును వెంటనే నిష్క్రమించెను.

కొద్దినిమిషములలోఁ దార్ఖానా కమల కూర్చుండిన మందిరమునకు వచ్చెను. వారిరువు రామందిరమున నేకాంతముగా నున్నపుడు మందరచేఁ గల్పితమగు పన్నిదమును సర్వమును తార్ఖానాకుఁ గమల చెప్పెను. దానిని వినిన పిదపఁ దార్ఖానా మిక్కిలి సంతోషించి కమలను గౌఁగిలించుకొని—ఒకగంటకాలము మిక్కిలి ప్రియసంభాషణ మొనర్చి, తనస్థితిని దనతల్లికిని, చెల్లెండ్రకును జెప్పుమని మిక్కిలివేఁడుకొనుచు, విడువలేకవిడువలేక తుదకు కమలనువిడిచి తనహర్మ్యమునకుఁబోయెను.

సాయంతనము సమీపించె. ఆఱుగంటలయ్యెను. అంతట కమలామందిరములో నేమిజరుగఁబోవునో మనము మరలమరలఁ జెప్పుకొననక్కఱలేదు. అనుకొనినరీతిగా నంతయు నాచరింపఁబడెను.

ఆఱుగంటలైనపిదపఁ గమల హఠంబున మృతినొందెనను ఘోరవార్త యంతఃపురమునం దతివేగముగ వ్యాపించి యాందోళమునకును, సంతాపమునకును గారణమయ్యెను. "అయ్యో! అయ్యో!! కమలా!!!" యని పెద్దపెట్టున క్లోడిస్సా యేడ్చుచుండవిని, మందిరమునకు వెలుపలనున్న యిరువురంతఃపురదాసీలు వేగమే యావిషాదరంగమునకువచ్చి

దిగ్భ్రమఁజెందిరి. జీవరహితయై పడియున్న కమలను, అమెకుఁ బ్రక్కగా భూమిపై వ్రాలి హృదయపూర్వకముగా నేడ్చుచున్నట్లు కానఁబడిన క్లోడిస్సాను దిలకించి దాసీలు చెందినభయ మిట్టిదని వర్ణించుటకు వలనుకాదు. వారు వచ్చినపిదపఁ గొన్ని నిమిషములకుఁ గ్లోడిస్సా వారితో వైద్యులను దీసికొనిరండని చెప్పెను. వెంటనే పరువెత్తుచు నొక దాసి తార్ఖానాకొఱకును, రెండవది చక్రవర్తి తల్లికొఱకును బోయిరి. మందిరము మాఱుమ్రోయునట్లు క్లోడిస్సా యింకను నేడ్చుచు నేయుండెను. ఇంతలోఁ జక్రవర్తి తల్లియుఁ దార్ఖానాయు, వారివెంట నిరువురు రాజవైద్యులును మందిరములోనికిఁ బ్రవేశించిరి. వారందఱును విస్మయ విషాదస్తంభీభూతులై కొంతవఱ కచ్చెరువొందిరి. కమలకు నాడీపరీక్షఁ జేయుఁడని రాజవైద్యులకుఁ జక్రవర్తి తల్లి యాజ్ఞాపించెను. వారును కళేబరమునుడాసి యొక్కరొక్కరే నాడీపరీక్షను జేసిరి. నాడి యెంతమాత్రమును గొట్టుకొనుట లేదు. ఒడలు చల్లగానుండెను. ఉచ్ఛ్వాసనిశ్వాసము లంతకుఁబూర్వమే లేవు. ఆపరీక్షానంతరము వైద్యులు చక్రవర్తి తల్లితోఁ గమల తప్పక మృతినొందెనని చెప్పిరి; కాని యేరోగముచేత మృతినొందెనో విశదీకరించుటకు వారు దడఁబడుచుండఁ, మునుపటివలెనే పెద్దపెట్టున వెక్కివెక్కి క్లోడిస్సా యేడ్చుచు నేదియో గొణుకుకొనుట వారికి వినవయ్యె. ఆగొణగుకొనుటలోఁ గొన్ని విచిత్రాంశములు వినవచ్చుటచే నందు పెద్దవాఁడగు వైద్యుఁడు "ఓసీ! మీయమ్మగారి యకాలపుమరణమునకు ముస్తఫాయాకూబే కారకుఁడని యేమేమియో గొణగుచుంటివే. ఆవిషయమెట్టిది? త్వరలో జెప్పుము" అని ప్రశ్నించెను.

అంతటఁ గ్లోడిస్సా విసవిసలేచి చక్రవర్తి తల్లి పాదములముందు సాష్టాంగమొనర్చి "దేవీ! ఈదీనురాలు వచించువాక్యముల వినుఁడు. మాయమ్మగారిచావునకా ముస్తఫాయాకూబే మూలకారణుఁడు. ఆమెను

గృహమునుండి తప్కరించుకొని వచ్చునపు డాపెకేదియో మందిచ్చెను. ఆమందు మొట్టమొదట మత్తునుగలిగించియుఁ గొన్నిగంటలకుఁ బిదప తెలివినిచ్చెను. కాని యామందేదియో విషసంబంధమగుటచే నిప్పటివఱకు నంతర్గతమయి తుదకామెయంతమునుజూచెను. దేవీ! అయ్యో! ఇంకేదిగతి తల్లీ! తల్లీ!! ఇదియంతయును ముస్తఫాయాకూబే చేసెను" అనుచు మహారోదనమును జేయుచుండెను.

ఈపలుకులు వినినంతఁ జక్రవర్తి తల్లి క్లోడిస్సాయొక్క నడవడికను గూర్చి తార్ఖానా నడిగెను. ఈపన్నిదమంతయుఁ గమల తార్ఖానాకిదివఱకే చెప్పియుండెఁ గావున దార్ఖానా చక్రవర్తి తల్లితోఁ గ్లోడిస్సా తనకుఁ బ్రియపరిచారికయనియు, ముస్తఫాయాకూబు తనకేదియో మత్తుమందు పెట్టెననియుఁ, దత్కారణమునఁ గొంతవఱకిప్పటికి మత్తుగానున్నను గ్రమక్రమముగా దేహమునం దాందోళనము కలుగుచున్నదనియు, నందుచేఁ దానిఁకదీర్ఘకాలము బ్రదుకననియు మొదలగువిషయములఁ గమలయే తనకుఁజెప్పినట్లు చెప్పెను. తార్ఖానాయే యిట్లు చెప్పుటచేతఁ జక్రవర్తి తల్లి రవ్వంతయు ననుమానము చెందక క్లోడిస్సాతో "ఓసీ! నీమాటలను నేనువిశ్వసించినాను. ఆముస్తఫాయాకూబిప్పుడే శిక్షింపఁబడుఁగాక" అని పలికెను.

ఇంకను బెద్దపెట్టున నేడ్చుచు "తల్లీ! ఆదుర్మార్గుఁడు తప్పక శిక్షింపఁబడవలసినవాఁడే"

చూచితిరా చదువరులారా! క్లోడిస్సానేర్పు! ఈపన్నిదముచేఁ గ్లోడిస్సాయెడ నెట్టియనుమానమైనను దుడిచిపెట్టఁబడుటయె కాక, ముస్తఫాయాకూబు శిక్షాపాత్రుఁడుకూడనయ్యె.

"దేవీ! తనమరణము దూరములో లేదనియెఱింగి, తానుజనిపోయినపిదప మనయాచారముల ననుసరించి కాక, స్వమతాచారానుకూలముగఁ దనకు దహనాదికర్మలఁ జేయవలసినదని నన్నెంతయో మఱి

మఱి వేఁడుకొనెను. కావునఁ దమకావిషయము విశదీకరించితి. నిర్మల కృపాంతరంగులరును, ధర్మకార్యాసక్తలును, సర్వజనసంస్తవనీయచరిత్రలరును నగు మీరీదురదృష్టపుఁ గమలయొక్క కడసారికోర్కెను దీర్చెదరని నాప్రార్థన” మని యధికవినయముతోఁ దార్ఖానా చక్రవర్తి తల్లిని వేఁడుకొనెను. స్తుతింపఁబడినచో నుబ్బి తబ్బిబ్బునొందుట యాబిడకు సహజము కావున తార్ఖానాస్తోత్రములకు వెంటనే “సరే! మీయిష్టానుసార మీకళేబరమును గొంపోవుదురుగాక” యని లఘుప్రత్యుత్తరముతోఁ దార్ఖానాను సరిపుచ్చి “ఓసీ! నీయజమానురాలియెడ నీకుఁగలవిశ్వాసము నాకు హృదయంగమమైనది! నీవునాకు సపర్యసేయుచు నిచటనుండినను సరే! లేక—

తల్లీ! మీకుఁ బదివేలవందనములు. నేను మాయమ్మగారి బంధువులకడకేగి యీదుఃఖవార్తను జెప్పవలయును. నన్ను పోనిండు” అని యాపెమాటలకడ్డమువచ్చి క్లోడిస్సా యేడ్చుచునే వచించెను.

“సరే! అట్లేపొమ్ము” అని సెలవిచ్చి తార్ఖానాయును రాజవైద్యులును వెంటరాఁ జక్రవర్తితల్లి నిష్క్రమించెను. పిదపఁ గ్లోడిస్సా వెంటనడువ కమల యొకశకటములో నంతర్భాగమున నుంపఁబడి తీసికొనిపోవఁబడెను. మస్తఘాయాకూబు పట్టుకొనఁబడి ముప్పది చుఱుకుకొఱడా దెబ్బలకుఁ బాత్రుఁడై, ఢిల్లీలో మరునాఁడు గాన్పడినచో మరణదండనకుఁగూడఁ బాత్రుఁడగునని యాజ్ఞాపింపఁబడి వెడలింపఁబడెను.

ఘూర్జరతార.

ఇరువదినాల్గవ ప్రకరణము.

ఔషధపటిమచేఁ గలిగిన విచిత్రమూర్ఛనుండి లేచి కనులు దెఱచునంత మందరయును క్లోడిస్సాయును దనప్రక్కనే యుండుటను గమల కాంచెను. ఇపుడు వీరందఱును మందరచే ముందుగా నద్దెకుఁ దీసికొనఁబడిన యొక గృహములో నున్నారు. ఈగృహము డిల్లీనగరమునకు మిక్కిలి చివరనుండు భాగములలో నొకవీధియందుఁ గలదు.

అట్లు కమల కనులఁదెఱచినంత “దేవీ! ఏమియు భయము నొందకుము. మీచిక్కులన్నియుఁ దొలఁగిపోయినవి. ఇపుడు మీరు వెనుకటి యంతఃపురమునఁగాక వేరొకచోటనున్నారు” అని మందర కమలతోఁ జెప్పెను.

వెంటనే కమలలేచి కూరుచుండి “మందరా! మందగా! క్లోడిస్సా! క్లోడిస్సా! మీకెంతయు నేను గృతజ్ఞురాలను. నావిముక్తికి మీరు ముఖ్యకారణముగా నున్నారు.” అని వారిహస్తములను స్పృశించుచుఁ గరుణారస పరిపూరితములగు కనులతో వారిని దిలకించుచుండెను.

“అమ్మా! ఇపుడు మన మప్రస్తుతప్రసంగములతోఁ గాలవ్యాపనముచేయుట యనుచితము. ఎటువచ్చి యెటుపోవునో మీరిఁక నీనగరమునం దుండఁగూడదు. ఇంకొక గంటలోఁ బ్రయాణమగుట శ్రేయస్కరము. ప్రయాణమునకు వలయు సర్వసన్నాహములను సమకూర్చియుంటిని. మీరిఁక లేచి భోజనాది కృత్యముల నొనర్చుకొనుఁడు.

"మందరా! "మీరుపోవుట"యే యని యంటివి కాని నీవు మాతోడ రావా?"

"అమ్మా! నాకుఁ గొన్నిపనులు కలవు. ఢిల్లీపురమునందింకను నేను నాలుగైదు దినములుండవలయును. నేను వచ్చుటకు వీలులేమి క్షమింపుడు. కాని గ్లోడిస్సా మీతోడ రాఁ గుతూహలము నొందుచున్నది."

"సంతోషము! సంతోషము! గ్లోడిస్సా! నీవు తప్పక నాతోడవచ్చుట నాకు మిక్కిలి సంతోషదాయకము. నీమేలు నేనెన్నటికిని మఱువను. నేను బ్రతికియుండునంతవఱకును, నాదేశమున నాయంతఃపురమున నాకుఁ బ్రియస్నేహితురాలవై యుండెదవుగాక. మందరా! నామనవి నాలకించి, డిల్లీపురములో నీపనులను జక్కఁజేసికొనిన పిదప నారాజధానికేతెంచి నాయొద్దనే యుండెదవుగాక యని నాప్రార్థన. మరియును నీవు నావిముక్తికొఱకుఁ జాలగా ధనవ్యయమును సలిపియుండనగు. కావున వేరుగా నూహింపక యీ హారమును దీసికొందువని వేఁడుచున్నాను."

అని తన గళమునుండి యమూల్యమగు నొక రత్నహారమును దీసి మందరకీయఁబోవ నామె పుచ్చుకొనలేదు. కమల బలవంతపెట్టెను. మందర యెంతమాత్రము నొప్పుకొనక తుదకు పూర్తిగాఁ దిరస్కరించి "అమ్మా! మీదేశమున నుండుటకు నాకేమియు నాతంకములేదు. వైద్యమే నాజీవనము కావున నేను దేశదేశములకుఁ దిరుగుట తప్పదు. ధర్మమునకే కాని, నేను ధనార్జనమునకు వైద్యము సలుపను. అట్టి ధర్మాచరణకై దేశాటనము చేయకతప్పదు. కావున క్షమింపుఁడు" "అమ్మా! కాలము మితిమీరుచున్నది. శకటము ద్వారమునొద్ద సిద్ధముగనున్నది. మీరు లేచి ప్రయాణసన్నాహముతో నుండుడు. అదిగో, ఆగదిలోఁ మోహనుఁడుకలఁడు, పొండు" అని మందర కమలతోఁ బలికెను.

"ఏమీ!" యని సత్వరమే యచటనుండి లేచి కమల మోహనుఁడుండిన గదిలోనికిఁ బోయెను.

చదువరులారా! ఇపుడు మోహనుఁడు నిర్మలానురాగమునఁ దారాకమలను గాఢపరిరంభణ మొనర్చెనని వ్రాసిన మీరాశ్చర్యమొందెదరా? మోహనునియెడఁ గమలకుఁగల యనురాగము మనకు విదితమేగదా. మోహనునికిని గమలయెడఁగల యనురాగముకూడ మనకు మునుపే విదితము. కావున నిందేమియాశ్చర్యముకలదు.

ప్రియుఁడును ప్రియురాలును జెప్పుకొనుట కనేకవిషయములు కలవు. కాని ప్రయాణమునకుఁ గాలము సమీపించుటచే వారు మాట్లాడుకొను విషయములఁ ద్వరలో ముగించిరి. ఆవిషయములెవ్వియో మనకిదివఱకుఁ దెలసియేయున్నవి. రవీంద్రుని వధయు, హేమచంద్రుని కథయు, మందర తనకుఁబంపిన వార్తయుఁ, దనఢిల్లీపురగమనమును, మీదుమిక్కిలి కమలావియోగమునకుఁ దానను భవించిన మహాసంతాపమును మొదలగు విషయములనుగూర్చి మోహనుఁడు కమలకుఁజెప్పెను. తనకు మత్తుమందు బెట్టుటమొదలుకొని సంభవించిన సంఘటములన్నింటిని గమల మోహనునకుఁజెప్పెను. ఇట్లు వారుప్రసంగించుచుండఁ బ్రయాణమునకుఁ గాలమైనదిలెండు' అని ప్రక్కగదిలోనుండి మందర కేకవైచెను. వెంటనే వారులేచి తమకై వేచియున్న శకటమునొద్దకు వచ్చిరి. కమలయును గ్లోడిస్సాయును శకటాంతర్భాగమునఁ గూరుచుండిరి. ఆశకటమునకుఁ గాచగవాక్షములుండుటచే నది మిక్కిలి సొంపుగాఁ గనుపట్టెను. మోహనుఁడును వానిసేవకులగు నంగద భలభద్రులును జెరియొకగుఱ్ఱము నారోహించిరి. మోహనుఁడుగూడ వేఱొకగుఱ్ఱము నెక్కె. తక్కినవారందఱును ప్రయాణమున కుపక్రమించుటకు సిద్ధముగానుండిరి. అంత మోహనుఁడును గమలయును మందరయొద్ద సెలవుగైకొనిరి. అంగదబలభద్రులు చెరియొక కెలంకునను మోహనుఁడు వెనుకను హయారూఢులై రా, శకటము నదియొడ్డునకుఁ బోవుచుండెను.

ఈరంగముపైఁ బ్రస్తుతము తెఱనుదింపి చింతాక్రాంతుఁడును, క్రూరశిక్షాపాత్రుఁడునయిన ముస్తఫాయాకూబెచ్చటనున్నాఁడో తిలకింతము. ప్రతోదహతముల ముప్పదింటిచే వీపుపై రక్తపుఁగండలతోఁ గూడిన దద్దురులతోఁ దలవంచుకొని, ఢిల్లీపురమునువిడిచి నదిని దాటి యాయొడ్డుననే నివసించియున్న యొకనిగృహమున కేగెను. ఆగృహాధికారి యాకూబునకుఁ బరిచితుఁడే. వాఁడును వీనివలెనే యువతీచౌర్య వ్యాపారధురీణుఁడు. కావున వారిరువురకును బరిచయముండుట విరుద్ధముకాదు. ఆతనియొద్దకు ముస్తఫాయాకూబుపోయి తనకు సంభవించిన యాపదలను విశదీకరించెను. వాఁడును సహావర్తకునియెడ జాలినొంది వెంటనే ఢిల్లీపురప్రధానన్యాయాధికారియొద్దకుఁ బోయి తనమిత్రుని క్షమింపవలసినదని వేఁడుకొనుటకు నదినిదాటి ఢిల్లీకిఁబోయెను. ఏమనిన మరునాడు ముస్తఫా ఢిల్లీనగరమునఁ గాన్పడిన-చో వానికి మరణము తప్పదని సార్వభౌమునాజ్ఞ.

ఇపుడు రాత్రి పదునొకండుగంటలయ్యెను. తనస్నేహితుఁడింకను రాలేదు. వానిరాక కుడికి యుడికి, వేచివేచి తుదకు నదీతటమునఁ బడవలరేవునొద్దఁ గూలఁబడి నదిమీఁదుగాఁ బ్రయాణముచేయు బాటసారులను దదేకదృష్టితోఁ జూచుచుండెను. అట్లు చూచుచున్నసమయమున రెండునావ లావలియొడ్డునుండి నదిమీఁదుగా రేవులోనికివచ్చియాగెను. ఆనావలలోఁ దేనినైనఁ దనస్నేహితుఁడున్నాఁడేమోయని మిక్కిలి సూక్ష్మదృష్టితోఁ జూచెను. కాని వానియందాతఁడులేఁడు. ఎవ్వరో మువ్వురు దృఢకాయులును, వారివెంట మేలిముసుఁగుల నొంటినిండఁ గప్పికొనిన వేరొక యిరువురును, వారివెంట మూఁడుహయములు నానావలలోనుండి యొడ్డుపైకిఁ దిగుచుండుట వాఁడుకాంచెను. క్షణములో ముసుఁగులలో డాగియున్నవారిరువురును దమకొఱకు వేచియుండిన 'అరబా' లోనికెక్కిరి,

'అరబా' యనుపదమాకాలమున రెండుగుఱ్ఱములచే లాగఁబడు శకటమునకుఁబేరుగా వ్యవహరింపఁబడెడిది. వెనుకనుండిన మువ్వురును వారివారి హయములపైనెక్కిరి. ప్రయాణోపక్రమణమునకు ననుజ్ఞ యీయఁబడెను. అపుడంతయు సిద్ధముగానుండెనా లేదాయని చూచుటకు దురదృష్టప్రేరితయై తనమొగమునుండి మేలిముసుఁగును దీసివైచి, అరబా గవాక్షమును దెఱచి తారాకమల ప్రక్కకుఁ జూచెను.

అత్యద్భుత మత్యద్భుతము! ఆమొగమును జూచినంత ముస్తఫాయాకూబెంతటి విస్మయమునొందెనో, ఎట్లుస్తంభీభూతుఁడయ్యెనో, ఎట్లు దిగ్భ్రమఁజెందెనో యవర్ణనీయము.

అధికవేగముతో "నరబా" పరువెత్తుచుండెను. మోహనాంగదబలభద్రులు వెంటనే పోవుచుండిరి. ఈజనసమూహ మొకమైలుదూరమున కేగునంతవఱకు, విస్మయస్తంభీభూతుఁడైన యాకూబు నిశ్చేష్టుఁడై కొంతవడికిఁ దెలివిదెచ్చికొనెను. కాని లాభమేమి? వారిని వెంటనంటుటకుఁ దనయొద్ద గుఱ్ఱమైన లేకపోవుటచే నేమియుఁ జేయలేక వెలవెలఁ బోయెను.

ఘూర్జరతార.

ఇరువదియైదవ ప్రకరణము.

తూర్పు తెలతెలవారుచుండఁగా ఢిల్లీపురమున నంతఃపురాధికారియొద్దఁ జేతులు జోడించుకొని యాకూబు నిలచియుండెను.

"ఏమిరా! పాపీ! ఈరోజున నీవిచటఁ గాన్పడిన మరణదండనకుఁ బాత్రుఁడ వగుదువని శాసింపఁబడియుండఁగా మాశాసనమును వెక్కిరించిన ట్లేలయిచటికి రా సాహసించితివి?" అని కోపముతో నధికారి గర్జించెను.

"దేవా! మీశాసనము నేను వెక్కిరించుటలో వింతలేదు. నేడు మన మందఱమును సంపూర్ణముగా వెక్కిరింపఁబడినాము"

"అధికారితోనా నీ హాస్యములు. ఔరా! ఏమి! సరే...

"దేవా! తొందరయేల నేను విన్నవించు విషయముల నాలింపుఁడు.

"ఛీ! నీవు మదోన్మత్తుఁడవు. నోరుమూయుము; లేకున్న...

"దేవా! తొలుఁదొల్త నావిన్నపమును విని, పిదప మీ చిత్తానుసార మొనర్పుఁడు.

"ఏమి నీ ధైర్యము. ఇంతటి స్వేచ్ఛతో మాట్లాడ నేర్చితివా!" అని కొంచెమాగి మరల నిట్లనెను. "సరే! నీ యేడ్పేదియో త్వరలోఁ గాన్పిమ్ము"

"చిత్తము. కమల చావలేదు. బ్రతికియే యున్నది. నిన్న...

"నీకేమైనఁ బిచ్చు కలిగినదా? ఓరి పిచ్చివాడా!

"దేవా! నిజముగా నేను కమలచేఁ బిచ్చివాఁడనయినట్లే గణింపఁబడితిని. నిన్నటిరాత్రిరి పదునొకండు గంటలవేళ కమలయును మరియొక వనితయును శకటములో నెక్కి పోవుచుండిరి. వారివెనుక మువ్వురు హిందువులు గుఱ్ఱములెక్కి పోవుచుండిరి. దీని నంతయు నేను జూచినాను. నామాటల నమ్ముఁడు. మీరు కొంతసిబ్బందిని వారివెంటఁ బంపుఁడు. వారు గాన్పింపకపోయినయెడల నాశిరము మీ కరవాలమునకు సమర్పించెద. అంతవఱకును మీయొద్దనే యుండెదను."

అధికారి నిర్ఘసించెను. మొదట వానిని బిచ్చవాఁడనియే భావించెను. తుదకు వానిపైఁ గోపముగూడఁ జెందెను. కాని యాకూబు పూసగుచ్చినట్లు పలుమాఱు వినయవిధేయతలతో నధికారికి నొక్కినొక్కి చెప్పెను. తన పలుకులలో విరుద్ధముండిన ప్రాణసమర్పణకు సిద్ధముగా నుంటినని చెప్పెను. ఎట్టకేల కధికారియును గొంతవఱకునమ్మి వారేగుచున్నదారి యాకూబునుండి తెలిసికొని వెంటనే యిరువదిమందియాయుధపాణులగు నాశ్వికసైనికులకుఁ గమలాదిజనసమూహమును వెంటనంటి జీవములతోఁ బట్టుకొనిరావలయునని యాజ్ఞయిచ్చి పంపెను.

ప్రాతస్సమయ మెనిమిది గంటలను మీరెను. అపుడు అరబాయును దానిని వెంటనంటి మోహనాంగద బలభద్రులును, జయపురపు రాజ్యమునకుఁ బోవుమార్గము మీదుగా నేగుచుంట గాన్పడును: వారేగుచున్న ప్రదేశము వృక్షశూన్యమై మిక్కిలి మిట్టపల్లములుగా నుండెను. కొన్నిచోట్ల లత్యున్నతములుగాను వానికిఁ బ్రక్కగనే మిక్కిలి పల్లపు ప్రదేశములుగాను నాభూమి విభజింపఁబడియుండెను. ఆకారణమున నాశ్వికులగు మోహనాంగద బలభద్రులు వడిగాఁ బోవఁ గలిగినను శకటము పోలేకుండుటఁ జేసి దానిననుసరించి నెమ్మ

దిగనే వారు పోవుచుండిరి. అప్పుడప్పు డనేకపర్యాయములు మోహనుఁడు వెనుకకుఁ దిరిగి యెవరైన వచ్చుచుండిరేమో యని చూచుచుండెను. చిరకాలమువఱకు నెవ్వరును జూపట్టలేదు కాని యీసారి పరీక్షించినపుడు వెనుక మూఁడుమైళ్ళ దూరమున దుమ్ము మిక్కిలి యెత్తుగా రేగుట కాన్పించెను. మరికొన్ని క్షణములకుఁ గొన్ని హయములును, వాని నారోహించి మహావేగముతో తామున్న దెసకు సూటిగాఁ బరువెత్తుకొని వచ్చుచున్న కొందఱును వారికగపడిరి. వెంటనే మోహనునికిఁ దత్తరము కలిగె. దానినిగ్రహించి యంగద బలభద్రులును వెనుకకుఁ జూచిరి. ఇపుడు సంగతియంతయు విదితమయ్యె. పెక్కుమంది యాయుధపాణులగు నాశ్వికసైనికులు తమ్ము వెంటనంటి యున్నారు. ఇందు సందియమేమియు లేదు. తక్షణమె "ప్రియసేవకులారా! ఆ సైనికులతోఁ బోరాడుట దుర్లభము. వారిసంఖ్య మనకు మించినది. కావున మనమిఁక నాలస్యము చేయఁదగదు. ఈశకటము మిక్కిలి మెల్లగాఁ బోవుచున్నది. అందుచేత వారు మనలను వెంటనే కలసికొందురు. అంగదా! నీవు క్లోడిస్సాను నీగుఱ్ఱముపైఁ గూర్చుండఁబెట్టుకొనుము. నేను కమలను గూర్చుండఁబెట్టికొనెదను. ఇపుడు మన హయములే మనకు శరణములు లెండు లెండు" అని మోహనుఁడు పలికెను.

వెంటనే యంగదుఁడు శకటము నాగునట్లుచేసి క్లోడిస్సాను దన గుఱ్ఱముపైఁ గూర్చుండఁబెట్టుకొనియెను. కమలను మోహనుఁడు డాసి "ప్రియా! నీ ధైర్యమును బ్రదర్శించుటకుఁ దగు సమయమువచ్చినది. లెమ్ము" అని పలుకుచు శకటమునుండి లేవఁదీసి బండివానికి మిక్కిలి ధనమునిచ్చి "ఓరీ! నీవేమియు భయమునొంద నక్కఱలేదు. ఆ వచ్చువారితో నీవేమియు నెఱుఁగనట్లు చెప్పుము. అదియే నిన్ను రక్షించు" నని చెప్పి కమలకు వెనుకఁ దాను గూర్చుండి కళ్ళెమును గట్టిగావిదల్చి, యొక్కసారి ప్రతోదముతో గుఱ్ఱమును జుఱుక్కుమ

నునట్లు కొట్టెను. ఈపను లన్నియు రెండునిమిషములలో జరిగెను. వెంటనే హయము పవమానవేగమునకు సమానమగు మానముతో నుఱకలెత్తసాగెను. అంగదుఁడు క్లోడిస్సాను ముందఱ నిడికొని, తన గుఱ్ఱమును అట్లే పరువు లెత్తింపసాగెను. బలభద్రుఁడు వారిని వెంట నంటెను. హయములలో మిక్కిలి వేగముగాఁ బరువెత్తునది మోహనునిదిమాత్రమె. బలభద్రాంగదుల గుఱ్ఱము లంతవేగముతోఁ బరువెత్తలేవు. అందుచే "అంగదబలభద్రులారా! మన మందఱమును గలసి పోవుట యసంభవము. నా గుఱ్ఱముతో సమానముగా మీ గుఱ్ఱములు పరువులెత్తఁ జాలవు. కావున నందఱము వెవ్వేరు త్రోవలం బోయి తుదకు ముందు గలియుదము." అని మోహనుఁడు వాక్రుచ్చెను. వెంటనే వారిరువురును జెరియొకత్రోవమీఁదుగా సవారిచేసిరి. ఇపుడు సైనికులు మోహనునికి మిక్కిలి దూరములో లేరు. అట్లయ్యును మోహనుఁడు భీతినొందక తనగుఱ్ఱము నదలించుచు వర్ణనీయమగు వేగముతోఁ బరువెత్తింప సాగెను. అదృష్టవశమున నా సైనికుల గుఱ్ఱములు మోహనుని హయముతో సమానముగాఁ బరువెత్త లేకపోయెను. కావున నొక్క యఱగంటలో మోహనుఁడు వారిని రెండుమైళ్ళ దూరము మించిపోయెను.

మోహనుఁడు ముందు, సైనికులు వెనుక నాలుగుగంట లడ్డులేక యీ వెంటాడుట సంభవించెను. అప్పటికి సైనికులనుదాఁటి పదునైదుమైళ్ళ ముందునకు మోహనుఁడు తన హయమును బరువెత్తింపఁ గలిగెను. మరియు నిపుడు వారు సార్వభౌముని రాజ్యములో లేరు, ఆ సరిహద్దులను దాఁటి జయపురరాజ్యములో నున్నారు. అట్లగుట నింకేమియు భయము లేదు. కావున మోహనుఁడును గమలయు నొక చెఱువుగట్టుపై హయమునుండి దిగిరి. అలసి సొలసియున్నహయము మీఁకట్టపై గడ్డి మేయఁ దొడఁగెను. కమల మోహనుని కౌఁగిలించుకొని "హృదయప్రి

యా ! నాకొఱ కెంతటికష్టము నొందితిరి" అని యేమేమో పలుకుచుండెను. ఇంతలో అంగదక్లోడిస్సాలును, బలభద్రుఁడును చెఱువునొద్దనున్న కమలామోహనులఁ గలసికొనిరి. వీరు సంయోగకాలమున ననుభవించినమహానందమునకు మేర యిట్టిదని సూచింపఁబడరానిది. అంగదబలభద్రుల హయము లిప్పుడు మోహనుని హయముతోఁ గూడ పచ్చగడ్డిని మేయుచుండెను. అప్పుడు మోహనుఁడు "బలభద్రా! ఈ ప్రక్క నేదైనఁ బురముకలదా?" యని ప్రశ్నించెను.

"దేవా! ఇచటి కొకమైలుదూరముననే—అదిగో—ఆ మహావనమునకుఁ జాటున జయపురమున్నది. అదే! అట్లు చూడుడు! ఆ నగరగోపురములు వనవృక్షములమీఁదుగాఁ గాన్పించుచున్నవి.

"మంచిది. మంచిది." అని కొంచెమాగి "నీ వాపురమున కేగి కమలా క్లోడిస్సాలకుఁ జెరియొక గుర్రమును గొని వెంటఁ బెట్టుకొని రమ్ము" అని వలయుధనము నాతనిచేతఁబెట్టి పంపెను.

ఒక్క యఱగంటలో నంగదుఁడు రెండు చక్కని హయములను జీను మొదలగువానితోఁగూడ వెంటఁ బెట్టుకొని తిరిగివచ్చెను. అప్పుడు వా రేవురును హయముల నారోహించి, చక్కని బాటమీఁదుగాఁ బోయి, వనమును నిర్గమించి, జయపురమునకు వెలుపలి భాగమున నొక మిట్టప్రదేశముపై నిలువఁబడిరి. తామిప్పు డున్నది యెత్తైనప్రదేశమగుటచే నచటనుండి జయపురమును బూర్తిగా నవలోకించుటకు వీలు కలిగెను. వారందఱు నాపుర సౌందర్యమునకు మిక్కిలి యచ్చెరువొందుచుఁ జూచుచుండిరి. అట్లే చూచుచున్న మోహనుఁడు కొంతవడికి నివ్వెరనొంది "అహాహా! ఏమి! వానిధైర్యము! ఏమి వానిసాహసము! కమలా! క్లోడిస్సా! అంగద బలభద్రులారా! అదిగో నావ్రేలు చూపుదెసకుఁ జూడుడు. దూరమున నల్లదే—ఆ యెత్తైన మహాగృహాగోపురపుంజచివర భాగముమీఁదుగా నెవ్వఁడో మెడకుఁ ద్రాడు గట్టుకొని

వ్రేలాడుచు దొంగపాటుగాఁ గ్రిందునకు దిగుచున్నాఁడు" అనెను. వెంటనే వా రందఱు నాదెసఁ జూచి విస్మయాశ్చర్యస్తంభీభూతులైరి.

"దేవా! ఆగృహము ప్రధానకారాగృహము. అట్లు త్రాడుమూలముగాఁ గ్రిందికి దిగుచున్నవాఁ డెవ్వఁడో పారిపోవ యత్నించు తస్కరుఁడు గావలయు" నని యంగదుఁడు పలికెను. మోహనున కేమి యభిప్రాయము కలిగెనోకాని తన దృష్టి నా నిర్భాగ్యునిపై సారించి తుదకాతఁ డెవ్వఁడో గుర్తుపట్టెను.

ఘూర్జరతార

ఇరువదియాఱవ ప్రకరణము.

ఆరూపమును గురుతుపట్టిన తక్షణమే "అంగదా! ఆదుర్మార్గుఁడు హేమచంద్రుఁడు." అని చెప్పెను వెంటనే వారందఱును దప్పించుకొన యత్నించుచున్న యాసాహసికుని రూపమును గురుతెఱుఁగఁజాలిరి.

"దేవా! రవీంద్రహంతకుఁడట్లు కారాగృహమునుండి తప్పించుకొనిపోవుట మనము చూచి సహింపఁగలమా!" యని బలభద్రుఁడు మోహనునితోఁ బలికెను.

"నిజమె. వాఁడు తక్షణము పట్టుకొనఁబడవలయు. ఇటీవల నాకుఁ గలిగిన కష్టములకు వాఁడే మూలకారణము." అని కమల చెప్పెను.

"మంచిది. అంగదా! నీవు సత్వరమే హయమునెక్కి పురప్రాకారద్వారమువద్ద గావలియుండు రక్షకభటుని కీవిచిత్ర వృత్తాంతమును దెలుపుము. మేమిచటనుండి వాని పలాయనము నడ్డగించెదము." అని మోహనుఁడు పలుక వెంటనే యంగదుఁడు తనగుఱ్ఱమునెక్కి పురప్రాకారములకుఁ జుట్టును త్రవ్వఁబడి జలపూరితము నతిగంభీరము నగు కందకమును వంతెనమీఁదుగా దాఁటి యచటఁ గావలియున్న రక్షకభటునితో నావృత్తాంతమును వాక్రుచ్చెను.

ఇచట మన మొకింతయాగి, వెనుకటి విషయములఁ దిరిగి స్మరింతము. త్రాడుమూలముగా వ్రేలాడుచుఁ గ్రిందికి దిగుటకు యత్నిం

చుచున్నవాఁడు నిజముగ హేమచంద్రుఁడే. వీఁడు శ్రీనగరకారాగృహమునుండి జయపుర కారాగృహమునకుఁ దప్పింపఁబడి యచటనే యుంచఁబడెను. జయపుర ప్రాకారముల కావలనున్న కొందఱు స్నేహితులే వీని విముక్తికి ముఖ్యకారణులు. ఆస్నేహితులు కోటగుమ్మమునొద్దఁ గావలియుండునట్టి యిరువురు రక్షకభటులకుఁ బెద్దలంచమిచ్చిరి. అట్లగుట వారు హేమచంద్రుఁడు తప్పించుకొని పారిపోవుచుండఁగాఁ జూచుచుండియు నేమియుఁ జేయరు. ఈసంగతులన్నియును హేమచంద్రునికిఁ దెలియును గావుననే వాఁడు ముఖ్యముగా నాటి సాయంకాలమునఁ దన సాహసకృత్యమునకుఁ దొఱకొనెను. చీఁకటిపడిన పిమ్మట యత్నించినచో త్రోవ తెలియకపోవుటయేకాక రక్షకభటులెక్కుడుమంది యెల్లప్పుడు ప్రాకారములయొద్ద నుందురు. పగటిపూటఁ బ్రయత్నించుచో మునుపే బహిరంగమగుఁ గావున సాయంతనమున హేమచంద్రుఁడు పారిపోవుటకు యత్నించెను.

త్రాడుమూలముగా నట్లు హేమచంద్రుఁ డొకయింటిపై దిగెను. అచటనుండి చప్పుడుచేయక యాయింటిగోడ మీఁదుగా వీధిలోనికి దిగి లోపలి కోటగోడ చిన్నదియగుటచే దాని నవలీల నారోహించి పెద్దప్రాకారములను డాసెను. కోటలోని మురికినీళ్ళు బయటి కందకములోనికిఁ బోవుటకై కోటగోడలో మనుజుఁడు ప్రాకవచ్చునంత తూము కలదు గాన నాప్రాకారములఁగూడ నెక్కనవసరము లేకపోయెను. ఆ తూములోనుండి బఱబఱం బ్రాకి హేమచంద్రుఁడు కందకమునుడాసెను.

ఇప్పుడు మోహనాదులు వారుండిన కట్టనుండి తమకు దాదాపు మూఁడువందల గజములదూరములోఁ గందకపుటొడ్డుననున్న హేమచంద్రు నచ్చెరువునొందుచుఁ జూచుచుఁ, దద్వృత్తాంతమును రక్షకభటులకుఁ దెలియఁజేయ నంగదుఁ డింతకుఁబూర్వమే పంపబడెగానఁ, బ్రక్కనున్నవారును హేమచంద్రుని గాల్చివైతురని యాలోచించుచుండిరి.

కందకపుటొడ్డును డాసినతోడనే హేమచంద్రునికిఁ గొంతసంతసము కలిగెను. ఏమనిన వానికిఁక నేమియు నష్టములేదు. కందకములో గుభాలున దుముకుటయు, నావలియొడ్డున కీఁదుకొని పోవుటయు, నచట నుండి కాలికి మిక్కిలి బుద్ధిచెప్పుటయు ననునీమూఁడు పనులే వానికిఁ గర్తవ్యములు. అట్లుచేయుటకుఁ గడంగుచుఁ దనకృత్యము నెవ్వరును జూచుటలేదుకదా యని యటునిటు చుఱుకుఁ జుఱుకునఁ జూచెను. దూరమునందు కొందఱు స్త్రీలను పురుషులును గాన్పడిరి. కాని వారిని గురుతింపలేకపోయెను. మరియును వారు తనతో జోక్యము కలుగఁజేసికొనరట్లుండుటచే వారితో మనకేలయని యెంచి వెంటనే యెక్కి యెగురెగిరి యాకందకములో గుభాలునదుమికెను. తత్క్షణమే ప్రధానరక్షకాధికారి యచటికివచ్చి దానినవలోకించి "అరే! అరే! ఎవఁడో దొంగ తప్పించుకొని పోవుచున్నాఁడు" అని కేక వైచెను. లంచముదినిన రక్షకభటులిరువురును నీటిలో నీఁదుచున్న హేమచంద్రుని శిరమునకుఁ దిన్నగా గుఱివెట్టినట్లు నటించి వానికేమియుఁ దగులకుండునటుల మనఃపూర్వకముగాఁ దప్పించి తుపాకులను బేల్చిరి. హేమచంద్రుఁడు తుపాకిచప్పుడు వినినతత్క్షణము నీటిలో మునిఁగె. అట్లగుటఁ బ్రధానరక్షకాధికారి కూడ కందకములోనికుఱికి హేమచంద్రుని వెంట నంటెను. హేమచంద్రుఁడు కందపుటావలి యొడ్డును జేరి యెక్కుటకుఁ బ్రయత్నించుచు నొకచెట్టు కొమ్మ నవలంబనముగాఁ బట్టుకొనునంత నదియును బుటుక్కున విరిగిపోవ హేమచంద్రుఁడు కందకములో గుభాలుమని పడియె. వీఁడట్టి దురవస్థల నొందునంతలో రక్షకాధికారి చేత గత్తిం దాల్చి యీఁదుచు హేమచంద్రుని సమీపించెను. హేమచంద్రుఁ డెట్టకేలకొకచెట్టుమొదలు నూతగాఁ గొని యెక్కుయూపుతో నొడ్డుపైఁబడెను. కాని రక్షకాధికారికత్తి వానివీపుపై ఁఱాచుకొనుటకు సిద్ధముగానుండె. రక్షకాధికారి వీనికొక్కఁడుగు వెనుకనే యున్నవాఁడు. కావున జచ్చినను

సరియేయని మహావిపత్సమయంబునఁ గలుగు ప్రాణములపై నిరాశతో వెనుకకుఁ దిరిగి రక్షకాధికారి హస్తములరెండిటిని సింహబలముతో నొడిసి పట్టుకొని వానిచేతనున్న ఖడ్గము నొక్కసారిగా నూడఁబెఱికి దానిమొనను వానివక్షస్థలమున గట్టిగా గ్రుచ్చెను. వెంటనే వాఁడు నిర్జీవియై గుభాలునఁ గందకములోఁ బడియె. ఈవిచిత్రమంతయు నాక్రమించినకాల మొక్కనిమేషమునకు మించదు.

ఒడ్డును దాఁటెను. బోనునుండి వెలువడిన పెద్దపులివలె నొక్కుమ్మడి పరువెత్తుకొని పోవుచుండె. రక్షకాధికారియొక్కయు, రక్షకభటులయొక్కయుఁ దుపాకీమ్రోఁతలు విని మఱి పదుగురురక్షకభటులు వచ్చి పారిపోవుచున్న హేమచంద్రుని జూచి వానిపై నొక్కసారి యగ్నిగోళవర్షమునుగుఱిపించిరి. కాని హేమచంద్రునికేమియు నపాయము సంభవింపలేదు. అదేపగగు—అదేపరుగు—అలయుటలేదు. సొమ్మసిలుటలేదు.

మిట్టపైనుండిన మన మోహనబలభద్రులును, కమలాక్షోడిస్సాలు నీకృత్యములనన్నింటిని మిక్కిలి సంభ్రమముతోఁ జూచుచుండిరి. తుపాకులు ప్రేల్పఁబడుటచే హేమచంద్రుఁడు చచ్చెననియే వారూహించిరి. కాని కొద్దినిమేషములలో హేమచంద్రుఁడు మిక్కిలి వేగముగాఁ బారిపోవుచుంట వారికిఁ గనవయ్యె. వెంటనే కమలాక్షోడిస్సాల నచటవిడిచి మోహనబలభద్రులు తమ హయములనెక్కి హేమచంద్రుని వెంట నంటిరి.

హేమచంద్రుఁడు వెనుకనుఁ జూడకయే పరువెత్తుచుండుటచేఁ దన్నట్టు లిరువురు వెంటనంటుట వానికిఁ దెలియలేదు. అట్లు వాఁడు పరువెత్తి తుద కొకపెద్దగోష్ఠముచాటునకుఁ బోయెను. అచట వానికై యెదురుచూచుచున్న స్నేహితులు—వీరసుభద్రుఁడును—వాని ప్రియసేవకుఁడు అఘోరియును—హయత్రితయముతో హేమచంద్రునిఁ గలిసికొనిరి. అపాయములనన్నిటిని నిర్గమించి సురక్షితముగా హేమచం

దుఁడు తమ్ముఁగలసికొనుటకు వారెంతయు సంతసించి తద్విషయమై సంతోషముగా మాట్లాడుచుండునంతలో గుఱ్ఱపుడెక్కల మ్రోఁత వారికి వినవచ్చె. వెంటనే యేదియో యుపాయము రానున్నదని గ్రహించి వారుమువ్వురును దమతమ హయముల నెక్కిరి. మాచదువరులకు హేమచంద్రుఁడు స్వోదరపోషకుఁడనియుఁ, దనజాగ్రత్తలోఁ దానెప్పుడు నుండు వనియుఁ దెలియునుగదా. ఇప్పుడుకూడ "ఏమి రానున్నదో నాప్రాణముల నేను దక్కించుకొనినఁ జాలు"నని యెంచి వెంటనే తన గుఱ్ఱము నదలించి మహావేగముతోఁ బరువెత్తుకొని పోవుటకు సంసిద్ధుఁడై యుండ వారికి నూరుగజముల దూరములో నశ్వారూఢులై తమదెసకుఁ బరువెత్తి వచ్చుచున్న యిరువురాయుధపాణులు గన్పట్టిరి. హేమచంద్రుఁడు మోహానబలభద్రులను రవీంద్రునియింట దాను బట్టుకొనఁబడినపుడు చూచియుంటచే వెంటనే గురుతించి, వీరరుద్రుఁ డిదివఱ కెన్నఁడును మోహాన బలభద్రులను జూడలేదు గాన వారింగూర్చి యాతనికిఁ జెప్పి తాను సత్వరమే తన గుఱ్ఱమును బరువులెత్తింపసాగెను.

వాఁడే మోహానుఁడని యెఱిఁగిన తక్షణమే "మంచిసమయము వచ్చినది." అని చెప్పుచుఁ దనతుపాకిని మోహానుని హృదయమునకు సూటిగా గురిపెట్టి "ఓరీ! అఘోరీ! నీవుకూడ మంచి గుఱితోఁ గాల్పుము" అని గంభీరముగాఁ జెప్పెను. వీరిప్రయత్నములను ముందుగా గ్రహించి, వారుతనపై నగ్నిగోళములఁ బ్రయోగింపకముందే మోహానుఁడు తన తుపాకితో వీరరుద్రుని గుఱ్ఱమునుగాల్చెను. వెంటనే గుఱ్ఱమును, వీరరుద్రుఁడును తలక్రిందులైరి. ఆసమయమున మరియొక యగ్నిగోళము మోహానుని తుపాకినుండి బుస్సుమని పెటపెటధ్వనులతో వీరరుద్రుని కాలినుండి దూసికొనిపోయెను. ఇదియంతయు నొక్కక్షణమాత్రములోఁ బూర్తియయ్యె. అఘోరి పారిపోయెను.

అఘోరి వీరభద్రులతోఁ గలహము సంపూర్తియైనపిదప మోహానాదులు తమకుముందు చాలదూరమున మిక్కిలి వేగముతో సవారిచేయుచున్న హేమచంద్రుని దరుముటకు మొదలిడిరి.

తమ్మువిడిచి మోహానబలభద్రులు గోష్ఠమున కేగునంతవఱకును గమలాక్లోడిస్సాలు వారినిఁ జూచుచునేయుండిరి. కాని వారాగోష్ఠముచాటున కేగినపిదప తుపాకులు పేల్పఁబడుటచే, మోహానబలభద్రులకు నేమైన నపాయము సంభవించునేమోయని తత్తరమునొంది కమలాక్లోడిస్సాలు హయారూఢలై యాగోష్ఠపుదెసకుఁ బోయిరి. వానినిడాయునంత నొక మనుజుఁడును, వానికిఁ బ్రక్క నొకహయమును భూమిపైఁ బడియుంట కమలాక్లోడిస్సాల దృష్టిపథములఁ బడియెను. ఆపడియున్నవాఁడు మోహానుఁడేమోయని తమగుఱ్ఱములను వానిదాపునకుఁ దోలినంత "అయ్యో! వీరరుద్రుఁడు" అని క్లోడిస్సా పెనుకేక వేసెను.

కమలకుఁగల్గిన భయవిస్మయము లెట్టివని వ్రాయనగు? తన్నిదివఱ కనేకాపాయములలోఁ బెట్టిన ఘోరచరిత్రుని సమ్ముఖమున మరలఁ దానుండుట కింతభయమొంది "ఇంకను బ్రతికియున్నాఁడా" యని యాతని మొగమును బరీక్ష చేయుచున్న క్లోడిస్సా నడిగెను.

"ఉచ్ఛ్వాస నిశ్వాసములు వచ్చుచునేయున్నవి. ఇంకను మృతినొందలేదు. దేవీ! వీఁడెట్టిదుర్మార్గుఁడైననేమి? దుర్మార్గుఁడగుట నిక్కువము. అచిరకాలమునకుఁ బూర్వమే చనిపోయిన వీనిభార్య మోహినినిగూడ నే నెఱుఁగుదును."

ఇట్లు క్లోడిస్సాపలుకుచుండగా మోహానునిచే ననుజ్ఞయీయఁబడి రక్షకాధికారులకు హేమచంద్రుని సాహసకృత్యములను దెలుపుటకై వెడలిన యంగదుఁడు తనకర్తవ్యములఁ దీర్చికొని, వీరినిఁ గలిసికొనుటకు వచ్చుచుండెను. "దేవీ! అల్లదే—అంగదుఁడు వచ్చుచున్నాఁడు. వీరరుద్రుఁడే వీఁడని యంగదునికిఁ జెప్పకుము. పాపమవసానకాలమునందు వానిని మనమేల దుస్థితినొందింపవలయును." అని క్లోడిస్సాపలుక, వెనుక

మోహినీ మరణసమయమున నామెకుఁ దాను జేసిన ప్రమాణ మిప్పుడు కమలకు జ్ఞాపకమువచ్చుటచే "క్లోడిస్సా నేనెంతమాత్రమును జెప్పను" అని కమల ప్రత్యుత్తరమిచ్చెను. ఇంతలో నంగదుఁడును వారిసిడాసె. వెంటనే "ఓరీ! అంగదా! మీప్రభువుగారును, బలభద్రుఁడు—నదిగో—ఆబాటమీఁదుగా హేమచంద్రుని వెంటనంటి తఱుముటకుఁ బోయిరి. నీసహాయము వారికిఁ గావలసియుండనగుఁ గావున నీవుకూడ వారినిఁ గలిసికొనుటకుఁ బొమ్ము" అని కమల పలికినంతఁ దదాజ్ఞానుసరణి నంగదుఁడు కమలానిరూపితమగు బాటమీఁదుగా మిక్కిలి వేగముతోఁ దనగుఱ్ఱమును బరువెత్తించుచుఁబోయెను.

వీరరుద్రునికిఁ గొనప్రాణము లున్నటులున్నవి. శత్రువునికైనను మరణకాలమున సహాయము చేయుట యార్యధర్మము కావున మీరు ప్రక్కనున్న యాయూరులోనికేగి వైద్యశాలనుండి యేదైననౌషధమును దీసికొనిరండు" అని క్లోడిస్సా మిక్కిలి జాలిగొలుపఁ బలుకగా నట్లేచేయుదునని కమల వెంటనే హయారూఢయై యొకమైలుదూరములోనున్న పురమువంకఁ బోయెను.

ఏడెనిమిది నిమేషములలో నాపురములోనికిఁ బ్రవేశించి యచట వైద్యశాలయుండువీధిని గనుఁగొని లోనికిఁబోయి యధికారితో మాటలాడి, వానిచే నొసంగఁబడిన కొన్నియౌషధములను బుచ్చుకొని, మరల హయారూఢయై తిరిగి వెనుక తాను గ్లోడిస్సాను విడిచినస్థలమునకు వచ్చెను.

అహో! అత్యద్భుతము!! అతివిచిత్రము!!! అచటఁ గ్లోడిస్సాగాని వీరరుద్రుని కళేబరముగాని గానరాదు. ఇంకెవరుండిరి? అయ్యో! పాపము! మృతిఁజెందెనుగాఁబోలు—తనప్రియుఁడు—తనదైవము—తనమోహనుఁడు భూమిపై నిర్జీవవలెఁ బడియుండె.

ఘూర్జరతార.

ఇరువదియేడవ ప్రకరణము.

పై ప్రకరణములలో సంఘటిల్లినవిచిత్రవిషయములను, మహామర్మములను బరిచ్ఛేదించుటకు ముందు మనకుఁ గొన్ని విషయములను దర్కించుట యావశ్యకము. ఔషధమునకై యేగుచున్న కమల తననుండి మిక్కిలి దూరములోనుండినంత, చేష్టలులేకయున్న వీరరుద్రుని యాకారమును దనగుఱ్ఱముపైఁ బెట్టుకొని తానుగూడ దానినెక్కి యచటికిఁ గొలఁదిదూరములోనున్న యొక లోయలోనికిఁ బోయెను. ఆలోయలో నిర్మల జలపూరితమగు నొక కొలనియొడ్డున వీరరుద్రుని గుఱ్ఱమునుండి దింపి యచటనున్న పచ్చగడ్డిపైఁ బరుండఁబెట్టెను. పిమ్మట కొలనికేగి తన చేలాంచలంబు నాకాసారనీరములయందుఁ దడిపి, వీరరుద్రునిడాసి వానిమొగముపై నొత్తఁదొడఁగెను. కొంతసేపువఱకటులొత్తునంత వీరరుద్రుఁడు కొద్దిగాఁ గదలి కనులఁ దెఱచెను. కాని వెంటనే మూసికొనెను. మరలఁ గొంతసేపునకుఁ గనులఁ దెఱచి యేదియో గొణగుట కారంభించెను. ఇంకను క్లోడిస్సా తన తడసిన పయ్యెదతో నాతని శిరము నొత్తుచుండెను. క్రమక్రమముగా వాని బుద్ధీంద్రియములు తమతమ స్థానములయందుఁ బ్రవేశించి పని చేయఁదొడఁగె. ఇంతను వానికిఁ బూర్తిగా తెలివి రాలేదు. మిక్కిలి యాందోళనములోనుండెను.

ఏవియో వాఁడిపుడు పలుకుచుండెను. ఆవాక్యములన్నియు సశే

షములగుటచే వానియందర్థము క్లోడిస్సాకు మిక్కిలి దురూహ్యముగా నుండె. కాని కొంతసేపునకు “హేమచంద్రుఁడు కాదు—కాదు—కాదు—వాఁడు నిజమెప్పుడు చెప్పఁడు— ఎప్పుడును జెప్పఁడు—చెప్పుటకు సాహసింపలేఁడు! హా హా!—ఒక యపరాధమునకు—బదులు వేఱొక యపరాధమునకుఁ జంపఁబడునని వాఁడు తలంచి యుండెను. అంతే—అంతే—అయ్యో పాపము ! ఆదురదృష్టవృద్ధుఁడు—నేనట్లనుకొనలేదు—లేదు—లేదు వానినిఁ జంపవలెనని నేననుకొనలేదు ! అనుకొనలేదు—కాని—కాని—అఘోరి—ఔను—అఘోరియే— ఆవృద్ధునిఁ జంపినవాఁ డఘోరియే—నేను కాదు—హేమచంద్రుఁడు కాదు ! పాపము! ఆవృద్ధుఁడిప్పుడేల వచ్చెను? ఓహో! కమలను రక్షించుటకుఁ గాబోలు ! ఔను—ఔను— మేమీపె నెత్తుకొనిపోవుచుండగా రక్షించుటకే వచ్చెను. హేమచంద్రుఁడు దురదృష్టుఁడు—తోటలో నెందుకుండెను—ఎందుకు పట్టుఁబడవలెను? అయ్యో! నాతల తిరుగుచున్నది. కణతలు బ్రద్దలగుచున్నవి. ఏమియుఁ దోఁచుటలేదు! ఏమిజఱిగియుండనగు? నేనిపుడెచ్చట నున్నాను? కారాగారములోనా? చేతులకు సంకెలలుకలవా? అని పలుకఁ దొడఁగెను.

“లేదు. నీవిపుడు కారాగృహమున లేవు. స్వేచ్ఛతోడనే యున్నావు.” అని క్లోడిస్సా తన మృదుమధుర కంఠధ్వనితోఁ బదులు చెప్పెను.

“ఎవరు? ఇమాట్లాడు నదెవ్వరు” అనుచుఁ బ్రశ్నించి పిదపఁ గొన్ని నిమేషములవఱకు నూరకుండి “అది నామోహిని కంఠస్వరమా?” యని యనెను.

“మోహినియా! అమె చిరకాలము వెనుకనే గతించినని యెఱుఁగవా?” యని క్లోడిస్సా పలికెను.

నిజమే! నాప్రాణసమాన— నానిక్షేపము—నామనోహరి—మోహిని చిరకాలము వెనుక చనిపోయెను.

ఘడియకాలము వారిరువురు మాటలాడలేదు. ఎప్పుడో సంగతుల వీరరుద్రుఁడు తలపోయుచున్నట్లు కాన్పించెను. తదేకదృష్టితోఁ క్లోడిస్సా వానివంకఁ జూచుచుండెను. అట్లాఘడియకాలములో వీరరుద్రుఁడు తనపూర్వపు జ్ఞానస్థానమునకుఁ బునరుద్ధరింపఁబడినట్లు చూపట్టె.

“మోహిని సంగతియేలకాని నీవెవ్వతెవు?”

“నేనెవ్వరినైన నీకేల?”

“అయ్యో! నాపై నిట్టిసానుభూతినిఁ గనుపఱిచినవారి నామము నడుగఁగూడదా !”

“నేనుదయపురవాసినిని?”

ఇంతలో వీరరుద్రుఁడు తన భూశయ్యనుండి చటుక్కునలేచి క్లోడిస్సాను దదేకదృష్టితోఁ దిలకింపసాగెను.

“ఏమి? అట్లు చూచెదవు! నన్ను నీవిదివఱకెన్నఁడును జూచి యుండలేదు.” అని క్లోడిస్సా పలుకుచుండఁగ వీరరుద్రుని మొగమునందు వింత వివారములు చూపట్టఁ దొడఁగెను. ఆతనిమనస్సునం దేభావములు సంచరించుచున్నవో మనకుఁ దెలియదు. కాని వానిచేష్టలే మనకు దృశ్యములు. క్రమక్రమముగా మిక్కిలి యచ్చెరువు నొందుచు వీరరుద్రుఁడు క్లోడిస్సా హస్తమును బట్టుకొనఁ బ్రయత్నించెను. కాని క్లోడిస్సాహస్తము దొరకలేదు. ఆమె లేచి తక్షణమె వెనుకంజవేయ మొదలిడెను.

“అయ్యో! పోకుము, పోకుము” అనుచు వీరరుద్రుఁడు శక్తిలేనివాఁడయ్యు నిలువఁబడి క్లోడిస్సా వెన్నంటి నడవసాగెను. అదిచూచి క్లోడిస్సా యతివేగముతోఁ బరువెత్తుకొనిపోయెను. పెన్నిధిని బోఁగొట్టుకొనిన పేదవోలె వీరరుద్రుఁడు నిశ్చేష్టుఁడై నిలువఁబడియె. కొంతతడవునకుఁ దెలివిఁదెచ్చుకొని ప్రక్కనున్న పాయముపై నెక్కి క్లోడిస్సా

ను వెంటనంటెను గాని యాయువతి వానిదృష్టిపథమున లేదు. అప్పుడే లోయకుఁ బ్రక్కగా నదృశ్యయయ్యెను. అదృశ్యమైన క్లోడిస్సాకొఱకు వెదకుచున్న వీరరుద్రు నొక్కింతతడవువిడిచి శోకాకులస్థితి నెట్లున్నదో చూతము.

తనప్రియుఁడే యచట నిర్జీవవలెఁ బడియుండుటఁ గాంచినతోడనే "హా" యనుచుఁ గమల తనగుఱ్ఱమునుండి దిగి మోహనుని దేహముపై వ్రాలెను. వెంటనే మోహనుని యుచ్ఛ్వాస మామెను స్పృశించెను. ఇంకను బ్రతికియేయున్నాడని యధికసంతోషముతో దాను వీరరుద్రునికై తెచ్చిన యౌషధచూర్ణమును మోహను నాఘ్రాణింపఁజేసెను. క్రమక్రమముగా మోహనుఁడు కనులఁ దెఱచెను.

"మనోహరా! మనోహరా! మాట్లాడుము—మాట్లాడుము—నేను కమలను" అనుచుఁ గమల వాని దేహమును దన మృదుకరకమలములతో గ్రుచ్చి కౌఁగిలించుకొనెను.

మోహనుఁడును స్మరణ దెచ్చికొని కమలా! కమలా! నీవేనా? భయపడకుము. నాకు దైవకృపచేఁ బ్రాణాపాయమేమియుఁ గలుగులేదులే!" అని కమలను బ్రతిపరిష్వంగన మొనర్చెను. ఆమె సంతోషమునకు మేర యింతంతని వ్రాయనలవికాదు. అధికానందాశ్రువులు పరిశుభ్ర ముక్తాఫలములవలె నొక్కటొక్కటి యామె నీలలోచనముల నుండి నిష్యందములగుచుండెను. తనకుఁ బ్రక్కగానున్న హయము క్లోడిస్సాకుఁ జెందినదిగాదనియు, మోహనునిదనియు నిపుడు కమల గురుతెఱుఁగఁజాలెను. వెంటనే సర్వవిషయములును మోహనునిచే నీక్రింది విధమునఁ జెప్పఁబడియె.

"అట్లు వీరరుద్రుని బిలుకుమార్చిన పిదప నంగదసహితుఁడనై హేమచంద్రుని వెంటనంటి తఱుమసాగితి కాని, వీరరుద్రునితోఁ బెనఁగులాడుటకు వ్యయముచేయఁబడిన కాలములో హేమచంద్రుఁడు రెండు

మైళ్ళదూరము పరువెత్తెను. అంతియకాక నాగుఱ్ఱము మిక్కిలి యలసి యున్నది. అట్లయ్యు నైదుమైళ్ళవఱకు నంగదుఁడు నేనును వానిని దరుమఁజొచ్చితిమి. ఎంత త్వరిమినను లాభము గాన్పింపకపోయెను. చీఁకటులు క్రమక్రమముగ దట్టమగుచుండెను. మిట్టతలముపై విడువఁబడిన మీ రేమైరోయని మా కాందోళనము కలిగెను. కావున హేమచంద్రుని వెంటనంటుట మాని తిరిగి వచ్చుచుండఁగా మమ్ము బలభద్రుఁడు గలిసికొనియె. వెంటనే మేము తిరిగివచ్చు కారణము బలభద్రునికిఁ జెప్పుచు వెనుకటి మిట్టప్రదేశమునకుఁ బోవు బాటనుబట్టితిమి. మీ రేప్రదేశమున నేమి చేయుచుండఁగాఁ జూచెనో, దానిని బలభద్రుఁడు చెప్పినంత నేను వానిపైఁ గొద్దిగాఁ గోపమునొంది పరునియొద్ద నిరువురు స్త్రీలను విడిచివచ్చుట తప్పని మందలించుఁ దన్నిరూపితమగు స్థలమునకు వేవేగ గుఱ్ఱములను బరువెత్తింప సాగితిమి. ఏమనిన, ఆమనుజుఁ డెవ్వఁడైనను వాఁడు వీరరుద్రుఁడే యనుసంగతి నాకుఁ దెలియును, నాకేకాదు; అంగద బలభద్రులకుఁ గూడ దెలియును. దెబ్బ తినుటచే సొమ్మసిలి యుండనగుఁ గావునఁ గొంతసేపునకుఁ దెలివి నొంది, తనకుపకారము సేయుచున్నను గ్రూరుఁడై మిమ్ము హింసింప వచ్చునేమో యని మిక్కిలి భయమునొందుచు నతివేగముతో నీ స్థలమునకుఁ బరువెత్తి వచ్చితిమి. నీవుగాని, క్లోడిస్సాగాని, వెనుకటి మనుజుని శవముగాని లేని యీస్థలముఁ జూచినంతనే మాకుఁ గలిగినసంతాపమేమనవచ్చును! ఆ సంతాపమేకాదు! అచటఁ బడియుండిన యొకనల్లని వస్తువునుజూచి ముందుగా వచ్చుచున్న నాగుఱ్ఱము లికిపడి వెనుకకు విదలించుకొనినపుడు గుభాలున గుఱ్ఱమునుండి జాఱి భూమిపైఁ బడిన నన్నుఁజూచి యంగద బలభద్రులు పొందిన భయదుఃఖము లేమనవచ్చును? ఆనల్లని వస్తువు వెనుక నాచేఁ జంపఁబడిన వీరరుద్రుని గుఱ్ఱమే.

నేను పడినవెంటనే అంగద బలభద్రులు "అయ్యో! అ

రయ్యో" యనుచుఁ దమ హయములనుండి దిగి నన్ను డాసిరి. కొనయూపిరితోనుండు మనుజుఁడు మాట్లాడునట్లు "ఓరీ! బలభద్రా! నీవు ప్రక్కనెచటనైన నుండినచోఁ గొంచెము మంచినీళ్ళను దీసికొని రమ్ము. ఓరీ! అంగదా నీవుపోయి కమలా క్లోడిస్సాలు మిట్టప్రదేశమున నుండిరేమో చూచిరమ్ము. నాకు గొప్పదెబ్బ తగిలెనేకాని ప్రాణముల కపాయము కలిగింపలేదు, ఐనను కనులు మూఁతలు పడుచున్నవి" అని చెప్పితిని. వెంటనే మదాజ్ఞానుసరణిని దమతమ కార్యముల నెరవేర్పఁ బారేగిరి. ఇంతవఱకును దిరిగి రాలేదు. అచిరకాలములోనే వత్తురు."

ఈ సంగతులను మోహనుఁడు కమలకుఁ జెప్పి క్లోడిస్సా యెచటనున్నదని యడిగెను. దానిపైఁ దనకుఁ బరిచయములైన విషయముల నన్నిటినిఁ జెప్పి క్లోడిస్సాకొఱకుఁ గమల చింతింపసాగెను. మోహనుఁడుకూడ చింతనొందె. తానును క్లోడిస్సాయును సపర్యలు సలిపిన మనుజుఁడు వీరరుద్రుఁడే యని కమల చెప్పినంత మోహనుని యాశ్చర్యము మన మూహింపఁజాలము. కమలా మోహనులు "అయ్యో! పాపము! క్లోడిస్సా వీరరుద్రునిచేఁ దస్కరింపఁబడియెఁ గాఁబోలు! ఏమి చేయనగు" నని యనుకొనుచున్నంతలో నంగద బలభద్రులు వెవ్వేరు తావులనుండి యొక్కరొక్కరుగ వచ్చిరి. వారిరువు రేయేపనులపై నేగిరో యయ్యవి యనుపేక్ష్యములని వారు తెలిసికొనిరి. ఏమనిన నంగదుఁ డెవ్వరిని వెదకుటకై యేగెనో, ఆకమల—క్లోడిస్సాలేదు—ఇచటనే యుండెను. ఎవ్వరిని స్మృతికి రప్పించుటకొఱకు మంచినీరమును బరిగ్రహింప బలభద్రుఁ డేగెనో, ఆ మోహనుఁడే లేచి కూరుచుండి కమలతో మాట్లాడుచుండె.

క్లోడిస్సాకొఱకుఁ గమలా మోహనాంగద బలభద్రులు విచారించు నవసరమున వారియొద్దకుఁ గ్లోడిస్సా వచ్చెను. సత్వరమే యధిక సంతోషముతోఁ గమల క్లోడిస్సాను గాఁగిలించుకొనుచు "క్లోడిస్సా! మ

రల నాకన్నులకుఁ గాన్పడితివా!" యని యనెను. మోహనుఁడు తన సంతోషమునుగూడ వెల్లడించెను. అంగద బలభద్రులుకూడ నట్లే తెలియఁజేసిరి.

"క్లోడిస్సా! నీవ ట్లదృశ్యవగుటకుఁ గలకారణ మేమి? మరల నేరీతి వచ్చితివి?" యని కమల ప్రశ్నించెను.

"కమలా! ఆ విషయములను మనము పురిలోనికేగి యొకచో భోజనాదికృత్యముల నొనర్చి పిమ్మట ప్రసంగింపవచ్చును" అని మోహనుఁడు పలికెను. వెంటనే వారందఱును హయారూఢులై బయల్వెడలి జయపురములోనికిఁ జొచ్చిరి.

ఆపురములో నొక విశాలప్రదేశమున నొక సౌధమును నద్దెకుఁ దీసికొని భోజనాదికమ్ము లొనరించి విశ్రమించుతరి క్లోడిస్సా కమలామోహనులతో నిట్లు చెప్పెను. "దేవీ! నీవౌషధముకొఱ కేగినంత నెవ్వరో మువ్వురు దృఢకాయులు—వీరరుద్రుని సహచరులని పిదప తెలియవచ్చె—ఇచ్చోటికువచ్చి "ఓసీ! నీ వెవ్వతెవు!" అని యడిగిరి. కాని నేను ప్రత్యుత్తర మీయకమునుపే వారు నన్ను కాలు సేతులు కట్టి తమలో నొకని గుఱ్ఱమునకు విఱిచికట్టిరి. మరియొకఁడు వీరరుద్రుని కళేబరమునుగూడఁ దన హయముపై నిడికొనియె. అంత వారందఱును నాతోఁగూడఁ బ్రక్కనున్న యొక యుపత్యకములోనికిఁ బ్రయాణమైరి. ఈప్రయాణములో హేమచంద్రుఁడు పూర్తిగా నిరపరాధియని నేను దెలిసికొంటిని.

"ఏమి! హేమచంద్రుఁడు నిరపరాధియా?" యని మహాశ్చర్యముతోఁ గమలామోహను లడిగిరి.

"నిజమే! రవీంద్రహంతకుఁడు హేమచంద్రుఁడుకాదు! అఘోరి యను వీరరుద్రుని సహచరుఁడు!"

"ఇది నీకెట్లు తెలియనయ్యె!"

"స్మృతితప్పి పడియున్న వీరరుద్రుని నోటినుండియే వింటిని. అంతియకాదు. మరికొన్ని విషయములు కలవు. హేమచంద్రుఁడు దేవీ! మొన్నటి నీదుస్థితికి మూలకారకుఁడఁట. వాఁడే వీరరుద్రాఘోరులచే నిన్నాయాకూఱునకు విక్రయింపఁబంచెనఁట. వీరరుద్రాఘోరాలు నిన్ను బలాత్కరించుకొని పోవుచుండగా నారంగమున హేమచంద్రుఁడుకూడఁ గలఁడనియు, నచటికపుడు రవీంద్రుఁడు కమలను రక్షించుటకు వచ్చెననియు, వెంటనే 'అఘోరి' వానినిఁ జంపెననియు మొదలగు విషయములు స్మృతితప్పియున్న వీరరుద్రుని నోటినుండి వింటిని. అట్లయిన రవీంద్రహంతకుఁడ వీఁడేయని నేనును అంగద బలభద్రులును వానిని బట్టుకొనినప్పుడు వాఁడు తాను హత్యఁజేయలేదని యేల చెప్పలేదు?"

"దానికిఁ గారణము మిక్కిలి స్వల్పము. తారాకమలను పరులకు దొంగతనముగా నమ్ముటయే మొదటితప్పు. ఆయపరాధమునకు మరణమే శిక్ష. అట్లే హంతకునికిఁగూడ మరణమే శిక్ష కావున వానిమరణము నిశ్చితమైనప్పు డేయపరాధమైన నేమి? అంతియకాక యెన్నటికైన నఘోరియే వీరరుద్రుని హంతకుఁడని తెలియనగు. అపుడు హేమచంద్రుఁడు విముక్తి నొందునుగదా!" "క్లోడిస్సా! నీవు చెప్పినదంతయు నిజముగానే యున్నది. హేమచంద్రుఁడు రవీంద్రుని హంతకుఁడు కాడని నిశ్చయముగాఁ దెలసినది." అని కమల పలికెను.

"అమ్మా! ఇఁకనేను వెనుకటిసంగతులఁ దెలిపెదను. అట్లు నన్నుగూడ వారితోఁ గొంపోవుచు నొకలోయలోనికిఁ బ్రవేశించిరని చెప్పితిఁగదా. ఆలోయ తోఁటలోఁ దమగుఱ్ఱములనాపి నాకట్లనువిప్పి వీరరుద్రునికి సపర్యలు సేయుటయందు వారు మిక్కిలి శ్రద్ధతోనుండి నాసంగతిని మఱచిపోయినట్లు కాన్పడిరి. వెంటనే నేను మిక్కిలి ధైర్యమువహించి నిశ్శబ్దముగా ముప్పదిగజముల దూరము వెనుకకుఁ బోయితిని.

"ఎంతటి సాహసకృత్యము!" అని కమల క్లోడిస్సానభినందించెను.

"మిక్కిలి మెచ్చుకొనఁదగినదానవు" అని మోహనుఁడు పలికెను.

"ముప్పదిగజముల దూరము పోయినను వారు నన్ను జూడలేదు. ఏమనిన వారి దృష్టియంతయు వీరరుద్రునిపై నుండెను. అది నేనుగ్రహించి భూరిసత్వమున వెనుకకుఁ జూడకయే మహావేగముతోఁ బరువెత్తఁదొడంగితిని. మూఁడువందల గజములు పరువెత్తి వెనుకకుఁ జూచినంత వారు నలువురును నన్ను దూరమునుండి వెంటనంటి పరువెత్తుచుండుటఁ గాంచితిని. వెంటనే నే నొకదట్టముగాఁ బెరిఁగిన మామిడితోఁటలోఁ జొచ్చితిని. అట్లుచొచ్చి యాతోఁటలో మిక్కిలి గుబురుగాఁబెరిఁగిన యొక రసాలవృక్షాగ్రమున కెక్కితిని. ఆతోఁట మిక్కిలి సాంద్రముగా నుండుటచే నేనేమిచేసితినో వారికిఁ దెలియలేదు. కావున వారాతోఁటలోనికి వచ్చియుఁ బైకి చూడకయే ప్రక్కనున్న యూరిలోనికిఁ బారిపోయితి నేమోయని యాదెసకుఁ బోయిరి. వెంటనే నేను జెట్టునుండిదిగి వేగముతో నడచుచు మిమ్ముల నాస్థలమునఁ గలిసికొంటిని.

"క్లోడిస్సా! నీసాహసము మిక్కిలి యభినందనీయముగా నున్నదని నేను పలుమారు చెప్పనక్కఱలేదు.

"అమ్మా! నన్ను పలుమారు మీరట్లు పొగడుటను నేను వినఁజాలను. అది యట్లుంచి నామనవి వినుఁడు. నేను నావృద్ధజనని విడిచి నాలుగేండ్లయినది. ఆమెనివాసస్థలమిచటికి కతిదూరమున నున్నది. ఆమె యెట్లుండెనో నాకిపుడు మిక్కిలి చింతగా నున్నది. కావున నామనవి విని యచటికిఁబోయి పదిదినములుండుటకు నాకనుజ్ఞ నిండు" అని పలికెను.

"క్లోడిస్సా! నిన్ను నేను విడువఁజాలను. మేమందఱము నిచట

నింకఁ గొన్నిదినములుండి పిదప శ్రీనగరమున కేగెదము. నీవు కూడ మాతోడ వత్తువని మేము నమ్మియున్నాము.” అని కమల పలికెను.

“అమ్మా! మిమ్ములను నేను శ్రీనగరములోఁ దప్పక మరలఁ గలసికొందును గావున నామనవి వినుఁడు.” అని గ్లోడిస్సా పలికెను.

కాని కమలామోహనులు మొదట నొప్పుకొనలేదు ఎట్టకేలకుఁ గ్లోడిస్సా మరల మరల నడుగగా నొప్పుకొని వారు కొంతధనమును గ్లోడిస్సాకీయఁబోయి యెంతబలవంతపెట్టినను మందరవలెనే స్వీకరింప నిరాకరించెను. తెల్లవారిన పిదపఁ గ్లోడిస్సా కమలా మోహనాంగద బలభద్రులతోఁ దాను మరల వారినందఱను శ్రీనగరములోఁ దప్పక కలసికొందునని చెప్పి వారినుండి సెలవుగైకొని వెడలిపోయెను.

ఘూర్జరతార.

ఇరువదియెనిమిదవ ప్రకరణము.

గ్లోడిస్సా వెడలిపోయిన మూఁడుదినములకుఁ బిమ్మట, కమలామోహనులంగద బలభద్రులతోఁ గూడ శ్రీనగర ప్రయాణోన్ముఖులైరి. జయపురమునుండి శ్రీనగరమునకుఁ బోవుట కాఱుదినములు పట్టును. ఆయాఱుదినములును బ్రయాణము సలిపి తుట్టతుదకు శ్రీనగరముఁ జేరి మరణించిన రవీంద్రునిసౌధములోఁ బ్రవేశించిరి. ఆసౌధమిప్పుడు రవీంద్రుని ప్రథమపుత్రుని యాజమాన్యముక్రింద నున్నది. కమలామోహనాంగద బలభద్రులాసౌధములోని కేతెంచినపు డాప్రథమపుత్రుఁడు లేఁడు. కార్యాంతరమున నెచటికో పోయెను. కాని నొకటి గృహదాసికలదు. ఆమెయే, మన కథానాయకులకు హృదయపూర్వక స్వాగతము నిచ్చెను. పిమ్మట వారందఱు నాగృహదాసిచే మిక్కిలి గౌరవింపఁబడిరి.

కమలామోహనులు శ్రీనగరమున కేలవచ్చిరో చదువరులూహింపనగు. అయినను నాచే నావిషయము మరల లిఖింపఁబడుఁగాక. రవీంద్రునిచే నెయ్యది కైలాసపర్వత పంక్తిచే నాలింగితమైయుండెనని చెప్పఁబడియెనో—ఎయ్యది లోకమునందు మున్నెన్నఁడును జూడఁబడని యమూల్య వివిధరత్నములకు పంటభూమియై యుండెనో—ఎయ్యది వివిధఫలవృక్షములకుఁ బుట్టినిల్లయి యెల్లపుడు పూచి మనోహరపరిమళముల వెదఁజల్లు సుకుమార కుసుమ విసరాలంకృత లలితలతావితానములకుఁ బట్టాలసురభియై యుండెనో—ఎయ్యది సంవత్సర

ముపొడవునను, సమశీతోష్ణమేయగు నైసర్గిక స్థితియందుండునో—ఎయ్యది ప్రపంచవృష్టిచే ననవలోకితమై యుండెనో—అట్టి మహాసురనందన విషయములఁ దెలుపుపత్రములను వెదకుటకై కమలా మోహానులు శ్రీనగరమునకు వచ్చిరి.

ఆసురనందనమున కెయ్యది దారియో మొదలగు విషయములు రవీంద్రుఁడు కమలకుఁ జెప్పెదననియెనే కాని చెప్పకయే మరణించెను. కాని తద్విషయముల విపులముగా వ్రాసిన పత్రములు కలవని వారెఱింగియుండిరి. వెంటనే తత్పత్రముల వెదకుటకు గృహదాసిని నియోగించిరి.

కమలామోహానులు శ్రీనగరమునకు వచ్చిన దినముననే క్లోడిస్సాయును దన వాగ్దత్తప్రకారము వారినిఁ గలిసికొనెను. క్లోడిస్సా వచ్చుట కమలామోహానుల కత్యంత సంతోషసంధాయకమయ్యె. వారు గృహదాసికిఁ గ్లోడిస్సాను బరిచయపఱచి తమను డిల్లీచక్రవర్తి యంతఃపుర విషయమున నామె యొనర్చిన మహోపకారముల నన్నిటిని నాగృహదాసికిఁ దెలియఁజెప్పి యామెయెదుటఁ గ్లోడిస్సాను మిగుల నభినందించిరి. ఆగృహదాసియుఁ గ్లోడిస్సా సద్గుణములకు మిక్కిలి సంతసించె. క్రమక్రమముగా వారిరువురకును మిక్కుటమగు స్నేహభావముద్భవిల్లె.

నాలుగు దినములు గతించె. పత్రములకొఱకు రవీంద్రుని సౌధమంతయుఁ బరిశోధింపఁబడియె కాని వానిజాడ యెందును గాన్పింపలేదు. కమలామోహానులిఁక నాపత్రములకొఱకు నిరాశనొంది మరునాఁడు వారలిరువు రొక గదియందుఁ గూరుచుండి యీరీతిని బ్రసంగించుచుండిరి.

“కమలా! ఘూర్జరదేశమును బరిపాలించు రాజకుటుంబమునందుఁ బుట్టిన యువరాజును నేనని మనము ఘూర్జరరాజధానిలోఁ బ్రవేశించువంతవఱకును బ్రకటింపఁగూడదు” అని సందేహముతో “కాని—

నేనే యువరాజునని యనుటకుఁ గల దృష్టాంతములేవి?” అని మోహానుఁడు పలికెను.

“మోహానా! ఏవియననేల? రవీంద్రుఁడట్లు నిరూపించి చెప్పఁగా వినిన నేనులేనా?” యని కమల నవ్వుచుఁ బలికెను.

“దానికన్న వేఱొక్క యుపాయము నాకుఁ దోఁచుచున్నది. నన్నుఁ జిన్ననాఁటనుండియును మహానురాగముతోఁ బెంచిన యుదయపురరాజగు వీరసింహుని నేను జూచి పెక్కుదినములైనది. ఆయనయొద్దకేగి మనకిప్పటివఱకు సంఘటిల్లిన విచిత్రవిషయముల నన్నిటిని వాక్రుచ్చి తదనంతర మాయనయొద్దనుండియే నేను యువరాజునని స్థిరపఱచు ప్రశంసాపత్రములను దీసికొని వచ్చెదను. ఈయుపాయము మంచిదేనా?

“నిస్సంశయముగా”

“అట్లయిన మనమిఁక నాలస్య మేలచేయవలయును. ఈనాఁడే ప్రయాణమున కుపక్రమింతము. మనమీనగరమునకు వచ్చుట వృథాయయ్యెఁగదా. రవీంద్రుని సౌధమున సురనందనముఁ గూర్చిన పత్రములెచ్చటను గాన్పడలేదు.

ఇంతట వా రుపవసితులై యున్నగది గుమ్మము తెఱువఁబడి క్లోడిస్సా లోనికి వచ్చెను. తమకుఁ బ్రక్క నొకపీఠికపైఁ గూరుచుండుమని క్లోడిస్సాకు సన్నఁజేసి తామాదినముననే యుదయపురమునకుఁ బ్రయాణము చేయ నెంచితిరనియుఁ—గ్లోడిస్సా కూడ తమతో వచ్చిన మిక్కిలి సంతోషముగా నుండుననియుఁ గమలామోహానులు చెప్పిరి. క్లోడిస్సా వారికిఁ బ్రత్యుత్తరముగాఁ దాను వారి కృపాతిశయమున కెంతయుఁ బాతురాలననియుఁ, గాని నాలుగైదు దినములవఱకుఁ దాను శ్రీనగరమును విడుచుటకు వీలులేదనియుఁ బిమ్మట వారిని తప్పక యుదయపురములోఁ గలిసికొందుననియుఁ జెప్పెను.

తదనంతర మానాఁడే కమలామోహనాంగద బలభద్రు లుదయపురమునకుఁ బ్రయాణోన్ముఖులై, గృహదాసీ క్లోడిస్సాలకుఁ జెప్పి వెడలి, నాఁటిసాయంతనమునకు మార్గముననున్న మన వెనుకటి పూర్వ సువాసినియగు నయేషాతల్లి గృహమును జేరిరి.

అయేషా కోరినప్రకారము, తన క్షేమసమాచారముల నాపె తల్లికిఁ దెలియఁజెప్పఁ దారాకమల, యాగృహప్రాంగణమునఁ దన హయమునునిలిపి లోనికిఁ బ్రవేసించెను. అట్లే మోహనుఁడును దన హయమునుండిదిగి, కమలవెంట గృహములోనికిఁ బోవసంసిద్ధుఁడై యుండునంతఁ బదుగురాయుధపాణులగు సేవకులు గుఱ్ఱములెక్కి వెంట రా నొక రాజవంశసంభూతుఁడు దివ్యహయారూఢుఁడై యాబాటమీఁదుగ నేవచ్చుచు మోహనునికిఁ గాన్పడిరి. వారు క్రమక్రమముగా డాయునప్పటికి మోహనుఁ డాశ్చర్యమహానందనిమగ్నుఁడై "ఓహో! నన్నుఁ బెంచినతండ్రి—ఉదయపురరాజు—వీరసింహుఁడు—ఇటులే వచ్చుచున్నాఁడు" అని యెలుంగెత్తిపలికెను.

ఆవచ్చుచున్నది నిజముగా వీరసింహుఁడే. కాని వీరినందఱను విడిచి మనము శ్రీనగరస్థిత రవీంద్రసౌధమున కిపుడేగవలయు.

వెనుకటిదినమున సాయంతనసమయములోఁ గమలామోహనులు రవీంద్రుని సౌధమున నొకగదిలోఁ గూరుచుండి, కైలాసపర్వతములనున్న సురనందనముఁగూర్చి మాట్లాడుచున్న క్షణముననే, ఆగదిలోనికిఁ గ్లోడిస్సా ప్రవేశించెననుసంగతి మాచదువరులస్మరణకు వచ్చుఁగాక. ఆసురనందనవిషయములఁగూర్చి తెలిపెడు పత్రములెవ్వియును దొరకలేదను కమలామోహనుల ప్రసంగమంతయు గ్లోడిస్సా వినెననుటకేమియును సందియము లేదు. కమలామోహనాంగదబలభద్రులా సౌధమునుండి వెడలిపోయినపిమ్మట క్లోడిస్సా గృహదాసినిజేరి "అమ్మా! నేనుగూడఁ బ్రయాణమయ్యెదను." అని చెప్పెను.

గృహదాసి క్లోడిస్సాను మిక్కిలి స్నేహభావముతోఁ జూచుచుండుటచే "క్లోడిస్సా! మించిపోవుకార్యములెవ్వియు నీకు లేవుకదా. నాలుగుదినము లిచట నాతోఁగూడ నుండఁగూడదా" యని గృహదాసి పలికెను.

"సరే. నాకేమియుఁ దొందరపనులులేవు. నీకోర్కెచొప్పుననే యుండెదనులెమ్ము"

"ఈగృహము నీగృహమేయని యెంచుకొనుము. నీయిష్టానుసారమిచటనుండనగు.

"సంతోషము! ఉండుటయేమంచిదని నాకుఁ దోఁచుచున్నది. ఏమనిన నీసౌధ మత్యంతరమణీయముగానున్నది. మిక్కిలి యమూల్యములు, చిత్రవిచిత్రములు నగువివిధపరికరములచే విలాసమైయున్నయది.

"అగునగు. ఈసౌధవిలాసము లత్యద్భుతములు. నీకువానిని జూడవేడుక కలదేని నీయిచ్చవచ్చినయపు డీసౌధమందిరము లన్నిటిలోనికిఁబోయి చూడనగు. వేయేల! ఈగృహము నీదేయనుకొనుము."

గృహదాసి నిర్మలహృదయమునకుఁ గ్లోడిస్సా మిక్కిలి మోదమందె. ఆమె, మఱునాఁడు ప్రాతస్సమయమాది మధ్యాహ్నభోజనసమయమువఱకు నాసౌధపుఁ బ్రతిమందిరములోనికిఁబోయి చూచెను. తలుపులఁ గదల్చెను. తాళములువేయఁబడని "అలమారు" లన్నిటినిఁ దెఱచెను బల్లలలోఁ జూచెను. చాపలకుబదులుగా భూమిపైఁ బఱువబడిన "తివాసీ" లకుఁ గ్రిందుగా వెదకెను. ప్రతిమూలలను బరిశోధించెను. ఖట్వములను జూచెను. పఱుపుల కధోభాగమునఁ బరిశీలించెను.

ఏమిది—పరిశీలించుట—శోధించుట—వెదకుట—పరీక్షించుట—గృహదాసిచూచుటకే యనుజ్ఞనిచ్చెఁగాని యిట్లు ప్రతివస్తువును వెదకుట కనుజ్ఞనిచ్చెనా? లేదు, కాని యట్లు వెదకుటయందు క్లోడిస్సాకు

వేఱుభావముకలదు. ఏదియోవస్తువుఁగొఱకామె మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించుచుండెను. ఇట్లు గ్లోడిస్వా పరీక్షజేయుచుండుట గృహదాసి కనుఁగొనదు. కనుఁగొనవగు సమయమునఁ గ్లోడిస్వా పరీక్షింపదు.

మధ్యాహ్నమగువఱకు నల్లు వెదకివెదకి తుదకు విసువుచెంది గ్లోడిస్వా గృహదాసిని జేరవచ్చునంత, నామె యొకనితో ‹‹అట్లయిన సరే, నిన్నుఁగూర్చిన సంగతులన్నియు బాగుగనేయున్నవి. మరల సాయంతనము వత్తువేని నాయభిప్రాయమును దెలిపెద పొమ్ము. అని చెప్పుచుండెను.

ఆ—యొకఁడు—ఎవ్వఁడనగా నిరువదేండ్ల ప్రాయమువాఁడు. ఉష్ణదేశములలో నుండువారివలె నల్లనిరూపువాఁడు, మంచిదృఢకాయుఁడేయగు.

‹‹పొమ్ము” అని గృహదాసి పలికినంత, వాఁడాపెనుండి సెలవుగైకొని వెడలిపోయెను. గ్లోడిస్వా గృహదాసిని డాసి ‹‹అమ్మా ! ఆయావనుఁడెవ్వఁడు?” అని ఆగృహదాసినడిగెను.

వాఁడు దక్షిణదేశస్థుఁడఁట. మనసౌధమున సేవకావృత్తి జేయుటకై వచ్చినాడు. ఇదివఱకు వాఁడు సేవఁజేసిన యొకరియొద్దనుండి తన విశ్వాసమును, సత్ప్రవర్తనమును దెలిపెడు ప్రశంసాపత్రములను గొనివచ్చినాడు. దానఁజేసి వాఁడు మంచివాఁడేయని తోఁచుచున్నది. ఈనాఁడు మొదల్కొని వానిని మనవనరక్షకునిగా నియోగింపఁదలఁచినాను. ఇంతవఱకునుండినవనరక్షకుఁడు వృద్ధుఁడౌటచే వానిని దప్పించి యాస్థానమున వీనిని నియోగించుటయే నాయభిప్రాయము”

‹‹మంచిదే.” అని గ్లోడిస్వాచెప్పెను.

సాయంతన మైదుగంటలపై నఱగంటకాలమైనది. గృహదాసియును, గ్లోడిస్వాయును సౌధప్రాంగణమున నొకచోఁ గూరుచుండియుండిరి. గ్లోడిస్వా యేదియో పుస్తకమును దనలోఁ దాను జదువుకొను

చుండెను. ఆసమయమున వెనుకటియావనుఁడువచ్చి గృహదాసి యెదుట నిలువఁబడియెను. వానిరాకను గ్లోడిస్వాచూచెను. కాని మరల తన పుస్తకమును జదువుకొనమొదలిడెను

వాఁడు వచ్చినవెంటనే ‹‹ఓరీ! నీపేరేమి? యని యడిగెను.

‹‹అమ్మా! నాపేరు గుహుఁడు” అని సవినయముగాఁ బ్రత్యుత్తరమిచ్చెను.

‹‹గుహుఁడా! నిన్ను మావనరక్షణమునకు నియోగించెదను. నీవీనాఁడుమొదలుకొనియే పనిచేయవలయు. నీపనియేమనగా రాత్రియంతయు మేల్కొని వనమును సౌధప్రాకారద్వారములను బరీక్షించుచుండవలెను. ఇందులకు నీకువేతనము భోజనముఁబెట్టి రెండునిష్కములీయనగు. నీకిష్టమేనా?”

‹‹అమ్మా! నాకిష్టమే”

‹‹సరే” యని గృహదాసిచెప్పి యొకచిన్నితుపాకిని వానిరక్షణమునకై యిచ్చి వానిపనిపై వానినుండుమని నియోగించిపంపెను.

ఈపై సంభాషణను విననట్లుండి యింతవఱకును గ్లోడిస్వా చిత్తైకాగ్రతతోఁ దనపుస్తకమును జదువుకొనుచుండెను. గుహుఁడు వనరక్షణమునకై పోయినపిదప నెద్దియో గృహకృత్యముల నొనర్చుటకు గృహదాసికూడ వెడలిపోయెను. ఆమెనుబోనిచ్చి, వెంటనే తనపుస్తకమును భూమిపై విసరివైచి, తనపయ్యెదలో డాచియుంచఁబడిన కొండొకవస్తువును సవరించుకొనుచు నచటినుండిలేచి సౌధమునుండిదిగి యుపవనములోనికిఁ బోయెను.

ఇపుడు చంద్రుఁడు తన శీతలరుచులతో దేదీప్యమానుఁడై యాకాశపథమున రాజసముతోఁ బ్రవర్తించుచుండె. ఆనాఁడు షష్టియగుటచేఁ జంద్రికలు మిక్కిలి ప్రభావంతములుగాలేవు. గుహుఁడు తనకు గృహదాసిచే నియ్యఁబడిన చిన్నితుపాకిని మూపుపై మోపికొని,

తనకు ముప్పదిగజములదూరములో నుండునకుఁ బోవుచుండుట క్లోడిస్సా చూచెను. వెంటనే తనకాలిచప్పుడు వానికి వినసై, తన్నుఁగనుఁగొనుట సంభవింపకుండ, పిల్లియడుగులతోఁ దానును వానివెనుకనే యనుసరించి, కొన్ని నికుంజపుంజములలోనికిఁ జొచ్చి యచట డాఁగియుండెను. ఆనికుంజము లున్నతములై సాంద్రముగాఁ బెరిఁగియుండుటచేఁ దాను గుహునిచేఁ జూడఁబడకయే వానిప్రచారములను గనుఁగొననగు.

ఆగుహుఁ డట్లుపోయిపోయి మరల వెనుకకుఁ దిరిగి క్లోడిస్సా డాఁగియుండిన నికుంజములవైపునకే వచ్చుచుండెను. అది చూచి క్లోడిస్సా తన పయ్యెదనుండి యొక "బాకు" ను దీసి కుడిచేతఁబట్టికొని లేచిపై దుముకు సింగపుఁగొదమవలె మిక్కిలి సరభసముతో నుండెను. అట్లు వచ్చివచ్చి గుహుఁడు క్లోడిస్సా డాఁగియుండిన నికుంజపుంజములకు రెండుగజముల దూరములోనున్న మరియొక పొదలోనికిఁబోయి కూరుచుండి యెవరును లేరుకదాయని నిశ్చయించుకొనుటకటునిటుఁ జూచి, తన యంగీనుండి యొకచిన్నిత్రవ్వుగోలను దీసి తనకు ముందుగా గుంట నొకదానిని ద్రవ్వ నారంభించెను.

గుహుఁడు చేయుచున్న పనినంతయుఁ జూచుచుండిన క్లోడిస్సా యిపుడు "బాకు" ను కుడిచేత గట్టిగాఁబట్టుకొని వానిపై దుముకుటకు సిద్ధముగా నొక యంజ ముందునిడి భీకరాకారయై యుండెను.

త్రవ్వఁగాఁ ద్రవ్వఁగా గుహుని త్రవ్వుగోల కొకవస్తువు తగిలినట్లు శబ్దమయ్యెను. వెంటనే త్రవ్వుగోలను భూమిపైఁ బెట్టి బ్రహ్మానందపారవశ్యముచే నాత్మపరిజ్ఞానము లేకయే వెలువడు మోదవాక్యముల మెల్లగాఁ బలుకుచు గుహుఁడు తనహస్తమును గుంటలోనికిఁ బోనిచ్చి యావస్తువును బరిగ్రహించెనో—లేదో—ఇంతలో బోనునుండి వెలువడు కొదమసింగమువలె—కనుమూసి కనుదెఱచునంత కాలములో నుదయించి తిరోహితమగు చంచలమువలె—అంత వేగముగా—అంతభీక

రముగా—క్లోడిస్సా గుహునిపై నొక్క హుటాహుటిని దుమికి వానిననంతసత్వముతో భూమిపైఁ బడఁద్రొక్కి వక్షస్థలముపైఁ గూర్చుండి యెడమచేత వానికంఠమును బిగియించి—రెండవచేతనున్న "బాకు" వాని బొమ్మలకు సూటిగానెత్తి పట్టుకొని "మాట్లాడకుము. లేనియెడల నీపని పూర్తియగు. నిన్ను నేనెఱుఁగకపోలేదు! నీవే హేమచంద్రుఁడవు!" అని గంభీరధ్వనితోఁ గ్లోడిస్సా వాక్రుచ్చెను.

ఘూర్జరతార.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

హేమచంద్రుఁ డెంతటి మహాభయముచే స్తంభీభూతుఁడయ్యెనో గజగజవణఁకుచున్న వాని యవయవములే సాక్ష్యమిచ్చును. క్లోడిస్సాను తాను మున్నెప్పుడును కనియుండలేదు. ఆమె యెవ్వతెయో తానెంత మాత్రము నెఱుఁగఁడు. ఒకస్త్రీ, అట్లు మనుజునిపైఁబడి వానిని మర్దించుట కెంచెననిన నాస్త్రీ స్వప్రాణములకు లెక్కసేయక యే యట్లు ప్రయత్నించునని చెప్పవచ్చును. తన్నిప్పు డొడిసిపట్టికొనినది స్త్రీకాక పురుషుఁడైనయెడల హేమచంద్రుఁడు తన సహజమనస్థైర్యముతో నెదుర్కొనియే యుండును. తాను గృహదాసితో మాట్లాడుచున్నపుడు పుస్తకమును దనలోఁ దాను జదువుకొనుచున్న క్లోడిస్సాను హేమచంద్రుఁడు చూడకపోలేదు. కాని తన్ను క్లోడిస్సా చూడలేదనియుఁ, జూచినను దనయెడ నశ్రద్ధతో నుండెననియు వాఁడనుకొనెను. కాని యితరులచేఁ గనుఁగొనఁబడని తన మారువేషమునకు మోసమునొందక తన నిజస్వరూపమును గ్రహించిన స్త్రీ—ఎవ్వరో తానెఱుఁగని స్త్రీ—ఒకచేత బాకును ధరించి తనరక్తమును గ్రోలుటకు భీకరమూర్తియై యున్న స్త్రీ—తనయెదుట గ్రుడ్లుఱుముచు శక్తివలెఁ బ్రత్యక్షమగుట హేమచంద్రుఁడు చూచి మహాభయమునఁ దనయొద్ద నుండిన తుపాకినిగూడ మఱచిపోయెను.

"నీవే హేమచంద్రుఁడవు" అని క్లోడిస్సా చెప్పినయప్పుడు హేమచంద్రుఁడు పిడుగు మీఁదఁబడినవానివలెఁ బలుకాడుటకు నోరు రాక కంపితగాత్రుఁడై యుండెను.

"తలవెంట్రుకయంతైనను గదలకుము!" ఇపుడు క్లోడిస్సా నిజముగా హేమచంద్రుని బాకుతోఁ బొడుచునట్లే యుండెను. "కదలినచో నీహృదయకోశములోనికి నాబాకు చొచ్చును. ఆబాకు నీకుఁ దత్కాలమునందే నరకద్వారములఁ జూపించును—అది నీచర్మముపై గీచికొనిపోయినఁ జాలు. ఆక్షణముననే మరణము తప్పదు—ఏమనిన బాకుమొన విషముతోఁ బూయఁబడినది."

ఝంఝామారుతముచే సమూలముగాఁ గంపించు వృక్షమువలె హేమచంద్రుఁడిపుడు గజగజ వడంకెను. తదనంతరము క్లోడిస్సా వానిమూపుమీదుగా నడుమునకు బంధింపఁబడిన తుపాకిని వానియొద్దనుండి లాగి తనయొద్ద నుంచుకొనెను. ఇపుడు హేమచంద్రుఁడు ప్రథమమునకన్న మిన్నగా భయమొందెను.

వాఁడు త్రవ్విన గుంట రెండడుగులు లోతుగా నుండెను. క్లోడిస్సా చుఱుకుఁజూపు లాగుంటలోనికిఁ జొచ్చి మొదట హేమచంద్రుఁడు దేనిని బరిగ్రహించుటకు సిద్ధముగానుండెనో యావస్తువుపైఁ బ్రసరించెను. అది కాగితములకట్ట; వెంటనే క్లోడిస్సా మోహనవినీలలోచనగోళములనుండి మహానందసూచకములగు దృక్కిరణములు వికిరములయ్యెను.

"ఆకాగితములను నాకిమ్ము!" అని మహాధికారివలె హేమచంద్రుని కానతిచ్చి వాని వక్షస్థలమునుండి తాను లేచెను. అట్లు క్లోడిస్సాచే హేమచంద్రుఁడు విడువఁబడినను వాఁడు పారిపోవునని యనుమానము కలుగు ప్రథమతక్షణమందే కమలయొద్దనుండిన బాకును, దుపాకియును, నెంతటి ఘోరకృత్యములనైన నొనర్చుటకుఁ గ్లోడిస్సాచే సిద్ధము చేయఁబడెను.

"కాగితములను నాకిమ్ము" అని గ్లోడిస్సా యాజ్ఞయిచ్చినంత క్షణమాత్రమైనను జాలముసేయక గుంటయడుగునుండి యాపత్రములను దీసి గ్లోడిస్సా హస్తమునఁ బెట్టెను. ఆపత్రములు గ్లోడిస్సాకుఁ దానందించుచున్నపుడు తనప్రాణములు పోవుచున్నట్లే—ఒక్కక్షణమాత్రకాలము వెనుక తాను దలంచుకొన్న మహాశలన్నియును గలలోని విషయములవలెఁదిరోహితము లగుచున్నట్లే—హేమచంద్రునికిఁ దోఁచెను.

"మంచిది!" అనుచు నాకాగితములను దనయొడిలోఁ బొందుపఱచి తుపాకిని జంకనిడికొని భూమినుండి లేచి "లెమ్ము—లేచి నేను జెప్పినట్లు చేయుము.

పాపము హేమచంద్రుఁడట్లే లేచెను; మరల మునుపటి యధికారగాంభీర్యముతో "ఆగుంటను బూడ్చివేయుము." అని హేమచంద్రునికిఁ గ్లోడిస్సా యాజ్ఞనిచ్చెను.

హేమచంద్రుఁడు లేచెను. వానియొడలు వణఁకుచున్నను బాపము త్వరలో గుంటను బూడ్చెను. అట్లుపూడ్చి మరల గ్లోడిస్సా యేమి యాజ్ఞనిచ్చునోయని వేచియుండెను.

అంతటఁ గ్లోడిస్సా యిట్లు చెప్పఁదొడఁగెను. "హేమచంద్రుఁడా! నీకెన్నఁటికిని సద్బుద్ధికలుగదని తోఁచుచున్నది. ఒక యపరాధము కొఱకు జయపుర కారాగృహమున బంధింపఁబడి, వీరరుద్రాఘోరుల సహాయముతోఁ ద్రాళ్ళమూలముగా నందుండి విముక్తిజెందితివో లేదో, మరల వేఱొక యపరాధమునకుఁ గడంగినావు. ఇంతటి దుర్బుద్ధివైతివేల? ఇపుడు నేనొక్క పెనుకేకను వైచి యందఱను మేల్కొలిపిన యెడల నీవు పట్టుకొనఁబడుదువు. మరల నీవు కారాగృహమునఁ బ్రవేశపెట్టఁబడుదువు. న్యాయాధికారి సమ్ముఖమునకు సంకెలలతోఁ గొంపోఁబడుదువు. ఇపుడు నీవు న్యాయాధికారిసమ్ముఖమున భయకంపితగాత్రుఁడవగుట యొక్క రవీంద్రపత్రి తస్కరణముననేకాదు—నీమా

రువేషమునకు—మరియు జయపుర కారాగృహమునుండి తప్పించుకొని వచ్చినందులకు. ఇట్టిమహాపరాధములకు—క్షమింపఁబడఁగాని ఘోరాపరాధములకు—నీవు నీజీవితపర్యంతము కారాగృహమున బంధింపఁబడెదవు?

"క్షమింపుము, అమ్మా—నాపై జాలిగొనుము" అని యామె పాదములపైఁబడి "అమ్మా! నీకునమస్కరించెద. నన్ను వెల్లడిజేయకుము. నేనిఁక శ్రీనగరమునువిడిచి మరల నెన్నటికినిరాను." అని గద్గదస్వరముతోఁ బలికెను.

"అట్లయిన నీకీపత్రములెట్లుదొరకెనో చెప్పుము. అబద్ధములాడెదవేమో జాగ్రత్త. నేను నీనక్కవినయములకు మోసమొందుదాననుగాను. నీకన్న బహుశః నేనే యెక్కుడెఱుంగుదును. నీచేష్టలన్నియు, నీప్రవర్తనమంతయు నేనెఱింగియేయుంటిని. నీవేమాత్రము నిజముపలికెదవో కనుఁగొనుటకే నీకుఁ బత్రములెట్లు దొఱకెనో యని యడుగుచుంటిని."

"అమ్మా! అట్లయిన నాసత్యమును బరిశీలింపుము. సౌధమునుండి కమల తస్కరింపఁబడి కొనిపోఁబడిన. రాత్రి రవీంద్రుఁడు నిర్జీవియై, రక్తపరిసిక్తకాయుఁడై భూమిపైఁబడియుంట నేను జూచితిని. చూచి యాయనయొడినుండి తాళపుఁజెవులఁగైకొని యాయన తన వ్రాఁతపనులకై వినియోగించెడు గదిలోనికేగి, నాయొద్దనుండిన—తాళపుఁజెవులతోఁ బెట్టియను దెఱచి యాపత్రములను గ్రహించి, సురనందనమునకు సంబంధించినవియగునో కాదో యని యొక్కసారిజూచి—పత్రములనన్నిటిని జదువలేదు. అట్లు చదువుటకు నాకుఁ గాలము లేకపోయెను. కావున బ్రథమపత్రములో మొదటి నాల్గుపంక్తులను మాత్రమే చదివితిని—పిమ్మట నీస్థలమునకువచ్చి వానిని బూడ్చిపెట్టి వెడలిపోవుచున్న మరునిముసమునందే పట్టుకొనఁబడితిని" అని హేమచంద్రుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

చంద్రికా సాహాయ్యమున హేమచంద్రుని మోమువంకఁ దీక్ష్ణములగు చూపులతోఁ గ్లోడిస్సా తిలకించెను. వానిమోమునం దెట్టిభావవైషమ్యమును బ్రకటింపఁబడియుండలేదు. కావున గ్లోడిస్సా వాని పలుకులను విశ్వసించెను. ఆపత్రములు గుంటలోఁ బూడ్చి పెట్టఁబడుటకు ముందు హేమచంద్రునిచేఁ జూడఁబడలేదని గ్లోడిస్సాకు మంచి నమ్మకము కలిగెను. లేక వాఁడాపత్రములను జదివి తన్మూలమున సురనందన విషయముల నెఱిఁగియే యున్నాఁడని యామెకుఁ దోఁచినయెడల వాని రహస్య పరిజ్ఞానము వానితోనే యంతమొందుట కచటనే—యాక్షణముననే—హేమచంద్రుని వధించియుండును.

"సరే! నీవు నిజమునే చెప్పితివి. కావున నిన్నింక జాలితోఁ జూచెదను. అట్లు చూడఁబడుటకు నీవు నాయనుజ్ఞలకు విధేయుఁడవై యుండవలెను సుమీ!

"అమ్మా! నీవెట్లుచెప్పిన నట్లు చేయువాఁడను"

"అట్లయిన గుఱ్ఱపుసాలలోనికి నాకుముందుగా నడవుము"

వెంటనే హేమచంద్రుఁడు ముందునడవఁ గ్లోడిస్సా వెంటరా, వారిరువురును గుఱ్ఱపుసాలలోనికిఁ బ్రవేశించిరి. అట్లు ప్రవేశించిన పిదప, రవీంద్రునిచేఁ జిరకాలమునుండియు నుపయోగింపఁబడిన యొకచక్కని గుఱ్ఱమువంకఁ దనవ్రేలుచూపి—అది రవీంద్రుఁడెక్కు హయమని గృహదాసి నిన్నటి సాయంతనము గ్లోడిస్సాకుఁ జూపించె—హేమచంద్రునితో "హేమచంద్రా! ఆగుఱ్ఱమును నీవెక్కి యీపురమును విడిచి పొమ్ము. మరియు నీవు——

"అమ్మా! ఆగుఱ్ఱముపై నెక్కి పోయిన నీనగరవాసులందఱు నాగుఱ్ఱమును గురుతెఱిఁగి నన్ను దస్కరుఁడని భావింపరా!" అని గ్లోడిస్సా కడ్డమువచ్చి పలికెను.

"ఆవిషయమెఱిఁగియే నేను ముఖ్యముగా నీకాహయమును జూపించితిని. ఏమనిన రేపు ప్రాతఃకాలమునకు గుహుఁడనువాఁడొకఁడు రవీంద్రుని హయమును దస్కరించుకొని పోయెననువార్త శ్రీనగరమున వ్యాపించును. కావున నాకార్యభారమును నీతలపై నుండుటచే నెన్నటికిని మరల నీవు శ్రీనగరమునకు రావు. మరియు నింకొక విషయము—నీవెచ్చటనైనను వ్యాపారము సలుపుకొని నిష్కళంకమగు జీవనముచేఁ బ్రవర్తించుటకొఱకు నీకిదిగో కొంతధనము నిచ్చెదను దీసికొమ్ము" అని యొకసంచిని హేమచంద్రుని హస్తమునఁ బెట్టి "ఇఁకనీవు సత్వరమే పొమ్ము. నీవెన్నఁడైనను శ్రీనగరమునకు రా సాహసించితివేని నాచేఁ గడునిడుమల నొందుదువని మాత్రము జ్ఞప్తియందుంచుకొనుము. ఇఁకఁ బొమ్ము" అనెను.

వెంటనే వాఁడు రవీంద్రుని హయముపై నెక్కి సౌధప్రాకారములదాఁటి పోయెను. కనుచూపుదూరము వాఁడేగునంతవఱకుఁ బ్రాకారమునొద్ద నిలువఁబడియుండి పిదప నాద్వారమునకు లోగొళ్ళెము వైచి, సౌధములోఁ దనకై యేర్పఱుపఁబడినగదిలోనికిఁ బోయెను.

తనగదిలోనికిఁ బోయి యామె నిదురబోవలేదు—వెంటనే దీపమునొద్దఁ గూరుచుండి తనయొడిలోనున్న పత్రములను బైకిఁదీసి చదువ నారంభించెను.

ఆపత్రములు రెండుభాగములుగా విభజింపఁబడి యుండెను. ఒకభాగము కమలామోహనుల బాంధవ్యరహస్యమునకును, రెండవభాగము సురనందన రహస్యమునకును గారణభూతములై యుండెను.

అమితశ్రద్ధతో వానినన్నిటినిఁ జదివెను. ఒకసారి చదివెను—మరల నింకొకసారి చదివెను. ఎంతచదివినను నామెకుఁ దృప్తి కలుగనట్లు తోఁచె.

ఆసురనందనము నెట్లు చూడనగునో—ఏయే పర్వతపంక్తుల ననుసరించి పోవలెనో—దానియం దేయేవస్తువులున్నవో మొదలగు రహస్యములఁ జదివినపుడు గ్లోడిస్సాకుఁ గలిగిన మహామోదమిట్టిదని వర్ణింప నెవ్వరితరము!

గ్లోడిస్సాకు సహజముగా గట్టిగుండియకలదు; కాని తన కీసమయమునఁ గలిగిన యానందమును దగుమాత్రపు హద్దులలో నిముడునట్లు చేయలేకపోయెను. ఆనందసూచకములగు నశ్రువు లామెవిశాలలోచనగోళములనుండి బొటబొట జారెను—ప్రపంచమున నేమియు నెఱుంగని పసిబిడ్డ యెట్లు నవ్వుకొనునో యట్లే తనలోఁ దాను నవ్వుకొనెను; బ్రహ్మానందపారవశ్యముచే జనించు మహోద్రేకవశమునఁ బటాపంచలగునేమోయను భయమున గ్లోడిస్సా, మిక్కిలి వడిగాఁ గొట్టుకొనుచున్న తనహృదయముపైఁ జేయినిడి, దాని సంరంభమును మాన్పయత్నించెను. తాను గూరుచుండియున్న పీఠికనుండి లేచి గదిలో నటునిటు దిరిగెను—మరల పీఠికపైఁ గూరుచుండి యానందబాష్పముల విడుచుచుఁ దనలోఁ దాను నవ్వుకొనెను. ఆ బ్రహ్మానందమహాలహరీ ప్రవాహంబునఁ బడి కొట్టుకొని పోవుచున్న తన హృదయమనేకచిత్రముల నొనర్చె. ఇప్పటికిఁ దనచేఁ జూడఁబడకపోయినను పత్రములమూలమున సురనందన సాంబంధికములగు సర్వవిషయముల నెఱుంగుటచేఁ గ్లోడిస్సా సంతోషమాత్రమునకై తనభావ ప్రపంచంబున మహోన్నత పర్వతపంక్తుల సృజించి వానియం దొకరహస్యప్రదేశమున భూలోకస్వర్గమనఁబడు సురనందనమును బుట్టించి దానిలోఁ దాను మాయావిహారముల నొనర్చుచుఁ, బువ్వులఁ గోయుచుఁ, బండ్లను రుచిచూచుచు, బంగారుకుప్పలలోనికిఁ జేయివెట్టి వానిని జిమ్ముచు, జాజ్వల్యమాన ప్రభలతోఁ బ్రజ్వలితములగుచున్న నిర్మలమణులను గులకరాళ్ళో యనునట్లు తనయొడిలోఁ బోసికొనుచుఁ, బిదప వాని యసంఖ్యాకతకు విసువుఁజెంది భూమిపైఁ వెదజల్లుచుఁ దదనంతరము తేన విహారమునకలసి యొకచో జలజల ప్రవహించుచున్న సెలయేట వినిర్మల శీ

తలజలములఁ గ్రోలుచు వేయేల? అతివిచిత్ర వర్తనముతోఁ బ్రవర్తింపఁ దొడఁగెను. ఆమాయా ప్రవర్తనమే యామె కనంత సంతోష సంధాయకమై యుండెను. దానియందే యామె సర్వేంద్రియములును, సర్వభావములును, కేంద్రీకృతములై యుండెను. ఆహా! కనుచూపునకు మేర కలదుగాని, హృదయావలోకనమున కేమిమేర?

అట్లు బ్రహ్మానంద సముద్రమున మునిఁగి యామెహృదయ మెంతకాలముండునో? త్రావినంతఁ ద్రావి తలఁబోసికొనినంతఁ బోసికొని తుట్టతుదకు మొగమెత్త నామెహృదయ మిప్పుడు సంతసపు మత్తునుండి విచ్చికొనసాగెను. భావికర్తవ్య మామె భావమందిరము నాక్రమించెను. కొంతసేపున కీదిగువ నిరూపింపఁబడిన ప్రణాళికయం దామెభావములు ప్రవహించెను.

“ఔను—ఇది మిక్కిలి పవిత్రకార్యము—దానిని దప్పక నెరవేర్తును. ఈరహస్యము కమలామోహనులకొఱకు నిర్దేశింపఁ బడినది. కావున దప్పక వారుకూడ నాతోపాటు సురనందన స్వానుభవమును, దానిపై సంపూర్ణయాజమాన్యమును బొందెదరుగాక. అపుడు రహస్య పరిజ్ఞేయమగు త్రయీసంఖ్య యతిక్రాంతముకాదు. ఆరహస్య సర్వమును నేనొక్కరితెనే యేల తెలిసికొని తత్ఫలము ననుభవింపవలె? వారుగూడ దీన భాగస్వాములైనఁ బోయినదేమి? నిజమే! అట్లుచేయనియెడల నాయది పరమలోభబుద్ధియగు. దానియందు నూర్గురు చక్రవర్తులకైనను సరిపోవు దివ్యరత్నరాసులును, బంగరుగుట్టలు నుండెననగా నవి ముగ్వురు మానవులకుఁ జాలకుండునా?”

అట్లు తలపోసి తుదకుఁ గమలామోహనులఁ గలసికొనఁ గృతనిశ్చయమై నాఁటిరాత్రిఁ శయనించి మరునాఁటి ప్రాతస్సమయమునఁ గాల్యకరణీయములఁ దీర్చికొని తనదేశమున కేగుచుంటినని గృహదాసినుండి సెలవుఁగైకొని పూర్వసువాసిని వసియించియుండిన ప్రదేశమునకుఁ బయనమై పోయె. ఉదయమున కేగు త్రోవలోనేయుండిన పూర్వసువాసిని గృహమునఁ గమలయుండునని గ్లోడిస్సాకుఁ దెలియదు.

ఘూర్జరతార.

ముప్పదియవ ప్రకరణము.

శ్రీనగరమునుండి బయల్వెడలిన మరునాఁటిసాయంతనమునకుఁ గ్లోడిస్సా కమలామోహనులను బూర్వసువాసినియింటఁ గలిసికొనెను. వారిసంయోగము మిక్కిలి సంతోషభూయిష్ఠమయ్యె. తనముద్దుల కొమరిత యోగక్షేమములను దెలిపిన కమల విముక్తికిఁ గ్లోడిస్సా మూలకారణమఁటఁ దెలిసికొని పూర్వసువాసిని గ్లోడిస్సాను మిక్కిలి గౌరవదృష్టితోఁ జూచెను. నాలుగైదుదినములలో వత్తునని చెప్పి, మరునాఁడే గ్లోడిస్సా వచ్చెనుగావున కమలామోహనులు కొంతవఱకు ముఖ్యవృత్తములేమైనఁ గలవేమోయని శంకించిరి. కాని యట్టివృత్తములేవియు లేవనియును, దాను మిక్కిలి సంతోషకరవృత్తాంతములకు మాతృకమై వచ్చెననియుఁ గ్లోడిస్సా చెప్పెను. ఆవృత్తాంతములు వారు వినుటకు ముందే మనముకొన్ని విషయముల వ్రాయుట యవసరము.

జయసింహుఁడు తాను మిక్కిలి గారాముగాఁ బెంచిన మోహనుఁడు శ్రీనగరమున కేగెదనని చెప్పి యింకను రాకయుండుటచే వానికేమైన నాపదసంభవించెనేమో యని తత్తరమొందుచు భటసహాయుఁడై మోహనుని వెదకుటకొఱకు శ్రీనగరమున కేగుచుండఁగా దైవఘటనచేఁ బూర్వసువాసిని గృహమునొద్దనే మోహనుఁడు కాన్పించెను. అధికసంతోషముతో వారిరువురును గౌఁగిలించుకొనిరి. పిదపఁ బూర్వసువాసినియింట జయసింహుఁడు విశ్రమమొందెను. అపుడు తాను

శ్రీనగరమున కేగినది మొదలు మరల జయసింహుని బూర్వసువాసినీగృహమునఁ గలసికొనువఱకు జరగిన సర్వసంఘటనములను మోహనుఁడు పూసగ్రుచ్చినట్లు జయసింహునకుఁ జెప్పెను. కమలను దాను వివాహమయ్యెదనని చెప్పి తాను ఘూర్జరరాజవంశీయుఁడని నిర్ధారణచేయుటకుఁ బ్రశంసాపత్రముల నీయుమని చెప్పినపుడు జయసింహుఁడపరిమితానందమును వెలిబుచ్చుచు మోహనునికిఁ బ్రశంసాపత్రమునిచ్చి వానితో సాయంతనమువఱకుఁ గాలముగడపి మరునాఁడు తన దేశమునకు భటపరివేష్టితుఁడై పోయెను.

కమలామోహనులానాటిరాతిరి యేకాంతముగనున్నపుడు గ్లోడిస్సా వారియొద్దకేగి రవీంద్రలిఖితములగు సురనందనపత్రములు తనకు దొఱకినవనియు, వానిని గమలామోహనులకు సమర్పింపవచ్చెననియుఁ జెప్పి కమలామోహనుల కాపత్రముల నిచ్చినపుడు వారలకుఁ గలిగిన సంతోషమునకు వర్ణన మెవ్వరుచేయఁగలరు? గ్లోడిస్సా ధర్మబుద్ధికి వారు మిక్కిలి యచ్చెరువొందిరి. ఆమె ననేకవిధములఁ గొనియాడిరి. ఔను. అట్లుకొనియాడుటయం దతిశయమేమికలదు?

ఆపత్రములెట్లు తనకుదొరకెనో చెప్పుమని వారడుగఁగా—వెనుక వీరరుద్రుని దానేతీసికొనిపోయినవిషయమున నిజకథగాక యనృతమాడినరీతినే—హేమచంద్రుని నామమునైన నుచ్చరింపక తాను రవీంద్రుఁడిదివఱకుఁ దనస్వకార్యముల కుపయోగించుకొనిన మందిరమునఁ దిరుగుచుండెననియు—అట్లు తిరుగుచున్నంతఁ దనకాలిక్రింద నేదియొకదలి జాఱినట్లయ్యెననియు—వెంటనే దానిని బరిశోధించి యొకవిధమగు తీఁగెబట్టును ముట్టుకొనగా నొకమూఁత తెఱువఁబడెననియు—దానిలోఁ దన కాపత్రములు దొఱకెననియు నాదిగాఁగల యబద్ధములను గ్లోడిస్సాచెప్పెను. వెంటనే వారునమ్మిరి. పిదప మరునాఁటి యుదయముననే కైలాసపర్వతపంక్తులకుఁ గమలాగ్లోడిస్సామోహనులు పయనమగుటకు నిశ్చయించుకొనిరి.

సూర్యుఁడుదయించినతోడనే తమతమ పరిచారికలతోఁ గమలామోహనులు తామత్యంతముఖ్యకార్యములపై మరల శ్రీనగరమునకేగుచుండిరని చెప్పి, మాలినీమాలతులను, అంగదబలభద్రులను ఘూర్జరరాజధానియగు ద్వారకకుఁ బొమ్మని తాము క్లోడిస్సాతోఁగూడ సురనందనప్రయాణోన్ముఖులై పోయిరి. వారు పోవునపుడు పూర్వోసు వాసిని కెట్టిదిగులుకలిగెనో యూహింపఁబడుఁగాక.

ఇఁక మనము హేమచంద్రునిస్థితి యెట్లున్నదో పరికింతము. అట్లు క్లోడిస్సాచేఁ దనయాశామూలమును గోలుపోయి తుదకవమానింపఁబడి రవీంద్రుని గుఱ్ఱమునెక్కి హేమచంద్రుఁడు శ్రీనగరమునుండి వెడలిపోవుచుండెను. వాఁడు శ్రీనగరమును దాఁటెను. కాని యెట్లుపోవుటకును వానికిఁ దోఁచదయ్యె. ఉత్తరదిశకా—దక్షిణమునకా—తూర్పునకా—పశ్చిమమునకా? ఎటుబోయినను వానికొక్కటేయనితోఁచెఁ గావున పగ్గములనువిడిచి గుఱ్ఱమును దానియిచ్చవచ్చినట్లు పోనిచ్చెను. హేమచంద్రునిస్థితిలో నుండినమనుజుఁ డెవ్వఁడైన నట్లే చేయకుండునా?

చంద్రుఁడు వినిర్మలప్రభలతో విలసిల్లుచుండెను. దూరమునందుఁ దనకెదురుగా గోడలవలెఁ గూర్పఁబడిన మహామేఘములలో మన కైలాసపర్వతపంక్తులు కాన్పించుచుండె. తానెక్కినహయము మెల్లగా నడచుచుండె. తనకెదురుగానున్న కైలాసపర్వతపంక్తులలోనికిఁ బోవుటకు వాని కిచ్ఛలేదు. అయ్యది వెనుకనే యదృశ్యమైనది. కావున కైలాసపర్వతములోనికిఁ గాక ప్రక్కగా మరియేదేశమునకో—యేప్రదేశమునకో—పోవుబాటమీఁదుగా గుఱ్ఱమును నడపించునుద్దేశముతో పగ్గముల నాదెసకు బిగించిలాగి కొఱడాతో నొక్కసారి దానివీఁపుపైఁ గొట్టెను; కాని గుఱ్ఱమాదెబ్బకు లెక్కసేయక దానిత్రోవనే మరల విడువక నడచుచుండెను.

హయముల నడవడికలఁగూర్చియు వాని యింగితజ్ఞానములఁగూర్చియు బాగుగా నెఱిఁగియున్న హేమచంద్రుఁడు వెంటనే తానెక్కిన హయముయొక్క ప్రస్తుతప్రవర్తనకుఁ గొంతవఱకచ్చెరువునొందెను. ఆహయము మిక్కిలి సాధువని హేమచంద్రుని కిదివఱకే తెల్లము. అది యట్టిసాధువగుటచేతనే గతించిన రవీంద్రుఁడు దానిని మిక్కిలి ప్రేమాతిశయముతోఁ జూచుచుండెడివాఁడు.

ఆహయముఁగూర్చి హేమచంద్రుఁడు తనలో "ఈగుఱ్ఱపు నడవడికయందేదియో విచిత్రమున్నట్లున్నది. ఒకవేళ దీనిని నేను మరల్పనెంచిన త్రోవలో నేదియైన నపాయముండెనేమో, మరియుఁ గొన్నికొన్నివేళల మనుజునిజ్ఞానముకన్న చతుష్పాత్తుల యింగితమే యుపయోగ్యమని నేను వినుటయేకాక చదివికూడ యుంటిని!" అనియనుకొనెను. అట్లూహించుచు హయమును నేమియుఁజేయక దానియిచ్చవచ్చినట్లు పోనిచ్చెను. అదియుఁ దిన్నగాఁ దనత్రోవఁ బోఁదొడఁగెను. క్రమక్రమముగాఁ గైలాసపర్వతములు సమీపించెను. పర్వతపంక్తులలోనికి హేమచంద్రుఁడిపుడు కొంపోవఁబడుచుండెను. ఆపర్వతములు మిక్కిలి యుడ్డదిడ్డములుగానుండె. వానిలో నెల్లయపుడు వఱదలుగాఁ బ్రవహించు నీరములుకలవు. ఘోరమృగములుకలవు. బ్రహ్మాండ గుహాలు కలవు. మిక్కిలి లోతైనయగాధములు కలవు. కావున వానిలోనికిఁ జొరఁబడుటకు హేమచంద్రుని కిష్టములేక మరల వేఱొకమార్గమునకు మరల్పనెంచి పగ్గముల నటుత్రిప్పి దానినదలించెను. కాని గుఱ్ఱమటు తిరుగలేదు. ఒక్కసారి మరల బ్రతోదముతోఁ గొట్టెను. దానికిని లెక్కసేయక యాహయము తనత్రోవనే తిన్నగాఁ గైలాసపర్వతాంతములకు వానిని గొంపోవుచుండెను. హేమచంద్రుఁడు మరల్పనెంచిన వేరుమార్గమునకుమాత్ర మాహయముబోవుట కిచ్ఛగింపక యనేకాపాయములతోఁగూడిన యాపర్వతపంక్తులలోనికే పోవుచుండె.

వెంటనే హేమచంద్రుఁ డాశ్చర్యమునొందె. క్రమక్రమముగా నొక్కయనుమాన రేఖ—తొలుదొల్త నస్తాద్రియం దంతర్హితుఁ డగుచున్న సూర్యుని లేశమాత్ర తేజోసహితమైన కిరణమువలె—వానిహృదయముపై నుదయించె. పదేండ్లకాలము రవీంద్రుఁ డాగుఱ్ఱము నుపయోగించెను; అప్పుడపుడు హేమచంద్రుని వితర్కములకు మూలకారణములై క్రమక్రమముగా నవి సురనందనదర్శనార్థము కైలాసపర్వత పంక్త్యంతరములకుఁ జేయఁబడిన ప్రయాణములని హేమచంద్రుఁడు తెలిసికొనిన. రవీంద్రుని పర్యటనములలో నావృద్ధుఁ డీహయమునే యుపయోగించియుండె. సురనందనదర్శనార్థమైన యాప్రయాణములలోఁ దక్క రవీంద్రుఁడాహయమును వేరొకప్పు డెపుడు నుపయోగింపలేదు. కావునఁ దానెక్కినహయము తనకిదివఱకే పరిచితమైనమార్గముమీఁదుగా నిపుడు పోవుచుండఁగూడదా?

"ఔను నిజమే. అట్లేయైయుండు" నని హేమచంద్రుఁడు తలంచె. వెంటనే వానిహృదయము మరల బ్రహ్మానందసుఖములలో నిమగ్నమయ్యె. సత్వరమే "నిస్సంశయముగా సురనందన మింక నాదేకావలయు!" నని యానందముతోఁ జప్పట్లుచఱచెను.

వెంటనే హేమచంద్రుని కరతాళధ్వనికిఁ గైలాసపర్వతపంక్తులసంఖ్యాకములగు ప్రతిధ్వనులతోఁ బ్రత్యుత్తరములిచ్చెను.

ఘూర్జర తార.

ముప్పది యొకటవ ప్రకరణము.

క్రమక్రమముగాఁ దానిపుడు పోవుచుండిన ప్రదేశము మిక్కిలి యున్నత ప్రదేశముపై నేటవాలుగా నుండుటను హేమచంద్రుఁడు చూచెను. అట్లు పోవఁ బోవఁ గ్రమముగాఁ బర్వతపంక్తులలోనికి వాఁడు ప్రవేశితుఁడగుచుండెను. అగాధములుకాని, జలపతనములుకాని, కొండయడవులుకాని, గుహలుకాని వానికింకను బ్రత్యక్షముకాలేదు. నెత్తిపై నూటిగా శర్వరీసార్వభౌముఁ డసంఖ్యాకతారాపరివేష్టితుఁడై దేదీప్యమాన ప్రభలతో రాజిల్లుచుండె. హేమచంద్రుఁ డిపుడేగుచున్న ప్రదేశము మిక్కిలి చతురముగా నుండెను.

అట్లు కొన్నిఘడియలు నడచి యాహయము హేమచంద్రునిచే నాపఁబడకయే తనంతటదా నొకచిన్న సమభూమియం దాగెను. ఆసమభూమి పచ్చగడ్డిచే దట్టముగాఁ గప్పఁబడియుండెను. సన్నటి తీవవలె నిర్మల జలపూరితమైన యొక్క సెలయే ఱాసమభూమి మధ్యమునుండి ప్రాకుచు దానిని రెండుగా విభాగించెను. అచట హయమునుండి హేమచంద్రుఁడు దిగి తన సంతోషమును దానికి వెలిబుచ్చుటకై వీపుమీఁద హేమచంద్రుఁడు మెల్లఁగా నాల్గుసార్లు తట్టెను. ఆహయమును దిరిగి తన సంతోషమును జూపునట్లు చెవులఁగదల్చుచు "ఇహీహీ" యని సకిలించెను. సెలయేట నిర్మలజలమును గడుపునిండఁ ద్రావి యాహయము పచ్చగడ్డిని మేయఁదొడఁగెను. ప్రక్కగానున్న కొన్ని వృక్షములు ఫల

భరితములై యుండగా హేమచంద్రుఁడు వానిని భుజించి పిదప ఝరీజలము నింతద్రావి విశ్రాంతికొఱకుఁ బచ్చగడ్డిపైఁ దన మేనును వ్రాల్చెను; కాని వానికి నిదుర లవమాత్రమేనియుఁ బట్టలేదు. వేనవేలు భావములు వానిహృదయమునందు సందడి సలుపుచుండెను. ఆహయము తప్పక సురనందనమునకే తన్నుఁ గొంపోవుచున్నదను నమ్మకమునందు వానికిఁ బూర్వమునకన్న నిపు డినుమడింపఁబడినవిశ్వాసము కలిగె. తిన్నగా సురనందనములోనికిఁ గాకపోయినను—ఏమనిన నయ్యది మహోన్నత పర్వతవలయముచే నాలింగితమై యుండెనని వాఁడెఱుంగు—దానికిఁ బరిసరప్రాంతమునకైన నాహయము తన్ను దప్పక కొంపోవునని హేమచంద్రుఁడు నిస్సంశయముగా నూహించెను. ఆభూలోకస్వర్గములోని కొక్కసారి తొంగిచూచుటకు వానిహృదయము తత్తరమొందెను; తానప్పుడే సురనందనమునకు స్వామియైనట్లు, దానియందుఁ దన శేషజీవితమును గడపుటయూ, లేక దానియందుఁగల యనంతహేమరత్నాదులతో మరల బహిఃప్రపంచమునకువచ్చి మిక్కిలి భాగ్యవంతుఁడై యుండుటయూ యను సంశయముల వాఁడు వితర్కింపఁదొడఁగెను.

అట్లొక్క ఘడియకాలము వితర్కించుకొని, మరల హయముపై నెక్కెను. ఆహయమును వెంటనే సెలయేటియొడ్డుమీఁదుగాఁ గొంతదూరముపోయి, పిడుగుపడుటచేఁ గాలిపోయిన యొకవృక్షమును జేరి, యచట సెలయేఱుదిగి దాని యావలియొడ్డునకు సూటిగా నడచినడచి యొకడొంకలోఁ బ్రవేశించెను. ఆడొంక మిక్కిలిపొడవై యటునిటు ముండ్లచెట్లచే నిండియుండెను. దానినుండి కొంతదూరము నడచి పిదప నడ్డముగానున్న మరియొక బాటపై నడవమొదలుపెట్టెను.

దాదాపు నాలుగుగంటలకాల మాత్రోవమీఁదుగనే నడచెను. తూర్పు తెలతెలవారెను. అపుడు తానిదివఱకునడచుచున్న బాటనుండిమరలి వెంటనే మరియొకసందులోనికాహయము ప్రవేశించి

నడచుచుండెను. ఆసం దొకపెద్దకొండఱాయినుండి చెక్కఁబడినట్లుండెను. దానినుండి నూఱుగజములు దూరమునడచునంత నాసందు పూర్తి జెందెను; కాని దానికిఁ బ్రక్కగనే యొక గుహాకుముందుగా విశాలస్థలముండెను. ఆస్థలమునొద్దకు సూటిగానడచి యాహయము చటుకుననాగెను. వెంటనే యాస్థలము విరామస్థలమనియెఱింగి హేమచంద్రుఁడు దానిమూఁపునుండిదిగి, తనసంతోషమును వెలిబుచ్చుటకు వెనుకటివలెనే దానినిఁదట్టగా నాహయమును హేషాపూర్వకముగఁ దనసంతోషమును దిరిగి ప్రదర్శించి. తనకు బాగుగాఁ బరిచయమైన గుఱ్ఱపుసాలలోనికిఁ బోవునట్లే యాగుహాలోనికిఁజొచ్చి యంతర్భాగమునకుఁ బోవుచుండెను. హేమచంద్రుఁడు దానిని వెంబడించెను; కాని వెంటనే కారుచీఁకటులచేఁ గ్రమ్మఁబడి చటుకున నిలచెను. అపుడే హయము కొంతదూరము ముందునకుఁబోయెను. ఇపు డొకచిన్న సెలయేటి మర్మరధ్వనులును, దానిలోని జలమును హయము త్రావుచున్నయపు డుద్భవించిన చప్పుడును హేమచంద్రునికి విననయ్యె. ఆహయము తిరిగి గుహాముఖంబునకువచ్చి దానికిముందుగానున్న విశాలస్థలముపై దట్టముగా మొలచియున్న పచ్చగడ్డిని మేయఁదొడఁగెను.

గుఱ్ఱమువలెనే తానును మిక్కిలి దాహపీడితుఁడగుటచే నాగుహాలోని ప్రక్కగోడ నవలంబనముగా గ్రహించి కొద్దిదూరమునందు మర్మరధ్వనులు సలుపుచున్న సెలయేటిని సమీపింపనెంచెను; అట్లెంచి గోడపైఁ దనచేయి పెట్టినతోడనే చల్లనిదెద్దియో వస్తువును వాఁడు స్పృశించెను. వెంటనే యది చుట్టగాఁజుట్టుకొనియున్న పామని యూహించి, మహాభయకంపిత సర్వాంగుఁడై వెనుకకుఁ బరువెత్తెను; కాని వానివెంట నెట్టిపామును బుసకొట్టలేదు. కావున తనభయ మడిగినపిమ్మట మరల నాస్థలమునకేపోయి దానిని స్పృశించెను. వెంటనే మహాశ్చర్యనిమగ్నుఁడై యావస్తు వొకదీపరతుకమైనట్లు వాఁడు కనుఁగొనెను. ఇంక

నేమైననుండెనేమోయని యాస్థలమునందే పరిశోధింప నొకబుడ్డియును, దానికిఁబ్రక్కగా నొక ఱాతిముక్కయును, దానిపై నొక "చకుముకి" యును గాన్పించెను. దీపమును వెలిఁగించుటకవి సాధనములని యెఱింగి వెంటనే చకుముకితో దీపరక్షకము (లాంతరు Lantern) లోనున్న బుడ్డిని వెలిఁగించెను. ఆవెలుతురుసహాయమున నిదివఱకుఁ దానుస్పృశించిన యొకబుడ్డిని దెఱచిచూడగా నందు తైలముండుట వానికిఁ గాన్పించె. ఆతైల మాదీపమునకుఁగదాయని గ్రహించి దీపసాహాయ్యమున గుహాంతరములోనికిఁ బదిగజములేగినంత సెలయేటిని సమీపించెను. పైనుండి కొండలోగా నేత్రోత్సవముగఁబ్రవహించుచు నొకజలప్రవాహము గుహలోఁ దొట్టివంటి యొకభాగమునఁ బడుచు మరల నాతొట్టికిఁ గ్రిందుగా నదృశ్యమగుచుండెను,

హేమచంద్రుఁ డాసెలయేటిజలమును బూర్తిగాఁ ద్రావి మరల గుహాప్రవేశమునకుఁజొచ్చె. తనతోఁగూడ దీపరక్షకమును జకుముకిని గూడ దెచ్చుకొనెను. ఏమనిన నవి సురనందనములోనికిఁ బోయెడు నేదైనగుహలోని కుపయోగ్యములై యుండునుగదా!

రెండుగంటలకాల మచట పచ్చగడ్డిపై నిదురఁబోయినపిదప లేచి మరల హయము నెక్కెను. ఆహయము ముందునకు నడవనారంభించెను. కొన్నిఘడియలలో మిక్కిలి సాంద్రముగాఁ బెరిఁగియున్న యటవీవృక్షములలోనికి వాఁడు కొంపోవఁబడెను. ఆవృక్షములలో నెట్టిబాటయును లేదు; కాని యాహయ మేవియోగురుతులకొఱకటునిటు నప్పుడప్పుడు పరీక్షించుచు వానిసాహాయ్యమునఁ బోవుచుండెను. ఆవృక్షములు వివిధజాతులలోఁ జేరినవి. కొన్ని మిక్కిలి పొడవులగుటచే వానియగ్రభాగములు మంచుచేఁ గప్పఁబడియుండెను. ఒకఘడియలో నావృక్షకోటినిదాఁటి యాహయము భయావహమైనట్టి రంగములోనికి హేమచంద్రుని గొంపోయెను.

వానిచుట్టును మిక్కిలి యున్నతములగు పర్వతపంక్తులు కలవు. అచ్చటచట మహాజలపాతములు భీకరధ్వనులతో గర్జించుచుండెను—భయంకరములగు కొండయడవులుండెను—భూమి భీకరముగా నావులించెనో యనునట్లు మహాగాధములు విచ్చలువిడిగా నుండెను—మంచుచేఁగప్పఁబడి గోపురములవంటి యత్యున్నతశిఖరములుండెను. వేయేల! ఆరంగము మహాభయదమై, వివిధప్రకృతివిచిత్రగర్భితమైయుండెను. అట్లుండినను నాపర్వతపంక్తులనుండి యధికజాగ్రత్తతో నించుకైన భయమొందినట్లు కాన్పింపక యాహయము హేమచంద్రునిఁ గొంపోవుచుండెను. ఒక్కొకచోటఁ బర్వతాంచలము మీఁదుగా నాహయము నడచెను. ఆయంచలమ్మున నొకభాగమున సరాసరి గోడవలెఁ బర్వతమును మరియొకప్రక్క నావులించుచున్న యగాధమును నుండుట సంభవించెను. అట్టి దాదాపు నిరాలంబమైన మార్గమునుండికూడ నాహయము రవ్వంతయైనఁ జలింపక—యొక్క తప్పటడుగైననిడక—యొక్కతరినైన జారక—యట్లేపోవుచుండును.

అట్లు సూర్యుఁడస్తాద్రిని జేరుచున్నంతవఱకుఁ బోయిపోయి తుద కొకభూరిగుహాముఖమునకు సూటిగా నడచుచుండెను. అది యొక విరామస్థలమగుననియే కాక యంతతోఁ బ్రయాణపూర్తి కూడ నగునని హేమచంద్రుఁ డూహించెను. ఆహయము తిన్నగా గుహాముఖమును జేరి యచట నిలచెను. వెంటనే హేమచంద్రుఁడు దానినుండి దిగెను. హయమును బ్రక్కనున్న యొకసెలయేట నీరమును ద్రావి యచట బాగుగా మొలచియున్న పచ్చగడ్డిని మేయఁదొడఁగెను. హేమచంద్రుఁడిపుడు చకుముకితో దీపమును వెలిఁగించి యాగుహలోనికిఁ జొచ్చెను. అది మిక్కిలి విశాలమై కొండలోనికి నూఱుగజములు వ్యాపించియుండెను. తప్పక యాగుహానుండియే సురనందనములోనికిఁ బోవుమార్గముండునని యూహించి లోపలి గోడలలో నెద్దియైన ద్వారముండునే

మో యని గోడలను మిక్కిలి శ్రద్ధతోఁ బరిశోధించుచుఁ దుదకు గుహాంతమును జేరెను. అంతతో గుహ పూర్తి జెందె. మరియు గోడలలో నెట్టి ద్వారములును గాన్పించుటలేదు కావున నీగుహకాక మరియొక గుహ యేమోయని యోజించి గుహాముఖమునకు మరలవచ్చి యొకగంటకాలము విశ్రమించి మరల హయము నారోహించెను; కాని యాహయ మిపుడు వెనుకటివలెనే ముందునకుఁ బోవలేదు. మరల దానువచ్చిన మార్గమునకే మరలి వెనుకకుఁ బోవుచుండెను; కావున తానువిడిచిన గుహకే మరల దానిని ద్రిప్పెను. అదియును మరల గుహాముఖమునకుఁ జేరఁగా నచట దానినుండిదిగి యాగుహయందే తప్పక సురనందనములోనికిఁ బోవు మార్గము కలదని యూహించుచుండెను.

ఇపుడు సూర్యుఁడు పూర్తిగా నదృశ్యుఁడయ్యెను. తమోంకురములు రేకెత్తసాగెను. అపుడు వాని కీయూహలు తోఁచెను.

“క్లోడిస్సా యీవఱకే సురనందన దర్శనార్థియై వచ్చుచుండనోపు! ఆమె యొక్కరితయే వచ్చునెడల నాపగను బూర్తిగాఁ దీర్చికొందును గాని యట్లెన్నటికిని రాదు. సహచరులతో వచ్చును. లేనియెడ దాను మిక్కిలి ప్రేమించిన కమలామోహనులకుఁ గూడ నారహస్యమును వెలిబుచ్చి వారితోఁగూడ వచ్చును. ఇచట నుండగా నేను వారికిఁ గన్పడితినేని నాకు మరణమే ప్రాప్తించును. ఏమనిన నేను బత్రములఁ బూర్తిగాఁ జదివియుఁ జదువలేదని యనృతమాడి యామెను మోసపుచ్చితినని యనుకొని క్లోడిస్సా నాపై మిక్కిలి క్రౌర్యముదలంచి నన్నుజంపంపిక మానదు. కావున నేనిచటనుండి లేచి వేరొకస్థలమునడాఁగి క్లోడిస్సా వచ్చునేమో చూచెదనుగాక” అని వెంటనే హయమునెక్కి యాగుహాముఖమునకుఁ బ్రక్కగా నొక మైలుదూరమునందుండినవృక్షపుంజముల లోనికిఁ బోయి యచటహయమునుండి దిగి యొకచో విశ్రమించెను.

ఘూర్జరతార.

ముప్పదిరెండవ ప్రకరణము.

ఆగుహాముఖమును హేమచంద్రుఁడు విడిచిపోయిన మఱునాటి యుదయముననే యచటికి మువ్వురు మనుజులు హయారూఢులై వచ్చి గుఱ్ఱములనుండి దిగిరి. వారు మోహనుఁడును గమలా క్లోడిస్సాలును. అచట వారు దిగినపిదప మోహనుఁడు ముందుగను కమలా క్లోడిస్సాలు వానివెనుకగను ముందునకు నడవసాగిరి. మొట్టమొదట నొకయగాధపు టొడ్డుమీఁదుగా నాలుగుమైళ్ళు నడచిరి; కాని తమ కొకమైలుదూరము వెనుకనే డాఁగుచుఁ దమ్ము హేమచంద్రుఁడు వెంటనంటి వచ్చుచున్నాఁడనునది వారేమియు నెఱుంగరు.

అట్లు నాలుగుమైళ్ళు నడచినపిదప నాయగాధ మంతము నొందెను. కాని ప్రక్కగనే యొకపెద్ద గోడవలె నుండు పర్వతముండెను. దానినెక్కి కొంతదూరముపోయి యొకగుహలోఁ జొచ్చి యదృశ్యులైరి. హేమచంద్రుఁడును వారినిఁ బోనిచ్చి యాకొండనెక్కి గుహలోనికిఁ జొచ్చినంత, గుహయావలిముఖము గాన్పించెను. వెంటనే గుహలోనుండి యావలిముఖమును జేరినంత నాకొండనుండి మెట్లవంటి రాళ్ళమీఁదుగాఁ గమలా క్లోడిస్సాలు క్రిందికి దిగి వెంటనే కొన్ని వృక్షకోటులలో నదృశ్యులైరి. హేమచంద్రుఁడు నట్లే యారాళ్ళమీఁదుగనే కొండనుండి దిగి యావృక్షకోటులలోనికిఁ జొచ్చునంత నొక్కమైలు దూరమున నొక కొండవాగుమీఁద వంతెనవలె వేయఁబడిన రెండు తాటిమ్రానులనెక్కి

కములాక్లోడిస్తాని మోహానులు నడచుచు నావలియొడ్డును జేరుట వానికిఁ గాన్పించెను. వారట్లు లావలియొడ్డునుజేరి యొకకొండగుహలోనికిఁ జొచ్చి యదృశ్యులైరి.

హేమచంద్రుఁడును దానున్న వృక్షకోటులనుగడచి కొండవాగును దాటిమ్రానులమూలముగా దాఁటి యాగుహాముఖమునొద్ద నిలువఁబడెనేకాని దానిలోనికిఁ బోలేదు. ఏమనిన నది మిక్కిలి చీకఁటిగా నుండెను. ఐనను ధైర్యమువహించి దానిలోనుండి ముచ్చూరు గజములేగెనో లేదో చుట్టలుగాఁ జుట్టుకొనియుండి చల్లగానుండిన యొకవస్తువును వానిపాదము తాకెను. వెంటనే వాఁడపరిమితభయమునొంది గజగజవణఁకుచు వెనుకకుఁ బరువెత్తికొని వచ్చెను.

అది కొండచిలువయని వాఁడు నిశ్శంకతో నమ్మెను. దానినిజంపుటకుఁ దనయొద్ద నెట్టిసాధనమును లేదు. అంతియకాక యాగుహాంతర్భాగమును బరీక్షించుటకుఁ దన చకుముకిని దెచ్చికొనలేదు. దానిని దన రహస్యస్థలమున విడిచివచ్చెను. కావున దెచ్చుటకొఱకై తనగుఱ్ఱమును విడిచివచ్చిన రహస్యప్రదేశమునకుఁ బోవుచుండెను. వచ్చిన త్రోవనే యన్నిటినిగడచి వెనుకటి యగాధపుటొడ్డును జేరినంత నలువురాయుధపాణులగు దృఢకాయులు వానిపై హఠాత్తుగాఁబడి కాలుసేతులను గట్టి తమలో నొకని గుఱ్ఱముపై నెక్కించుకొని యాపర్వతపంక్తులనుండి యెచటికో వానిని దీసికొని పోవుచుండిరి. తన్నట్లేల తీసికొనిపోవుచుంటిరని హేమచంద్రుఁడు దీనాననుఁడై వారినడిగెను; కాని వారు వేరొకభాషతో మాట్లాడిరి. వారిభాష వీనికిఁ దెలియదు—వీని భాష వారికంతకుమునుపే తెలియదు.

అట్టులామనుజులు నాలుగుమైళ్ళదూరము పరువెత్తిరోలేదో యిరువురు తుపాకులఁదాల్చి హయములపై నెక్కి మిక్కిలివేగముతో వారికిసూటిగాఁ బ్రక్కనుండి వచ్చుచుండిరి. వెంటనే వారికిని వీరికిని దు

పాకులతో యుద్ధము జరిగెను. ఆయిరువుర తుపాకులనుండి బయల్వెడలిన యగ్నిగోళము లప్పుడే యానలువురిలో నొకనిని నిర్జీవిగాఁజేయఁగలిగెను. తక్కఁగల మువ్వురును ధైర్యముతో వారిపైఁ దమ తుపాకులఁ బేల్చిరి—కాని వారిరువురును జెట్లచాటున డాఁగి, కొమ్మలనడుమనుండి యామువ్వురిపైనఁ బేల్చుచుండుటచే వెంటనే మువ్వురిలో నిద్దఱు నిర్జీవులై కూలిరి. ఇంక నొక్కఁడే యుండెను. వీని హయముపైనే హేమచంద్రుఁడు కట్టఁబడి యుండెను. ఆయాశ్వికుఁడు తానొక్కఁడై యుంటచే భయమునొంది పలాయన మొనర్చెను. కాని వెంటనే చెట్లచాటున నుండినవారిరువురును బయల్వెడలి వానిని దఱుముచు నగ్నిగోళముల వర్షించిరి. అందొక యగ్నిగోళ మాయాశ్వికుని శిరమునుండి దూసికొనిపోవ వాఁడు హయమునుండి నేలం బడియెను. అట్లు తన్ను విఱిచికట్టి తీసికొనిపోవుచున్న వారినెవ్వరో నిర్జించిరని వానికిఁ దెలియుఁగాని గుఱ్ఱపుమూపుపైఁ బరుండఁ బెట్టఁబడి యుండుటచే వారిని జూడఁజాలకపోయెను. కాని సత్వరమే యాయిరువురాశ్వికులును వానిసడాసి మొగమును బరీక్షించి మహాశ్చర్యముతో “ఏమి! హేమచంద్రుఁడా!” యని యనిరి.

హేమచంద్రుఁడును మహాశ్చర్యముతో “ఏమి! వీరరుద్రుఁడును—అఘోరియు నా!” యని మరికొన్ని క్షణములకు “నన్ను రక్షించినందులకు మీకు శతనమస్కారములు” అని పలికెను.

వెంటనే వీరరుద్రాఘోరులు వానికట్లను విప్పగా వాఁడును హయమునుండి భూమిపై దిగెను వీరరుద్రుఁడు హేమచంద్రునితో “నీవీతస్కరుల చేతులలో నెట్లు పడితివి?” అని యడిగెను.

“నాకిక మనుజులలోఁ దిరుగుప్రాప్తి లేదు కనుక యీపర్వతములలో నాకలములు దిని బ్రతుకవచ్చునని మొన్ననే యిచటికి వచ్చితిని. నేఁడు పండ్లను గోసికొనుట కొకచెట్టుయొద్ద నిలువఁబడియుండగా వారు

నలువురును నన్నుఁ బట్టుకొని రెక్కలు విఱచికట్టి తీసికొనిపోయిరి. కాని మీవలన మరల బ్రతుకు గాంచితిని. మీరిచటి కెట్లువచ్చిరి?" అని హేమచంద్రుఁ డడిగెను.

"మేము చాలదినములనుండి యీపర్వతములలోనే తిరుగుచున్నాము. ఇచటికిఁ బదునైదుమైళ్ళ దూరమున నొక కొండగుహలో నా సహచరులు పదుగురు కలరు. వారును నేను నీకొండలలోనే మా వ్యాపారముల నొనర్చుచున్నాము." అని కొంచెమాగి "పాపము! నీవు క్రిందనిలచి యుంటివి. నాగుఱ్ఱముపై నెక్కుము. ఇది యిరువుర నైన మోయఁగలుగు." నని చెప్పెను.

"అట్లే యెక్కెదను; కాని మీ రెచటి కేగెదరో?"

"నీ యిచ్చవచ్చినచోట నిన్నుదింపి మేము తిరిగి వెళ్ళెదము."

"వీరరుద్రా! నీ ధర్మబుద్ధికి నాకుఁ జాల సంతసము కలుగుచున్నది." అనుచు వానిగుఱ్ఱముపై నెక్కి "ఇచటికి నొక్క పదిమైళ్ళ దూరములో నాగుఱ్ఱము కలదు. అచటికి నన్నుఁ దీసికొనిపొండు" అని హేమచంద్రుఁడు పలికెను.

"సరే" యని వారందఱు దమగుఱ్ఱములనదలించి పోసాగిరి. అట్లు ప్రయాణము చేయుచుండగా హేమచంద్రుని హృదయమున ననేకభావములు పొడసూపెను. రెండుగంటలకుఁ బూర్వమే తాను కమలాక్షోడిస్సా మోహనుల వెంటనంటి వారితోఁగూడ నొక పెద్దగుహలోనికిఁ జొచ్చెనుగదా. ఆగుహనుండియే భూస్వర్గమునకు మార్గము కలదని తాను నిశ్శంకతో నిశ్చయించుకొనెను; తాను వేయుసంవత్సరములు వెదకినను గనుఁగొనలేని యాగుహను దైవికసంఘటనచే వానికిఁ జూడ లభించెను. వాఁడు నిజముగా సురనందన ప్రాంగణముననే యుండెను; కాని వాని కొకకొండసిలువ సైంధవునివలె నడ్డముగా నుండెను. దానిని జంపి గుహాంతర్భాగమునకుఁ బోయి దీపసాహాయ్య

మున నా గుహాకుడ్యములలో నెచటనో యుండు రహస్యద్వారమును దెఱచి సురనందనములోనికి వాఁడు ప్రవేశింపనగు. ఈవిషయముల నన్నిఁటిని దలంచి పులకీకృత సర్వాంగుఁడై తిన్నగాఁ దన గుఱ్ఱముండినచోటునకు రవీంద్రాఘోరులతోఁ గూడ వచ్చుచుండెను. క్రమక్రమముగా వారందఱు నచట దిగిరి. పిమ్మట హేమచంద్రుఁడును వీరరుద్రాఘోరులును బ్రక్కనుండిన కొన్ని ఫలవృక్షములకడకేగి వాని ఫలములను గడుపునిండ మెక్కి యచటి కొక్కయఱమైలు దూరములోనుండిన యొక సెలయేటి యొడ్డునకుఁ బోయిరి; కాని వెంటనే సెలయేటి కావలి యొడ్డున నొక కొండకుఁ బ్రక్కగాఁ దమకు నాలుగువందలగజముల దూరమునుండి మిక్కిలి బలిష్ఠులును దుపాకులనేకాక కరవాలములను గూడ దాల్చినవారును నగు పదునైదుగురు సైనికులు తమ్ముఁ బట్టుకొనుటకుఁ బరువెత్తుకొని వచ్చుచుండుట చూచి యక్కజపడి హేమచంద్రుఁడును, వీరరుద్రాఘోరులును బవమానవేగముతో వెనుకకుఁ బరువెత్తి తమతమ గుఱ్ఱములను డాసిరి. వీరరుద్రాఘోరుల గుఱ్ఱములు మేయుచుండినచోటునకు మిక్కిలి దూరములో హేమచంద్రుని గుఱ్ఱము కలదు. కావున వీరరుద్రాఘోరులకన్న నెక్కుడుదూరము వాఁడు పరువెత్తవలసి తత్తరపడుచున్నంత వీరరుద్రాఘోరులు తమగుఱ్ఱముల నెక్కి కనుమూసి కనుదెఱచునంతలో నదృశ్యులైరి. వారిపై నాపదునైదుగురు సైనికులును దమ తుపాకులఁ గాల్చిరి; కాని చెట్లలోనుండి పలాయనము సేయుచుండుటచేత వీరరుద్రాఘోరులు తప్పించుకొనిపోయిరి. పాపము! దురదృష్టపు హేమచంద్రుని నాపదునైదుగురును బట్టుకొని తమలో నొకని గుఱ్ఱముపై నెక్కించుకొని మరల దాము వచ్చిన త్రోవనే వెనుకకుఁ బోవఁ దొడఁగిరి. వారు తమలోఁ దాము వీరరుద్రుఁడు దొఱకలేదని పలుకుకొనుచుండిరి కావున వా రేలవచ్చిరో వెంటనే హేమచంద్రుఁడు గ్రహించి

"అయ్యలారా! నేను వీరరుద్రుని సహచరుఁడనుగాను. నన్ను విడువుఁడు" అని పలికెను. అంత వారిలోఁ బెద్దవాఁడగు నాయకుఁడు "ఓరీ! నీవు వీరరుద్రుని సహచరుఁడవు కానియెడల మమ్ములను జూచినతోడనే యేల పరువెత్తితివి? అంతియకాక నీవును వాఁడును మిక్కిలి స్నేహభావముననున్నట్లు మేము దూరమునుండియే చూచితిమి. నీగుఱ్ఱమును నీవెక్కఁజాలినయెడల వారివలెనే నీవును బారిపోయి యుందువు. కావున నీవు తప్పక వీరరుద్రుని సహచరుఁడవే. వీరరుద్రుని గాని, వాని సహచరులనుగాని పట్టుకొని రమ్మని మామహాప్రభువుగారియాజ్ఞ కావున నీవు నోరుమూసికొని పడియుండుము" అని పలికెను.

వెంటనే హేమచంద్రుఁడు విగతాశుఁడై నిట్టూర్పువుచ్చెను. తన దురదృష్టదేవత తన్ను వీరరుద్రునిఁ గలయఁజేసెనని చింతింపఁదొడఁగెను. ఒకింత వితర్కముపై వీరరుద్రుఁడు తన్ను మొదటి సమయమున రక్షింపకపోయినయెడల వెనుకటి నలువురు తస్కరులును వానినచటికో తీసికొనిపోయి యుందురు కావున వీరరుద్రుని నిందింపభావ్యము కాదని హేమచంద్రుఁడు తలపోసి తనకింతకును సురనందనమును జూచుటకు దేవుని యనుజ్ఞ లేదని యెంచి నిరాశాపరితప్తహృదయుఁడయ్యె.

అయ్యో! ఇంకొక గంటకాలములో వెనుకటి గుహనుజేరి యందుండు కొండసిలువను దన కరవాలముతో నఱికి గుహాకుడ్యములలో వాఁడనుకొనినటుల నెచ్చటనో యుండు రహస్యద్వారమును దెఱచి సురనందనములోనికిఁ బ్రవేశించి యుండునని వాఁడనుకొనెనుగదా! పాపము! ఎంతకాలములో నెట్టియాశలు స్వప్నసమములై పోయెను!

ఆసైనికనికాయము సూర్యుఁడస్తాద్రిఁ జేరువఱకును బ్రయాణమొనర్చి తుదకొకచోఁ గొంతకాలము విశ్రమించి మరల లేచి రాత్రి యంతయును బ్రయాణమొనర్చి సూర్యుఁడుదయించు వేళకుఁ గొన్ని మ

హాపర్వతముల మధ్యనుండి పోయి తుద కొకలోయయందు మరల విశ్రమించెను. అచట నాసైనికనికాయము రెండుగంటలకాలమే యుండి మరల లేచి సాయంతనము నాల్గుగంటల వఱకును—అగాధములనుండి—బ్రహ్మాండగుహాముఖంబులనుండి—ఘోర వనాటవులనుండి—గర్జించుచున్న జలపాతముల ప్రక్కనుండి—మంచుచేఁ గప్పఁబడిన మహోన్నత శిఖరగోపుర ప్రాంతములనుండి—పోయిపోయి తుదకొక మహాదుర్గమును జేరెను. ఆదుర్గమునకుఁ జుట్టును పర్వతవలయమే యభేద్యప్రాకారముగా నుండెను. దుర్గముననగ్రభాగమున నొకచో మిక్కిలి పెద్దదియగు పట్టుజెండా గాలికిఁ గదలుచుండెను. ఆదుర్గమును వారందఱును జేరునంత నెవ్వరో కవచధారియైన యొక మహానీయుఁడు హయారూఢుఁడై నలువురు వెంటరా మనసైనికనికాయమున కెదురుగనే వచ్చుచుండెను.

ఆమహానీయునిపేరు జగద్విదితమైన "గిరిసింహుఁడు" మిక్కిలి సాంగ్రామికశాస్త్రవేత్త—ఆకొండలకు సార్వభౌముఁడు—అధికసుందరరూపుఁడు—సకల సద్గుణుఁడు. వానిని జూచినతోడనే మనసైనికులందఱును దమ తమ గుఱ్ఱములనుండి సత్వరముదిగి వానికి వంగి నమస్కృతులొనర్చిరి. హేమచంద్రుఁడు కూడ నట్లే చేసెను. వెంటనే గిరిసింహుఁడు హేమచంద్రునివంక వ్రేలు చూపుచు నాతఁడెవ్వఁడని యాసైనికనాయకునడిగెను. వాఁడును దక్షణమే సర్వ వృత్తాంతమును జెప్పెను. వెంటనే హేమచంద్రుని గారాగృహమున బంధింపుఁడని పలికి గిరిసింహుఁడు తన నలువురు సేవకులతోడను ముందునకుఁ బోయెను.

హేమచంద్రుఁడు నిశ్చేష్టుఁడయ్యె—వానిప్రాణములన్నియు నెగసిపోయినట్లయ్యె—దేహము వడఁకెను—నెన్నుసటఁ జెమ్మటబొట్టులు పొడసూపెను.

ఆసైనికనాయకుఁ డిపుడు హేమచంద్రు నొకచేతఁ బట్టుకొని వెనుకగా నిరువురు సైనికులురా దుర్గమున కుత్తరపు గోడగానున్నకొండనుడాసి మిక్కిలి యిఱుకుమెట్లమీఁదుగాఁ గొండకు సగముభాగమునకుఁ బోయిరి. ఆకొండ సరాసరి యిఱువదియడుగుల యెత్తుండెను. ఆమెట్ల కెదురుగాఁ గొండలో నొక ఫిరంగి యమర్పఁబడి యుండెను. ఎవ్వరైన శత్రువులు దుర్గములోనికి రానెంచి మెట్లెక్కిన నాఫిరంగి వాత తప్పక పడెదరు.

ఆఫిరంగియొద్ద నొకకావలివాఁ డుండెను. ఆసైనికనాయకుని వెంటనున్నవాఁ డెవ్వఁడో కారాగృహమునకుఁ గొంపోవఁబడుచున్నాడని తెలిసికొని కావలివాఁడు లేచి నిలువఁబడెను. వెంటనే వారందఱును మన హేమచంద్రుని ఫిరంగిమీఁదుగా దుర్గములోనికిఁ దీసికొనిపోయిరి. ఆదుర్గము పర్వతాగ్రమున నున్నది కావున నచటినుండి యెవ్వఁడు తప్పించుకొనలేడు. కొన్ని నిమిషములలో హేమచంద్రుఁ డొకగుహను బోలిన "కొట్టు" లోనికిఁ ద్రోయఁబడెను. వెంటనే యాగుహాద్వారము మూసికొనిపోయెను.

ఘూర్జర తార.

ముప్పదిమూఁడవ ప్రకరణము.

హేమచంద్రుఁ డుతక్క యాగదియందిం కెవ్వరును లేరు. వానికిఁ బ్రక్కగానున్న గోడలో మనుజునిచేయిదూరునంత యొకకన్న ముండెను. ఆకన్నమునుండి వెలుపలివెలుతురు లోనికి వచ్చుచుండెను. అది మిక్కిలిపొడవైనకన్నమగుటచే దానిపొడవునుబట్టి యాగోడ యెంతవెడల్పుగానుండెనో హేమచంద్రుఁడు గ్రహించెను. దానికెదురుగా నొకఱాతితలుపు కలదు. వానికిఁ గుడిప్రక్కనుండి కొన్నిమెట్లు లాగదిమిద్దె (పైభాగము) వఱకు నుండెను.

ఎదుటనున్నతలుపు దెఱచి వేరొకచోటునకుఁ బోవుటయో, లేక ప్రక్కనున్న మెట్లనెక్కి గదిమిద్దెపైకేగుటయో తెలిసికొనలేక నిట్టూర్పువుచ్చి తనస్థితిని దలంచుకొని చిన్నబిడ్డవలె నేడ్వఁదొడఁగెను; అట్లు చింతానిమగ్నుఁడై యుండుటచేఁ దన కెదుటనున్న ద్వారము తెఱువఁబడుటయు దానినుండి యొకఁడువచ్చి హేమచంద్రుని కెదురుగా నాల్గుగజముల దూరమున నిలువఁబడుటయు హేమచంద్రుఁడు తొలుదొల్తఁ జూడలేదు.

వాఁ డొకవింతమనుజుఁడు. అఱువదేండ్ల ప్రాయమువాఁడు. విశాలమైన లలాటముమీఁదుగా వెనుకకు వానినెరసిన పొడవువెండ్రుకలు వ్రేలాడియుండెను. ఎన్నోయేండ్లనుండి పెరుఁగుచున్నదికాఁబోలు వానిగడ్డము మిక్కిలిపొడవై నెరసి మొగముక్రిందుభాగమునంతయుఁ

గప్పెను. కనుబొమలు మిక్కిలి దట్టముగాఁ బెరిఁగి పొడవులై యుండెను. చెవులమీఁదుగాఁబడుచున్న తలవెండ్రుకలును గడ్డమునుగలిసి యొండొంటితో నల్లుకొనిపోయెను. మొత్తముమీఁద వానియాకారము మిక్కిలి యసహ్యముగాను, మాలిన్యభూయిష్ఠముగాను నధికదరిద్రతాన్వితముగా నుండెను. దేహవర్ణము సున్నమువలెఁ దెల్లగానుండెను. దుస్తులు బూజుపట్టి పీలికలై తూటులువడియుండెను. వానినెత్తిపైనుండిన “కుళ్లాయి” జూచియు వాఁడుధరించినదుస్తులవిధమునుజూచియు వాఁడైరోపాఖండమునందుండు తెల్లవారిజాతిలోఁ జేరినవాఁడని తోఁపకమానదు.

హేమచంద్రుఁడు వానినిజూచినవెంటనే, వాఁడును దన్నుఁబోలు నొక దురదృష్టకారాగృహవాసియని గ్రహించెను. హేమచంద్రుఁడట్లు తన్నుజూచినవెంటనే యాయైరోపీయుఁడు “ఓయౌవనుఁడా! నావంటి దురదృష్టుఁడవే నీవని తెలిసికొంటిని. నీవీకారాగృహమునఁ బ్రవేశపెట్టఁబడినరీతియు—నీనిట్టూర్పులును—నీదుఃఖాశ్రువులును—నీదురదృష్టతను జెప్పకచెప్పెడిని” అని యనెను.

“అయ్యో! నేనుదప్పక దురదృష్టుఁడనే” యని హేమచంద్రుఁడు ప్రత్యుత్తరమిచ్చి మిక్కిలి బిగ్గఱగా నేడ్వఁదొడఁగెను.

కొన్నినిమిషములవఱకు నట్లు హేమచంద్రుఁ డేడ్చుచుండగా నాయైరోపీయుఁడు వానినేమియుఁ బ్రశ్నింపకుండెను. కొంతసేపునకు హేమచంద్రుఁ డూరటజెందుచున్నట్లు కాన్పింపఁగా “దురదృష్టుఁడా! నీస్థితినిదలఁచుకొని యట్లునీవు చింతనొందుట మిక్కిలి సహజమే; కాని నీకనులనుండి ధారలుగాఁ బ్రవహించుచున్న యశ్రువు లీగోడలలోనున్న శిలలనుగాని లేక నిన్ను దీనియందుఁ బ్రవేశపెట్టినవారిహృదయములనుగాని మెత్తపఱుపఁజాలవు—కరఁగింపఁజాలవు.” అని యైరోపీయుఁడు పలికెను.

బెదరియుండిన తనధైర్యమును దిరిగి సంగ్రహించుకొనుచు “నీవుచెప్పినదంతయు నిజమే. ఏడ్చుటవలన నేమిలాభము?” అని హేమచంద్రుఁడనెను.

“నేఁడుమొదలు నీవు స్వగృహముగ నెంచుకొనవలసినతావునకు నాతో రమ్ము” అని యైరోపీయుఁడు తాను దెఱచినద్వారమునుండి ముందునకునడవ వానిని హేమచంద్రుఁడు వెంటనంటిపోయెను.

వెంటనే వాఁడు భూగర్భగుహానుబోలు నొకగదిలో నైరోపీయునితోఁ గూడి యుండెను. ఆగది మిక్కిలి విశాలమైనది. గోడలలో మిక్కిలి యెత్తుగా నచ్చటచ్చటఁ గొన్నికొన్నికన్నములు కలవు. ఆకన్నములలోనుండి వెలుతురు వచ్చుచుండును. గదికి మధ్యప్రదేశమునుండి యొకరాతికంబము కప్పునకూఁతగాఁ బెట్టఁబడియుండెను. ఆకంబమునకంటి యరుగువంటి యొకశిల కలదు. అది కూర్చుండుటకుఁగాని పరుండుటకుఁగాని యుపయోగ్యముగా నుండెను. ఎచ్చటను జాపగాని, యెండుగడ్డికాని లేదు. వారు గదిలోఁ బ్రవేశించినతోడనే కంబమునకుఁ బ్రక్కగానున్న రాతిపైఁ గూర్చుండిరి. అపు డాయైరోపీయుఁడు హేమచంద్రునితో నీక్రిందివిధమునఁ జెప్పెను.

“స్వవిషయములఁగూర్చి మాటాడుటకు ముందుగా నీ కీకారాగృహమున నెట్టి యనుభవము కలుగఁబోవునో చెప్పెదను వినుము. నే నీచెఱయందైదేండ్లనుండి వాసముచేయుచుంటిని; కావున నాకన్నియు ననుభవములైనవి. అదిగో—ఆగోడకుఁ బ్రక్కగానున్న రాతిబల్లయే నీకుఁ దల్పము. నాకు నట్టిరాతిబల్లయే—అదిగో దూరముననున్న యామూలలో నున్నది—తల్పముగా నుండియున్నది. నీకు గడ్డిపఱుపులును, కంబళములు నియ్యఁబడును. అవి పాతవైన పిదప మరలక్రొత్త వీయఁబడును. దినమునకు రెండుసార్లు నీకాహారమీయఁబడును. ఆయాహారమారోగ్యవంతముగానే యుండును. నీవు

మాంసమును దిందువేని మాంసముపెట్టఁబడును. నావంటి యారోపీయునివలె బ్రాందిఁద్రావునలవాటుకలదేని నదియు నీయఁబడును.

“నాకు మాంస మక్కఱలేదు. బ్రాందియు నక్కఱలేదు”

“కాని యానసుఁడా! నాకు నీవొక్క సాహాయ్యము చేయవలసియున్నది. అదెట్టిదనిన వినుము. నేను బ్రాందిద్రావుటను నా దేశమునందు, అనగా ప్రష్యా దేశమునందు, మిక్కిలి యలవాటుపడి యుంటిని. నాకు వారమునకొకసారి యిచట రెండుబుడ్లుమాత్రమే యీయఁబడును; కాని యా రెండుబుడ్లును నాకుఁజాలవు. నీకుఁగూడ బ్రాందిద్రావున లవాటుకలదని కారాగృహాధికారికిఁ జెప్పి పంచినయెడల నీవుకూడ వారమునకు రెండుబ్రాందిబుడ్లీయఁబడును. ఆరెంటిని నీవు తీసికొని నాకిచ్చినయెడల నేనెంతయును నీకు కృతజ్ఞుఁడనై యుండెదను”

“సరే. ఆపని కింత యడుగవలెనా? అట్లేచేసెదను గాని యీగుహాయం దీపరికంపితవాయువును బీల్చు భాగ్యమేకాక నింతటి కన్న పరిశుభ్రవాయువును బీల్చుభాగ్యము మనకులేదా?”

“లేకేమి వాయుపారిశుద్ధ్య మిచటకన్న వేరొకచోట మించుగానుండఁబోదు. ఏమనిన మనము భూమియందలి మిక్కిలియెత్తయిన ప్రదేశములోనుండుటచే మనమిప్పుడు పీల్చుచున్న గాలి మిక్కిలి నిర్మలమైనది. అయినను మనమింతకుఁబూర్వము విడిచివచ్చిన గుహలో మెట్లుకలవు. ఆమెట్లమీఁదుగా మన మీగృహోపరిభాగమును జేరనగు. ఆయుపరిభాగము మిద్దెపైఁ గూర్చువలెనుండును. అచట రాత్రింబవళ్లు మనయిచ్చవచ్చినట్లుండ వచ్చును.

“అట్లయినఁ గారాగృహాధికారులు మిక్కిలి శ్రద్ధా జాగ్రత్తులతోఁ గావలియుండరా?” యని తప్పించుకొనుటకు వీలుకలుగునేమో యని యూహించుచు హేమచంద్రుఁడు వానినడిగెను.

“శ్రద్ధా జాగ్రత్తలెందునకు? నీవు మొట్టమొదట నీగృహము నఁ బ్రవేశించినపుడు నీవెనుకనే మూసికొనినతలుపును తాళమువైచిన జాలును. ఈగృహమునుండి తప్పించుకొని పారిపోవుటకు సహజాధారమైన యవరోహణమునకు బదులు గరుత్మంతునివలె ఱెక్కలున్న నెగరవలయు”

“అట్లయిన నీ కారాగృహమునుండి విముక్తినాసించుట గగన హార్మ్యమును గట్టుటేనా” యని నిస్పృహతోఁ హేమచంద్రుఁడు పలికెను.

“అగునో కాదో నేను గొన్ని సంగతులఁజెప్పిన పిదపఁ బరీక్షింపుము. మనకు భోజనముఁదీసికొనిరాబడు రెండువేళలఁదక్క ఱాతితలుపెన్నఁడును దాళమువేయఁబడకయుండదు. భోజ్యములను దీసికొని వచ్చినవానినిజంపి ఱాతితలుపునొద్దకుఁబోయిన యెడల వానికి సహాయుఁడుగావచ్చిన మరియొకఁడా ద్వారమునొద్ద మందుదట్టింపఁబడిన తుపాకితోఁ గావలియుండును. వానినిగూడ వధింతుమనుకొనుము. పిమ్మట మెట్లనుండిదిగి క్రిందునకేగునంత నచట నొక దుర్గరక్షకుఁడట్లేకావలి యుండును.”

ఇంకను విముక్తిఁజెందు నాశతో “ఆదుర్గరక్షకుఁడుగూడ జంపఁబడినచో—ఏమనిన ఘోరసాహసికులు ఘోరకృత్యములను మిక్కిలి యున్మాదముతో నొనర్చెదరు. అప్పుడు వారి స్వప్రాణనిరసనమే వారికిఁ బదుగురు మనుజులబలము నిచ్చును” అని హేమచంద్రుఁడు చెప్పెను.

“మంచిది. అట్లే యాదుర్గరక్షకుని జంపితిమనుకొనుము కాని యాకార్యము చప్పుడుకాకుండ నెరవేరదు. ప్రక్కనే రక్షకాలయము కలదు. ఆచప్పుడును వినినవెంటనే యాలయమునుండి పదుగురాయుధపాణులగు దుర్గరక్షకులాతుపాకీలనుండి పదియగ్నిగోళములు బయల్వెడలును.”

"కాని, ఎప్పుడును గలుగకుండునట్లుగనే వాఁడు చంపఁబడియె ననుకొనుము."

"అట్లే యనుకొందము. అట్లు వానిని జంపినపిదప నీవిముక్తికి రెండే మార్గములు గలవు. ఒకటి ప్రకృతిచే నిర్మితమైన కుడ్యమువలె మహోన్నతము నభేద్యము నగు పర్వతప్రాకారమునెక్కుట. ఆ ప్రాకార మేటవాలుగానుండినచో నెక్కుట కెట్లో వీలుచిక్కును; కాని యట్లులేకుండుటచే నయ్యది యగమ్యము. పోనిమ్మెట్లో యెక్కితివనుకొనుము. అచటనుండి దిగుటకు వీలేమియును లేదు. మన దేశములలో మనయిండ్లగోడలెట్లున్నవో యట్లే నీవెక్కిన పర్వతప్రాకారముండును. అచటనుండి దుమికితివా క్రిందుగానున్న యగాధములోఁబడి శిలాస్థలముపై నీశిరము బ్రద్దలగును. ఇఁక రెండవమార్గము మెట్లనుండి—ఆమెట్ల నెక్కుటకు ముందొక ఫిరంగియు, దానియొద్ద నిరువురు కావలివాండ్రు నుందురు. ఆకావలివారియొద్ద దుపాకు లెల్లయవుడును గోళములతో సిద్ధముగా నుండును. అంతియకాక యాఫిరంగి త్రికాలములయందును మందుతోడను రవ్వలతోడను గోళములతోడను సిద్ధపఱుపఁబడి యుండును. అహా ! చిన్నవాఁడా ! అయిదేండ్ల నుండి నే నీచెఱసాలయందుండి యుంటినని చెప్పఁగా, నేనును నీవలెనే తొలుదొల్త విముక్తికై సర్వవిధములను బ్రయత్నింప లేదనుకొంటివా ? కావున నీవిముక్తి కవరోహణము మిక్కిలి యసంభవము. ఆరోహణ మంతకుమును పే యసంభవము !" అనునపుడు హేమచంద్రుని హృదయమునందుఁ గడసారియాస పూర్తిగా నశింప మోము వెలవెలఁబారెను.

వాని మోమువంక నాయైరోపీయుఁ డొక పదినిమిషములు తేరి చూచి "యౌవనుఁడా! నీవెవ్వఁడవో నీయుదంత మెట్టిదియో చెప్పెదవా ?" యనియడిగెను.

"నాపేరు హేమచంద్రుఁడు. చిన్ననాఁటినుండియును నేను శ్రీనగరమున రవీంద్రుఁడను వర్తకునియొద్ద నుంటిని. కొద్దిదినముల వెనుక నే యావర్తకుఁడు కాలగతిఁజెందెను. పిదపఁ గొన్నికొన్ని కార్యాంతరములచే నాఁడు కైలాసపర్వతములలోనికిఁ బ్రయాణము తటస్థించెను. ఆపర్వతపంక్తులలో నెవ్వరో యిరువురు బాటసారులు కలసికొనిరి. వారును నాబోటి బాటసారులేకాన నేనును వారును గలసిమెలసి ప్రవర్తించుచుండగా గిరిసింహునిచేఁ బంపఁబడిన పదునైదుగురు సైనికులు నాతోనున్న బాటసారులను దఱిమిరికాని వారు పారిపోయిరి. అయిరువురిలో నొకఁడు దొంగలకు నాయకుఁడై పేరువహించిన వీరరుద్రుఁడఁట. రెండవవాఁడు వానియనుచరుఁడఁట—నేనుఁగూడ వారితో నుండుటచే నేనును వారి యనుచరుఁడనేయని నన్ను బట్టుకొని యీకారాగృహమునఁ బ్రవేశపెట్టిరి" అని హేమచంద్రుఁడు చెప్పెను.

వాఁడట్లు తనకథను జెప్పుచుండగా నాయైరోపీయునిసూక్ష్మదృష్టి హేమచంద్రుని మొగమును మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించుచుండెను. హేమచంద్రుఁడు తనకథను ముగించిన పిదప నాయైరోపీయుఁడు కొన్ని నిమిషములవఱకుఁ దనలోఁ దానెద్దియో వితర్కించుకొనిన పిమ్మట హేమచంద్రునివంకఁ జూచుచు "హేమచంద్రా ! నీకథను మిక్కిలి సంగ్రహించితివి. ఒకని జీవితచరిత్రము నాల్గువాక్యములలో నిమిడియుండుట మిక్కిలి విచిత్రము ! ఐనను నీకథయందేవియో కొన్ని విషయములు దాఁపఁబడెనని నాకుఁ దోఁచెను" అని యనెను "దాఁచితినని నీకెట్లు తెలియు ?" "ఆఁ 'దాచితినని నీకెట్లుతెలియు' నని నన్నడుగుటచే తనే" యని యావృద్ధుఁడు చెప్పెను.

హేమచంద్రునికి లజ్జ వొడమెను. అపుడు గదితలుపు తెఱవఁబడి వారున్నచోటి కొక దుర్గరక్షకుఁడు రెండు పళ్లెరములలో భోజ్యములను బట్టుకొని వచ్చెను.

ఘూర్జరతార.

ముప్పదినాల్గవ ప్రకరణము.

వెనుక తా నాయారోపీయునికిఁ జేసినవాగ్దత్తమును హేమచంద్రుఁడు జ్ఞాపకముంచుకొని, భోజ్యములను దీసికొనివచ్చినవానితో "ఓయీ! నాకు మద్యద్రవములఁ ద్రావునలవాటు కలదు కావున దెలియఁజెప్పితిని" అని చెప్పెను. వెంటనే వాఁడు మరలిపోయి యయిదునిమిషములలోఁ దిరిగివచ్చి, రెండు బ్రాందిబుడ్లను నొకగడ్డిపఱుపు నొక కంబళమును, మృత్తికాపాత్రయందుఁగొంతనీరమును దెచ్చి హేమచంద్రునకొసంగి చెఱసాలతలుపులను మూసి వెలుపలఁ దాళమును వైచి పోయెను.

అనంతరమున వారిరువురును భోజనమొనర్చిరి. ఇపుడు రాత్రి ప్రవేశించెను. వెంటనే వారికిదివఱకే యీయఁబడిన యవిసెతైలపుబుడ్డిని జకుముకితోఁ వెలిఁగించిరి. వారుండినగదియం దిపుడు కొద్దిగా దీపపువెలుతురుండెను.

భోజనానంతరమున వారిరువురును శిలావేదికపైఁ గూరుచుండిరి. అపు డైరోపీయుఁడిట్లు చెప్పెను.

"హేమచంద్రా! నీకథయందుఁ గొన్నివిషయములఁ గప్పిపుచ్చితివని యిదివఱలో నుడివియుంటిని. అందునకు నీవు కోపగించుకొనకుము. నీస్వవిషయములను విపులముగ నాకు నివేదించుటకు నీవు సా

హసము నొంధకుండుట సహజమే! ఏలయన నామొగమును నీవెఱుంగవు—నీమొగము నంతకుమునుపే నేనెఱుంగను. మనము పరదేశీయులము—వివిధమతావలంబకులము; కాని దైవము మనకిరువురకు నీనాఁడిచట సంయోగమును గలిగించినాడు. నేఁటినుండి మనమిరువురము నీకారాగారమునఁ గాలము గడపవలెనని వానియమోఘాజ్ఞ. నేఁటినుండియు మనమన్యోన్యసమాధానమున మనమనదుఃఖములను మఱచిపోవలెనని వానియిష్టము. నేఁటినుండియు మనము నిర్మలహృదయముతో నేకీభవించి స్నేహమార్గమున నిశ్చలదృష్టితో నడవవలెనని వానిలేఖనము కావున హేమచంద్రా! మనవార్ధ్వములను దూరముగాఁ ద్రోలి యొకరితోఁ నొకరు మిక్కిలి మిత్రభావము జూచుకొనుట శ్రేయస్కరమని నాయూహ" "నిజమే, ఔను నాకోరిక కూడ నట్టిదే! మరియును నేఁటినుండి నీతో నేను మిక్కిలి హితముగా నుందును. అపుడే నీవునాకన్న మహానీయుఁడవని గ్రహింపఁజాలితిని—నీపలుకులయం దధికజ్ఞానము కలదు—

"అయ్యో! యువకుఁడా" తలనుగదల్చుచు "అధిక స్వానుభవమున నేను బ్రపంచికచరిత్రయం దనేకపాదముల నభ్యసించియుంటిని—నాయీడు నీదానికన్న మూడురెట్లెక్కువ. ఈరాత్రి నీచరిత్రతోఁ గాలము బుచ్చెదము—రేపు నా చరిత్రను జెప్పెదను. కప్పిపుచ్చక సర్వమును నీవు చెప్పినయెడల నేనును గప్పిపుచ్చను."

"అట్లేయని నేనిదివఱకే వచించియుంటిని గదా" అని హేమచంద్రుఁడు పలికెను.

కాని వాఁడుపూర్తిగా స్వచ్ఛహృదయుఁడై మాట్లాడుటలేదు; ఏమనిన దనజీవితపర్యంతము కారాగృహవాసమేయని వాఁడెఱిఁగియు సురనంధన సాంబంధిక రహస్యముల నాయైరోపీయునికిఁ దెలియఁజెప్ప నెంచలేదు. వాఁడు మిక్కిలి కృపణుఁడు; ఎల్లయపుడును జెఱసాలయే వా

నియుల్లగుట సురనందన సౌఖ్యము లభించుమార్గము తనకు లేదని యెఱింగియును దానినే పట్టుకొని పెనఁగులాడఁజొచ్చెను.

“నీవు కప్పిపుచ్చిన విషయమెద్దియనఁగా, నేదియో కార్యాంతరమునఁ గైలాసఁ పర్వతపంక్తులలోనికి వచ్చితినంటివి—ఆకార్యాంతరమెద్దియో!” అని యైరోపీయుఁడు పలికెను.

హృదయకాపట్య మిసుమంతయైన మోముపైఁ గన్పడకుండునట్లు హేమచంద్రుఁ డైరోపీయుని ప్రశ్నకుఁ బ్రత్యుత్తరముగా నిట్లు చెప్పెను. “నిజముచెప్పెదను వినుము. నేనొక శ్రీనగరరక్షక భటుని జంపియుంటిని; కావున నాయపరాధము నానెత్తిపై నుండుటచే నాదేశమున నుండుటకు వీలులేక కైలాసపర్వతములలో డాగియుండుటకు వచ్చితి.” హేమచంద్రా! నీవుచెప్పినదంతయును నేను నమ్మెదను; ఏమనిన నన్ను మోసగించుటకు నీవేలతలఁచెదవో యెఱుఁగను. అంతియకాక యది నీ స్వవిషయము. నిన్ను నేను బలాత్కరించి చెప్పుమనలేదు. నీ సమ్మతినే చెప్పుచుంటివి. కావున నీవనృతమాడలేదని నేనెంచెదను. ఇఁక మనమీ ప్రసంగమును ముగించి మిద్దెమీద కేగుదము రమ్ము.” అని చెప్పి లేచి హేమచంద్రుఁడు వెంటరా ప్రక్కగదిలోనికి వచ్చి మెట్లమీఁదుగా మిద్దెమీఁదకు వెళ్ళెను.

ఆమిద్దెపై నుండి దుర్గప్రాకారములును దూరమునందున మహోన్నత పర్వతప్రదేశమును జూడనగు; కావున వారిరువురు నాపరిసరప్రాంతములఁ జూచుచు నొకగంటకాలము చల్లనిగాలిలో నిలువఁబడిరి. ఆమిద్దెపైన నొక పట్టుబావుటా కలదు. అది మిక్కిలి పొడవైన కంబమున కగ్రభాగమున గాలిలోఁ దటతట లాడుచుండెను. ఆ స్తంభాగ్రమునుండి మిద్దెకు రెండుత్రాఁడులు బిగియఁగట్టఁబడి యుండెను. ఎల్లపుడును విముక్తికై గొంతెమకోరికలఁ గోరు హేమచంద్రుఁడు దుర్గప్రాకారముల పొడవును త్రాఁడుపొడవును సరిపోల్చి పరాసువాని

తో “ఈత్రాఁడు పొడవును ప్రాకారముల యెత్తును సమానముగా నున్నది” అని యనెను.

ఆవాక్యములయం దర్థమును పరాసువాఁడు గ్రహించి “మరల గగన హర్మ్యమును గట్టుచుంటివే. ఏమనిన నీవనుకొనుచున్నట్లే యాత్రాఁడు మూలముగాఁ గ్రిందునకు దిగెదవనుకొనుము. అపుడు ప్రాకారముల లోపలిభాగమునే యుండుదువుగాని వెలుపలికిఁ బోఁజాలవు. కావున నట్టియూహ నిష్ఫలము. దానికేమి కాని నాకొక్కసంగతి స్మృతికి వచ్చినది. ఈపట్టుబావుటాకన్న బదిరెట్లు పెద్దదియగు బట్టబావుటా యొకటి రెండుసంవత్సరములకుఁ బూర్వ మొకనాటిరాత్రి గాలిచేతనో మరెట్లో యెగిరిపోయినది. ఆజండాకొఱకు దుర్గరక్షకు లనేక స్థలములయందు వెదకిరఁట—కాని యెచ్చటను గాన్పింపలేదు “అని పలికెను.

తదనంతరము వారిరువురును మిద్దెనుండి మెట్లమీఁదుగా దిగి యెవరి శిలావేదికపై వారు పరుండి నిదురబోయిరి.

హేమచంద్రుఁడు మరునాఁటిప్రొద్దున నిదురనుండిలేచి చూచునంతఁ దనకు ముందుగా లేచిన ఫ్రాన్సుదేశీయుఁ డొక చీపురతో వారున్నగది నూడ్చుచుండె.

అట్లూడ్చుచు హేమచంద్రుఁడు నిదురనుండి లేచుటనుజూచి వానితో “హేమచంద్రా! ఇది మనకుఁ బ్రతిదినకృత్యము దీనిని మనమిఁకఁ బంచికొనవలయు. ఒకనాఁడు నీవూడ్చుము—మరునాఁడు నేనూడ్చెదను” అని యైరోపీయుఁడు చెప్పెను.

వానివిజ్ఞానమును సూక్ష్మబుద్ధిని శాంతస్వభావమును కాంతిని గ్రహించి వాఁడు తనకన్న వేయిమడుంగులు ధీశాలియని యెంచి తనకు విముక్తియెన్నఁడైన దొరకినచో వానిమూలముననే యని నిశ్చయించుకొని వానిస్నేహమును మిక్కిలి సంపాదించు నూహతో “నేఁడు

మొదలుకొని నీవెన్నఁడును గృహసమ్మార్జనము జేయవద్దు. ప్రతిదినమును నేనే లేచెదను. అని వానిపై ప్రశ్నకుఁ బ్రత్యుత్తరమొసంగుచు లేచి వానిచేతనున్న చీపురును దానులాగి పుచ్చుకొని భాగశేషము నూడిచెను.

అంత నొకగంటకుఁ బిమ్మట వారికి భోజ్యములు తేఁబడియెను. వారిరువురును భోజనమొనర్చిన పిదప "హేమచంద్రా! నిన్నరాత్రి నీవు నీకథను జెప్పితివికదా. నేఁడు నావిషయముఁ గొంతచెప్పెదను. రమ్ము మీఁదకుఁబోవుదము" అని పలికెను.

పిమ్మట వారిరువురును మిద్దెమీఁదకుఁబోయి జెండాకఱ్ఱకుఁ బ్రక్కగాఁ గూరుచుండిరి. అపుడా యైరోపీయుఁ డిట్లుచెప్పఁదొడఁగెను.

"నాపేరు "డోర్వాల్" నాస్వదేశము ఫ్రాన్సుదేశములో నన్ను "కౌంటు డోర్వాల్" అని యందురు. "కౌంటు" అను పదము గొప్పపదవిని దెలియఁజేసెడు బిఱుదు కాని యీకారాగృహమున నీవు భిక్షుకుఁడవైనను నేను కౌంటునైన నిరువురము సమానులమే. కావున దద్విషయమునుగూర్చి ప్రసంగించుట యనవసరము. మొట్టమొదట నేను భాగ్యవంతుఁడనే—కాని బుద్ధిపూర్వకముగా నాభాగ్యముల ననతికాలములో వ్యయమొనర్చితిని. నేను నాయౌవనమున బహుభోగపరాయణుఁడనై యుంటిని. నేనెప్పుడును బెండ్లిఁజేసికొనలేదు. 'పాలఁతి దాహావహ్ని పురుషుఁడాజ్యఘటంబు' అను నార్యోక్తిని మఱచి యౌవనోన్మాదమున నధికజారత్వమును సలిపియుంటిని. ఇపుడా యౌవనమును దలంచిన నాకు మిక్కిలి యసహ్యముకలుగును. నలువది యేండ్లు వచ్చినంత నొక్కసారిగా నాబుద్ధియును నాయాలోచనలును వేరొకమార్గమునుబట్టెను. అంత నాజారత్వమును భోగములను బూర్తిగా విసర్జించితిని. విద్యావిషయములలోఁ జొచ్చితిని. పెక్కుభాషల నేర్చుకొంటిని. ప్రకృతి శిల్పాది శాస్త్రములను బాగుగా నభ్యసించి

తిని. ఆశాస్త్రములయం దనేకప్రయోగముల నొనర్చితిని, కొంతకాలమువఱకు 'బరుసవేది' యందు నాకు విశ్వాసముకలదు. అది ప్రపంచమునందుండియే యున్నదని నమ్మితిని. దానిసృజనముకొఱకు వివిధవిషరాసాయనముల సమ్మేళనములతోఁ దుదకు నాకుఁ బ్రాణాపాయము వచ్చునంతవఱకుఁ బెనఁగులాడితిని. ఈప్రయత్నమునందు నాకుఁగల ధనములోఁ జాలధనమును వ్యయపఱచితిని. కాని సారాంశము పూర్తిగా నిష్ఫలమయ్యె. అట్లే యనేకవిధములగు ప్రకృతిశాస్త్రప్రయోగములను బ్రయత్నించితిని; కాని వాని సారాంశములు నిష్ఫలములైనప్పటికి మొత్తముమీఁద వానిలో మిక్కిలి యనుభవజ్ఞానము నొంది యనేకవిషయముల గుర్తెఱుంగఁజాలితిని. క్రమక్రమముగా నాభాగ్యములు క్షీణింపఁదొడఁగె; అవి క్షీణించినకొలఁదిని ధనార్జనమున కనువైనమార్గమును మిక్కిలిశ్రద్ధతో నన్వేషింపఁ దొడఁగితిని. అట్లు ధనమునకై తహతహలాడుట మరల జారత్వాది క్షణభంగురభోగములలో మునుఁగుటకుఁగాదు—ఏమనిన వానియందు నాకు మిక్కిలి ద్వేషభావము కలిగెను—కాని ధనమేబలము కావున బలవంతుఁడనగుటకుఁ దహతహ నొందితిని. అనంతములగు నైశ్వర్యముల కధికారియగువాని కేవేవి వశీకరములై యుండునో నేను గ్రహించితిని. అట్లు సంవత్సరములు గడచెను; ధనవంతుఁడనగుటకు బదులు క్రమక్రమముగా దరిద్రితాస్థితికి వచ్చుచుంటిని. కాని నాయభ్యాసములు నన్వేషణములును నాయాదర్శనములును ప్రకృతిశాస్త్ర ప్రయోగములును నిష్ఫలములై నాధనమును వృద్ధిజేయుటకుబదు లూడ్చుచున్నప్పటికిని ధనవంతుఁడనగుటకు ముందుముం దొకమార్గముకలదుగదాయని యూఱటఁ జెందితిని. మిక్కిలి ధనవంతుఁడని పేర్వడిన యొకవృద్ధుఁడు నాకు సన్నిహితుఁడు. వానికి వారసుఁడను నేనుదక్క మఱెవ్వరును లేరు. కావున వానియందు నా యాశలను బొందుపఱచితిని. అట్లుండ నేఁటి కాఱేండ్లకు వెనుక

నొక్కనాఁడు నన్ను వానిస్వగృహమునకుఁ బిలువనంపుకొనెను. ఆవృద్ధుఁడు తనమరణశయ్యపై నుండెను. నేనేగునప్పటికిఁ గొనయూపిరితో నుండెను. నేను వచ్చినతోడనే నాతోఁగొన్నిమాటలను జెప్పెను. అవియే వానికడసారిమాటలు. వాఁడు రెండువిషయములఁ జెప్పెను. మొదటివిషయమైన తనధనముఁగూర్చి తాను ధనవంతుఁడగుటకు బదులు మిక్కిలి ఋణములపాలయ్యెననియు దాను విడిచిపోవుచున్న గృహము మొదలగు-వానిని ఋణదాతలు గ్రహింతురనియుఁ దుదకుతనదహనాది క్రియలకైనను ధనలోపము కలుగుననియుఁజెప్పెను. ఇఁక రెండవవిషయమొకకథ. ఆకథను బూర్తిగాఁజెప్పకమునుపే వానిప్రాణములుపోయెను. కావున దద్విషయమై మాట్లాడనవసరము లేదు."

కొన్ని నిమిషములాగి మరల డోర్వా లీరీతినిఁజెప్పెను.

"అట్లు నాచుట్టనుపైఁబెట్టుకొనిన యాశలన్నియును నశింప నాకు వెఱ్ఱియూహలు పుట్టఁదొడఁగెను. నాజీవనవిధానమును బూర్తిగా మార్పనెంచితిని. ప్రకృతిశాస్త్ర ప్రయోగాన్వేషణాదులతోడ మిక్కిలి విసువుజెందితిని; అంత—నీవు నవ్వెదవేమో—హిమాలయ పర్వతములను జూచువెఱ్ఱియూహ నాకుఁ గలిగెను. ఒకపనిని జేయవలెననిసంకల్పించుకొనినపు డాపనిని వెంటనే చేయుట నాకు సహజమైయుండెను. కావున సత్వరమే నే నోడనెక్కి నాదేశమునుండి మైదువత్సరములకు వెనుక నీదేశమునకువచ్చితిని. హిమాలయములు పశ్చిమదిశయందుఁ దగ్గి క్రమక్రమముగా సమభూములలోఁ గలసిపోవుటచే ముందు పశ్చిమదిశ—అనగా—కైలాసపర్వత ప్రాంతములకు వచ్చితిని. నాయొద్ద చిత్రకారునికి వలయు చిత్రలేఖనా పత్రములు తూలికలు నిండియూరబ్బరు మొదలగు సర్వపరికరములునుగలవు; కావున నీకైలాస పర్వతములలో నున్న మహనీయ ప్రకృతిరంగములను గొన్నికొన్నింటి చిత్రపటముల లిఖింప జూచ్చితిని. అట్లుండ నొక్కనాఁడిపుడు మనముండిన యీదుర్గ

ప్రాంతమునకు వచ్చుటసంభవించెను. వెంటనే యీదుర్గ ప్రాకారములును దీనియౌన్నత్యమును దీనిచుట్టునున్న యగాధములును నాదృష్టి నాకర్షింప నీదుర్గమునకెదురుగా నొకయున్నత స్థలమునఁ గూర్చుండి, దుర్గపటమును లిఖింపఁదొడఁగితి. నేనట్లు లిఖించుచుండగా దుర్గములోనుండి యిరువురు ముప్వురు దుర్గరక్షకులు నాయొద్దకు వచ్చిరి. వారు కొండలలోఁ బుట్టి కొండలనడుమఁ బెరిగిన యనాగరికులై చిత్రలేఖనమున నేమియో యెఱుఁగనివారౌటచేఁ దమప్రాకారము తమ కందకము, తమదుర్గము, తుదకుఁ బ్రాకారములోని మెట్లు దాని చుట్టునున్న యగాధములు చిత్రపటమునందుండుట జూచి మిక్కిలి యచ్చెరువునొంది యామహాద్భుతవిషయమును దుర్గములోనితమస్నేహితులకుఁ జెప్పి వారిని వెంటబెట్టుకొని వచ్చిరి. వారందఱును దుర్గపటమును జూచి యత్యాశ్చర్య పరవశులై వెడలిపోయిరి."

ఇచటఁ గొన్నినిమిషములాగి మరల నీక్రిందివిధమున డోర్వాల్ చెప్పఁ దొడఁగెను.

"కొన్ని దినములకుఁ బిమ్మట నీదుర్గ పరిసరప్రాంతముల నేను దిమ్మరుచుండగాఁ బదునేవురు మహమ్మదీయసైనికులు లిచటికి హాయారూఢులైవచ్చి నా యూరుపేరుల నడిగిరి. వెంటనే యాసైనికులకు నాయకుఁడగు నొక యౌవనుఁడు నాచిత్రలేఖనమునకు మిక్కిలి యచ్చెరువునొందెను. ఆ యౌవనునికిఁ జిత్రలేఖనవిద్య బాగుగాఁ దెలియును—మరియు మిక్కిలి బుద్ధిమంతుఁడు. వానికి నాచిత్రపటముల నన్నిఁటిని జూపితిని. ఆ కళాకౌశల్యమున నాకుఁగల పరిజ్ఞానమునకు నన్ను మిగుల నభినందించి తమతో విందు గుడువఁజేసెను. అపుడు నేనీదుర్గపటమును వానికిఁ జూపింప నాతనికిఁగలిగిన సంతోషమునకు మేరలేదు. ఆ మహమ్మదీయులకు, నీదుర్గవాసులకును వైరము కలదఁట—ఆసంగతి నాకుఁ దెలియమి వానిని నాదుర్గపటమున కొకప్రతినిదీసికొన నిచ్చితిని.

వాఁడా ప్రతిని లిఖించుచుండగా నీదుర్గరక్షకులు పదునైదుగురు హయారూఢులై యచటికిఁ బరువెత్తికొని వచ్చిరి. అట్లువచ్చి ముందుగా నన్నుఁ బట్టికొనిరి. పిమ్మట వారికిని వీరికిని బదినిమిషములకాలము పోరాటము సంభవించె. మహమ్మదీయు లోటువడి పారిపోయిరి. శత్రువుల దుర్గస్థానమును, దాని పరిసరప్రాంతములను, బటముమూలముగా నొకరికి నివేదించుచుంట నన్ను వేగుగనెంచి పట్టుకొని యీకారాగృహమునఁ బ్రవేశపెట్టిరి. నాటినుండియు నే నిచటనేయుంటిని. హేమచంద్రా! ఇదియే నా స్వవిషయము."

ఘూర్జరతార.

ముప్పది యైదవ ప్రకరణము.

కౌంటుడోర్వా లాత్మీయచరిత్ర మట్టిదియ. దానిని హేమచంద్రుఁ డధికశ్రద్ధాసంభ్రమములతో నాలకించెను.

కతిపయదినము లట్లు గడచుచుండఁ గ్రమక్రమముగాఁ దనసహవాసి ప్రసంగము హేమచంద్రునికి మిక్కిలి సంతోషమును గలిగింపఁ జొచ్చెను. వాఁడు మిక్కిలి మృదులహృదయుఁడనియుఁ గారుణికుఁడనియు హేమచంద్రుఁడు కనుఁగొనెను. వాఁడు వివిధకళాకౌశలుఁడనియు, విజ్ఞానియనియు, మిక్కిలి శాంతికలవాఁడనియు, నిష్కపటియనియు నధిక సూక్ష్మబుద్ధి యనియు హేమచంద్రుఁడు గ్రహించి వాని స్నేహమును గ్రహించుటకుఁ దాను జేయఁగలుగనది సర్వమును జేయుచుండెను. వానిస్నేహసంపాదనమునకుఁ దానుగూడ నిర్మలహృదయుఁడై శాంతిపరుఁడైనట్లు ప్రవర్తింపఁ దొడఁగెను. అట్టి హేమచంద్రుని ప్రవర్తనమును డోర్వాలు తన సూక్ష్మబుద్ధిచేఁ బరికించుచుఁ గ్రమక్రమముగా వానితో మిక్కిలి మిత్రభావమున నుండఁజొచ్చెను. దినములు కడచుచున్నకొలఁదిని వారికిఁ బరస్పరమైత్రి మిక్కుటముకాఁ జొచ్చెను.

వారమున కొకసారి రెండు బ్రాందిబుడ్లు వారిలో నొక్కొక్కరికీయఁబడుచుండెనని వెనుక చెప్పఁబడెను గదా. వాని రెండుబుడ్లనే కాక తన రెండుబుడ్లను గూడ దీసికొనుచు నాలుగుబుడ్ల మొత్తమును

ననుభవించుటఁ జూడఁజూడ హేమచంద్రునికి మిక్కిలి యాశ్చర్యము తోఁచెను; ఏమనిన దనతోఁబాటు మంచినీరమునే డోర్వాలు త్రావుచుండెనుగాని యాబుడ్లలోని సారాయ మెన్నఁడును ద్రావినట్లు కన్పట్టలేదు. కాని ప్రతివారమునందు నుత్తబుడ్ల నిచ్చి సారాయముతోనున్న బుడ్లను బుచ్చుకొనుచుండెను. ఈవిషయము హేమచంద్రుని కాశ్చర్యకరమై యుండుట సహజమే. ఐనను మాటలాడక యూరకుండెను.

అట్లుండ నొక్కనాటిరాత్రి వా రిరువురును బరుండి యుండగా డోర్వాలు తన గడ్డిపఱుపును, బ్రాందిబుడ్లను మఱియుఁ గొన్ని రాళ్ళను గదలించుచున్న చప్పుడు హేమచంద్రునికి వినఁబడియె. ఆచప్పుడు వినినంత వాని కనేకభావములు కలిగెను. వెంటనే యిట్లు తలపోసెను. “అంతటి విజ్ఞానముతో——నంతటి బహుకళాకౌశలముతో——నంతటి శాంతితోఁ——దప్పక వాఁడు తన జీవితసర్వస్వము నీ కారాగృహమున గర్పింపనెంచి యుండఁడు! తప్పక విముక్తికై యేదియో విచిత్రప్రయత్నమును జేయుచునే యుండవచ్చును! అది యింకను బూర్తి కాకపోవచ్చును! దానిని నాకుఁ దెలియఁజెప్పుట కనుమానగ్రస్తుఁడై కాని, భయగ్రస్తుఁడై కాని యుండవచ్చును. ఆసంగతిని గనిపెట్టెదఁ గాక——తద్విషయసూచకమగు నేదియో యంశమును గూర్చి మాట్లాడెదఁగాక!”

ఆ మరునాటి మధ్యాహ్నమున వారిరువురును భోజనము లొనర్చి యొకచో నాగదియందుఁ గూరుచుండియుండఁగాఁ దాను మిక్కిలి ముక్తిలోలుఁడైనట్లు తన భావములఁ బ్రదర్శించుచు “మన కెన్నటికైన నీ కారాగృహమునుండి విముక్తిఁ జెందుటయు నా కొండలనడుమఁ బరిశుభ్ర వాయువును బీల్చుటయును గలుగునని దేవుని యాజ్ఞయేయున్నచో నెంతసౌఖ్యముగానుండు!” నని మిక్కిలి సంభ్రమముతోఁ బలికెను;

వెంటనే “నీకు విముక్తి దొఱకినచో నీస్వేచ్ఛ నెట్లుపయోగించెదవు?” అని డోర్వా లడిగెను.

“అయ్యో! ప్రియమిత్రమా! ఆప్రశ్న నెట్లడుగఁ జాలితివి. నాయట్టి యౌవనుని కనేకమార్గములు కలవు.”

“అట్లైన నీ యాస్నేహితు నీచెఱసాల నే విసర్జించి పోయెదవా?” యని తన సూక్ష్మదృష్టితో వానిమొగమును మిక్కిలి పరిశీలించుచు డోర్వాలు పలికెను.

పై వాక్యమునం దేదియో యితరార్థ ముండెనని గ్రహించి వెంటనే “కాదు కాదు! నిన్ను నేనెన్నటికిని విడువను. మన మిరువురమును గలిసి మనస్వేచ్ఛఁ బునరుద్ధరింపఁ బడినచో——లేక మన మిరువురమును గలిసి మన విముక్తిని సమకూర్చుకొన్నచో——నే నెల్లయప్పుడును నీ కొమారునివలె నీయెడఁ బ్రవర్తించుచు నిన్నెన్నటికిని విడువకుందును. ఆహా! అంతగా నీచే వర్ణింపఁబడిన ప్యారిసునగరమునకు నీతోఁ గూడ నేగినచో నా కెంతసంతోషము కలుగును!”

ఈ మాటలను జెప్పుచుండగా వాని యనుభావములను డోర్వాలు కొన్ని నిమిషములకాలము మిక్కిలి సూక్ష్మముగా నవలోకించి పిమ్మట “హేమచంద్రా! రెండు నెలలనుండియు నీ నడవడికను మిక్కిలి శ్రద్ధాభక్తులతోఁ బరీక్షించుచుంటిని. నీ వీకారాగృహమునకువచ్చిన మొదటిదినముననే నీ స్వభావమును గూర్చి కొంత తెలిసికొంటిని. ఎట్లనిన నీ దుస్థితిచేత నీవనేక సాహసకృత్యములఁ దలంచితివి——అ వెఱ్ఱియన——కావలివానిని జంపెదనంటివి——దుర్గరక్షకుని శతఘ్నిరక్షకుని వధించెదనంటివి. కాని నీవు చెప్పినదంతయుఁ జేయఁ గలవో లేవో యనుసంశయము నాకుఁ గలిగినది. ఏమనిన నభేద్యమగు నిట్టి దుర్గమునుండి తప్పించుకొనుట సంవేగసాహసికవ్యాపారయత్నములచేఁగాదు. వేదాంతము నంతయుఁ దన సాహాయ్యమునకుఁ దెచ్చికొనవలయును——

మిక్కిలి జాగ్రతను జూపవలయు—మిక్కిలియోర్పుతో నుండవలయు. అట్లయ్యును మానవులకుండు సాధారణధైర్యముతో నీకుడ్యముల గట్టితనమును—ఈగోపురముల యౌన్నత్యమును—ఈద్వారముల బాహుళ్యమును—ఇచట దుర్గరక్షకులసంఖ్యను నిరసింపఁజాలము. సామాన్యవిజ్ఞానముచే మనకు విముక్తి నిక్కువముగా నలభ్యమగు" అని డోర్వాలు గంభీరతతో వక్కాణించెను.

వెంటనే యధికసంభ్రమముతోఁ దటాలునఁ దా నుపవసితుఁడై యున్నచోటనుండిలేచి "అట్లయిన మిత్రమా! మనవిముక్తికిఁ గావలసిన శాంతి—ఆవేదాంతము—ఆవిజ్ఞానము—ఆసూక్ష్మబుద్ధి, నీకుఁ గలదా" అని హేమచంద్రుఁడు పలుకుచుండఁగా వానికడ్డమువచ్చి "ఓయీ! చూడుము! అప్పుడే నీవెట్లుసంభ్రమమునొందుచున్నావో! ఒకవేళ నామెదడునందుఁ బొందుపఱుపఁబడినదంతయును నీకుఁ జెప్పఁబడినయెడల సత్వరమే యధికోత్సాహోద్రేకమున నీకుఁ బిచ్చిపట్టునని నేను దలఁచెదను." అని డోర్వాలుపలికెను. "ఓహో! అట్లయిన నేను మిక్కిలి శాంతముతోనుందును" అని డోలాయమానహృదయుఁడై "ఓహో! విముక్తికి వీలుండదేఁగాఁబోలు" నని గద్గదస్వరముతోఁ బలికి తనశిలావేదికపైఁ గూలఁబడియెను; ఏమనిన నుద్రేకకారణమునఁ దనయొడలు దానేమఱచిపోవునేమోయని వానికిఁదోఁచె.

"నీవీకారాగృహములోనికి వచ్చిన మొదటిదినముననే యవరోహణమూలమున మనకు విముక్తి యెట్లసంభమో చెప్పియుంటివిగదా" యని డోర్వాలుపలికెను.

"ఔను! ఱెక్కలుకలిగిననేకాని యారోహణమూలమున విముక్తి యలభ్యమనియుఁగూడఁ జెప్పియుంటివి."

"అట్లయిన నీకు ఱెక్కలువచ్చెనేని విముక్తి లభ్యమని నమ్మెదవా?" యని డోర్వాలుపలికెను.

ఆపై డోర్వాలుని మొగమువంక మిక్కిలి విస్మయముతోడను, నిరుత్సాహముతోడను జూచి తనలోఁదాను "అయ్యో! వీనికి దుఃఖభరమునను ముదుసలితనమునను మతిపోవుచున్నది!" యని హేమచంద్రుఁ డనుకొనెను.

అతని భావమును వెంటనేగ్రహించి "హేమచంద్రా! నాపలుకులను నీవు నమ్మకపోవచ్చును; కాని పాశ్చాత్యఖండమునందుఁ బ్రకృతిశాస్త్రమునకు శాఖగా నుండు నొకశాస్త్రసాహాయ్యమునఁ గొండొకయుదంతము కనిపెట్టఁబడియెను ఆయంత్రనిర్మాణమునుగూర్చికాని, దానియాకారమునుగూర్చికాని నీవేకాదు, నీహిందూదేశము సయితమిప్పటివఱకు నెఱుఁగదు. దానిపేరు విమానము"

గంధర్వాదులు విమానముపై గగనమున సంచరించుదురను పౌరాణికగాథను హేమచంద్రుఁడు తలఁచి కొంతవఱకు వానిమాటల విశ్వసించెను.

"ఇదిగో చూడుము. దానినిగూర్చి నీకు బోధజేసెదను." అని తనయంగీజేబునుండి కొన్నితూలికలనుదీసి "ఫ్రాన్సునుండి మొట్టమొదట నొకచర్మపేటికయందు నాచిత్రలేఖనమునకు వలయు పరికరములనుఁబెట్టి తీసికొనివచ్చితిని; కాని యాపేటిక పరికరములతోఁగూడ గిరిసింహుని సైనికులచేఁ దీసికొనఁబడియె. కాని యదృష్టవశమున నాయంగీజేబునందుఁ జాల పరికరములుండుటచే నవి వారికంటికిఁ గాన్పింపలేదు. ఇదిగో పాండుతూలిక—దీనితో నల్లవాఱియున్న యాగోడపై విమానమును లిఖించెదఁజూడుము" అనిచెప్పి యట్లు లిఖించుటకుఁ బ్రారంభించెను.

ఆవిమానలేఖనము పూర్తియైనపిమ్మట దాని వివిధాంగముల నిర్మాణమునుగూర్చి డోర్వాలు కొంతసే పుపన్యసించెను. ఇంకను మతి తప్పియే డోర్వాలిట్లుచేయుచున్నాఁడని హేమచంద్రుఁ డనుకొన్నెఁ.

కాని దానినైజమునుగూర్చియు—దాని పరిణామమునుగూర్చియు—దానినడపుటనుగూర్చియు—వాయువునకన్న దేలికగానుండునట్టి యావిరితోఁగాని లేక యట్టివేరు తేలికవాయువుతోఁగాని దాని పీతగోళమును బూరించుటనుగూర్చియు—దానియందుఁ గూర్చుండిన మనుజులెట్లు మేఘమండలములోనికిఁ బోవుదురో యావిషయమునుగూర్చియు—డోర్వాలు విశదీకరించుచుఁ గ్రమక్రమముగా బోధించునంతఁ దొలుదొల్త నొకస్వప్నమునుగాంచినట్లు, నందు మహాద్భుతవిషయములఁ జూచినట్లు—అవి యపారసంతోషమున మూలకారణము తుదకుఁ బరిణమించినట్లు హేమచంద్రుఁడు తలపోసెను. హేమచంద్రునికిపుడు పూర్తిగా డోర్వాలునందు విశ్వాసముకలిగెను; ఏమనిన వాఁడు పలికినదంతయుఁ బ్రత్యక్షముగాఁ బ్రదర్శింపఁబడియె, అవియన్నియు స్థిరాంశములగుటచే నసంభవములు. వెంటనే యుత్సాహోద్రేకమున డోర్వాలుని గాఁగిలించుకొని "ఆహా! నీవుమానవులకన్న నెక్కుడు ధీవిశాలివి—నీకన్న నేను బదివేలమడుంగులు హీనబుద్ధిని" అని పలికెను.

"ఓయీ! నీవు ప్యారిసునగరమున నున్నయెడల నిట్లు పలికియుండవు; ఏమనిన విమానములచ్చట దైనికదర్శకములు."

"ఆహా! ఇది మహాద్భుతము!" అని హేమచంద్రుఁడు తనభావమును వెలిబుచ్చెను; కాని యట్లుచెప్పెనోలేదో—ఆయనంతరక్షణమునందే హృదయమున నొకబండనువైచినట్లయ్యె—వానియుత్సాహము సమసిపోయెను—మోము వెలవెలబోయెను; తుదకు శిలావేదికపైఁ గూలఁబడి "అయ్యో! అదియంతయు నిరుపయోగము; ఏమనిన విమాననిర్మాణమునకు వలయు పరికరములలో నొక్కటియైనను లేదు" అని గొణఁగఁజొచ్చెను.

వానినిజూచి వానితో విసువుచెందినటుల "అట్లు సొక్కుంతుఁడైనవాని—క్షణక్షణమాతురతనొందువాని—తొందరనొందువాని—

నాకు సహాయకారిగానుండుట కెట్లొప్పుకొననగు" అని డోర్వాలు పలికెను.

వాని యప్రియమునకుఁ బాత్రుఁడనైతిఁగదాయని యెంచి వెంటనే "నన్ను క్షమింపుము. అజ్ఞానముచే నట్లుపలికితిని. నేను గలయందైనను గనివినియెఱుంగని మహాద్భుతముల నీవు చెప్పితివి. కాని యజ్ఞానుఁడనగుటచే వానిని గ్రహింపఁజాలకుంటిని. ఈనాయజ్ఞానమును క్షమింపుము. క్షమింపుము!" అని జాలిగొలుప హేమచంద్రుఁడు పలికెను.

వెంటనే శాంతచిత్తుఁడై "దురదృష్టుఁడా! నీయెడ నాకిసుమంతయేని గోపముకలుగలేదు. ముందుముం దాచరణలోఁ బెట్టఁబడఁబోవుచున్న నామహాసన్నాహమునకు నీవు తగిన ప్రోత్సాహకుఁడవుగాను—సహాయకారివిగాను—ఉండువుగాక" యని వానిని బ్రియముతోఁ గాఁగిలించుకొనెను.

హేమచంద్రునికిఁ గలిగిన సంతోష మింతింతనరాదు. 'మహాసన్నాహము' అనుపదము డోర్వాలుని నోటినుండి యూడిపడియెనో లేదో హేమచంద్రుని కవర్ణనీయమగుమోదము కలిగె; కాని దానినంతయు దాఁచి డోర్వాలునివలెనే శాంతస్వభావము నభ్యసించెను.

"మొట్టమొదట దీనిని జెరపివేయుట మంచిది; ఏమనిన నెట్టి యనుమానమునకైనను మనము చోటీయఁగూడదు." అని పలుకుచు 'చేరుమాలు' తో గోడపై లిఖింపఁబడిన విమానమును జెరిపివేసెను.

డోర్వాలు పరుండు శిలావేదికకును, హేమచంద్రుఁడు పరుండు శిలావేదికకును దాదాపు పదునైదుగజములదూరము కలదు. ఈశిలావేదికాద్వయమునకు నడుమ మిక్కిలి వెడల్పుగానున్న యొక శిలాస్తంభము కలదు. ఆస్తంభమే వారికి నడుమ తెరవలె నుండును. పగటిపూఁట హేమచంద్రుఁడు తన గడ్డిపఱుపును జుట్టియుంచును; అట్లుకాక డో

ర్వాలుని గడ్డిపఱుపు సర్వకాలములయందును వాని శిలావేదికపైఁ బఱువఁబడియుండు. ఇపుడాపరాసువృద్ధుఁడు హేమచంద్రుఁడు వెంటరాఁ దన శిలావేదికను డాసెను. అట్లు డాసి దానిపైఁ బఱువఁబడియున్న గడ్డిపఱుపును జుట్టి ప్రక్కనున్న మూలలోఁ బెట్టెను. అంత శిలావేదికయంతయును గాన్పించెను. దానిపొడ వాఱడుగులు—వెడల్పు రెండడుగులు—ఎత్తు రెండున్నఱయడుగులు—ఆశిలావేదికయంతయు నొక్కటేఱాయియైనట్లుండెఁ; గాని యుపరిభాగము మూడుపలకఱాళ్ళచేఁ గూర్పఁబడియుండెను.

అపుడు డోర్వాలిట్లు పలికెను. "ఇపుడిఁక మిత్రమా! విముక్తికొఱకు నేను జేయుచున్న ప్రయత్నరహస్యమును నీకుఁ జెప్పెదను. ఈ వేదికాంతర్భాగము ఖనితమై యున్నది. దాని ఖనికుఁడను నేనే. ఒకశవము పట్టఁజాలునంత భాగము ఖనితమగువఱకును నేను బ్రతిదినమును నిశీసమయమున మూఁడునాలుగు గంటలకాలము లేచి పనిజేసితిని. చెక్కఁబడిన యాఱాతిముక్కలను రాత్రివేళలనే మిద్దెమీఁదకుఁబోయి యచటనుండి వానిని దూరదూరముగా నష్టదిక్కులయందును వెదజల్లితిని. ఆమూఁడుపలకఱాళ్ళ నెత్తుము. వానికడుగున సాధనముకలదు."

"ధనమా!" యని హేమచంద్రుఁడు నెక్కి నెక్కి వక్కాణించెను.

"ఔను, ధనమే! కాని వెండిబంగారములు కావు—అవి నాకింకను జేకూరలేదు—ఐన నాకాలము సమీపముననే యున్నదని తోఁచెడిని." అని పలుకుచు నొకపలకఱాతిని దనకరముతో నెత్తెను. దాని యడుగున నేమికలదో వెంటనే హేమచంద్రుఁడు చూచెను; కాని తన సంవేగభావములను వెనుకటివలెనే యుచ్చరింపక వెనుకకు రెండడుగులువైచి నిలువఁబడియెను.

"ఒకనాఁడు మనమిరువురమును మిద్దెపైనుండఁగా నొకపెద్ద జెండా పోయెనని నీతోఁ జెప్పితినిగదా!"

"ఔను"

"ఆజెండా యిదిగో!" అని మూల నొకచోఁ జక్కగా ముడువఁబడియున్న జెండాను హేమచంద్రునకుఁ జూపించెను.

"జెండాను దొంగిలించుట మిక్కిలి సాహసకృత్యమని నీవెంచవగుఁగాని యపాయమేమియును గలుగలేదు. ఆజెండా నప్పుడే విమానరూపమునకు మార్చితిని. నాజీర్ణవస్త్రములను గుట్టుకొనవలయునని కారాగృహాధికారినుండి పెక్కులు సూదులును దారమును బుచ్చుకొంటిని. వానితో దీనిని విమానరూపముగాఁ గుట్టితిని. కాని దానిలోనికి వాయువు చొఱకుండున ట్లేరీతిని జేసితివని నీవడుగవచ్చును. చెప్పెదను వినుము. నాయొద్ద గొన్ని చిత్రకారపరికరములు దాఁపఁబడియుండెనని యిదివఱకే నీకుఁ జెప్పియుంటినిగదా. వానియందు 'ఇండియా రబ్బరు' ముక్క లనేకములు కలవు. అవిసెనూనియం దిండియారబ్బరు కరఁగును. అట్లు కరఁగినదానిని బ్రాందితో మిశ్రముఁ జేసినయెడల దానిసహజపరిమాణముకన్న నెన్నియో మడుంగులుబ్బును. దానిని గరగించుటకుఁ గావలసిన యవిసెనూనెయు మనదీపములకుఁ బ్రతిదినము నీయఁబడుచున్నది. దానిని పొంగునట్లు చేయుటకు వలయుబ్రాంది కూడ మనకీయఁబడుచున్నదిగదా! అట్లుచేయఁబడిన రబ్బరును విమానముపైఁ బూయుటచే నది వాయురోధమేకాక యుదకరోధముఁగూడనయ్యె." అని పలికినపిదప రెండవపలకఱాతిని బైకిఁదీసి "ఇవిగో విమానమున మనము కూర్చుండుతొట్టికిఁ గావలసిన సర్వపరికరములును. తొట్టిరూపు వచ్చునట్లు చేయుటకీపరికరముల నన్నిటి ననుసంధించినఁ జాలును. ఇది తొట్టెయడుగువైపు—ఇవి ప్రక్కలు. వీనినన్నింటిని గట్టిగానుండునట్లు బంధించుటకు మిద్దెపైనున్న జండా త్రాఁడు సుపయోగింపవలె

ను" అనుచుఁ దొట్టియొక్క వివిధాంగములను వేరువేరుగాఁ దీసి హేమచంద్రునికిఁ జూపించుచు "శీతకాలమునఁ జలిమంట వేసికొనుటకు మనకుఁ గట్టెలీయఁబడును. వానిలో నాకుఁ బనికివచ్చువానిని దీసి వానితో నొకగంప నల్లితిని. ఆయల్లిక యడ్డదిడ్డముగా నున్నను గట్టిగ మాత్ర ముండును. మనము విమానము నుపయోగించుకాలము వచ్చునప్పటికి సర్వమును సిద్ధముగా నుండు"నని చెప్పెను.

"ఆకాలమెప్పుడు వచ్చును?" అని హేమచంద్రుఁ డెంతటిసంభ్రమముతోఁ బ్రశ్నించెనో మాచదువరులే యూహింపనగు.

"ఈదీర్ఘరాత్రులుకల చలికాలములో నేరాత్రి మిక్కిలి కాఱుచీఁకట్లతోనుండునో—ఎయ్యది మిక్కిలి దీర్ఘముగానుండునో—ఆరాత్రియే మన విమానయానమునకుఁ దగిన సమయము. ఇపుడు మనము చలికాలమునకు తొందరతో నెదురుచూచుచుండవలయు. అది యట్లుంచి విమానమునుగూర్చి యింకను గొన్నివిషయములఁ జెప్పవలయు నాలకింపుము. మిద్దెపైనున్న జెండాత్రాడు మనకనేకవిధముల నుపయోగించును. ఆత్రాడులోఁ గొంతభాగమును దొట్టి గట్టిగానుండునట్లు కట్టుట కుపయోగించి మిగిలిన యధికభాగమును వేరువేరువిధముల కుపయోగింపవలెను. విమాన మటునిటు నూగకుండునటు దానికోణమునకుఁ గ్రిందుగా నొకత్రాడునువిడిచి యాత్రాడుచివరన నొక పెద్దబండను గట్టవలయు. మిగిలిన త్రాడును రెండుగా విభజించి విమానమునకు మీదుగా దానిచుట్టును మేఖలలవలె బంధించి వానికొనలను మనము కూరుచుండు తొట్టికిరుగెలంకులను గట్టవలయు. మన చిఱిచాపలును, గడ్డిపఱుపులును ముక్కలుముక్కలుగాఁ గోయఁబడి తొట్టియందుఁ బెట్టఁబడుటచేతను, త్రాఁడులనడుమఁ బెట్టఁబడుటచేతను విమానపుఁ దులాగౌరవాగౌరవములను జక్కఁబఱచి సామరస్యము నొనర్చును.

"ఆహా! ఇది యంతయు నత్యద్భుతము!" అని హేమచంద్రుఁడు పలికెను. భేతాళుఁడెదుట వామనుఁడెట్లుండునో బుద్ధిసూక్ష్మతయందు డోర్వాలుని యెదుట తానట్లుండెనని హేమచంద్రుఁడు గ్రహించెను.

పిమ్మట డోర్వాలిట్లు వచించెను. "ఇఁక విమానమును బూరించుట యెట్లని నీవు ప్రశ్నింతువు? ఎట్లనఁగా వినుము" అని మూడవ పలకటాతిని బైకిఁదీసి "ఇదిగో యీ 'పీపా'ను జూడుము. నేనీచెఱసాలకుఁ గ్రొత్తగా వచ్చినపుడు కూరుచుండుటకై నాకిది యీయఁబడెను; కాని ప్రస్తుతకార్యమునకు దీనిని సంగ్రహింపవలసి వచ్చినతోడనే చలిమంటకుఁ బుల్లలుచాలమి దీనిని దగులఁబెట్టితినని యబద్ధము చెప్పితిని. అప్పటినుండియు నిదియీస్థలముననేయుండియున్నది. ఈకారాగృహమునకు వచ్చినదాది నాకీదినమువఱకు నీయఁబడిన బ్రాందియు మొన్నమొన్నటినుండి నీవు తీసికొని నాకిచ్చుచున్న బ్రాందియును ఈ 'పీపా'లోఁ గూడఁబెట్టఁబడియున్నది. మన విమానయానమున కనువగునాఁడీ బ్రాందినంతయు నిప్పుతోఁగాచి దానియావిరిని విమానములోనికిఁ బట్టవలెను. ఈబ్రాందినుండి విమానములోనికిఁ బట్టఁబడు నావిరి వాయువుకన్న మిక్కిలి తేలికగానుండుటఁజేసి విమానము మేఘమండలములోనికెగురును."

అట్లుచెప్పి యామూడుపలకటాళ్ళ నెప్పటితావులలోనుంచి వానిపై నెప్పటియట్లు గడ్డిపఱుపునుబఱచి హేమచంద్రునితో "నిట్లు రమ్ము మిద్దెమీఁది కేగి నిర్మలవాయువును బీల్చుదము; ఏమనిన నీదినమున కీరహస్యములు చెప్పఁబడినవి. ఇదివఱకుఁ జెప్పఁబడిన విషయములేకాక వానినిమించిన యద్భుతములు నీకింకను జెప్పఁబడును." అని చెప్పి హేమచంద్రునీ మిద్దెపైకిఁ దీసికొనిపోయెను.

ఆమిద్దెపై వారిరువురును గొంతకాలము హాయి చెందిరి. ఇవుడు హేమచంద్రుఁడును, డోర్వ్యాలును గాఢస్నేహ లతాబంధితులై యుండిరి. ఇంచుకంతయైనను దాఁపక తనరహస్యప్రయత్నము నంతయును హేమచంద్రునికిఁ జెప్పెను; తన్నుఁగూడ వాని విమానములో నెక్కించుకొని తీసికొనిపోవును. కావున దనభావి జీవితమునకు డోర్వ్యాలాధారభూతుఁడని యెంచి వానియెడ హేమచంద్రుఁడు మిక్కిలి మిత్రభావముతో సంచరించుచుండెను. తనకన్న వాఁ డన్నివిషయములను వేయుమడుంగు లధికుండని గ్రహించెను. కావున సురనందన పురోభాగమునన్న మహాగుహాలోని యజగరమునుజంపి యాభూలోక స్వర్గములోనికిఁ బోవుటకుఁ దనకు డోర్వ్యాలు మిక్కిలి సహాయకారిగా నుండు నని వితర్కించి వాని కారహస్యమును దెలియఁజెప్పుటకుఁ దన పెదవులను హేమచంద్రుఁడు విప్పుచుండఁగా "హేమచంద్రా! ఇంకను గొన్ని మహాద్భుత విషయములను—గొన్నిరహస్యములను—నీకుఁ జెప్పెదనని యంటిని గదా. ఆరహస్యములను జెప్పెద వినుము—వానిని—" అని డోర్వ్యాలు పలుకఁ బోవు చుండగా వాని కడ్డము వచ్చి "మిత్రమా! నే నొక పరమరహస్యమును నీకుఁ జెప్పట కెంచుచుంటిని." అని హేమచంద్రుఁడనెను.

"అది యెట్టిది?" అని డోర్వ్యాలు ప్రశ్నించెను.

"నాయజమానుఁడగు రవీంద్రుఁడు మరణించిన పిదప వానిచే లిఖింపఁబడిన పత్రములు కొన్నింటిని నేను జూచుట సంభవించెను. ఆపత్రములలో నొకదానియం దీకైలాస పర్వతములలోఁ గొన్ని మహోన్నత పంక్తులచే గాఢాలింగితమయిన యొక యుపత్యకము కలదనియు—ఆయుపత్యకమున నసంఖ్యాకములగు దివ్యరత్నములు కలవనియు—అది భూలోక స్వర్గమువలె నెల్లప్పుడును మనోహర పరిమళములను వెదజల్లు వివిధ కుసుమములతోడ—అధిక మాధురీ మహిమచే

విలసిల్లి నిత్యమును బండియుండు వివిధ ఫలవృక్షములతోడను—విరాజిల్లుచుండు ననియు—

"ఓహో! సురనందనమా! ఔను—సురనందనమనునది సృష్టియందు నిజముగానున్నది! సంశయమేమియును లేదు! ఇంతకుమునుపే నేను ధనవంతుఁడ నగు కాలము సమీపముననే యుండవచ్చునని చెప్పఁగా వినియుంటివిగదా. ఎట్లు ధనవంతుఁడ నగుదునో యిఁక గ్రహించుకొనుము!"

"ఔను నీవు చెప్పినవిషయము నాస్మృతికి వచ్చినది. కాని యీమూలమునఁగాక మరేమూలముననో ధనార్జనము చేయుదువని నేననుకొంటిని."

"అట్లుకాదు. నాప్రకృతి శాస్త్ర విజ్ఞానము ధనానుకూలమున కుపకరింపదు; కాని యావిజ్ఞానముచేత—అనగా మనవిమాన సాహాయ్యమున—ఆ సురనందనము మీఁదుగా నెగురుచు దాని మధ్య ప్రదేశముననే దిగవచ్చును."

"ఔ నౌను నిజమే—అట్లయిన మన మాతమఃపూరితమైన దీర్ఘ కుహరాపాయములకుఁ బొల్పడు నవసరము లేకుండును."

"ఓహో! అట్లైన నీవు నాకన్న నదృష్ట వంతుఁడవేనా! ఆసురనందన స్థానమును గనుఁగొనియుంటివా?" అని యాశ్చర్యముతో డోర్వ్యాలు పలికెను.

"ఔను. దానిస్థానమును నేను బూర్తిగా నెఱుఁగుదును. దాని ద్వారమువంటి ప్రదేశమునకు నిజముగా నేను బోయి యుంటిని. ఆప్రదేశము నధిగమించినఁజాలు సురనందనములోనికిఁ బ్రవేశింపనగు; కాని యచట నొక మహాసర్పము కావలివానివలె వేచియుండును—దానిని జూచి మహాభయ విస్మయములతో నేను బరువెత్తి—"

“ సప్రాణుఁడవై యెట్లు పరువెత్తఁజాలితివి ?”

“ ఆప్రశ్నమునకు దైవమే ప్రత్యుత్తర మీయవలయు. నాపాదము దానిచుట్లను స్పృశించెను—అట్లయ్యు నది కదులలేదు.”

“ అగమ్యగోచరమగు నామహాపర్వతరంగమున సురనందన స్థానమెచ్చట నుండునో తిన్నగా మరల గుర్తింపఁగలవా?”

“ ఆఁ—తప్పక గుర్తింపఁ గలుగుదును. అగమ్యము నత్యున్నతమును నగు నొక మహాపర్వత వలయముచే నది కౌఁగిలింపఁబడి నట్లున్నది. ఆపర్వతవలయములోఁ దక్కఁగల పర్వతముల కన్నిటికన్న మిక్కిలి యెత్తగుశిఖర మొక్కటి కలదు. ఆశిఖర శిరోభాగము రెండుగా విభజితమైనట్లున్నది. ఇదియే గుఱుతు.”

“ సరే! బాగుగనే యున్నది. ఆగుఱుతుచేత మనము సురనందనాంతర్భాగమునకు మేఘమండలమునుండి దిగవచ్చును; అట్లంతర్భాగముననే దిగుటఁ జేసి మన కాగుహాకష్టములు—అది నిజమైనను గాకపోయినను—ఎదురుపడవు. ఆవిషయముల నట్లుంచి నేను జెప్పఁబూనుకొన్న రహస్యమును వినుము. కాని యీరహస్యమును నాకన్న నీవే బాగుగా నెఱుంగుదువు.

“ ఓహో! అట్లైన నదియును సురనందనముఁగూర్చి యేనా?’

“ అగును. ఆరహస్యము నాకెట్లు తెలిసెనో చెప్పెదవినుము. నాచుట్టమొకఁడు తన మరణశయ్యపై నున్నపుడు—వాని వారసుఁడనగు నాకుఁ దనధనవిషయమునుగూర్చి చెప్పి రెండవ విషయమును వచించుచుండగాఁ బ్రాణముల విడిచెనని చెప్పియుంటినిగదా. ఆ రెండవ విషయమే సురనందనవిషయము. ఆరహస్యము తనకుఁ బరమస్నేహితుఁడైన యొకనిచేఁ జెప్పఁబడియె. దానిని నాకుఁ జెప్పి—కాని పూర్తిగాఁ జెప్పలేదు. సురనందనము కైలాసపర్వత పంక్తులలో నున్నదనియు, దానియం దనంతములగు రత్నాదికములు కలవనియు నెల్లయపుడు

బరిమళించుచు నెల్లయపుడును బూచు కుసుమనికుంజములు కలవనియు—అచట నెల్లయపుడును సమశీతోష్ణము నైసర్గికస్థితియం దుండునని యుఁజెప్పి కైలాసపర్వతములలో దానిసరియైన స్థాన మెచ్చటనున్నదో యాస్థానమును జేరుటెట్లో మొదలగు విషయములఁగూర్చి నాకుఁ జెప్పఁబోవుటకు మొదలిడినంత ప్రాణములను విడిచెను. అట్లు దానిసరియైన స్థాన మీపర్వతపంక్తులలో నెచ్చటనున్నదో నాకుఁ దెలియకపోయినను నెట్లయినఁ గనుఁగొనఁగలనని యీపర్వతములకు నా దేశమునుండి వచ్చితిని గాని నేనెట్లు పట్టుబడి చెఱసాలఁ బెట్టఁబడితినో నీకుఁ దెల్లమే కదా!”

ఇచట డోర్వాలుని ప్రసంగము ముగిసెను. వెంటనే యాప్రసంగసూత్రమునందుకొని హేమచంద్రుఁడు తానెట్లు సురనందన స్థానమును గుర్తింపఁగలిగెనో డోర్వాలునికిఁ జెప్పెను. కాని మోహానుని గూర్చి కాని కమలాక్లోడిస్సాలను గూర్చి కాని వాఁడొక్కమాటనైన నాడలేదు. సురనందన స్థానమును దనంతట దానే నిస్సహాయుఁడుగానే కనుగొనెనని హేమచంద్రుఁడు చెప్పెను.

నాఁటినుండి వారిరువురు నత్యంత మైత్రితోఁ బ్రవర్తింపఁజొచ్చిరి.

ఘూర్జర తార.

ముప్పదియాఱవ ప్రకరణము.

శీతకాలము సమీపించెను. దానికి మనకారాగృహవాసు లిరువురును హృదయపూర్వకస్వాగతము నిచ్చిరి. క్రమముగా విమాననిర్మాణమునకువలయుసర్వపరికరములనువారిరువురుసమకూర్పఁజొచ్చిరి.

శీతగోళములోని కావిరిని బూరించునపు డది యెగరకుండునట్లు వారు కొన్నిప్రయత్నములఁ జేయఁదొడఁగిరి. వారిగదియం దొకమూలను మెట్లకుఁబ్రక్కగా నొకపొడవైన యినుపకమ్మికలదు. ఆకమ్మి మెట్లమీదుగా నెక్కునపుడును దిగునపుడు నవలంబనమునకై యుపయోగింపఁబడుచుండెను. దానియొద్దకుఁ గారాగృహాధికారు లెప్పుడునురారు. కావున దానినూడదీసి నిశీసమయముల నెఱ్ఱని నిప్పులయందుఁగాల్చి, పొడవైన నాల్గుముక్కలుగా విఱుఁగఁగొట్టిరి. ఆముక్కలలో నొకదానిని గ్రిందుగను, ఒకదానిని మీఁదుగను, ఒకదానిని వానికడ్డముగను మఱియొకదానిని నిలువుగను, దూర్చుటచేత నదియొకవిధమగు తొట్టివలెనుండెను. దీనిని నిర్మించుటకుఁ బదిరాత్రులకాలము వారిచే నుపయోగింపఁబడెను. ఇఁక నీయినుపతొట్టిని విమానమునకుఁ గట్టుటకు వలయుత్రాఁడులు కావలయు. దానికై వారిగడ్డిపఱుపులు సాయమొనర్చెను ఆగడ్డిపఱుపులు గట్టిగానుండి విడివడకుండునట్లు గట్టిత్రాఁడులచే బిగింపఁబడియుండెను. ఆత్రాళ్ళ నూడబెఱికి యీయినుపతొట్టని వారు కూర్చుండుటకై యల్లఁబడిన గంపకుఁ గట్టిరి. ఇఁకనీగంపను (తొట్టిని) శీతగోళమున కధోభాగమున వ్రేలాడఁగట్టవలయు.

ఇంతలో శీతకాలము బహు శీతసమన్వితమై దీర్ఘరాత్రులచే నొప్పుచుండెను. ప్రతిరాత్రియందును డోర్వాలు మిద్దెమీఁదకునేగి ప్రయాణమున కనుకూలమగునేమోయని పరీక్షించుచుండి యొక్కనాఁడు హేమచంద్రునితో “రేపురాత్రి మనప్రయాణమునకు మిక్కిలి యనుకూలముగానున్నది. కావున మనము సంసిద్ధులమై యుండవలయు” నని పలికెను.

హేమచంద్రునియానంద మింతింతని చెప్పరాదు.

ఆమఱునాఁడు కడచెను. రాత్రిప్రవేశించెను. ప్రతిదినమును భోజ్యములను బట్టుకొనివచ్చువాఁడు వానిపనిని బూర్తిసలుపుకొని పోయెను.

ఇపుడు రాత్రిపదిగంటలయ్యె. డోర్వాలు మిద్దెపైకేగి రెండు నిమిషములలోఁ దిరిగి హేమచంద్రునియొద్దకువచ్చి ప్రయాణమునకు సర్వము ననుకూలముగానున్నదని మిక్కిలి సంతోషముతోఁ జెప్పెను.

ఆరాత్రి మహాంధసముతోఁ దులదూగుచుండెను; మిక్కిలి నల్లనివైన కాదంబినీ నికరములు గగనరంగమునకు యవనికలుగానుండెను; ఒక్కనక్షత్రమైనను గాన్పించుటలేదు. ఒక్కక్షణమాత్రకాలము హేమచంద్రుఁడు భీతావహచిత్తుఁడయ్యెను. ఆతమఃపటలములోనుండి పొడిచికొనిపోయి నల్లని మేఘమండలములోఁ బక్షివలె నెగురుటను గూర్చి తలపోసినపుడు హేమచంద్రుని హృదయము సాధ్వసఘూర్ణితమయ్యెను. కాని యనంతరక్షణమునందే సురనందనము వాని హృదయదృష్టి కెదుటఁ బ్రతిష్ఠితమయ్యె. వెంటనే దానియందుఁ గమ్మనిసౌరభముల వెదఁజల్లుచు నిండారియున్న పుష్పములును—మిక్కిలి రుచ్యములుగానుండిన ఫలములతోవంగియున్న వృక్షకోటులును—మెల్లని నడకతోఁ బ్రాకుచున్న సెలయేఱులును—పల్లవములను మెక్కుచు వృషాగ్రములపైఁ గూరుచుండి సంసారతాపత్రయవిదూరములై హాయిగా

గనము చేయుచున్న పక్షిబృందములును—నూఱుగురు సార్వభౌముల కిరీటాలంకారములకునైన సరిపోయి గుట్టలుగుట్టలుగాఁ బడియున్న రత్నములును హేమచంద్రుని స్మృతికివచ్చెను. వెంటనే వాఁడు మరల ప్రోత్సాహియయ్యెను.

హేమచంద్రుఁడును డోర్వాలును దమ పనికిఁ బూనుకొనిరి. ఇనుపతొట్టెను పీతగోళమును గంపను మిద్దైపైకి హేమచంద్రుఁడు తీసికొనిపోయెను. అచట చీఁకటిగా నుండుటచే వారికృత్యముల నెవ్వరును జూడఁజాలరు. జెండాత్రాఁడును డోర్వాలూడబెఱికి దానిపొడవును దన మూరతోఁ గొలిచెను. అదియును వీలయినట్లే యుండెను. వెంటనే దానిని సగముగా మడిచి యామడిచినచోటను దీపమునఁ గాల్చెను. కావున నది రెండుగా విభజింపఁబడియెను. ఆత్రాళ్ళ చిగురులను విమానాగ్రమునఁ బట్టుతోఁ జేయఁబడిన యుంగరములనుండి దూర్చి వానిని వారు కూర్చుండు తొట్టెకుఁ గట్టిరి. అట్లు చేయుటవలన విమానమటు నిటు నూగకుండును. ఇఁకఁ దాము కూరుచుండుతొట్టిని విమానమునకు వ్రేలాడగట్టఁ దొడఁగిరి. గడ్డిపఱుపులనుండి త్రాళ్ళను బెఱికి గట్టిగాఁజేసి యాతొట్టిని విమానమునకుఁ గట్టిరి. ఇఁక నినుపతొట్టిని త్రాళ్ళతో నింపి దానిని దాముకూరుచుండు తొట్టికిఁ గ్రిందుగాఁ గట్టవలయును. వెంటనే వెనుకటి మూఁడుపలకత్రాళ్ళను హేమచంద్రుఁడు మిద్దెమీఁదికి మోసికొనివచ్చి వాని నినుపతొట్టెయందుంచెను. పిదప మిగిలిన పఱుపుత్రాళ్ళతో దానిని దాముకూర్చుండుతొట్టెనుండి క్రిందికి వ్రేలాడగట్టిరి.

ఇపుడు రాత్రి రెండుగంటలైనది. విమానములోని కిఁక నావిరిని బూరించుటతక్క తక్కఁగల కృత్యములన్నియుఁ బూర్తిసలుపఁబడెను. పిమ్మట వారిరువురును దక్కటిపనికిఁ దొఱకొనిరి. పూరణవిధాన మాచరణలో నున్నపుడు విమాన మెగరకుండునట్లు దాని యధోభాగమును మిగిలిన జెండాత్రాళ్ళతో మిద్దెమెట్లలో నడుగుమెట్ల

యొద్దనున్న పెద్దయినుపసీలకుఁ గట్టిరి. ఇఁక బూరణమునకుఁ గడంగిరి. మద్య ద్రవముతో నున్న పీపాను హేమచంద్రుఁడు గదినుండి మోసికొని వచ్చి మిద్దెమెట్లపై నుంచెను. ఆపీపాకుఁ బెద్దరంధ్రమొనర్చి యొక చిఱిచాపను గొట్టముగా నుండునట్లుచుట్టి దాని నారంధ్రమునుండి గోళముఖములోనికిఁ జొన్పెను. పిమ్మట నాపీపాకుఁ గ్రిందుగా హేమచంద్రుఁడు కట్టెలనమర్చి మంటఁ బెట్టెను. దానిక్రిందుభాగ మినుముతోఁ గప్పఁబడియుండుటచే దాని కెట్టిభంగమును గలుగదు. మంట మెట్లలో వెలుఁగుచుండుటఁ జేసి మిద్దైపైకి గాన్పింపదు. కావున దుర్గరక్షకుల కెట్టియనుమానమున కైనను జోటుదొరకదు. మంట మండిన వెంటనే పీపానుండి గొట్టమువలె నమర్పఁబడియున్న చిఱిచాపనుండి విమానములోని కావిరి పోవఁదొడఁగెను. క్రమక్రమముగా విమానముబ్బఁజొచ్చెను. ఒక యఱగంటలో విమానము పూర్తిగా విజృంభించి నిలువఁబడి మేఘమండలములోని కెగురుటకు మిక్కిలి యాతురతతో నున్నట్లు గాలిలో నటు నిటు నూగుచుఁ దటతట గొట్టుకొనసాగెను.

వెంటనే డోర్వాలు “హేమచంద్రా! సర్వమును సిద్ధమైయున్నది. రమ్ము తొట్టిలోని కెక్కుము. మనజుని సూక్ష్మబుద్ధిచేఁ జేయఁగలుగుసర్వమును జేయఁబడినది. ఇఁక దేవునిపై మనభారమును వైవవలయును. కాని భయమును రవ్వంతయైన నొందకుము. ఏమనినఁ దమకుఁదాము సహాయ మొనర్చుకొనువారికి దైవమే సహాయ మొనర్చును.” అని చెప్పుచుఁ దాను దొట్టెలోని కెక్కెను. వెంటనే హేమచంద్రుఁడు నెక్కెను. ఎక్కినతోడనే వానిని డోర్వాలు కౌఁగిలించుకొని “హేమచంద్రా! చచ్చిన నిరువురము జావవలయును—బ్రదికిన నిరువురము బ్రదుకవలయు” నని చెప్పెను. హేమచంద్రుఁ డధికానందమున నోలలాడెను.

కూరుచుండి త్రాటను గట్టిగాఁ బట్టికొమ్మని హేమచంద్రునికిఁ జెప్పి మెట్లకును విమానమునకుఁ గట్టఁబడిన త్రాడును గోసెను.

వెంటనే విమాన మొక్క విదలింపుతోఁ బైకి నెగసెను. ఇరువది గజము లెగసెనో లేదో రాళ్ళతోనుండిన యినుపత్రాటి త్రాళ్ళను డోర్వాలు కోసివేసెను. వెంటనే యాత్రిమును రాళ్ళును దుర్గస్థిత గృహోపరిభాగములపైఁ బడి మహాశబ్దముల నొనర్చెను—విమాన మధిక వేగముతో గాఢతమఃపటలమునుండి పొడిచికొని పోవుచు మేఘమండలమును సమీపింపఁ దొడఁగెను.

ఘూర్జర తార.

ముప్పదియేడవ ప్రకరణము.

మిక్కిలి యెత్తునుండి సంభవించిన శిలాపతనముచేతఁ గలిగిన మహాశబ్దమునకు దుర్గరక్షకులందఱును దమతమ నిద్రలనుండి మేలుకొలుపఁబడిరి. వెంటనే దానికిఁ గారణమును దెలిసికొనుటకై దుర్గరక్షకులు ప్రతిచోటును వెదకఁజొచ్చిరి; కాని యేగోడయును బడియుండలేదు. పిమ్మట కారాగృహములోనికిఁ జొచ్చిరి; కాని—అదిగో! అందు డోర్వాలును హేమచంద్రుఁడును లేరు—తప్పించుకొని పోయిరి! డోర్వాలు పరుండు శిలావేదిక ఖనితమై యుండెను—పలకరాళ్లు కాన్పించుట లేదు—గడ్డిపఱుపులు చెల్లాచెదరుగాఁ గోయఁబడి యుండెను—మెట్లపై గట్టియలబూడిదకలదు—దానిపై 'బీపా' కలదు—మిద్దెపై నుండవలసిన జెండాత్రాఁడు కాన్పించుటలేదు—మెట్లప్రక్క నుండవలసిన యినుపకమ్మి యదృశ్యమయ్యెను—ఎట్లో డోర్వాలును, హేమచంద్రుఁడును దప్పించుకొనిపోయిరి! జెండాత్రాడు కాన్పింపక పోవుటఁ జేసి వారు దాని మూలముగాఁ గ్రిందునకు దిగి తప్పించుకొనిపోయిరని దుర్గరక్షకులు వెంటనే గ్రహించి వారిలోఁ బదుగు రాయుధముల ధరించి దుర్గపరిసరప్రాంతముల వెదకుటకుఁ బోయిరి.

కాని వారి యన్వేషణము నిష్ఫలమగుచు వెనుకకు వచ్చిరి. దుర్గమంతయును నిరుత్సాహముతో నుండెను. చెఱసాలలో నుండువారు తప్పించుకొని పారిపోయిరి. వారిని దుర్గరక్షకులు పట్టుకొనలేకపోయిరి—వారిజాడయైనను గాన్పింపదయ్యె—నిజముగా దుర్గరక్షకులకుఁ జెడ్డపేర్మ

వచ్చును. కావున దుర్గాధికారి పదునైదుగురు సైనికులకై దాఱునెలలవఱకు సరిపోవు సామగ్రినిచ్చి వారిని బర్వతాంతరములకుం బోయి నెలలకైననుసరే, సంవత్సరములకైననుసరే వెదకి పారిపోయినవారిని బట్టికొనిరమ్మని యాజ్ఞయిచ్చి పంపెను.

వారును దత్తర్థమై బయల్వెడలిరి; కాని తమకూర్ధ్వభాగముననే పవనసముద్రమునందు నడచుచున్న విమాననౌకయందు డోర్వాలు హేమచంద్రులుండిరని యాసైనికులేమియు నెఱుంగరుకదా! వారెక్కిన విమానమిపుడు మేఘసముదాయములనుండి పోవుచుండెను. గాలి తూర్పునుండి వీచుచుండుటచేత విమానము దక్షిణదిశకుం బోవుచుండెను. వాయుతరంగముల కది యటునిటు నూఁగఁజొచ్చెను. వైమానికులచుట్టును గాఢతిమసము నిండియుండెను. ఆకసమంతయును సాంద్రమేఘయవనికచే ముసుఁగువడియుండె. ఎచ్చటను జుక్క కాన్పించుటలేదు. మిక్కుటముగా నున్న చలిచే వైమానికుల దేహము కరడు గట్టినట్లయ్యెను.

దానియందు డోర్వాలు మిక్కిలి శాంతిపరుఁడై యుండెను. తనవిజ్ఞానశక్తికిఁ దానే లోలోన నక్కజము నొందఁదొడఁగెను. కాని వాని భావమెంతమాత్రమును ముఖప్రదర్శితము కాలేదు. వాని ముఖలక్షణముల నెట్టిమార్పును జూడఁజాలము. వానిసంతోషమునకు మేరలేకుండి యుండవచ్చును; కాని దానినెల్లఁ బైకి పొంగకుండునట్లు చేసెను. ఇఁక హేమచంద్రుఁడో తనసహజ చిత్తభ్రమలతో నల్లకల్లోలము నొందుచుండెను; విమానమూఁగినపుడెల్ల వానిహృదయమూఁగఁజొచ్చెను. అది వంగినపుడెల్ల వాని యుత్సాహము కుంగఁజొచ్చెను.

ఇంతలో తూర్పు తెలతెలవారుచుండెను.

“హేమచంద్రా! సూర్యోదయ మాసన్నమగుచున్నది.” అని డోర్వాలు హేమచంద్రునికిం జెప్పెను. తూర్పుననుండిన మేఘములకుం

జాటుగాఁ గించిదరుణ వర్ణమైన తేజస్సు చూపట్టెను. దానికిం జీఁకటిదారినిచ్చుచుండెను. క్రమక్రమముగా భానూదయమయ్యె. అపుడు వైమానికులు తమకధోభాగముననున్న రంగమును దిలకించిరి. మహోన్నతములగు కైలాసపర్వతములన్నియు వారికి గుట్టలవలెఁ దోఁచె. దానినుండి నీరపూరితములై పారుచున్న నదులును, నదములును వెండితీవలవలెఁ గాన్పించెను. సరస్సులలోని యుదకము పాదరసమువలె మిలమిలలాడుచుండుట వారికిం జూపట్టెను. అపుడు “హేమచంద్రా! సూర్యోదయమయ్యెఁ గాన నిఁక నీవు సురనందనస్థానమును గుర్తెఱుఁగుము” అని డోర్వాలు పలికెను.

“అట్లే గుర్తెఱుఁగుదును.”

“దానిని మనము కడచియుండము గాలియుత్తరమునుండి వీచుచున్నది; కావున నాలెక్కప్రకారము మనము సురనందనమును గడచియుండము. విమానమునకు శక్తి తగ్గుచున్నది—మన మొక్కొక మెట్టే క్రిందునకు దిగుచున్నాము—” అని డోర్వాలు పలుకుచుండఁగా “అదిగో మహోన్నతశిఖరము! అదిగో సురనందనప్రాంతము!” అని హేమచంద్రుఁ డాదెసకుఁ దనవ్రేలు సూపుచు నఱచెను.

ఒక్క నిమేషకాల మాదెసను డోర్వాలు చూచి “మిత్రమా! ఆశిఖరమును నేను జూచితిని! కాని మనముండిన యిచ్చోటనుండి శిఖరమునకున్న దూరమును విమానయానపు మానమును సరిపోల్చి లెక్క వేసినయెడల మనముకోరినట్టు లానందనాంతర్భాగమునఁగాక దానిప్రాకారపర్వతమునకీవల దిగుట సంభవించునని గ్రహించితిని.”

“అట్లయిన మనకాఁగుహాలోనుండి పోవుట తప్పదా?”

“తప్పదు.”

ఇపుడు భూమికిం బైన నొక్క యఱమైలులో విమానముండెను. అదృష్టవశమున వారికిం గ్రిందుగా నగాధముకాని, కొండవాగుకాని ఘ

రెట్టివికాని లేవు. విమానమిపుడు భూమినుండి రెండడుగుల యెత్తులో నుండెను. వెంటనే యది భూమిపైఁ గొట్టుకొనకమునుపే దానినుండి భూమిమీఁదికి డోర్వాలు హేమచంద్రులు దుమికిరి. అనంతరక్షణముననే యావిమానమును భూమిపైఁ గొట్టుకొని వ్రాలిపోయెను.

ఇపుడు వారికిఁ జుట్టును పెద్ద పర్వతములును, వృక్షకోటులునుండెను. ఆస్థలమంతయు నిర్మానుష్యముగా నుండెను.

విమానమునుండి భూమిపై దుమికినవెంటనే డోర్వాలు హేమచంద్రులొకరినొకరు కౌఁగిలించుకొనిరి. హేమచంద్రుని కనులనుండి యానందబాష్పములు బొటబొట జారెను. అపుడు డోర్వాలు "హేమచంద్రా! నీగుఱుతునుబట్టి యిచటికి సురనందన మెంతదూరములో నుండునో చెప్పఁగలవా?" యని పలికెను. "ఆఁ. చెప్పెదను." అని హేమచంద్రుఁ డొకనిమేషకాల మొకదెస జూచి "ఇచటికి సురనందనము రెండుమైళ్ళ దూరముననే యున్నది. అదిగో నాగుఱుతు." అని యాదెసకు వ్రేలుచూపెను. వెంటనే డోర్వా లాదెసకుఁ జూచి సంతోషభరితుఁడయ్యె.

"మిత్రమా! నేను వెనుక నీప్రదేశమునకు వచ్చినపుడు దీపరక్షకమును జెకుముకిని నొకస్థలమునందుంచితిని. ఆస్థలమిచటికి మిక్కిలి దగ్గరలో నున్నది. కావున నచటికిఁబోయి యవి యున్నవో లేవో చూతముగాక. రమ్ము" అని పలికెను.

వెంటనే డోర్వాలు వెనుకరా హేమచంద్రుఁ డాచోటునకు దారిబట్టి పోవుచుండెను.

అట్లు వారిరువురు నడచుచుండగా హేమచంద్రుఁడు "మిత్రమా! ఆగుహలోనున్న సర్పముతో మనము పెనఁగులాడుటెట్లు?" అని యడిగెను.

"ఆసర్పవిషయమై నేనిదివఱలోఁ బెక్కుసారులు చింతజేసి యుంటిని. నీవు చెప్పినట్లాసర్పము నీచే స్పృశింపఁబడినను నిశ్చలనముగా నుండుటను గూర్చి యాలోచించినచో నాసమయమున నది మత్తుచే నొడలుమఱచి యుండనగు. అట్లు కానియెడల నది యొకశిలాప్రతిమయై యుండవచ్చును. లేక నిజముగా సర్పమే యగునెడల నేఁటివఱకు నది యాస్థలముననే యుండదు. సర్పజాతి యెల్లప్పుడును నొకచోటనుండి మరియొకచోటికిఁ బోవుచుండును. కాని నాకుఁ దప్పక యది సర్పరూపముగాఁ జెక్కఁబడిన శిలాప్రతిమయై యుండనోపునని మిక్కిలి తోఁచుచున్నది; ఏమనిన మీహిందూదేశీయులును, మరికొందఱు ప్రాచ్యులును సర్పమును మిక్కిలి పూజింతురు. ప్రతి పుణ్యస్థలమునకు ముందు సర్పవిగ్రహముండును. కావునఁ బుణ్యస్థలములలో కెల్లపవిత్రస్థలమగు నీభూలోకస్వర్గమునకు—ఈసురనందనమునకు—ముందుగా సర్పవిగ్రహ మేలయుండఁగూడదు?" అని డోర్వాలు పలికెను.

ఇఁక నిప్పుడు హేమచంద్రుని హృదయవీధిని వేరు భావములు సంచరించుచుండెను. కమలా క్లోడిస్సా మోహనులు సురనందనములో నుండిరేమో? వారికిఁ దాను గన్పడుట సంభవించునేమో? అట్లు సంభవించెనేని నిరాయుధుఁడగు తన్ను సాయుధుఁడగు మోహనుఁడు క్లోడిస్సా ప్రేరితుఁడై చంపునేమో? కాని వారు మొదటిసారివచ్చి వలయునన్ని మణులను గ్రహించి తిరిగి తమతమదేశములకేగి యుండవచ్చునని హేమచంద్రుఁడు నిశ్చయించుకొని యూరటఁ జెందెను. ఐనను గుహయొద్దకుఁ బోయినచో వారు సురనందనములో నుండియున్నది—లేనిది—తెలిసికొనవచ్చునని యూహించెను. ఏమనిన వారెక్కివచ్చిన హయము లాగుహకుఁ గొద్దిదూరమున గడ్డిమేయుచుండును.

ఇంతలో డోర్వాలును హేమచంద్రుఁడును దమ గమ్యస్థానమును జేరిరి. మునుపు తానుఁ బెట్టినచోటనే దీపరక్షకమును జెకుముకియు

ను జెక్కుచెదురకుండెను. అట్లుండుటకు సంతోషించి వా రారెంటిని గ్రహించి గుహవైపునకుఁ బోవ నారంభించి యొక్క మహాగాధపు టొడ్డుమీఁదుగా నడచుచుండిరి. నాలుగుమైళ్ళు నడచునంత నాయగాధ మంతమునొంద నొక పెద్దగోడవలెనున్న పర్వతము వారికెదురయ్యెను.

ఆపర్వతమునెక్కి కొంతదూరముపోయి యొక గుహాముఖమునఁ జొచ్చిరి. ఆగుహలోనుండి యాకొండ యావలిప్రక్కను జేరిరి. అచట నుండి మెట్లవలెనున్న రాళ్ళమీఁదుగాఁ గొండనుండిదిగి కొన్ని వృక్షకోటులలోనికిఁ జొచ్చిరి. ఆవృక్షకోటులలోనుండి యఱమైలునడచి యొక కొండవాగును సమీపించిరి. వారికెదురుగా నాకొండవాగున కావల యొడ్డున మహోన్నతపర్వతములో నొకగుహ యుండెను. ఆగుహ కారు చీకట్లతోఁ గ్రమ్మఁబడియుండెను. దానిని డోర్వాలునకుఁ జూపించి "అదియే సురనందన ద్వారము" అని హేమచంద్రుఁడు మహోత్సాహముతోఁ జెప్పెను.

పిదప వారిరువురును గొండతావు మీఁదుగా వంతెనవలెఁ బరువఁబడియున్న రెండు తాటిమ్రానులమీఁదుగా నావలియొడ్డు చేరి గుహాముఖమున నిలువఁబడిరి. అచటనుండి యాపరిసర ప్రాంతములలో హాయము లెవ్వియైన నుండెనేమో యని హేమచంద్రుఁ డటు నిటు జూచెను. కాని యెచ్చటను గాన్పించలేదు. డోర్వాలు దీప రక్షకమును వెలిఁగించుమని హేమచంద్రునితోఁ జెప్పెను. హేమచంద్రుఁడు వెలిఁగించెను.

గుహాముఖమున హేమచంద్రుఁడు నిలువఁబడి దీప సాహాయ్యమున దాని యంతర్భాగమును జూచెను. కొన్నిచోట్ల ముందునకుఁ బొడిచి కొనివచ్చియుఁ గొన్నిచోట్ల లోతుగానుండియు నాగుహాంతర్భాగము మిక్కిలి యడ్డదిడ్డముగా నుండెను. కాని దానియావలి చిగురును వారికిఁ గాన్పించలేదు. ఒకచో నొక పచ్చసిమొక్క యుండెను.

హేమచంద్రునిచేత నున్న దీపరక్షకమును దీసికొనుటకై హస్తమునుజాచి "హేమచంద్రా! నేను ముందు నడచుచుందును. నీవు నావెనుకరమ్ము. దీనియందు నిజముగా నజగరమే యుండునెడల నది ముందుగా నన్నే మ్రింగును. నేను ముదుసలినిగాన జచ్చినను మిక్కిలి నష్టములేదు. నీవో చిన్నవాఁడవు" అని డోర్వాలు పలికెను.

సర్పభయముచేత దీపరక్షకమును హేమచంద్రుఁడు తొలుదొల్త డోర్వాలున కీయనెంచెను. కాని వెంటనే సిగ్గుతెచ్చుకొని "కాదు కాదు మిత్రమా! ఏయపాయము వచ్చినను సరే నేనే ముందు నడచెదను" అని చెప్పి డోర్వాలు వెన్నంటిరా హేమచంద్రుఁడు గుహలోనికి మెల్లగా నడవఁదొడఁగెను. అట్లు రెండువందల గజముల దూరము నడచునంత నాగుహ క్రమ క్రమముగా సన్నగిలుచుండెను. వారియడుగులచప్పుడు తక్క మఱెట్టిచప్పుడునులేదు. హేమచంద్రుఁడు తాను పట్టుకొనియున్న దీపరక్షకమును దన కనులకుఁ దిన్నగా నెత్తిపట్టుకొని గుహ నంతయును సూక్ష్మదృష్టితోఁ జూచుచు నడచుచుండెను. వానికి మిక్కిలి ప్రక్కగా డోర్వాలు నడచుచుండెను. వెనుక తాను సర్పమును స్పృశించిన స్థలము సమీపించు చున్నదని హేమచంద్రుఁడు గ్రహించెను. ప్రతిక్షణమునందు నాపాము బుస్సుమని మీఁదఁ బడునేమో యని హేమచంద్రుఁ డాలోచించు చుండెను. కాని యంతటను నిశ్శబ్దముగా నుండెను.

ఇపుడు వారు క్రమముగా గుహాంతమును సమీపించు చుండిరి. క్రమ క్రమముగా నల్లని దేదియో—మిక్కిలి పెద్దదియును మిక్కిలి వెడల్పుగా నున్నదియును—ఒకటి కాన్పింపఁజొచ్చెను. అది మిక్కిలి పెద్దదిగానున్న స్త్రీ యాకారము.

"ఇపుడు నీకేమియుఁ గాన్పించుటలేదా?" యని హేమచంద్రుఁడు మెల్లని కంఠస్వరముతో డోర్వాలు నడిగెను.

"ఆఁ. ఒక పెద్దప్రతిమ నాకుఁ గన్పట్టుచున్నది." అని డోర్వాలు పలికెను.

"ప్రతిమయా?" అని హేమచంద్రుఁడు డోర్వాలు నడిగెను.

"ఔను ప్రతిమయే! ఇంకను శ్రద్ధతోఁ బరీక్షింపగా నాకది లక్ష్మీప్రతిమయని నిస్సంశయముగాఁ దెలిసె. ఓహో! హేమచంద్రా! చూడుము:—అదిగో సర్పము"

"ఆఁ! సర్పమా?" అను నప్పుడు హేమచంద్రుని దేహామంతయును జల్లుమనెను.

"ఔను సర్పమే. ఏమిసర్పము? ఱాతితోఁజెక్కఁబడినసర్పము—శిలాసర్పప్రతిమ—ఆస్త్రీ ప్రతిమయును శిలామయమే!" యని డోర్వాలు చెప్పెను.

హేమచంద్రుఁ డిపు డాశ్చర్యమునొంది పాముఁగూర్చి తనకుఁ గలిగిన భీతిని విడిచెను. ఇఁక వారిరువురు నాస్థలమును జేరిరి. హేమచంద్రుఁడు వెంటనే ప్రతిమ వెనుకభాగమునకుఁబోయి యచట నొక రంధ్రముకాని ద్వారముకాని కలదేమోయని వెదుకఁజొచ్చెను. కాని యట్టిదేమియును గాన్పింపలేదు. కావున నచటనుండి వెనుకకు వచ్చి గుహాకుడ్యములను జేతితో గట్టిగాఁగొట్టసాగెను. ఏమనిన నాకుడ్యములో నెచ్చటనైన ద్వారముండినచో నోటుకుండను గొట్టినట్లు యదియొక విధమగు శబ్దము వినఁబడు. కాని యాయత్నమును నిష్ఫలమయ్యె.

ఇఁక డోర్వా లేమిచేయుచుండెను? మిక్కిలి యందముగాఁ జెక్కఁబడిన యాప్రతిమ కెదురుగా నిలువఁబడి దాని నత్యంత శ్రద్ధతో సూక్ష్మముగాఁ బరీక్షించుచుండెను. అట్లొక యైదునిమిషముల కాలము పరీక్షించి "హేమచంద్రా! ఈప్రతిమను దక్క నీవెచ్చట వెదకినను సురనందనద్వారము కాన్పించదు!" అను డోర్వాలుని పలుకులు

విని హేమచంద్రుఁడు దీపరక్షకముతోఁ బ్రతిమకు మిక్కిలిదగ్గరగవచ్చి దానిని బరీక్షించుచుండగా "ఏమనిన! ఈప్రతిమయందే సురనందనద్వారముండవచ్చును. ప్రయాణమును సలుపు.——"

ఇచట హేమచంద్రడోర్వాలులు మహావిస్మయస్తంభీభూతులైరి. ఏమనిన, నాప్రతిమయొక్క ముందుభాగమంతయును దలుపువలెఁ దెఱచికొనెను. దానినుండి యొకస్త్రీ వెలుపలికివచ్చి "ఓహో! ఎవరు మీరు?" అని హేమచంద్రునిజూచి "ఏమి! హేమచంద్రా!" అని యనెను.

"గ్లోడిస్సావా!" అని హేమచంద్రుఁడనెను.

వెంటనే క్షణమాత్రములోఁ గ్లోడిస్సా తనయొడినుండి యొక బాకునుదీసి హేమచంద్రునిపైఁ బడుచుండెను; కాని హేమచంద్రుఁడనంతసత్వముతో నాబాకు నామెహస్తమునుండి యూడబెఱికి దానితో నామె హృదయకోశమును బొడిచెను. వెంటనే గ్లోడిస్సా భూమిపైఁ బడియెను. హేమచంద్రుఁడు గ్లోడిస్సావచ్చిన ద్వారములోనికిఁ జొచ్చెను. వెంటనే వానివెనుక నాద్వారము మూసికొనిపోయెను.

మహావిస్మయస్తంభీభూతుఁడై డోర్వాలు గ్లోడిస్సాను దనయొడిలోఁ బెట్టికొనియెను. ఆమెహృదయములోనికిఁ గ్రుచ్చికొనియున్న బాకు నూడఁబెఱికెను. వెంటనే రక్తము ప్రవహింపఁజొచ్చెను. ఆగాయమును గుడ్డతోఁగప్పుటకై గ్లోడిస్సా చేలాంచలమును జింపఁబోవుచుండగా డోర్వాలు మహాశ్చర్యనిమగ్నభూతుఁడయ్యెను. ఏమనిన నామె ముఖకరచరణములు కొంచెము పచ్చగా నామె వక్షోభాగమును దక్కటిభాగములును నిర్మలపాండురచ్ఛాయగా నుండెను!

ఘూర్జరతార.

ముప్పదియెనిమిదవ ప్రకరణము.

క్లోడిస్సా యేకారణముచేతనో మారువేషము ధరించియున్నదని యెంచి యాకారణములఁగూర్చి మిక్కిలి వితర్కింపక యింకను సప్రాణియై యుండెనేమోయని డోర్వాలు తెలిసికొనుటకుఁ బ్రయత్నించెను. ఆమె యందింకను నుచ్ఛ్వాసనిశ్వాసములు క్రమముఁదప్పలేదు; గాయమునుండి రక్తము ప్రవహింపకుండునటుల డోర్వాలు చేయఁగలిగినదంతయుఁ జేసెను. ఆగుహయందుఁ బ్రకంపితమైన వాయువుకన్న పరిశుభ్రమైన గాలి యామెకవసరమనియెంచి వెంటనే క్లోడిస్సాను గుహాముఖమునకుఁ జేతులతో నెత్తుకొనిపోయెను. ఆపెనచ్చటడించి తిరిగి ప్రతిమయొద్దకేగి దీపరక్షకమును జెకుముకిని వెంటఁగొని మరల క్లోడిస్సాయొద్దకు వచ్చెను.

ఆమె సప్రాణియై యుండెనేకాని మనలోలేదు. రక్తమిపుడు ప్రవహించుటలేదు. ఒకప్పుడామె కనులఁదెఱచి డోర్వాలుని మొగము వంకఁజూచెను; కాని యామెకంతయు నగమ్యగోచరముగానుండెను. వెంటనే మరలఁ గనులను మూసికొనెను.

ఆపెనుండి డోర్వాలు దీపరక్షకముతో మరలఁ బ్రతిమనొద్దకుఁ బోయి ద్వారమునకుసంబంధించిన మర్మమును గనుఁగొనఁజూచె. ఒకగంటకాల మాప్రతిమాంగముల నన్నిటిని మిక్కిలి సూక్ష్మదృష్టితోఁ బరీక్షించెను; కాని యణుమాత్రమైన వానికామ్మరము తెలియలేదు. కావున వెంటనే మరలఁ గ్లోడిస్సాయొద్దకువచ్చి దీపరక్షకమునార్పి ప్రక్కగాఁ గూరుచుండెను. వానిహృదయవీధియం దిపు డనేకభావములు సంచరింపఁజొచ్చెను.

ఇపుడు వాఁడేమిచేయనగు? తానే క్షుద్బాధచే సగము పీడింపఁబడుచుండెను; పైగా గాయమునొందిన క్లోడిస్సా కనేక సపర్యలు చేయవలెను. నిర్మానుష్యమైన యాపర్వతరంగమున వాని కేమిసాహాయ్యముకలుగును? ఎచ్చట నెల్లపుడును సమశీతోష్ణమై సర్గిగస్థితియుండునో—ఎచట మిక్కిలి రుచ్యములగుఫలము లెల్లయపుడు నిండియుండునో—అట్టి సురనందనద్వారమునొద్దనే వాఁడు నిజముగానున్నాఁడు—కాని యింకొకయడుగు ముందునకుఁబడదు. పోనిమ్ము—హేమచంద్రుఁడు తన్నుగొంపోవుటకు సురనందనములోనికి వచ్చునా? వచ్చునని యె డోర్వాలు తలంచెను; కాని యీతలంపు దీర్ఘకాలము నిలువలేదు—ఏమనిన వానినడవడికను బూర్తిగా నిపుడు డోర్వాలు గ్రహింపఁజాలెను. వాఁడు ద్వారములోనికిఁ జొచ్చునపుడు తన్ను రమ్మనలేదు. తుదకుఁ దనవంకఁ జూడనైనలేదు. వెంటనే తనవెనుక తలుపును మూసికొనెను—కావున నట్టి పరమలోభి—అట్టి కుక్షింభరుఁడు తన్ను సురనందనములోనికిఁ దీసికొనిపోవుట కెంతమాత్రమును రాడని డోర్వాలు నిజముగా గ్రహించెను.

క్లోడిస్సా యింకను జీవముతోనున్నది. కాని తెలివికిరాలేదు. ఆమె జీవించుటయే నిశ్చయమైనయెడల నాస్థితియందే యైదాఱుదినములుండుననుటనిస్సంశయము. డోర్వాలు కరుణాళుఁడు తనశక్తికొలఁదినామెకు సపర్యలుసలుప నిశ్చయించుకొనెను. ఆమెయాగుహయందే యుండవచ్చును; కాని మెత్తని పక్కయును గప్పుటకు వస్త్రములును కావలెను. మరియుఁ దినుట కాహారము కావలెను. ఈలోపము లెట్లుతీరునాయని డోర్వాలు తనలోఁదాను మరలఁ దర్కించుకొనఁజొచ్చెను. ప్రతిమయొద్ద నాఘోరసంఘటనము సంభవించి యిప్పటికి మూఁడుగంటలయ్యెను; ఇంకను హేమచంద్రుఁడు తనకొఱకు రాలేదు.

“రాఁడు—వాఁడెన్నటికిని రాఁడు. ఇపుడువాఁడు సురనందన

సౌఖ్యములకుఁ జిక్కువడి, సంతోషముచేత నొడలుమఱచియుండనోపు; లేక, తనచేఁ బొడువఁబడినను నదృష్టవశమున గ్లోడిస్సా యింకను జీవించియుండునేమో యనియెంచి, వెలుపలికివచ్చుటకు భయపడియుండవచ్చును. కావున నెట్లయినను వాఁడురాఁడు" అని డోర్వాలు తనలోఁ దాననుకొనియెను.

అట్లు నిశ్చయించుకొని యేమిచేయనగునాయని డోర్వాలు తర్కించుకొనఁజొచ్చెను. ఇంకను నాగుహాయందుండుట క్షామదేవతతోఁ జెల్లాటమాడుటయే. తనకుఁ గావలసినవానికై యింకొకచోటికిఁ బోవలెను—పర్వతములమధ్య కేగినచో నెవ్వరైన బాటసాగులు కాన్పింపవచ్చును—వారియొద్దనుండి తనకుఁ గావలసిన వస్తువులను గ్రహింపవచ్చును. వానికిపుడు తనవిమానము స్మృతికివచ్చెను; అవిమానము భూపతనమొందిన స్థలమునకుఁ బోవనెంచెను. అదృష్టవశమున నది యక్కడనుండునేని, దాని పరికరములతోఁ గ్లోడిస్సా కనుకూలమగు తల్పమును జేయవచ్చును. కాని గ్లోడిస్సా నాగుహాయందువిడిచి తానువెళ్ళుట మంచికార్యమా? హేమచంద్రుఁ డేకారణముచేనైన సురనందనమునుండి యచటికివచ్చి సజీవియై గ్లోడిస్సాయుండుటఁజూచి మునుపు సగముగానైన ఘోరకృత్యము నిపుడు పూర్తిజేయఁడా? కావున నామె నచటనేవిడిచి తానుపోవుట హేమచంద్రుని ఘోరక్రోధానలమున కామె నాహుతిఁజేయుటకాదా?

అట్లగుట వెంటనే యామెను దనచేతులయందిడుకొని యచటికి దాదాపు మూఁడువందల గజములలోనున్న యొక గుహానొద్దకుఁ బోయెను. ఆగుహాముఖము సాంద్రముగాఁ బెరిగిన చెట్లగుంపుచే మునుఁగువడియున్నది. కావున గ్లోడిస్సా నాగుహాయందునిచి తాను విమానముండిన స్థలమునకుఁ బోవనారంభించెను.

తాటిమ్రానులమూలముగాఁ దానును హేమచంద్రుఁడును వెనుకదాటిన కొండవాగు నిపుడు డోర్వాలునాటి వృక్షకోటులనుండి మెట్లఁబోలెనున్న శిలలమీఁదుగా గుహనుజొచ్చి, కొండయావలిభాగమునుజేరి యచటనుండి కొండనుదిగి విమానము భూపతనమైనస్థలమును సమీపించెను. అట్లు సమీపించునంత విమానమునకుఁ బ్రక్కగా ముప్వురెవ్వరో యుండుటను వాఁడు చూచి మిక్కిలి మోదమునుజెందె. వారుముప్వురును మూఁడుహయములపై నుండిరి. వారికి వెనుక నింకొక హయముపై పెక్కుమూటలు నుండెను. ఆముప్వురును విమానమునొద్దనిలిచి దానిని మిక్కిలి యాశ్చర్యముతోఁ జూచుచుండిరి. డోర్వాలు వారిని సమీపించెను. ఆముప్వురిలో నొకఁడు పురుషుఁడు—రెండవది వానిభార్య—మూఁడవచిన్నది వారికొమరిత. అచటినుండి కొన్ని యామడల దూరములో నాపర్వతాంతముల నెక్కడో వారినివాసస్థలము కలదు. వారందఱును గొండలలో నివసించువారు. వారు శ్రీనగరమునకు మొన్న మొన్నచేపోయి తమకుఁగావలయు తినుబండారములను, వస్త్రములను, దక్కఁగల సామగ్రిని గొని మరల వారి నివాసమునకేగుచుఁ దోవలోనున్న విమానమునొద్దనిలిచి దాని నాశ్చర్యముతోఁ జూచుచుండిరి. ఈసంగతుల నన్నిటిని వారితో ముచ్చటించునపుడు డోర్వాలడిగి తెలిసికొనెను.

అభయంకరపర్వతరంగమునఁ బరదేశీయుఁడెవ్వఁడో యొక్కఁడే తిరుగుచుండుటఁజూడ వారియాశ్చర్యమునకుఁ గొంతవఱకుఁ గారణమయ్యెను. కాని వారికిఁ జెప్పఁబడుటకుఁదగిన యొకకథను డోర్వాలు వెంటనే సృష్టించెను. మహమ్మదీయసైనికులు తన్నన్యాయముగా దోఁచిరని వారితో డోర్వాలు చెప్పెను. అట్లుచెప్పుట మిక్కిలి తెలివితోఁ గూడుకొని యున్నది. ఎట్లనిన మహమ్మదీయులాకొండలలో నివసించు వారికందఱకును గర్భశత్రువులు—ఆసంగతిని వినినతోడనే కరుణార్ద్రుఁడ

గు నాపురుషుఁడు మనడోర్వాలుని దనతో స్వగృహమునకు రమ్మని పలికెను. కాని వారేగుచున్న మార్గమునకును దానేగు మార్గమునకును వ్యత్యాసముండుటచే నాపురుషునితోఁ గూడఁ దాను వచ్చుటకు వీలులేదని డోర్వాలు చెప్పెను. అట్లయినచో నీకుఁగావలయు సామగ్రిని దీసికొమ్మని యాపురుషుఁడు తన హయమునుండి దిగి మూటలతో నుండిన హయమునొద్దకు డోర్వాలుని గొంపోయి యామూటలను విప్పెను. వెంటనే డోర్వాలు తనకుఁగావలయు తినుబండారములను గొన్నివస్త్రములను దీసికొనియె. పిమ్మట నాముప్పురును దమత్రోవను బోయిరి. వారినిఁ గనుచూపుదూరము పోనిచ్చి విమానమునుడాసి తనయంగీనుండి యొక చిన్నకత్తినిదీసి పట్టుగోళమునకుఁ గట్టినత్రాళ్ళను గోసి దానిని జక్కగా మడతబెట్టి యాతినుబండారములను, వస్త్రములను, పట్టుగోళమును దన రెండుచేతులలో నిముడునట్లు చేసి తానిదివఱకువచ్చిన మార్గముననే తిరిగి గ్లోడిస్సాయొద్దకు వచ్చెను.

వచ్చినతోడనే యాపట్టుగోళమును దక్కఁగల వస్త్రములలోఁ గొన్నిటిని గూర్చి యొకమెత్తని తల్పము నమర్చి దానిపైఁ గ్లోడిస్సాను బరుండఁబెట్టెను. ఆమె వెనుకటి స్థితియందే యుండెను. శీతవాయువు గుహలోనికిఁ గొట్టకుండునటుల గుహాముఖమున చెట్లగుంపు కలదు; కాని యింకను గుహలోఁ జల్లగా నుండెను. ఆగుహకుఁ బరిసరప్రాంతమునఁ గొన్ని యెండుకట్టెయలుండగా వానిని గుహలోనికిఁ దెచ్చి చెకుముకిచే నిప్పుజేసెను. ఆవెట్టచేత నాగుహలో శీతమదృశ్యమయ్యెను. తాను దెచ్చిన తినుబండారములయందు గోధుమపిండి, చక్కర మొదలగునవి కలవు వానితో రొట్టెలనుజేసి కట్టెయలపైఁ గాల్చి తాను గొన్నిఁటినిభుజించి గ్లోడిస్సాను గొన్నిఁటిని దినిపించుచుండెను.

అట్లొకవారము కడచెను. గ్లోడిస్సా క్రమక్రమముగాఁ దెలివినొందెను. దినద్వయమునుండియు నామె కనులఁ దెఱచి డోర్వాలు తనకభిక

భక్తి శ్రద్ధలతో నుపచారము చేయుచుండుటఁజూచి తన కృతజ్ఞతను జూపులతోఁ దెలుపుచుండెను. వారము పూర్తియగునంత నామె మాట్లాడఁ దొడఁగెను. వెంటనే తన కృతజ్ఞత నధికానందముతోఁ గ్లోడిస్సా డోర్వాలునికి వాక్రుచ్చెను. పిమ్మట నీరీతిని వచింపఁజొచ్చెను.

“నేను మాఱువేసమును దాల్చినట్లు నీవెఱిఁగియుంటివి; కాని నేనట్లేల తాల్చియుంటినో యడుగవద్దని నిన్ను వేడెద. దానిని దాల్చినది దుర్బుద్ధితోఁ గాదని ప్రియమిత్రమా! నిన్ను నమ్మింపఁగలను.”

“నీమాటలను నేను నమ్మితిని. నీరహస్యమును నీయొద్దనేయుంచుము. నేను దద్విషయమై నిన్నెప్పుడు నడుగను. కాని సురనందన మహానందముల ననుభవించుటకుఁ బున్నెము చేసిన మర్త్యులలో నీవొక్కరితవుగదా—

“ఆస్వర్గమునుండి వెలుపలికి రాకుండిన బాగుగా నుండునుగదా! ఆదుర్మార్గుఁడు హేమచంద్రుఁడేడి?

“నీవువచ్చిన ద్వారమునుండియే వాఁడు లోనికిఁ జొచ్చెను. వెంటనే వానివెనుక నారహస్యద్వారము మూసికొనిపోయెను.”

మాపాఠకుల కిదివఱకే తెలిసియున్న తన స్వవిషయములను డోర్వాలు చెప్పఁదొడఁగెను. వెనుక హేమచంద్రుని కెట్లు చెప్పెనో యట్టిరీతినే తనచరిత్రను గ్లోడిస్సాకుఁ జెప్పెను. హేమచంద్రుఁడు తనకు సహకారాగృహవాసి యెట్లయ్యెనో—మహాద్భుతముగా వారిరువురును విమానమూలమున నెట్లు విముక్తి నొందిరో—హేమచంద్రుఁ డాగుహలోనికిఁ దన్నెట్లు తీసికొనిపోయెనో చెప్పెను.

“ఇచట నేనేడుదినములనుండి యుంటినా? అట్లయిన నాకుగాయముకలిగి వారమైనదా!”

“ఔను. పూర్తిగా నేఁడుదినములు—ఇది యెనిమిదవనాఁటి యుదయము”. అని డోర్వాలు చెప్పెను.

"అట్లయిన బ్రతిమయుంచిన గుహనుండి సురనందనములోనికి మార్గము చూపు మర్మద్వారముల విషయమై వానికెంతమాత్రమును దెలియదని నీకు నిశ్చయముగా నమ్మకముకలదా?"

"నేను నిశ్చయముగా నమ్మితిని. కాని యీసమయమున నిస్సందేహముగా వాఁడు సురనందనానందమున మునిఁగియుండును—

"ఉండదు! అట్లుకాదు! అట్లెన్నటికిని సంభవింపదు" అనునపుడా పెకనులయందు భయంకరమగు నొక తేజస్సు నిలచెను. "నీవు చెప్పినట్లు హేమచంద్రుఁడామర్మముల నెఱుంగకుండినచో వానిపాదమెన్నటికిని సురనందనభూమిని ద్రొక్కియుండదు. పర్వతములలో వాఁడు చిక్కువడి యున్నాఁడు; క్షామ మీవఱకే వానిని బూర్తిగా మ్రింగెను."

"అయ్యో! నిజమేనా?" యని యొడలు కంపింప డోర్వాలడిగెను.

"ముమ్మాటికిని. అయినను దైవమే వానిని శిక్షించినాఁడు. ఏమనిన మానవజాతిలో నట్టి వక్రబుద్ధి లేదు. వాఁ డారితేఱినమోసకాఁడు—

"ఔను. ఔను—అట్లయియె యుండనగు. కాని పాపము వాఁడింకను గొనయూపిరితో నుండవచ్చు. అట్టివానికి సహాయమొనర్చుట ధర్మము. కావున నేను వానియొద్దకేగెదను. ఆద్వారమర్మమును విశదీకరింపుము—

"ప్రియమిత్రమా! ఆరహస్యమును నీకుఁ జెప్పుటకు వీలులేదు. దానిని బరులకుఁ దెలియఁజెప్పనని దేవునియెదుటఁ బ్రమాణమొనర్చితిని. కాని నేనీగుహను విడుచుటకు వీలైనపుడు నాతోఁగూడ సురనందనములోనికి నిన్నుఁ గొంపోయెద." అని గ్లోడిస్సా చెప్పెను.

మోహనుఁడుకాని, కమలకాని నిజముగా నట్టి ప్రమాణము నెప్పుడును గ్లోడిస్సాచేఁ జేయింపలేదు. అది గ్లోడిస్సా సృష్టి. అట్లు చెప్పు

టచే డోర్వాలు హేమచంద్రుని కెట్టిసహాయమును—ఒకవేళ నింకను జీవించియున్నచో—చేయఁజాలఁడు. అట్లగుట దన ఘోరశత్రువు నిస్సహాయుఁడై మలమల మాడి చచ్చును. తన ప్రతిజ్ఞ పూర్తిగాఁ జెల్లును.

"అట్లయినచో వానికర్మమునకు వానిని విడువవలయు! కాని నీవు నన్ను సురనందనమునకుఁ దీసికొనిపోవుదునని చెప్పియుంటివి. అందునకు నాకు మిక్కిలి సంతోషము కలిగెను. కాని యట్లు కొంపోవఁబడెదనని కాదుసుమీ నేను నీకీవారమునుండియు నుపచారమొనర్చినది. దురదృష్టుఁడగు మర్త్యునియెడ విధిగాఁ జూపింపనగు సానుభూతినే నేను నీ[illegible]షఁ బ్రదర్శించితి!"

"మిత్రమా! నీసత్ప్రవర్తనమునంతయు నేను గ్రహించితిని. నీవు నాతోఁ గూడ సురనందనములోనికివచ్చి పన్నిద్దఱు సార్వభౌముల ధనాగారములు నిండునంతటి ధనమునైనను దీసికొనిపొమ్ము. కాని నీవొక్క ప్రమాణము చేయవలయు—

"అదియెట్టిది చెప్పుము."

"సురనందన రహస్యము నెఱిఁగినవారు నేనేకాక యిరువురు కలరు. వారినామముల నన్నడుగవద్దు. వారు తమదేశమునకేగి చాలకాలమైనది. అయిదాఱు నెలలలోఁ దిరిగి వత్తుమని నాతోఁ జెప్పిరి. ఇపుడు వారు వచ్చుకాలము పూర్తియైనది. త్వరలో వత్తురు. కావున నీవు మూఁడుదినములకన్న నెక్కువకాలము సురనందనమున నుండరాదు." అని చెప్పెను.

తనకు ధనమే ముఖ్యమగుట డోర్వాలు వెంటనే దానికంగీకరించెను.

మరునాఁడు సాయంతనమునఁ గ్లోడిస్సా డోర్వాలుని వెంటఁబెట్టుకొని సురనందనోన్ముఖి యయ్యెను.

ఘూర్జర తార.

ముప్పదితొమ్మిదవ ప్రకరణము.

క్లోడిస్సా ముందు నడచుచుండెను. వెనుక డోర్వాలు వచ్చుచుండెను. నాల్గువందల గజములదూరము నడచినంత వారు గుహాముఖమును జేరిరి. ఎన్నియుపాయములైనను గడచి యెట్టకేలకు సురనందనమును జూచుభాగ్యమబ్బెగదా యని డోగ్వాలు మిక్కిలి సంతసమొందఁజొచ్చెను; కాని చూచుటకు శాంతచిత్తుఁడైనట్లుండెను.

గుహాయంతయుఁ గాఱుచీఁకట్లతోఁ గ్రమ్మఁబడియుండెను. వారియొద్ద దీపరక్షకములేదు. కాని మిక్కిలి పరిచయము గలిగియుండుటచే నాచీఁకటిలో నుండియే క్లోడిస్సా ప్రతిమయొద్దకుఁ డోర్వాలుని దీసికొనిపోయెను. ఆప్రతిమనెట్లు తెఱచెనో డోర్వాలునికిఁ గన్పడలేదు—డోర్వాలును దానికై శ్రద్ధనొందలేదు—ఏమనిన డోర్వాలు మిక్కిలి ధర్మబుద్ధి. ద్వారములోనికి ముందు క్లోడిస్సాజొచ్చి డోర్వాలుని బిమ్మట రానిచ్చెను. వెంటనే వారివెనుక ద్వారము మూసికొనిపోయెను. "మిత్రమా! నేనొక్కరితనే యైనయెడల చీకటిలోనుండియే పోయియుందును. కాని నీవు క్రొత్తవాఁడవు ఈమెట్లు మిక్కిలి యిఱుకుగా నుండుటచే జాఱెదవు. కావున నీమూల నొక దీపరక్షకమున్నది. దానిని వెలిఁగించెద. అంతియకాక మన మొకదానికై వెదుకవలసియున్నది" అని క్లోడిస్సా చెప్పి దీపగక్షకమును వెలిఁగించెను.

ఆవెదుకఁబడవలసినది హేమచంద్రుని కళేబరమేయని డోర్వాలు గ్రహించెను. వెంటనే వానియొడలు జల్లుమనెను. దీపరక్షకమును

జేతనిడికొని మెట్లమీఁదుగా నధోదిశకుఁ గ్లోడిస్సా దిగుచుండెను. ఆమెవెనుక డోర్వాలు దిగుచుండెను. దీపరక్షకముతో నప్పుడపుడు మెట్లవరుసకటునిటుఁ గ్లోడిస్సా పరీక్షించుచుండెను. కాని హేమచంద్రుని కళేబరమింకను గాన్పింపలేదు. అదిగో కళేబరమని క్లోడిస్సా యెప్పుడు పలుకునోయని డోర్వాలూపిరి బిగియఁబట్టి మెట్లను దిగుచుండెను. అట్లొకపదునైదు నిమిషముల కాల మామెట్లవరుసనవరోహించిరి. అధోభాగమునకుఁ బోయినకొలఁదిని నైసర్గికస్థితి క్రమక్రమముగా వేడిమిగా నుండఁజొచ్చెను. తుట్టతుదకు మెట్లవరుస ముగియఁజొచ్చెను. అపుడదుగో కళేబరమని క్లోడిస్సా పలికెను. వెంటనే డోర్వాలునియొడలు జల్లుమనియె. హేమచంద్రుఁడు భూమిపైఁ బడియుండెను. వానిశిర మొక శిల కానుకొనియుండెను.

తనచేతనున్న దీపరక్షకమును మృతహేమచంద్రుని మోమునకు దగ్గఱగాఁ బట్టుకొని క్లోడిస్సా చూచుచుండెను. వాని దేహమంతయుఁ గృశించి కృశించి యుండెను. అధికమగుబాధ నొందినట్లు వానిమొగము మిక్కిలి ప్రకంపితమై యుండెను. వానిశవ మింకను కుళ్ళుటకారంభింపలేదు. అపుడు డోగ్వాలు మిక్కిలి కంపితస్వనముతో "మిక్కిలి దురదృష్టుఁడు! మూఁడు నాల్గుదినములక్రిందనే ప్రాణముల విడిచి యుండవచ్చును. అట్లగుట నొక్క సంపూర్ణవారమైనను క్షామముచేఁ బీడింపఁబడియుండు. వాని దుండగము లెట్టివైనను దత్ప్రతిఫలము మిక్కిలి భయానకముగా నున్నది!" అని పలికెను.

క్లోడిస్సా పలుకాడలేదు. కాని వెంటనే దీపరక్షకమునార్పెను. ఇపుడంతయుఁ జీఁకటిగానుండెను. క్షణికమైన సాధ్వసముచే డోర్వాలు కంపింపఁజొచ్చెను; కాని వెంటనే క్లోడిస్సా "మిత్రమా! నేనుజేసిన ప్రమాణసరణి నీరహస్యద్వారమర్మము నీకుఁ దెలియకుండుటకై దీపమార్పితిని. ఇదిగో! మన మిఁక సురనందనభూమిపైఁ బాదము నిడు

చున్నాము” అని పలుకునంత నేమూలనుండియో యాస్థలమునకు వెలుఁగువచ్చెను. ఆవెల్గుమూలమున ముందు తెఱచికొనియున్న ద్వారమొకటి కాన్పించెను. వెంటనే యాద్వారమునుండి లోనికి డోర్వాలుని గ్లోడిస్సా తీసికొనిపోయెను. తక్షణమునందే యాద్వారము మూసికొనిపోయెను. డోర్వాలు వెనుకకుఁ దిఱిగిచూచెను. కాని యాద్వారము కాన్పింపలేదు. అది పర్వతములోఁ గలసిపోయినది. ఫలభరవినమ్రములైయున్న వృక్షములనుండ గ్లోడిస్సా డోర్వాలు నొక శాద్వలస్థలమునకుఁ దీసికొనిపోయెను.

ఇపుడు డోర్వాలు భూలోకస్వర్గమున నున్నాఁడు. దానికిఁ జుట్టు మహోన్నతప్రాకారమువలె నొకపర్వతవలయ ముండెను. విమానమూలముననఁదక్క పరులెవ్వరును సురనందనములోనికివచ్చువీలు లేదని డోర్వాలు గ్రహించెను. ఇపుడు తానుండినచోటు, ప్రతిమయుండిన గుహనుండి యధమపక్ష మొక్కమైలులోతున నుండెనని లెక్కవేసెను. ఆకారణముచేఁ బర్వతములకావల నెట్టిశీతకాలము ప్రజ్వరిల్లుచున్నను నచటమాత్ర మెల్లయపుడు వేడిమిగా నుండునని సిద్ధాంతీకరించెను. అయిన నాసిద్ధాంతమును సాంగముగా స్థిరపఱచుటకు వీలులేదు. ఏమనిన వేసవికాలమువలె నచటినైసర్గికస్థితి వెట్టగానుండుటయేకాక యుపత్యకమంతయును సంపూర్ణమైనపరువుతో భాసిల్లుచుండెను— వృక్షములన్నియు ఫలభరవినమ్రములై యుండెను—భూమియంతయుఁ బచ్చనిగడ్డిచేఁ గప్పఁబడియుండెను—వీనికంటె నాశ్చర్యకరమగు వృత్తమేమన నాయుపత్యకమున నతిమనోహరములగు రోజాపువ్వులు మనోహరసౌరభముల వెదఁజల్లుచు, నసంఖ్యాకములై యుండెను అట్టి రోజాపువ్వులను దన జీవితకాలమున డోర్వా లెన్నఁడును జూడలేదు.

గ్లోడిస్సా వాని నొకచక్కని మందిరమునొద్దకుఁ గొంపోయెను. ఆమందిరము తెల్లసఱాళ్లతో నిర్మితమైయుండెను. డోర్వాలు నామందిరములోఁ గూర్చుండఁబెట్టి తాను, ప్రక్కగానున్న వృక్షములయొద్దకేగి, మిక్కిలి రుచికరములగు కొన్ని ఫలములనుగోసి, మందిరమునొద్దకు దిరిగివచ్చి డోర్వాలుని కాఫలములనిచ్చెను. ఆఫలముల భుజించినంత వానిరుచిని డోర్వాలు వర్ణింపనేరకపోయెను. అట్టిఫలములను దానెన్నఁడును రుచిజూచియుండలేదని గ్లోడిస్సాకుఁ జెప్పెను. ఆయుపత్యకమున ననంతములుగానున్న ద్రాక్షఫలములనుండి తీయఁబడిన యొకవిధమగు నాసవమును ద్రావుమని గ్లోడిస్సా డోర్వాలుని కిచ్చెను. ఆద్రాక్షాసవమును డోర్వాలుత్రావి యపరిమితోల్లాస భరితుఁడయ్యెను.

—ఆమందిరమునం దొక్కగంటకాలము డోర్వాలుని విశ్రాంతి నొందనిచ్చి పిమ్మట వానిని వెంటఁబెట్టుకొని గ్లోడిస్సా సురనందనవిచిత్రములను జూపింపఁగడఁగెను.

దానియందుఁ బ్రవహించుచుండిన యసంఖ్యాకములైన చిన్నచిన్న సెలయేఱులన్నిఁటిలోను బెద్దదియగు నొక్క సెలయేటియొద్దకు డోర్వాలుని మొట్టమొదటఁ గొంపోయెను. ఆసెలయేటి కధోభాగమునఁ జేపలు మిలమిలలాడుచుండెను. దాని నీరములు మిక్కిలి నిర్మలములుగానుండెను. “కావున ఫలములనేకాక మాంసభక్షకు లెవ్వరైన నీచేపల నుపయోగింపవచ్చును” అని తద్విషయమై గ్లోడిస్సా ప్రసంగవశమున డోర్వాలునకుఁ జెప్పెను.

అచటనుండి యాచిన్నిచిన్ని సెలయేఱులను దాటి డోర్వాలుని కొన్నిగుహాముఖములయొద్దకుఁ గొంపోయెను. ఆగుహాలు మిక్కిలి పెద్దవియై, పర్వతవలయములోనికిఁ జాలదూరము వ్యాపించియుండెను. ఆగుహాలయందు వివిధవర్ణములతో దేదీప్యమానములై వివిధములగు రత్నములు వెలుఁగుచుండెను.

“నీవీసురనందనమునుండి పోవుటకుముం దీగుహాలలోనుండిన వివిధధనములలో నీయిచ్చవచ్చినవానిని దీసికొనిపోనగు. ఇఁక నీసురనందనము

నకెల్ల మిక్కిలి విచిత్రకరమగు నొకస్థలమునకు నిన్నుఁ గొనిపోవుచున్నాను" అని క్లోడిస్సా చెప్పుచు నొక గుహాముఖమునొద్దకు డోర్వాలుని గొంపోయెను. పరిసరమునకన్న నాగుహాముఖమునొద్ద నత్యధికోష్ణస్థితి ప్రబలియుండెను. అంతియకాక యావిరివంటి యొక పలుచనిపొగ గుహాముఖమునుండి వెలువడుచుండెను. దానికిఁ గారణమును వెంటనే డోర్వాలు గ్రహించెను. ఉష్ణఝరియొకటి యాగుహాంతర్భాగమునఁ గలదు: ఆఝరి శాఖోపశాఖలుగాఁ జీల్పఁబడుటయు రెండు చిన్నసెలయేఱులు గుహకుఁ గొద్దిదూరమునుండి ప్రవహించుటయు డోర్వాలుని దిలకింపుమని క్లోడిస్సా నిరూపించెను.

"ఈఝరులలోఁ బ్రతిదానిని నేను మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించియుంటిని; కాని యివియన్నియు సంగమము నొందు స్థలమును గనిపెట్టలేకపోతిని. చూచితివా యీసురనందనమున సర్వసౌకర్యము లెట్లు కూర్పఁబడియున్నవో! ఈవేడిఝరులచే నిచట నెంతమాత్రమును జలియుండదు" అని క్లోడిస్సా చెప్పెను.

"అగును. భూమిమట్టమునకు మిక్కిలి లోతుగానుండుటచేతను—చలివాయువులన్నిఁటిని లోనికి రాకుండునటుల నడ్డగించు నామహోన్నతపర్వత ప్రాకారములనను—ఈయుష్ణఝరులనుండి యెల్లయపుడును వేడివేడియావిరి వెడలుచుండుటచేతను—ఈప్రదేశము సర్వకాలములయందు వేడిగానుండును. అంతియకాదు. ఈవెట్టదనమున కాకారణములకన్న ముఖ్యకారణ మొకటి కలదు ఈపర్వతవలయములో నంతర్గతాగ్ని యెల్లపుడును బ్రజ్వరిల్లుచుండును. ఆయగ్నికిఁ బర్వతమును బ్రద్దలుచేసి, వెలుపలికి వచ్చునంత శక్తి లేదుకాని, బాహ్యప్రదేశమునకు వెచ్చఁదనమునుమాత్ర మిచ్చుచుండెను. మరియు దీనికిం కొకదృష్టాంతము కలదు. అంతర్గతాగ్ని సంబంధమగు నొకవిధమైన జమీపర్వతమున నుండుటచేతనే యీగుహాలయందు రత్నములున్నవి!"

అని డోర్వాలు తన ప్రకృతిశాస్త్రవిజ్ఞాన సాహాయ్యమునఁ దత్తద్విషయముల నారసి క్లోడిస్సాకుఁ జెప్పెను.

అట్లు మూఁడుదినములు గడచెను. నాలవదినము ప్రొద్దున డోర్వాలు ప్రయాణోన్ముఖుఁడయ్యెను. తనయిచ్చవచ్చినన్ని రత్నముల నిదివఱకే డోర్వాలు గ్రహించి యుంచుకొనెను. డోర్వాలునికిఁ దనహయము నిత్తునని క్లోడిస్సా చెప్పెను. పిమ్మట వెనుకటిమార్గముననే డోర్వాలుని మరల ప్రతిమయుండిన గుహాముఖమునకుఁ గ్లోడిస్సా తీసికొనిపోయెను. మునుపటివలెనే డోర్వాలుని కాఁద్వారమర్మములు తెలియకుండునటులఁ బ్రవర్తించెను.

ఆగుహాముఖమున కొక యఱమైలుదూరమునఁ దన హయముండెనని యచటికిఁ గ్లోడిస్సా డోర్వాలుని దన వెంటఁగొనిపోవుచుండెను. నాలుగువందలగజములదూరము నడచినంత డోర్వాలు స్తంభీభూతుఁడై "అయ్యో! నాపనియైనది." అని కేకలువైచెను. ఏమనిన హయారూఢులై పదుగురు కేకలువైచుచు డోర్వాలుని దెసకు వచ్చుచుండిరి. వారు వెనుకటి గిరిసింహుని దుర్గరక్షకులు—ఆయుధములను ధరించిరి. ఒక్కక్షణమాత్రకాలములో డోర్వాలుని జుట్టుముట్టి తమలో నొకనిగుఱ్ఱముపై నెక్కించుకొనిరి. క్లోడిస్సాకును దమకును సంబంధములేమి నామెను బట్టికొనలేదు.

డోర్వాలుని విడువుఁడని దుర్గరక్షకులను గ్లోడిస్సా ప్రతిమాలెను. కాని యాప్రార్థనలను వినక డోర్వాలునితోఁ దిరిగి వారు వచ్చినత్రోవమీఁదుగా వెడలుటకు సంసిద్ధులై యుండిరి. అపుడు వారందఱకును బెక్కుగుఱ్ఱముల డెక్కలచప్పుడు విననయ్యె. కొద్దిక్షణములలోఁ బన్నిద్దఱు తుపాకులఁదాల్చి హయారూఢులై వారున్నదెసకే వచ్చుచుండిరి. ఆయాయుధపాణులకు నాయకుఁడైన యొక్క చక్కని పురుషుఁడు వారికిముందుగా స్వారిచేయుచుండెను, ఆపురుషుని జూచిన

వెంటనే "వీరరుద్రా! వీరరుద్రా!! నీవేనా!" అని సంతోషముతోఁ గ్లోడిస్సా పెనుకేక వేసెను. వీరరుద్రుఁడు నధికవిస్మయాశ్చర్యములతో "మోహినీ! మనోహరీ!" అని పలికి తనభార్యను (గ్లోడిస్సాను) గౌఁగిలించుకొనుటకు హయమునుండి దిగ సంసిద్ధుఁడై యుండఁగా "ముందుగా నాదుర్మార్గులనుండి యావృద్ధుని విడిపింపుము. ఏమనిన వాఁడు నాజీవమును రక్షించినవాఁడు" అని గ్లోడిస్సా పలికెను.

అంత నొక్కక్షణమాత్రకాలములో నా రెండుసంఘములకును బోరాటము జరిగెను. వీరరుద్రునిసహచరులతోఁ బోరాడసంసిద్ధులై యుండుటకు దుర్గరక్షకులు డోర్వాలుని విడిచిరి. వెంటనే డోర్వాలు మోహినితో గుహయొద్దకుఁబోయెను. అయిదునిమేషముల కాలము పోరాటము సలుపఁబడెను. దుర్గరక్షకులందఱును మడిసిరి. వీరరుద్రుని సహచరులలో నొక్కఁడును గాయమునొందలేదు—డోర్వాలు రక్షింపఁబడియెను—వీరరుద్రుఁడు తనభార్యయగు మోహినిని గౌఁగిలించుకొనెను.

ఘూర్జరతార.

నలువదియవ ప్రకరణము.

ఆసాధ్వసిక విప్రలాపము పూర్తినొంది నిమేషదశక మతిక్రమిం
వీరరుద్రానుచరులుండిన స్థలమునుండి ముప్పదిగజముల దూర
చి కొండొక పెద్దశిలపై మోహినీ వీరరుద్రులు కూరుచుండిరి.
హిని వీరరుద్రునియొడిలోఁ గూరుచుండి నిర్మలానురాగమును గ్రు
ంచుచూపులతో వీరరుద్రుని సుందరాననము నవలోకించుచుండె
వీరరుద్రుఁడును మోహినివంక నల్లే చూచుచు "మోహినీ! మ
హరీ! దీర్ఘకాలమునకుఁ బిదప మనమిచట మరలఁ గలసికొనుట
బ్రహ్మానందము కలిగెను. కాని నాహృదయ మనేకభావ
తో నల్లకల్లోలము నొందుచున్నది. నీవు మృతినొందితివను వృత్త
? నిన్ను బువ్వులతోఁ బూజసేయు నీభర్తనుండి యేల విడిపోం
—ఈఘోరపర్వతములలో నేలయున్నావు?—నీజీవమును రక్షించి
ఁడని నీవిందాఁక చెప్పితివే యావృద్ధుఁడెవ్వఁడు?" అని యడిగెను.

"మనోహరా! అన్నిసంగతులను జెప్పెద వినుము. నేను బాము
గఱువఁబడినపిదప మందరయను వైద్యురాలు నాకొకమందు నిచ్చె
ఆయౌషధమాహాత్మ్యముచేత నొక్కదినములో నేను మరల సజీవి
తిని. అంతకుఁ బూర్వమే కమలయును నాపెపరిచారికలును నాయెడ
గాశనొంది వెడలిపోయిరి. అపుడు నాహృదయమునందు నాభూత
దలంచినంత మిక్కిలి పశ్చాత్తాపము కలిగెను. కమల మిక్కి
హృదయ—నిష్కపట—అట్టియువతిని జిక్కులువెట్

మూటఁగట్టుకొనుటయే యని నాకుఁ దోఁచె. ఇఁకనైన సన్మార్గ ప్రవర్తింపుమని తెల్పుటకొఱకే నాకు దైవము మరలఁ బ్రాణము నని యూహించితిని; కావున నట్టి సన్మార్గమునఁ బ్రవర్తించుటెట్లు యొద్దకు వచ్చినచో నీఘోరకృత్యములకు నేనుగూడ నాకర్షింపఁబడ ను; కావున నాకేమియుఁ దోఁపక మన్మనోగతమును మందరకుఁ ని. ఆమె కొన్నిమూలికల చూర్ణమును నాకిచ్చెను. ఆచూర్ణ నాయొడలికిఁ బూసికొంటిని ; వెంటనే నామోహినీరూపము జిపోయె."

"అయ్యో! మోహినీ ! నీవు నాయొద్దకువచ్చి దుష్ప్రవర్త ను విడువుమని నన్ననినచో నేను విడువకుందునా? నీకన్న నాకెః కలరు ?"

మనోహరా! దుష్ప్రవర్తనమును విడిచెదనని నీవు చెప నాకుఁ గడుంగడు సంతోషము లిగెను. మా ఆవేసమును ద్మాట నాభూతచరిత్రకుఁ దగిన ప్రాయశ్చిత్తమును జేసికొన నెంచి ఆప్రాయశ్చిత మెట్లుచేసికొననగు? ఎవ్వరిని నేను గష్టముల పాలుసేం దలఁచితినో యాకమలకు సహాయముగానుండి యామెను రక్షించుట నాకుఁ బ్రాయశ్చిత్తము. కావున వెంటనే క్లోడిస్సాయను నామము నామెను ఢిల్లీసుల్తానుని యంతఃపురమునుండి మందరాసాహాయ్యము రక్షించితి. అట్లుచేయుటవలన—ఆపుణ్యకార్యము నొనర్చుటవలన దైవము నాయెడఁ గరుణించి నాకు గొప్ప బహుమతినిచ్చెను.

"ఏమి? బహుమతియా!—మోహినీ" అని యాపె మో వంక మిక్కిలి శ్రద్ధతోఁ బరీక్షించుచు "కాదు! కాదు!—అది యు ము.—నేను నమ్మఁజాలను.—అయినను నీవీకైలాసపర్వతముల యున్నదానవు." అని సోత్కంఠతో వీరరుద్రుఁడు పలికెను. "వీర సందియమేల? నిజముగాఁ గొన్నినెలలనుండియు నేను ను

చుచుంటిని. ఆహా! మనోహరా! నీవు నీదుష్ప్రవర్త గాఁ ద్యజించి సన్మార్గావలంబకుఁడవైతివేని నీవును నేను తటి యానందముతో సురనందనములో నుండనగు!—ఎట్టి ములు మీకు లభింపనగు? "

"మోహినీ! మోహినీ! " అని వీరరుద్రుఁ డధికానందముతో హినిని గాఁగిలించుకొని "నేనీక్షణమునుండియు సత్ప్రవర్తనము మెలఁగెద"నని చెప్పెను. మోహినియును మిక్కిలి యానందభరిత య్యెను. కొన్నినిమిషముల కాలము వివిధవిషయములఁ గూర్చి వా ప్రసంగించిరి.

కొన్నినెలలకు వెనుకఁ దూనాపర్వతములలో హేమచంద్రునెట్లు కొనెనో—తరువాత గిరిసింహుని సైనికులచే వాఁడెట్లుకొంపోవఁబ నో—వీరరుద్రుఁడు మోహినికిఁ జెప్పెను.

మోహినియును దాను హేమచంద్రడోర్వాలులను జూచుట సంభవించెనో—ఎట్లు హేమచంద్రుఁడు తన్ను బాకుతోఁ బొడి —డోర్వాలు తన కెట్లుపచారములు సల్పెనో—తుదకు హేమచం డెట్లుమృతినొందెనో—వీరరుద్రునికిఁ జెప్పెను.

వీరిట్లు మాట్లాడికొనుచుండగా వీరరుద్రుని యనుచరులయొద్దను డోర్వాలు క్లోడీస్సా నిజమైనపేరు మోహినియనియు నామె వీరరు ద్రు భార్యయనియుఁ దెలిసికొనెను.

మోహినీ వీరరుద్రులు తమప్రసంగమును ముగియించి వారుం చోటికినచ్చిరి.

తామిఁక చేరొకనాయకుని నెన్నుకొనవలెననియు—దమతోఁ రాననియు వీరరుద్రుఁడు తన యనుచరులకుఁ దెలియఁబఱచెను.

END OF
TITLE